RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 17 Issue No. 3(1) Monthly March 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category



## నాయని కృష్ణకుమారి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 17 - Issue. 3 - March (1) 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil
(Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# నాయని కృష్ణకుమారి

జానపద వాఙ్మయానికి సాహిత్యపు విలువలు ఆపాదించి దానొక సాహిత్య ప్రక్రియగా సుస్థిరస్థానం కల్పించిన విదుషీమణి ఆచార్య నాయని కృష్ణకుమారి. చిన్న వయస్సులోనే తండ్రి సాహిత్య వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న నాయని కృష్ణకుమారి కవితా తత్త్వం ఆకళింపు చేసుకొని ఆధునిక సాహిత్య ప్రక్రియలైన కథ కవిత్వం, యాత్రాచరిత్ర వంటి వాటిపై సృజనశీల రచనలు చేశారు. మరొకవైపు పండితుల అనాదరణకు గురై మారుమూల ప్రాంతాలలో పామరుల నోళ్ళల్లో నానుతున్న జానపద వాఙ్మయానికి పునర్జీవ శక్తిని ప్రసాదించేలా ఒక సాహితీ ప్రక్రియగా నిలబెట్టి అనేక పాటలు, కథలు సేకరించి భావితరాలకు అందించిన జానపద వాఙ్మయోద్ధారిణి.

సేకరించిన జానపద సాహిత్యాన్ని విశ్లేషించే విధానంలోనూ నూతన ఒరబడికి మార్గాలు తెలిచారు. జానపద వాఙ్మయాన్ని అధ్యయనం చేయాలంటే మడతకుర్చీ విధానం పనికిరాదని క్షేత్ర పర్యటన ద్వారానే విలువైన సమాచారాన్ని సేకరించవచ్చని చెప్పటమే గాక ఆచరణలో చూపిన మార్గదర్శి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అనేక గ్రామాలు సందర్శించి జానపద పాటలు పాడే వారి, కథలు చెప్పేవారి పామరుల భాషను ఆకళింపు చేసుకొని వాటినంతటిని అక్షరబద్ధం చేసిన మహనీయురాలు. తాను సేకరించిన జానపద వాఙ్మయాన్ని గణిత శాస్త్రాల సూత్రాల ప్రాతిపదికన విశ్లేషించి సశాస్త్రీయంగా వాటిని నిరూపించి జానపద వర్గీకరణ చేశారు. జానపద గేయ గాథలు, తెలుగు జానపద వాఙ్మయం, జానపద సరస్వతి, జానపద వాఙ్మయ చరిత్ర, నల్గొండ జిల్లా ఊయల పాటలు, కథలు - గాథలు వంటి గ్రంథాలు ఆమె జానపద వాఙ్మయానికి చేసిన కృషికి నిదర్శనాలని చెప్పవచ్చు.

నాయని కృష్ణకుమారి గారు ఒకవైపు జానపద సాహిత్య కృషి చేస్తూనే మరొకవైపు సృజనశీల రచనలకు అంకురార్పణ చేశారు. ఆమె డిగ్రీ చదివేరోజుల్లో ఆంధ్రులకథ వెలువరించారు. 18 ఏళ్ళ వయస్సులో ఆమె వ్రాసిన ఆంధ్రులకథ ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కూల్ పాఠ్యపుస్తకంగా నిర్ణయించిందంటే ఆమె రచనా వైదుష్యం ఏపాటిదో అర్థంకాక మానదు.

నాయని కృష్ణకుమారి గారు విశాఖలో ఉన్నప్పుడు అనేకమంది ప్రముఖ రచయితలతో పరిచయం ఏర్పడటం, విశేషంగా సాహితీ సభలలో, నాటకాలలో పాల్గొంటూ తన సాహితీకృషికి బలమైన పునాదులు వేసుకున్నారు. ఆ క్రమంలో అగ్నిపుత్రి, అయత, ఏం చెప్పను నేస్తం, పరిశీలన, పరిశోధన వంటి సృజనశీల రచనలు వెలువరించారు. ఆమె లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో విద్యార్థులతో కలసి కాశ్మీర్ విహార యాత్రకు వెళ్ళి ఆనాటి అనుభూతులను "కాశ్మీర దీపకళిక"లో ఆవిష్కరించి యాత్రా రచనకు బాటలు వేశారు. ఆ కావ్యానికి ముందుమాట అందించిన ఆచార్య చేకూరి రామారావు "అది కేవలం యాత్రా రచనకాదు. ఒక వచన కావ్యం" అంటూ కొనియాడారు. అందులో నాయని కవితాత్మ కూడా ఆవిష్కరించారని పండితుల ఉవాచ.

ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులుగా 4 దశాబ్దాల పాటు సేవలందించిన నాయని కృష్ణకుమారి గారు తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా విశిష్ట సేవలందించి వృత్తికే గౌరవాన్ని తీసుకువచ్చారు. ఒకవైపు సాహిత్యంలోనూ మరొకవైపు జానపద వాఙ్మయంలోనూ, ఇంకొకవైపు పరిపాలనా దక్షతలోనూ త్రివేణి సంగమంవలె భాషిల్లి తెలుగు నేలను పులకింపజేశారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని నేటి మహిళా లోకం ముందుకు నడిస్తే ప్రపంచ మహిళా దినోత్సవ ఆశయం నెరవేరినట్లే. ఆవిధంగా మహిళలు రాణిస్తారని ఆశిద్దాం.

- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | ప్రపంచీకరణ : తెలుగు రచయితల దృక్పథాలు | - డా॥. వెంకటరామయ్య గంపా | 6 |
| 2. | తెలంగాణా తొలి తెలుగు దళితకవి దున్న ఇద్దాసు | - డా॥. ఏటూరు జ్యోతి | 10 |
| 3. | తెలుగు భాషా, సాహిత్యాలకు పాశ్చాత్యుల కృషి | - డా॥. భూక్య తిరుపతి | 13 |
| 4. | తోలు బొమ్మలాటలు నవల - విశ్లేషణ | - డా॥. బశెట్టి ఉపేంద్ర | 17 |
| 5. | రూపకం - సమాహార కళ ఒక పరిచయం | - డా॥. వెంకట నరేష్ బుర్ల | 20 |
| 6. | ప్రపంచీకరణ దుష్ఫలితాలను చిత్రించిన వచన కవిత | - డా॥. డి. మస్తానమ్మ | 25 |
| 7. | తెలుగు తానీషా యస్వీ జోగారావు | - డా॥. శిరీష ఈడ్పుగంటి | 29 |
| 8. | అన్నమాచార్య సంకీర్తనల్లో సాంస్కృతికాంశాలు | - డా॥. గంధం అరుణ &<br>- డా॥. ఎ. రవీంద్రబాబు | 34 |
| 9. | సమకాలీన హిందీ నాటకరంగం - ఒక పరిశీలన | - డా॥. గోవిందరాజు భరద్వాజ | 38 |
| 10. | పాఠ్యపుస్తకాల్లో లింగవివక్ష - ఒక పరిశీలన | - డా॥. కె.సుమలత | 43 |
| 11. | కందుకూరి వీరేశలింగంగారి కాలంనాటి ఆంధ్ర సమాజం | - డా॥. శీలం శ్రీనివాసరావు | 48 |
| 12. | నూతన విద్యా ప్రణాళిక - పంచతంత్రం | - డా॥. కొమ్మనబోయిన సుజాత | 53 |
| 13. | తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో - పాట | - జె. లక్ష్మినర్సయ్య | 56 |
| 14. | శ్రీమద్భాగవతం - ప్రహ్లాదుని విశ్వమానవతా విలువల ప్రబోధం | - డా॥. పి. జయచంద్రుడు | 59 |
| 15. | కొత్త క్యాలెండర్ - సరికొత్త కవితావిష్కరణ | - డా॥. పి. విజయకుమార్ | 64 |
| 16. | పాల్కురికి సోమనాథుడి రచనల్లో వైద్య విజ్ఞానం | - డా॥. పంతంగి వెంకటేశ్వర్లు | 68 |
| 17. | నెల్లూరి కేశవస్వామి కథలు - పరిశీలన | - జి. శ్రీమతి | 73 |
| 18. | తెలంగాణ కవిత్వంలో వివిధ కులవృత్తులు | - గైని రవి | 76 |
| 19. | అద్దేపల్లి కవిత్వంలో స్త్రీ జీవిత చిత్రణ | - గల్లా వెంకటేష్ | 79 |
| 20. | భాగవతంలో "ధర్మం" విశిష్టత | - డా॥. మంద సురేఖారెడ్డి | 82 |
| 21. | తెలంగాణ కథలు - గిరిజన, దళిత జీవన చిత్రణ | - బి. మోహన్ నాయక్ | 84 |
| 22. | కాల పరిణామంలో వృత్తుల విధ్వంసం | - మునగపాటి అరవింద | 90 |
| 23. | దాశరథి రంగాచార్య - చిల్లర దేవుళ్ళు | - భూక్య నరేందర్ | 93 |
| 24. | కాకిపడగల పటం కథ - కర్ణుని పెళ్ళి విశేషాలు | - నోముల రాజు | 97 |
| 25. | విమర్శకునిగా సుదర్శనం | - పి. అన్వేష్ గౌడ్ | 102 |
| 26. | అన్నమయ్య - పురందరదాసు | - ఆచార్య ఎం. రామనాథంనాయుడు | 104 |
| 27. | శ్రీ శ్రీ మహాప్రస్థానం - మార్క్సిజం ప్రభావం | - సాలి రాజా | 113 |
| 28. | ప్రజాకవి కాళోజీ - కవితాతత్వం | - సూరేపల్లి పద్మావతి | 117 |
| 29. | భారతీయ సంస్కృతి - జానపదుల భక్తి విశ్వాసాలు | - వెన్నా కాశిరెడ్డి | 120 |
| 30. | ప్రకృతి వైపరీత్య సాహిత్యంలో - కావ్య వస్తువుగా ప్రకృతి | - కె. సుధాకర్ | 124 |
| 31. | గోరటి వెంకన్న - జీవిత విశేషాలు | - మల్లేపాకుల సైదయ్య | 126 |
| 32. | కడప జిల్లాలోని జాతరలు-ప్రత్యేకత మరియు ప్రాధాన్యత | - ఆచార్య వి.రామబ్రహ్మం &<br>- ఆచార్య యు. కృష్ణమోహన్ | 130 |
| 33. | శ్రీ మహాభాగవతం – నారయ అలంకార సౌందర్యం | – డా॥.జి. శ్రీనివాసరావు | 134 |

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# ప్రపంచీకరణ : తెలుగు రచయితల దృక్పథాలు

- డా॥. వెంకటరామయ్య గంపా, అసిస్టెంట్ ప్రొఫెసర్, భారతీయ భాషల అధ్యయన కేంద్రం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ.

గత రెండు దశాబ్దాలుగా ప్రపంచీకరణ మాట తెలుగు సాహిత్యంలో వినిపిస్తున్నప్పటికీ సాహిత్య రచనలు మాత్రం ఈ దశాబ్దంలోనే ఎక్కువ సంఖ్యలో వచ్చాయి. అన్ని భావజాలాలకు చెందిన కవులు, రచయితలు ప్రపంచీకరణను వస్తువుగా చేసుకుని రచనలు చేశారు. కవులు, రచయితలు అందరూ కూడా ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూనే రచనలు చేశారు. అందుకు గల కారణం ప్రపంచీకరణ వలన కలుగుతున్న నష్టాలే. కానీ కొద్దిమంది కవులు, రచయితలు మాత్రం ప్రపంచీకరణను సమర్థిం చారు. అందుకు గల కారణం ప్రపంచీకరణ వలన వారికి ప్రయోజనాలు కలుగుతున్నాయి. ఇలా ప్రపంచీకరణపై సాహితీవేత్తల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ భిన్నాభిప్రాయాలు దళిత, బి.సి. సాహితీ వేత్తల నుంచి వెలువడుతున్నాయి.

ప్రపంచీకరణ వలన తమ జీవితాలు, కులవృత్తులు, సంస్కృతి ధ్వంసమవుతున్నాయని, పేదరికంలో ఉన్న తాము మరింత పేదరికంలోకి కూరుకుపోయే పరిస్థితి నెలకొన బోతూందని కొంతమంది దళిత, బి.సి. సాహితీ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరు ఎక్కువగా ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ రచనలు చేశారు. గోరేటి వెంకన్న రాసిన 'పల్లెకన్నీరు పెడుతుందో...' గేయంలో

**'కుమ్మరివాములో తుమ్మలు మొలిచెను**
**కమ్మరి కొలిమిలో దుమ్ములేచెను**
**సాలెల మగ్గం సడుగులిరిగినయి**
**పెద్దబాడిషా మొద్దుబారినది...'**

అని కులవృత్తులు క్రమంగా కనుమరుగయ్యే పరి స్థితిని వివరించారు. ఇక పెద్దింటి అశోక్ కుమార్ 'కాగు బొత్త' కథలో ప్రపంచీకరణ వలన ప్రవేశించిన ఫ్రిడ్జ్ వలన కాగుబొత్త మరుగున పడిందని, యంత్రాల వలన కుమ్మరి వారి కులవృత్తి మూలపడిందని పేర్కొన్నారు. సుంకోజి దేవేంద్రాచారి రచించిన 'అన్నంగుడ్డ' కథలో యంత్రాల వలన జీవనభృతి కోల్పోయిన వడ్రంగివారి జీవితాలను వివరించారు.

జాతశ్రీ రచించిన 'వ్యక్తిగతం' కథ గంగిరెద్దులవారి జీవితాన్ని వివరిస్తుంది. ఇందులో గంగిరెద్దులవాడు ఊరూరు తిరిగి తన వృత్తిని చేసుకుంటూ జీవనాన్ని కొన సాగిస్తుంటాడు. తను గంగిరెద్దుతో ఆడించిన ఆటను చూసి జనాలు తమకు తోచింది ఇచ్చారు. 'తన ప్రాణాన్ని పణంగా పెట్టి ఆడిన ఆటకు నివ్వెరపోయిన అన్నపూర్ణమ్మ తల్లులు దోసిళ్ళతో కాదు, చేటలతో ధాన్యాన్ని కొలిచారు' అని గంగిరెద్దులవాని ప్రతిభను తెలియచేస్తాడు రచయిత. ఇక వి.ఆర్.రాసాని రచించిన 'పయనం' కథ నక్కలవారి జీవితాన్ని వివరిస్తుంది. 'వాళ్ళు నక్కలోళ్ళు. అడవిలో ఎక్కడ నీళ్ళుంటే అక్కడ గుడారాలేసుకొని, జంతువుల్ని వేటాడి తింటూ, ఆ ప్రాంతంలో ఉన్న పల్లెల్లో, పిన్నీసులు, తలపిన్నులు, పూసల దండలు అమ్మి, ఆ డబ్బుతో కాసిన్ని నూకలు తెచ్చుకుంటూ బతికే సంచార జీవనులు' అని నక్కలవారిని గురించి రచయిత వివరిస్తాడు. పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'గోస' కథ గారడీవృత్తిని చేసేవారిని వివరిస్తుంది. 'గర్భవతి అయిన స్త్రీ తన శారీరక స్థితిని లెక్కచేయక చిన్న రింగులో తన శరీరాన్ని దూర్చి గారడీ చేసినప్పటికీ పిడికెడు మెతుకులు కూడా ఎవరూ పెట్ట లేదు. కొంతమంది తిట్టారు, మరి కొంతమంది విసుక్కు న్నారని' ఆమె పరిస్థితిని రచయిత వివరిస్తాడు. ప్రపంచీ కరణ వలన బి.సి. కులాలవారు, గారడీవారు, గంగి రెద్దోళ్ళు, నక్కలోళ్ళు మొదలైనవారు వారి వృత్తిని, జీవన భృతిని కోల్పోయినట్లు ఈ రచనల ద్వారా తెలుస్తుంది.

ప్రపంచీకరణపై వ్యతిరేకత ఇలా ఉంటే మరి కొంత మంది దళిత, బి.సి. సాహితీవేత్తల అభిప్రాయం ఇంకొక విధంగా ఉంది. ప్రపంచీకరణ వలన అంది వచ్చిన అవ

కాశాలను వినియోగించుకుని ముందుకు సాగాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. 'గ్లోబలైజేషన్ అనేది అభివృద్ధి చెందాల్సిన ప్రాంతాలకు, దేశాలకు, జాతులకు, వర్గాలకు అనువుగా మలుచుకోవాల్సిన అవసరం ఉంది. ఒక సామెత ఉంది. బర్రె మన కోసం కట్టదు, ఈనదు. కాని దాని పాలు మనం పిండుకోవాలి. లేని యెడల చరిత్రలో, అభివృద్ధిలో వెనుకబడి పోతారని' బి.యస్.రాములు తన అభిప్రాయాన్ని వేపచెట్టు కథా సంకలనంలో వ్యక్తం చేశారు. తెరేష్ బాబు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'గ్లోబలైజేషన్‌లో భాగంగా ముందుకొచ్చిన టెక్నాలజీని దళితులు తమకు అనువుగా ఉపయోగించుకోవాలన్న ప్రతిపాదనలున్నాయని' పేర్కొన్నారు. వీరిలాగానే పలువురు బి.సి., దళిత కవులు, రచయితలు ప్రపంచీకరణను సమర్థిస్తున్నారు. దానికి కారణాలు ఉన్నాయి.

భారతదేశం కూడా తృతీయ ప్రపంచ దేశాల్లో ఉన్నప్పటికీ, ఇక్కడి పరిస్థితులు వేరు. కుల వ్యవస్థ అనేది భారతదేశంలో మాత్రమే కనిపించే ప్రత్యేక అంశం. అందువల్ల దళిత, బి.సి.ల పరిస్థితులు తక్కిన దేశాలకంటే భిన్నంగా ఉన్నాయి. అసలు ఇక్కడి దళిత, బి.సి.ల పరిస్థితులు ఇతర దేశాలతో పోల్చలేనివిగా ఉన్నాయి. భారత దేశ చరిత్రలో ఎందరో రాజులు, రాజ వంశాలు మారినప్పటికీ మారనటువంటిది దళిత, బి.సి.ల జీవితం. స్వాతంత్ర్యం తరువాత కూడా వీరి జీవితాల్లో చెప్పుకోదగిన మార్పులేదు. కానీ దళితులు, బి.సి.లు వాస్తవాలను దృష్టిలో ఉంచుకుని గమనిస్తే, ప్రపంచీకరణ భారత దేశంలో ప్రవేశించిన తరువాత వీరి జీవితాల్లో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. ముఖ్యంగా ప్రపంచీకరణను ప్రపంచ దృక్పథంతో గమనిస్తే ఒకరకమైన ఫలితాలు, దేశీయ దృక్పథంతో మరొక రకమైన ఫలితాలు కనిపిస్తాయి. తక్కినవారిలా కాకుండా దళితులు, బి.సి.లు వారి కోణం నుంచి పరిశీలిస్తే మరికొన్ని వాస్తవాలు తెలుస్తాయి. సమాజంలో ఒక వర్గం ప్రజలు సమర్థించడం వలన ప్రపంచీకరణ ఈ దేశంలోకి ప్రవేశించింది. వారికి ప్రపంచీకరణ వలన ఎటువంటి సమస్య లేదు. అంటే ఒక వర్గం వారు ప్రపంచీకరణ వలన కలిగే ఫలాలను అందుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ దళిత, బి.సి.లు మాత్రం ప్రపంచీకరణ వలన కలిగే ఫలాలను అందుకోవడానికి సిద్ధంగా లేరు. ఒకసారి వాస్తవాలను ఆలోచించాలి.

సమాజంలో వివిధ వృత్తులు ఎప్పటినుంచో కొనసాగుతున్నప్పటికీ అన్ని వృత్తులవారికి సమాన గౌరవం లేదు. కొన్ని కులాలవారు వారి వృత్తి ద్వారా గౌరవాన్ని పొంది, గొప్పవారిగా కీర్తించబడుతుంటే మరికొన్ని కులాలవారు వారి కులవృత్తుల వల్ల అవమానాలు, చీత్కారాలు ఎదుర్కొంటున్నారు. బి.సి.లల్లో కొన్ని కులాలవారి వృత్తులు గౌరవప్రదంగానే ఉన్నాయి. కానీ కొంతమంది వృత్తులు తక్కువగా చూడటం ఇప్పటికీ కొనసాగుతుంది. మరి కొంతమంది వృత్తి దినదిన గండంగా కూడా ఉంది. ఇక దళిత, గిరిజనుల వృత్తులు వివక్షకు గురౌతున్న తీరు ఇప్పటికే అందరికీ తెలిసిన విషయమే. 'వ్యక్తిగతం' కథలో గంగిరెద్దులవాడు తన ప్రాణాన్ని పణంగా పెట్టి గంగిరెద్దును ఆడిస్తాడు. 'గోస' కథలో గర్భవతి తన ప్రాణాన్ని లెక్కచేయకుండా చిన్నరింగులో దూరి గారడీ చేస్తుంది. ఈ కాలంలో కూడా మనిషి బతకడానికి ప్రతి రోజు ప్రాణాన్ని పణంగా పెట్టాలా? లేకపోతే ఒక కులంలో పుట్టారు కాబట్టి ఊరూరు తిరుగుతూ, దొరికింది తింటూ జీవనాన్ని కొనసాగించాలా? చేసిన పనికి, చేస్తున్న వృత్తికి తగిన ప్రతిఫలం లభించక బాధలు అనుభవించాలా? లేక ఇటువంటి వృత్తిని వదిలిపెట్టి గౌరవంగా బతకాలా? వృత్తిని దైవంగా భావించాలని చెప్పినప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో ఆ స్థితి నేడు ఉందా? ఒక వృత్తిలో ఉన్న సాధకబాధకాలు వాటిని అనుభవించేవారికే తెలుస్తాయి. ఇప్పటికీ పెద్దలు వారి పిల్లలకు చెబుతూ 'మేం పడే బాధలు నువ్వుపడవద్దు. ఈ పని నువ్వు చెయ్యవద్దు' అని చెబుతుంటారు. ఇక్కడ పని అంటే వృత్తి అని సులభంగా గ్రహించవచ్చు. వారు అనే ఈ మాట ద్వారా ఎంతబాధను అనుభవించి ఉంటారో చెప్పవచ్చు.

సాహిత్య పరంగా కథల్లో రచయితలు వివరించిన వస్తువు వాస్తవం అయినప్పటికీ, ఈ సమస్యలకు పరిష్కారం చూపవలసిన అవసరం ఉంది. దళిత, బి.సి.లకు చెందిన ఈ సమస్యలకు ప్రస్తుతం ప్రపంచీకరణ పరిష్కారం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సమస్యలకు ఒకటే పరిష్కారం విద్య. ప్రపంచీకరణలో బహుళ జాతి సంస్థలు తమ వస్తువులను ప్రపంచవ్యాప్తంగా అమ్ముకోవడానికి ప్రజలకు కనీస విద్య అవసరమని గ్రహించాయి. అందుకోసం బహుళజాతి సంస్థలు తృతీయ ప్రపంచ దేశాల్లో విద్యను ప్రోత్సహించవలసిందిగా ఆయా దేశ ప్రభుత్వాలపై వత్తిడి తీసుకొస్తున్నాయి. ఆయా సంస్థలకు తక్కువ వేతనంతో పనిచేయడానికి కావలసిన మానవ వనరుల కోసం ఉన్నత విద్యను సైతం ప్రోత్సహిస్తున్నాయి. విద్యకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేయని ప్రభుత్వాలు నేడు దళిత, గిరిజన విద్యార్థులకు ఆర్.జె.యన్.యఫ్.ల పేర ఉపకార వేతనాలను అందిస్తున్నాయి.

స్వాతంత్ర్యం తరువాత ప్రభుత్వాలు దళితుల, బి.సి.ల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు నామమాత్రమే. ప్రపంచీకరణ ప్రవేశంతో ధన ప్రవాహం పెరిగింది. ప్రపంచ బ్యాంకు ఒత్తిడి మేరకు ప్రభుత్వం అనుత్పాదక రంగంలో డబ్బును ఖర్చు పెడుతూంది. ప్రభుత్వం కూడా ఓట్ల కోసం అధికశాతం ఉన్న దళిత, బి.సి.ల కోసం పలు కార్యక్రమాలను చేపట్టింది. బడుగు బలహీన వర్గాలవారికి గృహ, నీటి సదుపాయాలు, జీవనోపాధికి సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం వలన కనీస అవసరాలు తీరుతున్నాయి. దశాబ్దాలుగా స్త్రీవాదులు పోరాటం చేస్తున్నా గ్రామీణ స్త్రీలలో చైతన్యం రాలేదు. కానీ డ్వాక్రా వంటి పథకాలు, మీడియా, మహిళా రిజర్వేషన్ల వలన స్త్రీ చైతన్యం గ్రామాలను తాకింది. ఎన్నో సంవత్సరాలుగా వివిధ కులాల్లో ఉన్న మూఢాచారాలను తొలగించడానికి మీడియా ద్వారా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పరిశ్రమల వలన నగరీకరణ, పట్టణీకరణ పెరిగింది. గ్రామాల్లో దోపిడికి, పీడనకు గురైనవారు నగరాలకు, పట్టణాలకు వలసవెళ్ళి తమ కష్టాలకు తగిన గుర్తింపునూ, ఫలితాలను పొందుతున్నారు.

ప్రపంచీకరణ వలన సమాజంలో చాలా వేగంగా మార్పులు వచ్చాయి. ఈ మార్పులను అందుకోవడానికి ఒక వర్గం ఎప్పుడూ ముందుంది. ఇది ప్రాచీనకాలం నుంచి జరుగుతున్నది. ఉదాహరణకు కొన్ని వర్గాల వారు చదువు అనే పదానికి దూరంగా ఉన్నప్పుడు అగ్రవర్ణాల వారు విద్యావంతులయ్యారు. కొంతకాలం తరువాత బడుగు బలహీనవర్గాల వారికి చదువుకోవడానికి అవకాశం వచ్చింది. కానీ అగ్రవర్ణాలవారు బడిలోపల ఉండి చదువుకుంటే, బలహీన వర్గాలవారు బడివెలుపల ఉండి చదువుకున్నారు. దళితులు, బి.సి.లు బడిలోపల కూర్చునే సమయానికి బడిలోపల ఉన్న అగ్రవర్ణాలవారు ఆంగ్లపాఠశాలల్లో విద్యను అభ్యసించి, ఆనాడు ఉన్న ఉద్యోగవకాశాలను అందిపుచ్చుకున్నారు. దళితులు, బి.సి.లు ఆంగ్ల పాఠశాలల్లో ప్రవేశించేనాటికి సామాజికంగా, ఆర్థికంగా ముందున్న వర్గం అంతర్జాతీయ స్థాయి పాఠశాలల్లో విద్యను అభ్యసించి ప్రపంచీకరణ ఫలాలను అనుభవిస్తున్నారు. గ్రామ పొలిమేర దాటడానికి ఎన్నో నిబంధనలు విధించుకున్న వర్గం కాలానుగుణంగా వారి నిబంధనలను మార్చుకుని ప్రపంచీకరణ ఫలాల కోసం విదేశాలకు వలసపోతున్నారు. ఇటువంటి స్థితిలో కూడా దళితులు, బి.సి.లు తమ కులవృత్తులను కాపాడుకుంటూ, తమను కష్టాలకు గురిచేసిన ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ, నిరసిస్తూ కూర్చోవాలో లేక ప్రపంచీకరణ ఫలాలను అందుకోవడం కోసం ప్రయత్నం చేయాలో దళిత, బి.సి. కవులు, రచయితలు ఆలోచించాలి.

ఒక రకంగా ప్రపంచీకరణ అనేది నేటి దళిత, బి.సి.లకు సంధికాలం. ప్రపంచీకరణ వలన కోల్పోతున్న కుల వృత్తుల స్థానంలో మరొక వృత్తిలో స్థిరపడటానికి కొంత సమయం పడుతుంది. ఈ సంధికాల పరిస్థితి నుంచి బయటపడటానికి దళిత, బి.సి. మేధావులు ఆలోచించాలి. వారికి ప్రభుత్వ సహకారం ద్వారా చేయూతనిచ్చే మార్గా

లను చూపెట్టాలి. ప్రపంచీకరణ ఫలాలు దళిత, బి.సి. వర్గాల దగ్గరకు వచ్చినప్పటికీ, వారి నిరక్షరాస్యత వలన వాటిని అందుకోలేకపోతున్నారు. ప్రభుత్వం గిరిజనులకు పక్కాగృహాలను మంజూరు చేసినప్పటికీ వాటిని పలు కారణాల వలన సద్వినియోగం చేసుకోలేక పోయిన తీరును కొండవీటి సత్యవతి 'గూడు' కథలో కనిపిస్తుంది. ప్రపంచీకరణ ఫలాలను అందుకోవడానికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలో, ఎటువంటి చర్యలు తీసు కోవాలో తెలియచేస్తూ దళిత, బి.సి. కవులు, రచయితలు రచనలు చేయాల్సిన అవసరం ఉంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలంగాణా తొలి తెలుగు దళితకవి దున్న ఇద్దాసు

– డా॥. ఏటూరు జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

తెలంగాణా ప్రాంతపు తత్త్వకవులకు ఒక ప్రత్యేకత ఉంది. తత్త్వకవులు సమాజంలో భాగంగా ఉంటూ లౌకిక జీవితాన్ని గడుపుతూ ప్రజలకు సన్నిహితులయ్యారు. భావపరంగా జీవనతత్త్వాన్ని తెలిపేదితత్త్వం. కుటుంబ జీవితానికి గౌరవం ఇస్తూనే, సమాజ శ్రేయస్సును కోరుకున్నవారు. సంసారంలోనే సన్యాసిగా జీవించ మన్నారు. తత్త్వకవులు జీవిత విలువలను గుర్తించినవారు. ఉన్నంతలో సరిపెట్టుకుని వ్యవస్థను వ్యతిరేకించక పరిస్థితులను చక్కదిద్దుకుంటూ అంతర్ముఖులై జీవించిన వారు తత్త్వకవులు. సత్యాన్ని ఆవిష్కరించటమే తత్త్వం అంటారు. తెలుగులో తత్త్వకవితకు ఆద్యుడు పోతులూరి వీరబ్రహ్మం. 17వ శతాబ్దానికి చెందిన వీరబ్రహ్మం తత్త్వాలు ప్రజాజీవితానికి చేరువగా వచ్చాయి. తత్త్వ కవులలో గురువు ప్రధానంగా కనిపిస్తాడు. ఆత్మవివేకాన్ని శిష్యులకు కలిగించిన వాడే గురువు. అలాగే కులనిరసన తత్త్వకవులలో కనిపించే ప్రధానాంశం. బాహ్యాచారాలను ఆడంబరాలను, కర్మకాండలను నిరసిస్తారు. మూఢవిశ్వాసాలను, మాయ, మంత్రాలను ఖండించడం, సాంసరిక జీవనం ప్రధానం అంటారు. వీరు జ్ఞానానికి ప్రాధాన్యం ఇస్తారు. లౌకికజ్ఞానం,అనుభవజ్ఞానం కాయ కష్టం, వృత్తి జీవనానికి ప్రాదాన్యత ఇస్తారు. సామాన్య జనుల కోసం, సామాన్యులే రాసిన తత్త్వసాహిత్యంలో భాష, ప్రధానంగా కనిపిస్తుంది. తెలంగాణా మాండలి కానికి ప్రాదన్యాత కనిపిస్తుంది.

సామాన్యుల హృదయాలలో చొచ్చుకుపోయే లక్ష్యంతో జ్ఞానసంబంధమైన విషయాలను వచనంలో కాకుండా రాగయుక్తంగా, పాడుకోవడానికి అనుగుణంగా, తత్త్వాలు రాశారు. సమాజంలోని ప్రతిమనిషికి స్వేచ్ఛ సమానత్వం కోసం అడుగులు వేస్తున్న సందర్భంలో తెలంగాణా సాహిత్య చరిత్రలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పెద్దవూర మండలం చింతపల్లిలో వెలసిన తత్త్వకవే దున్నఇద్దాసు. 108 సం॥లు బతికి సమాజంలోని కుళ్ళును, ద్వేషాన్ని ఆశువుగా చెప్పి, తన మాటలు, పాటలతో సమాజానికి చికిత్స చేసిన వైద్యుడు. అచలాన్ని ఆచరిస్తూ గురబోధ చేసిన యోగి ఇతను. దళితుడిగా జన్మించి, దార్శనికుడిగా కొన్ని వందల మంది అగ్రకులాల వారికి బోధచేసిన అవధూత. నల్లగొండ జిల్లాలో ప్రారంభమైన అచలపరంపర తెలంగాణా అంతా కని పిస్తుంది. అచలతత్త్వాన్ని భిన్నకులాలు, భిన్న మతాల వాళ్ళు అనుసరించారు. 1811లో మాదిగ కుటుంబంలో జన్మించిన ఇద్దాసు తల్లిదండ్రులు ఎల్లమ్మ, రామయ్య హైదరాబాద్ రాజ్యం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడమే కాకుండా, రాజకీయ అనిశ్చితి ఏర్పడిన సందర్భం. భూస్వాములు, సంస్థానాదీశులు, దొరలదౌర్జన్యాలు అధిక మైన తరుణం. కరువు కాటకాలులతో ప్రజాజీవితం దుర్భ రంగా ఉండేది. చిన్నవయసులోనే నల్గొండ జిల్లా తుంగ తుర్తిలో గురువుల సాంగత్యంతో జ్ఞానాన్ని సంపాదించిన దున్నఇద్దాసు అచలమతాన్ని ప్రచారంచేస్తూ, గురుబోధ చేస్తూ దైవాతసంభూతుడిగా మారిపోయిండు. యోగ విద్యలను తెలుసుకున్నాడు. మాదిగ కుటుంబంలో పుట్టి కులవృత్తిని నేర్చుకోవడమే కాకుండా, రైతుగా పశువుల కాపరిగా పనిచేసిండు, మోటకొట్టడం, తిత్తి, డప్పు, చెప్పులు చేయడం నేర్చుకున్నాడు. తత్త్వాలు చెపుతూ, ప్రజల మధ్యనే ఉంటూ సంసారిక జీవితాన్ని గడుపుతూ అచలాన్ని బోదించిండు. పిల్లలతో కలిసి వ్యవసాయ పనులు చేసిండు. కుల వివక్షను ప్రశ్నించాడు. అట్టడుగు వర్గాల వారికి ప్రాణపదమయ్యిడు తన తత్త్వాల్లో సమ కాలీన సమాజాన్ని ఆవిష్కృతం చేసిండు. జాతరల గురించి, జోగిని ఆచారంగురించి, దొంగతనాలు, వేశ్య లోలత్వంపై తత్త్వలు చెప్పిండు. అలాగే మానవజీవితం

గురించి, మార్మికతతో, గూఢమైన అర్థాలతో, దేహం గురించి, జీవితంగురించి చెప్పిండు. ఇతర కులాల వారైన కుమ్మరి, మాదిగ, దూదేకుల,కరణాలు మొదలగు అన్ని కులాల వారిని ఈ తత్త్వాల్లో ప్రస్తావించాడు.

దున్న ఇద్దాసు పేరును పరిశీలిస్తే ఇదమ్మ ఒక గ్రామ దేవత. ఆడపిల్లలకు ఇదమ్మ, మగపిల్లలకు ఇదన్న పేర్లుపెట్టడం ఆచారం. మాదిగల కులదేవత మాతంగి పరాదేవత. ఇద్దన్న పేరే ఇద్దాసుగా మారింది. ఇద + దాసు = ఇద్దాసు. బాల్యంలో రైతులవద్ద జీతగాడుగా కుదిరి చిన్నప్పుడు పశువులు కాయటం, మోటకొట్టడం, ఏతమెత్తటం, నాగలిదున్నడం, ఇంటివద్ద చెప్పులు కుట్టడం, తాళ్ళుపేనడం చేసేవాడు. తెల్లవారుజామున మోటకొట్టు సమయంలో బావివద్ద నుండి ముగ్గురు సాధువులు దేవాలయంలో శివసంకీర్తనం విని పరవశించి పోతాడు. ఆ రోజు నుండి సాధువుల వెంటవెళ్ళి భక్తితో సంకీర్తనలో పాల్గొనేవాడు. ఇది గమనించిన సాధువులు ఇద్దన్న నోరుతెరిపించి నాలుకపై విభూతిరాసారు. విభూతి ప్రసాదంతో ఇదన్న హృదయంలోని భక్తి బీజాలు మొలకెత్తి తాత్త్విక చింతనతో ఆశువుగా పాటలు ఆలపించడం ప్రారంభించాడు. ఇతని తత్త్వాలను విన్న జంగమదేవర పూదోట బసవయ్య ఇదన్న హృదయ క్షేత్రం పక్వమైనట్లు భావించి లింగధారణం చేయించి పంచాక్షరీమంత్రం ఉపదేశించినాడు.

ఇదన్న పోతులూరి వీరబ్రహ్మంగారి వలె భక్తి
జ్ఞాన, వైరాగ్యాలని ప్రబోధిస్తూ మార్మిక
తత్త్వాలను, వేదాంత కీర్తనలను రచించినాడు
పామరులకు అర్థమయ్యే తెలంగాణా
వ్యవహారికి భాషలోని తత్త్వాలు

తెలంగాణాలో వేపూరి హనుమద్దాసు, రాకమచర్ల వేంకటదాసు,ఇమ్మడిజెట్టి చంద్రయ్య,వేముల శంకరమ్మ, గొల్లపల్లి వేంకటదాసు, కాశీదాసు చెన్నదాసు, జటప్రోలు మాసుంబాబా, మన్నెలకొండ హనుమద్దాసు వీరంతా జ్ఞానయోగులుగా పేరు పొందినవారు. పాలమూరు ప్రాంతమంతా భక్తి జ్ఞాన భీజాలను చల్లినవారు ఇద్దాసు గారికి కులదేవత "మాతంగి" చాలా సందర్భాలలో దర్శన మిచ్చిందని ప్రతీతి. మాతంగా అనగా ఆసాది. ఆసాది అనగా గ్రామదేవతల గుడులలో పూజారి. ఇతని తత్త్వాలలో సామాజికత, మహిళలకు సమానత్వం, గ్రామ నామాలు, భాష, సామెతలు అన్ని వర్గాల వారికి సమాన స్థానంను కల్పించడంను చూడవచ్చు.

దేహజ్ఞానానికి సంబంధించిన తత్త్వంలో,
దేహమనే నార జీరి అభి
మానమనె చేతాడు పేని - సు
జ్ఞానమనెడు గుంజ బాతి - అ
జ్ఞానమును బిగగుంజి బిగ్గర" అని జ్ఞానబోధ చేస్తారు.

నాలుగు వేదములు - శాస్త్రములారు పరగ పద్దెనిమిది పురాణములు చదివి దారి తెలియక సంధ్య - జపమనుష్టానము జేసి మనుజులందరు- మాయకేలోకువైరి.

ఇద్దాసు గారి తత్త్వాలలో గురుతత్త్వం, ఆత్మతత్త్వం, ఆచారాలు దేశకాల పరిస్థితులు మొదలగు అంశాలు పేర్కొనబడినవి.

"ముందు నీకు రూపలేదట మంది
చదువు శృతులు పల్కుట
అందుకు పరిపూర్ణుడని వుండి ఏలితివయ్య"

ఈ విశ్వంలో చైతన్యానికి నిర్దిష్ట ఆకారం లేదు. భూమిపై పుట్టినపుడు ఒక ఆకారం వచ్చింది. కొంతకాలం భూమండలాన్ని పాలించి 84 లక్షల కోట్ల జీవులు పుట్టటానికి ముందు త్రిమూర్తులుగా మారి పరిపూర్ణత చెందాడని నాలుగు వేదాలు, పద్దెనిమిది పురాణాలు, ఇతిహాసాలుగా పరిణమించాయని చెప్తాడు.

కలియుగం నిల్పుటకు కల్కి రూపుడయ్యా
గురుడు పల్కుచున్న నాదురూపై
పల్కితివి పరబ్రహ్మ ఓం ॥

కలియుగంలో దేవతలు, రాక్షసులు, మానవులు ఉన్నారు. కానీ అందరూ మానవ రూపంలోనే ఉన్నారు. అందరికి కలిమాయ చుట్టుకోవడంతో కొందరు ధర్మాత్ములు, పుణ్యాత్ములుగా ఉంటూ వారు ధర్మాన్ని, నిజాయితీని ప్రదర్శిస్తారు. కానీ వాళ్ళను ఎవరు పట్టించు

కోరు. స్వార్థం అధికంగా ఉంటుంది విశ్వాసం, నమ్మకం లేకుండా ఉంటారు. అక్రమంగా సంపాదిస్తారు. అని కలియుగం గురించి చెప్తాడు.

కడగొట్టు వాన్నిగైనికాడున్నాను
కన్ను చూపుతో నన్ను కర్ణించి పోవయ్య
ఉదకము ఎక్కువై ఉడుకుతున్నది పైయి
ఉంటానో పోతానో తెలియరాదస్వామి
మాను మాదిగ గాని మనస్సు మాదిగాదు
ఆ మనస్సులో నిను తలచి మయిమరిచి పోతున్నా
నీ దయ లేకుంటే దరిదాపు నాకెవ్వరు
నీ దాసుని మీద దయలు ఉంచవయ్య

రెడ్ల ఇంట్లో గురుపూజ జరుగుచున్నదని తెలిసి ఇద్దాసు గురువు దగ్గర వెళ్ళాలంటే అగ్రకులాల వాళ్ళ ఇంట్లోకి రానివ్వరు. గురువుని చేరడం ఎలాగని తన ఆత్మలోనే పాడుకుంటూ వైమరిచిపోతాడు. ఇది గమనించిన బస్వలింగయ్య గురువు ఇద్దసుని ఇంట్లోకి పిలిపించాడు. గురువు గారికి పాదాభివందనం చేసి తీర్థ ప్రసాదం స్వీకరించాడు.

దున్న ఇద్దాసు తాత్త్వికగేయాలు, మేలుకొలుపులు, మంగళహారతులు రచించారు. వీరివి 32 తత్త్వాలు ప్రకటించబడ్డాయి. దున్న ఇద్దాసుగా ప్రసిద్ధుడైన మాదిగ మహాయోగి 108 ఏళ్ళు బ్రతికి 8-7-1919 నాడు తనువు చాలించారు. దేహం చాలించే ముందు శిష్యులతో తన మెడలో లింగం నుండి పాలుకారితే విధివిధానాలతో సమాధి చేయమని రక్తంకారితే బొంద పెట్టుమని చెప్పి కన్నుమూసారు. లింగం నుండి పాలు కారడం చూసి శిష్యులు చింతపల్లిలో సమాధి చేసారు.

అమ్మా ! నీకు ఇదిగో మంగళం - శివశంఖారణి
దేవి నీకు ఇదుగో మంగళం ...
పంచనైదు భూతముల
పళ్ళెమొకటి చేసినాము
మించిన తత్త్వంబునకు
అంటి మనసునుంచినాము

ఇది ఇద్దసు గారి మంగళహారతి. తెలంగాణ దళితకవి దున్న ఇద్దాసు తత్త్వాలు సజీవ సత్యాలుగా నిలిచి పోతాయి.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలుగు భాషా, సాహిత్యాలకు పాశ్చాత్యుల కృషి

– డా॥. భూక్య తిరుపతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రాఙ్నన్నయ కాలం నుండి తెలుగు భాషా, సాహిత్యాలు దినదినాభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. రోజురోజుకు కొత్త కొత్త పదాలు భాషలో నుండి ఉద్భ విస్తూనే ఉన్నాయి. ప్రాఙ్నన్నయ కాలం నుండి తెలుగు సాహిత్య పరిశోధకులు, వివిధ రకాలుగా సాహిత్య యుగ విభజన చేశారు. రాబోవు రోజులలో కూడా ఇంకా మరో కోణంలో కూడా విభజిస్తారు. ప్రస్తుతం తెలుగు భాషకున్నంత పద సంపద నన్నయ భారతాంధ్రీకరణ కాలంలో లేకపోయినప్పటికి, నన్నయ రెండున్న పర్వాల భారతాన్ని తెలుగులోకి ఆంధ్రీకరించి తెలుగు భాషాభి వృద్ధికి పునాది వేశాడు. అప్పటినుండి ప్రారంభమైన తెలుగు సాహిత్య రచన వివిధ కవుల సాహిత్య రచనల ద్వారా అభివృద్ధి చెందుతూనే ఉన్నది. అయితే ప్రాచీన కవుల రచనలు అన్ని తాటాకుల పైన, రాగి రేకుల పైన శిలా శాసనాల పైన వివిధ రూపాలలో గ్రంథస్థమైనది. భారతదేశానికి వచ్చిన పాశ్చాత్యుల మూలంగా తెలుగు భాషపై విస్తృత స్థాయిలో శాస్త్రీయ పద్ధతిలో పరిశోధనలు జరిగినవి. ప్రారంభ కాలంలో వాటి ఆధారంగా పాఠక లోకానికి తెలుగు భాషకు సంబంధించిన అనేక విష యాలు తెలుస్తున్నాయి.

క్రీ.శ. 16వ శతాబ్దంలో పాశ్చాత్యులు తమ స్థావరాల్ని ఆంధ్ర రాష్ట్రంలో మచిలీపట్నం ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్నారు. వారి వర్తక వ్యాపారాల కోసం మచిలీ పట్నంలో డచ్చివారు, ఫ్రెంచివారు తరువాత ఆంగ్లేయులు వ్యాపారాలు చేసేవాళ్ళు. వీరి రాకతో వ్యాపారంతోపాటు, ఆంధ్ర ప్రాంతంలో క్రైస్తవమత వ్యాప్తి, తెలుగు భాషా సాహిత్యాలపై విశేష ప్రభావం చూపింది. ఆ కాలంలోనే ముఖ్యంగా ఆంగ్లేయుల కాలంలో తెలుగు వారికి క్రైస్తవమత దీక్ష ఇప్పించి ఆంగ్ల భాష నేర్పించి, వారి సహాయంతో క్రైస్తవమత గ్రంథం బైబిల్‌ను తెలుగులోకి అనువాదం చేయించారు.

భారతదేశానికి వచ్చే పాశ్చాత్యులు భారతదేశంలోని ఏ రెండూ భాషలనైనా కనీసం నేర్చుకోవాలి అనే నిబంధన ఉండేది. అయితే ఆనాడు తెలుగును నేర్చుకున్న పాశ్చాత్యులలో మూడు వర్గాల వారు ఉన్నారు. వారు 1) క్రైస్తవమత వ్యాప్తికై తెలుగును నేర్చుకొన్నవారు. 2) ఉద్యోగ ధర్మాన్ని అనుసరించి వాణిజ్యాభివృద్ధిని కాంక్షించి వ్యావహారిక పరిజ్ఞానంతో తృప్తిపడి తెలుగు నేర్చుకొన్న వారు. 3) తెలుగుపై భాషాభిమానాన్ని పెంచుకొని విశేషకృషి చేసినవారు. పైన పేర్కొన్న మూడవ వర్గం వారి మూలంగానే తెలుగు భాషకు మహోపకారం జరిగింది. వారిలో ప్రముఖులు సి.పి.బ్రౌన్ దొర, మెకంజీ, కాంబెల్, ఛార్లెస్ ఇ. గోవర్స్. టి. బరో, ఎం.బి. ఎమెనో, జె.ఎ. బోయల్స్, బిషప్ కాల్డ్వెల్, కేప్టన్ ఎం. డబ్ల్యు మొదలైన వారు ఉన్నారు.

పాశ్చాత్యుల కాలంలో మరీ ముఖ్యంగా క్షీణ యుగంలో క్రీ.శ. 1806లో అచ్చు అక్షరాలు తయారు చేయించారు. ఇదే విషయాన్ని "క్షీణయుగమున పండిత వేద్యమైన కవిత ప్రజాపరమై సభా గౌరవమును చూరగొన్నది. తాటాకు పత్రముల నుండి భూర్జపత్రము లకు, కాగితాలకు వ్యాపించినది. క్రీ.శ. 1806లో తెలుగు అచ్చు అక్షరములను తయారు చేసినారు. క్రీ.శ. 1817లో తెలుగు లిపిలో అచ్చయిన మొదటి గ్రంథము శబ్ద మంజరి. క్రీ.శ. 1834 నాటికి తెలుగు గ్రంథాలు అసంఖ్యాకముగ అచ్చయినవి. అందువలన ఎక్కువ మంది చదువుటకు వీలయినది. సంస్కృత గ్రంథములతో పాటు తెలుగు గ్రంథములపై అభిమానం హెచ్చినది. మెకంజీ, బ్రౌన్ వంటి పాశ్చాత్య పండితుల కృషివలన ప్రాచీన గ్రంథములనేకములు సేకరించి భద్రపరచుట జరిగినది" అని డా॥ జి. నాగయ్యగారు పేర్కొన్నారు.

అదే కాలంలోనే తెలుగు నిఘంటువులు, వ్యాకరణ గ్రంథాలు, పురాణ ఇతిహాస గ్రంథాలు అనేకం వెలుగులోకి

వచ్చాయి. ఆలాగే భారతదేశంలోని భాషాకుటుంబాలు, ద్రావిడ భాషల వ్యాప్తి, ఆంగ్ల భాషలకు ద్రావిడ భాషలకు ఉన్న తేడాలు, తెలుగు భాష ఆర్య భాషా కుటుంబానికి చెందినది కాదని, ఇది ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని తెలియజేశారు. వాటికి సంబంధించిన స్పష్ట మైన ఆకరాలను చూపించారు. ఇదే విషయాన్ని ఆరుద్ర గారు ఈ విధంగా ప్రస్తావించారు. "తెల్లవాళ్ళ వల్ల మన దేశానికి రాజకీయంగా ఎన్నో అనర్థాలు వచ్చినా, సాహిత్య సాంస్కృతిక రంగాలలో చాలా మేళ్ళు కలిగాయి. ఒక్కొక్క దేశ భాషకు కొందరు తెల్లవాళ్ళు మళ్ళా ప్రాణం పోశారు. నిఘంటువులు, వ్యాకరణాలు, వాచకాలు వ్రాశారు, వ్రాయించారు. అచ్చు కూటాలు నెలకొల్పారు. మూల మూలలలో ఉండే వ్రాతప్రతులను ఒక దగ్గర సమీక రించారు. గ్రంథాలను ప్రచురించారు. గ్రంథాలయాలను స్థాపించారు. మన పాత చరిత్రను అక్షరాలా తవ్వి పైకి తెచ్చారు. పురాతన శిల్పాలను కనిపెట్టారు. ప్రపంచానికి మన భాషల గురించీ, సంస్కృతి గురించి చాటి చెప్పారు" అని అన్నారు.

మెకంజీ దొరను భారతీయ గణిత శాస్త్రం మీద విస్తృత పరిశోధనలు చేయాలనే ఆలోచనే తనని భారతదేశానికి తీసుకువచ్చింది. వీరి గురించి ఆరుద్రగారు ఇలా అన్నారు "లూయిస్ దీపానికి ఆ రోజుల్లో లార్డు ఫ్రాన్సిస్‌గారు ప్రభువులు. ఆ వంశంలోని వాళ్ళను నేపియర్ ప్రభువులని పిలుస్తారు. వీళ్ళ మూల పురుషుడు జాన్ నేపియర్ గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు. ఈయన "లాగర్థామ్స్" ఘాథాంశాలను కనిపెట్టిన మేధావి. వీరికి అయిదవ తరంలోని మనుమడు ఫ్రాన్సిస్ దొరగారు తమ పూర్వీకుని జీవిత చరిత్రను వ్రాయదలిచారు. అందులో హిందువుల గురించి ప్రస్తా వించాలి. ఆ అంశంమీద పరిశోధనలు జరపడానికి ఫ్రాన్సిస్ దొరగారు కాలిన్ మెకంజీ సమర్థుడని భావిం చారు. ఆ పనిలో నియోగించారు. స్టార్నవె గ్రామానికి కమ్ ప్ట్రోలర్‌గా మెకంజీ ఆ రోజుల్లో పనిచేస్తూ ఉండేవారు. పరిశోధనా పిపాస పెరిగిన మెకంజీగారు చేస్తున్న ఉద్యోగానికి రెండేసి నెలలు, మూడేసి, నాలుగేసి నెలలు సెలవు పెట్టి గ్రంథ పఠనమునూ, విషయ సేకరణలోనూ పడ్డారు. మూడేళ్ళపాటు ముమ్మరంగా ఈ వ్యాసంగం సాగింది. అయితే దురదృష్టవశాత్తు ఫ్రాన్సిస్ ప్రభువు మరణించారు. ఆయన చనిపోయినా మెకంజీలో ఆయన నాటిన విజ్ఞానాంకురం చనిపోలేదు. తాను స్కాట్లండులో హిందువుల గణితంపై ప్రారంభించిన పరిశోధనలను భారతదేశంలోనే కొనసాగించాలని మెకంజీ నిశ్చయించు కొన్నారు" అని అన్నారు.

మెకంజీ భారతదేశానికి వచ్చిన తరువాత మధురకు వెళ్ళి, అక్కడ ఫ్రాన్సిస్ కుమార్తె అయిన హెస్టర్ దొరసాని ఇంట్లో అతిథిగా దాదాపు పదమూడు సంవత్సరాలు ఉన్నారు. అక్కడ హెస్టర్ దొరసాని తన ఇంట్లో ఒక పండిత కేంద్రాన్ని, నిష్ణాతులైన బ్రాహ్మణ విద్వాంసులతో ఒక సభను నడుపుతుండేది. భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న గణితశాస్త్రానికి సంబంధించిన గ్రంథాలు సేకరించేవారు. వాటిని క్రోడీకరించేది. ఇక్కడే ఉంటున్న మెకంజీ దొరగారు భారతదేశంలోని ప్రాంతాలు సర్వే చేయాలని, దేశ చరిత్రను తెలుసుకోవాలనే ఆలోచన కల్గింది. భారతదేశానికి వచ్చిన ఇతను మొదట్లో దిండిగల్, కోయంబత్తూరు ప్రాంతాలకు బదిలీ మీద వెళ్ళాడు. అక్కడినుండి నెల్లూరు, ఒంగోలు మార్గాలకు సర్వే చేస్తున్న కాలంలో చినబళ్ళ ఫడేరు చెప్పిన కంభం కైఫీయతులను మెకంజీ రాసుకునేవారు. అలాగే నెల్లూరు కచేరిలో ఉన్న పత్రాలను చదివి వాటిని క్రోడీకరించారు. కడప, కర్నూలు జిల్లాలో పర్యటించి నిజాం ప్రాంతపు భూముల్లో ఉన్న ఖనిజాలు, వజ్రాలకు సంబంధించిన ఆకరాలను సేకరిం చారు. సేకరించిన విషయాల్ని ఏషియాటిక్ రీసెర్చెస్ పత్రికలో శ్రీశైలం ఆలయ విషయాలు, అమరావతి స్థూప విషయాలు, దక్షిణ భారతదేశంలోని జైనస్థానాల వివ రణలు ప్రచురించారు.

మెకంజీ, బ్రౌన్‌ల కాలంలోనే 'డాక్టర్ లాడెన్' ఉద్యోగిగా 1803లో మద్రాస్ వచ్చాడు. దాదాపుగా తొమ్మిది సంవత్సరాలు వివిధ ప్రాంతాలు పర్యటించి తెలుగు, తమిళ, కన్నడ భాషా గ్రంథాలను సేకరించారు

మైసూర్ ప్రాంత పర్యటన సమయంలో ప్రకృతి శాస్త్రం మీద పరిశోధనలు చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న కొండలు, అక్కడ దొరికే ఖనిజాలు, లోహాలు వాటితో ఎటువంటి రోగాలు తగ్గుతాయో అనే విషయం మీద విశేషమైన కృషి చేశారు. అలాగే సీమ ప్రాంతంలో పర్యటించినప్పుడు అక్కడ పండే పంటలు, కాయలు, కార్తెలూ, ఆ ప్రాంతంలో మాట్లాడే భాషలు, వాటి వివరాలు తెలుసుకునేవారు. శ్రీరంగపట్నంలో ఉన్నప్పుడు సంస్కృత భాషను నేర్చుకొని కథలను అనువాదం చేశారు. తాను తిరిగిన ప్రతి ప్రదేశంలోను శాసనాలు భారతీయుల చరిత్ర, ఆచారాలు, మత నియమాలు మొదలైన విషయాలు తెలుసుకునేవారు. తన జీవిత కాలంలో సేకరించిన విషయాలను క్రీ.శ. 1875లో లాడేన్ గారి కవితలు, కథాగేయాలు గ్రంథరూపంలో ప్రచురిత మైనాయి.

డేవిడ్ బ్రౌన్, మిస్ ఫ్రాన్సిస్ కౌలేల ద్వితీయ పుత్రుడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్. బ్రౌన్ చిన్నతనంలోనే హీబ్రూ, సిరియన్, అరబ్బీ, పారశీక, గ్రీకు, లాటిన్ భాషలతో పాటు సంస్కృతం రాయడం చదవడం నేర్చుకున్నారు. తండ్రి దగ్గరే గ్రంథ పరిష్కరణలో శిక్షణ పొందాడు. ఇది అతనికి తరువాత కాలంలో ఆంధ్ర సాహిత్య పరిష్కారానికి బాగా ఉపయోగపడింది.

సి.పి. బ్రౌన్ 1817లో మద్రాస్ సివిల్ సర్వీసులో రైటర్‌గా మొదటిసారిగా ఉద్యోగంలో చేరారు. మద్రాసులో ఉద్యోగం చేస్తూనే కోదండరామ పంతులు వద్ద తెలుగు నేర్చుకొన్నారు. 1820లో కడపజిల్లా డిప్యూటి కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పనిచేసినప్పుడు తెలుగులో మాట్లాడటం తప్పనిసరి అయ్యింది. 1822లో కడప నుండి మచిలీపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడినుండి తిరిగి మద్రాస్‌కు వచ్చారు. అక్కడ "హిందువుల ఆచారాలు" అనే గ్రంథం ఇతనికి లభించింది. ఆ పుస్తకాన్ని తన వెంట తీసుకెళ్ళారు. అందులో అతనికి తెలియని అనేక విషయాలు కనిపించాయి. ఆ పుస్తకం చదువుతుంటే కడపజిల్లాలో ఒక గొప్ప కవి ఉన్నాడని తెలిసింది. అప్పుడే వేమన గురించి సి.పి.బ్రౌన్ అన్వేషిస్తే ఇతను రెడ్డి కులానికి చెందినవాడని 17వ శతాబ్ది కవియని, తాత్త్విక కవని అర్థమైంది. అప్పుడు వేమన ప్రతుల్ని సేకరించి కాగితాల మీదికి రాయించి వాటిని 1824లో ఆంగ్లంలోకి అనువదించాడు. ఇతనికి రాజమండ్రిలో ములుపాత బుచ్చయ్యశాస్త్రితో పరిచయం ఏర్పడింది. అతను రచించిన వెంకటేశ్వర మాహాత్మ్యం, మాఘమాహాత్మ్యం కావ్యాలను చదివి, అతని దగ్గరే ఛందస్సు నేర్చుకొన్నాడు. తదనంతరం విష్ణుపురాణం, పద్మపురాణాన్ని ప్రత్యేకంగా చదివారు.

కావ్యాలను చదువుతున్నప్పుడు బ్రౌన్‌గారికి ఒక ఆలోచన వచ్చింది. ఇప్పటివరకు కాలేజీ బోర్డు వారు తెలుగును అభ్యసించడానికి వీలుగా వ్యాకరణాలు, నిఘంటువులు, పదకోశాలు మొదలైన వాటిని సెలక్షన్లూ ప్రకటిస్తున్నారే తప్ప తెలుగు కావ్యాల పరిచయం పూర్తిగా తెలుసుకోవడానికి ఆంగ్లేయులకు ఉపయోగపడే ఛందో గ్రంథాలు మద్రాసు కాలేజీవారు ఇంతవరకు ప్రకటించ లేదు అని ఆలోచించి ఆ కార్యానికి తానే పూనుకొన్నాడు. అప్పుడే 'Analysis of Telugu Prosody' అనే రచనను చేశారు. 1825లో 'ఆంధ్ర గీర్వాచ్ఛందసు' అనే తెలుగు పేరుతో "The Prosody of the Telugu and Sanskrit Languages Explained" అనే గ్రంథాన్ని రచించారు. కడపలో ఉన్నప్పుడు సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్ర గిర్వాణ ఛందంలో బ్రౌన్ తెలుగు సాహిత్యాన్ని చదువవలసిన క్రమాన్ని ప్రత్యేకంగా వివరించారు. ప్రతి వ్యక్తి వేమన పద్యాలు చదవాలి. వీటి తరువాత చక్రవర్తి రాఘవాచార్యులు గారి 'నల చరిత్ర' అనే ద్విపద కావ్యంలో ఉన్న కథ చదవాలి. ఆ తరువాత రంగనాథ రామాయణం చదవాలి. వీటి తరువాత ఆంధ్ర మహాభారతంలోని పద్యాలు, భాగవత అష్టమ, దశమ స్కంధాలు అధ్యయనం చేయాలని అన్నారు. ఆ తరువాత అలంకార కావ్యాలు తారాశశాంకం, సుభద్రా పరిణయం, మనుచరిత్ర, దశావతార చరిత్ర, హంసవింశతి వంటివి చదవాలి వాటన్నిటి తరువాత రాఘవ పాండవీయం,

నైషధం, విష్ణుచిత్తీయం చదివి చివర్లో వసుచరిత్ర చదవాలని అన్నారు.

తెలుగు భాషకు చక్కని నిఘంటువు తయారు చేయాలని నిర్ణయించుకొన్నారు. అప్పటికే ఉన్న కాంబెల్ నిఘంటువులో మధ్యలో తెల్లకాగితాలు చేర్చి బైండింగ్ చేయించేవారు. తెల్ల కాగితాలపై కొత్త పదాలు రాసేవారు. ఇలా రాసినవి మొత్తం సుమారుగా నాలుగువేల పదాల వరకు ఉన్నాయి. ఆంధ్ర సాహిత్య వ్యాసంగాన్ని ఆరంభించిన నాటి నుంచి తన జీవితాంతం వరకూ గ్రంథ సేకరణ ఒక పవిత్రమైన కర్తవ్యంగా భావించి అనేక సంపుటాలను సంపాదించేవారు. క్రీ.శ. 1830లో భారతీయ హిందువులు ఎక్కువగా ఇష్టపడే సరుకుల మీద ఒక వాణిజ్య వ్యాసాన్ని కూడా రాశారు. ఇది బెంగాల్ పత్రిక లోను, అమెరికన్ పత్రికలో ప్రచురితమైంది. హిందువుల ఆచార వ్యవహారాల మీద ఒక వ్యాసం రాశారు. 1835లో "A Grammar of the Telugu Language" అనే పేరుతో ఇంగ్లీషులో ఆంధ్ర వ్యాకరణాన్ని, సంస్కృత ఛందస్సు గురించి "A Familiar Analysis of Sanskrit Prosody" అనే పేరుతో వ్యాసాన్ని ఏషియాటిక్ జర్నల్‌లో ప్రచురించారు. తెలుగు కన్నడ గ్రంథాలకు కేటలాగులు తయారు చేశారు. 1842-1850 వరకు పల్నాటి వీరచరిత్ర ప్రతిని పరిష్కరించారు.

ఛార్లెస్ ఇ. గోవర్ తమిళ, మలయాళం, బడగ, కన్నడం, కొడగు భాషలలో జానపద గేయాలు సేకరించి “Folk Songs of Southern India” అనే పేరుతో గ్రంథాన్ని రచించారు. ఇందులో వేమన పద్యాలున్నాయి. జె.ఎ. బోయల్ 1874లో రాయలసీమలో ఉద్యోగిగా ఉన్నప్పుడు తన అధికారక పర్యటనల్లో గ్రామాల్ని సందర్శించినప్పుడు రాత్రి సమయాల్లో పల్లె ప్రజలు పాడే పాటల్ని వాటి తాలుకూ సంగీతాన్ని వింటూ ఉండేవాడు. కెప్టెన్ ఎం. డబ్ల్యూ కౌర్ ‘ఆంధ్ర లోకోక్తి చంద్రిక’ అనే పేరుతో తెలుగు సామెతలు సేకరించి ప్రచురించాడు. ఎం.బి. ఎమెనో, టి. బరో మొదలైన వారు ద్రావిడ భాషల మీద విశేషమైన కృషి చేశారు. ఈ విధంగా పాశ్చాత్యులు తెలుగు భాషా సాహిత్యాభివృద్ధికి ప్రారంభ కాలంలో ముఖ్యంగా క్షీణ యుగాలలో విశేషమైన కృషిచేశారు.

**ఆధార గ్రంథాలు :**

1) ఆరుద్ర - సమగ్ర ఆంధ్ర సాహిత్యం.
2) జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష.
3) మెకంజీ కైఫీయత్తులు - మొదటి భాగం, సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్ట్, కడప.
4) ప్రతిభామూర్తుల జీవిత చరిత్రలు - తెలుగు మణిదీపాలు, కృష్ణాజిల్లా రచయితల సంఘం.
5) ద్రావిడ భాషలు - పి.ఎస్. సుబ్రహ్మణ్యం.
6) ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి - తెలుగు భాషా చరిత్ర.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తోలు బొమ్మలాటలు నవల - విశ్లేషణ

- డా॥. బశెట్టి ఉపేంద్ర, అతిథి అధ్యాపకుడు, ట్రిపుల్ ఐ.టి., ఇడుపులపాయ, కడప.

ఆంధ్రదేశం కళలకు కాణాచి వంటిది. శాతవాహనుల కాలం నుంచి ఆంధ్రదేశంలో కళలు పరిఢవిల్లాయి. ఈ తెలుగు ప్రాంతంలోనే దాదాపు నాలుగు వందల కళలు న్నాయి. అయితే శాస్త్ర సాంకేతికాభివృద్ధి చెందడం వల్ల, కరువు కాటకాలవల్ల, ప్రభుత్వాలు కళలను ఆదరించక పోవడం వల్ల చాలా కళలు అందరించిపోయాయి. ప్రతి సామాజిక వర్గానికి ప్రత్యేక కళలున్నాయి. ఈ కళలు ప్రజలకు వినోదాన్ని, ఆనందాన్ని, భావ విప్లవాన్ని కలిగించాయి, నేటికీ కలిగిస్తున్నాయి. అలాంటి కళల్లో చెప్పదగిన అద్భుత కళ 'తోలు బొమ్మలాట' ఆ కళ నేడు దాదాపుగా తెరమరుగయిందనే చెప్పాల్సి ఉంది. ఈ కళ స్థితి గతులను గూర్చి 'తోలుబొమ్మలాట' అనే నవల చిత్రించింది.

ఈ తోలు బొమ్మలాటకు దాదాపు రెండు వేల సంవత్స రాల చరిత్ర ఉంది. ఈ కళ ప్రదర్శన చూస్తే ఈ కళాకారుల ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం, నేర్పు, కూర్పు, సృజనత్వం ఎలాంటివో ద్యోతకమవుతాయి. ఈ కళను సృజించిన కళాకారులు ఎంతటి మేధావులో కూడా బహిర్గతమై మన లను ఆశ్చర్యచకితులను చేస్తుంది. ఈ కళ ఉత్థాన పతనాలను గూర్చి ఎందరో కథకులు, నవలా కారులు చిత్రించారు. అలాంటి వారిలో అగ్రగణ్యులు సన్నపరెడ్డి వెంకటరామిరెడ్డి గారు. ఈ బొమ్మలాట మనలను బతికిం చడం లేదని కళాకారుని కొడుకు కిరీటి నిష్ఠూరమాడుతూ ఆ బొమ్మలను అమ్మి ఆకలి తీర్చుకోవాలంటాడు. అపుడు గోవిందరావు కొడుకుతో ఇలా అంటాడు.

"యన అమ్మ సాయినోళ్ళు సచ్చేదాకా ఆడతానే ఉన్నేరు. గుర్తులేదా? మీ తాత అయితే మరీ... ఆడతా... ఆడతా... ఆంజనేయస్వామి చేత లంకాదహనం చేయిస్తా.... స్టేజిమీదే పాణాలిడ్సిండు. ఆటమధ్య ఆపితే గ్రామానికి అరిష్టమనీ, మీ రంగడ బిగదీసి కరువు కడు తుందని సావు సంగతి బైటికి పొక్కకుండా తెల్లార్లూ ఆడినం..... గుర్తులేదా! బొమ్మలాట గాల్లంరా మనం.... బొమ్మను పట్టుకుంటే పూనకమొచ్చినట్టు కథాపాట మాటా గజ్జల అడుగులు తాళాలూ, లయ అన్నీ పరిగెత్తు కంటా రావా! పిరికి మాటలు మాట్లాడతావు గదరా నాయాలా!" అంటూ సున్నితంగా మందలిస్తాడు.

ఒకప్పుడు కళాకారులకు ఎంతో గౌరవం ఉండేదని గోవిందరావు గుర్తుచేసుకుంటాడు. పాతకాలం నాటి బొమ్మలాట కళాకారుల ఆత్మగౌరవాలూ, అభిమాన సంపదలూ, పొందికైన మాటలు, అపశబ్దాలు దొర్లని భాష. ఈ రెండింటి కలయిక వల్ల కలిగిన వృత్తికి ఆనందాన్ని ఆపాడించే కొద్దిపాటి అహంభావ సంపదా - మనస్సు లోపలి పొరల్నుంచి బైటకు తన్నుకొచ్చేందుకు ప్రయత్నిం చేవి. తమను గౌరవించి తాంబూళాలిచ్చే రెడ్డిగారి పెద్ద రికాలూ, గ్రామ కట్టుబడుల వినయాలూ, పురాణగాథల పట్ల చెవికోసుకునే గ్రామస్థుల ఉత్సాహాలు గోవిందరావు కళ్ళముందు కదలాడాయి. ఒకప్పుడు తోలుబొమ్మలాట కళాకారులు ఒక ఊరికి చేరగానే గ్రామస్తులందరూ వారికి భోజన ఏర్పాట్లు చేసేవారు. కానీ నేడు అలాంటి పరిస్థితి పూర్తిగా కనుమరుగైంది. ఈ విషయాన్ని గూర్చి సన్నపరెడ్డి వెఎంకటరామిరెడ్డి గారు ఒక వృద్ధురాలి చేత ఇలా చెప్పి స్తాడు.

"ఇప్పుడెవురు సూస్తారు తల్లీ బొమ్మలాట! ఎవురింట్లో చూసినా ఆ కొంపలు గూల్చే టీవీ పెట్టెలుండాయి. అయ్యేంటియో ఇసిత్రపు సీరెల్లంటమ్మా! కరంటోస్తేసాలు ఆడ మొగ అందరూ టీవీలకు అతకుపోయి కూచొనే వాల్లే మన కాలం అదొక ఎర్రి కాలంతో... తోలుబొమ్మ లాట తొంబై ఆమడలయినా పోయిసూసి రావాలని సామెత. తెల్లబార్లు కంటిమీద కునుకు లేకుండా సూస్చాం టిమి... ఇప్పుడైన ఓపికుండి బొమ్మలాట సూస్తీమంచిదే"

అంటుంది. ఈ మాటలు నేటి కళాకారుల దుస్థితికి అద్దం పడుతున్నాయి.

తోలు బొమ్మలాట కళాకారులు ఒక ఊరికి వెళ్ళగానే వారికి ఆ ఊరి పెద్ద, ఇతరులు ఘనస్వాగతం పలికేవారు. వారికి దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేసేవారు. అయితే నేడు ఆ పరిస్థితి లేదు. పెదదలందరూ గతించారు. పిల్లలకు ఆ మర్యాదలు, కళాభిరుచి తెలియదు. అందువల్ల గోవిందరావు ఒక ఊరికి కళాప్రదర్శనకు వెళ్ళే, ఆ ఊరి లోని ఒక యువకున్ని ఇలా అభ్యర్థిస్తాడు.

"నాయనా! వెంటేసూ! ముత్త రాజులు నాయనా మీరు... రాజవంశం మీది. మీ నాయన హయామంతా మేం ఈ ఊర్లోకొస్తే మమ్మల్ని వదలి పొయ్యేవాడు కాదు. ఆట ఆడాల... సంభావనలన్నీ రాబట్టాల. మమ్మల్ని బండెక్కించి వాగుదాకా సాగనంపాల అప్పుడుగాని ఆయనకు తృప్తి ఉండదు. కాలం మారిపోయింది. కొత్త తరానికి బొమ్మలాటలు తెలిసినట్టు లేదు. పాతతరం వాల్లు కూడా మరిచిపోయినట్లుండారు. వాళ్ళకు కొద్దిగా గుర్తు చేయినాయినా! పొద్దున్నే లేచి గ్రామపెద్దల కాడికీ, గుంపు పెద్దల కాడికీ మమ్మల్ని తీసకపోయినా వనుకో..... మేమే చెప్పుకుంటాం తండ్రీ! ఈ ఒక్క సాయం చెయ్యి వెంకటేశ్వర్లూ!" అంటూ వేడుకుంటాడు. దానికి ఆ యువకుడు సరేనంటాడు ఆ ఊరిపెద్ద రాఘవరెడ్డి వద్దకు తీసికెళతాడు. అపుడు అనేక తర్జన భర్జనల తరువాత రాఘవరెడ్డి ఇలా అంటాడు.

"కళను చూపాలని వచ్చినవారు. నాగ్గూడా సంతోషంగా ఉంది. బొమ్మలాట ఆడించాల. ఇప్పటి తరానికి దాని రుచి చూపించాల. నేను ఓ కే.... నాక్కూడా ఆట చూడాలని వుంది. నా సహకారం మీకు ఎల్లవేళలా ఉంటుంది. అయితే ఇప్పుడొక యిబ్బంది వచ్చిపడింది.

రేపు టెండర్లుండాయి. నేను కడపకు పోవాల. చీకట్లోనే లేచిపోవాల. మీ పంచాయతి పట్టించుకునేంత టైం లేదు నాకు ఒక పన్జేయండి. మన సర్పంచి కాడికిపోండి ఆయప్పకు నేను చెప్పి పంపుతా అన్నీతనే దగ్గరుండి చూసుకుంటాడు" అంటాడు.

రాఘవరెడ్డి మాటలకు నీరుగారిపోతాడు గోవిందరావు. ఆ క్రమంలోనే ఆ ఊరిలోని కృష్ణమాచార్యులను సంప్రదిస్తాడు గోవిందరావు తను వచ్చిన పనిచెబుతాడు. అపుడా పెద్దాయన మారిపోయిన కాలాన్ని గురించీ, కూలిపోతున్న కులవృత్తుల గురించి ఆవేదనగా చెప్పుకొస్తాడు. బొమ్మలాటలూ, హరికథలూ, బుర్ర కథలూ, యక్షగానాలూ, పిచ్చిగుంట్ల కథలూ.... ఒకటేమిటో పల్లె జనాలకు ఆనందంతోబాటు మంచి నడవకనూ, ఆధ్యాత్మిక స్పృహను కలిగించే ఈ కళలన్నీ అంతరించి పోయిన వైనాన్నీ ఆవేదనగా వెలిగక్కుతాడు. అన్ని గ్రామీణ వినోదాల్ని మింగేసి తానొక్కడే వెలిగిపోతూ వున్న టీవిల గురించి వివరిస్తాడు. దానికిబానిసలైన జనాల పోకడ పట్ల బాదపడతాడు. ఊరి మధ్యన గుడ్డ తెరలు కట్టి, దీపాలు వెలిగించి, తెరలు బొమ్మలెత్తి తెల్లార్లూ గొంతు చించుకున్నా టీవి బొమ్మల్నిచూసీ కళ్ళకు తోలుబొమ్మలు ఎబ్బెట్టుగా కనిపిస్తాయనీ, వాటిని ఆదరించి ఆనందించే స్థితిలో జనం లేరని చెప్పాడు. అతని మాటలు పూర్తిగా విన్నాక గోవిందరావు ఒక నిట్టూర్పు విడుస్తాడు. అదే విధంగా ఆ ఊరికి చెందిన బ్రహ్మయ్య కులవృత్తులు పతనమయ్యాయని, దానిలో భాగంగానే తోలుబొమ్మలాటకు ఆదరణ లేకుండా పోయిందని అంటాడు. గోవిందరావుతో ఆయన ఇలా అంటాడు.

"కులవృత్తులు యాడుండాయి నాయినా! మాదిగోని చెప్పులు ఎవురు తొడుగుతుండారు. కుమ్మరోని కుండలు ఎవురు వాడుతుండారు... చెప్పు! ఎద్దుల సేద్యం ఉంటే అన్నీ కులాల వాళ్ళతో పనిబడతా ఉండె. ఇప్పుడంతా ట్రాక్టరు సేద్దేలయిపాయె. సేద్దెపు కొరముట్లతో ఏంపని? ఎప్పుడో కొడవలో గొడ్డలో చరిపించుకోవాలంటే టౌనుకు పోతాండ్రి రైతు పని ఇడిస్తేగాని మేం కూడా బతకలేని కాడికొచ్చినం అందుకే నాకొడుకు టౌన్జేరిండు. డబుల్ కాట్లూ, సోఫా సెట్లూ డైనింగు టేబిల్లూ.... ఇట్లా నైసుపన్జేసుకుంటూ బతుకుతాండు. మాకులపు పిల్లోల్లు చానామంది చిల్లరంగళ్ళు పెట్టుకొనే, బేల్దారి పనికి పోతానో,

కోత మిషన్లలో కూలికి పోతానో బతుకుతాండారు'' అని చెబుతాడు. ఏదిఏమైనా తమ కళకు ఆదరణ తగ్గడాన్ని గోవిందరావు జీర్ణించుకోలేకపోతాడు. ఆ పల్లెలో ఎలాగోలా ఆట ఆడి వారిచ్చింది తీసికొని తన బృందంతో తిరుగు ముఖం పడతాడు.

గోవిందరావు తమ కళ నిరాదరణకు గురి కావటానికి గల హేతువులను ఇలా నిర్ధారిస్తాడు.

''తమ కళను పల్లెల దరికి రాకుండా చేసింది. టీవీలే. బొమ్మను చేసి అవమాన పరచాలనుకుంటే టీవిల బొమ్మను చేసి పోకమాను మోయించాలి.

ఒక్కో సీరియల్‌కు ఒక్కోరకమైన అవమానం.

ఒక్కో ఛానల్‌కు ఒక్కో విలక్షణమైన పరాభవం...

అవును టివిల బొమ్మలు చేయాలి'' అనుకుంటాడు. తోలు బొమ్మలాట కళ ఏ విధంగా నిరాదరణకు గురైందో సన్నపురెడ్డి వెంకటరామరెడ్డి గారికి తోలు బొమ్మలాటలు అనే నవలలో సప్రమాణంగా చిత్రించారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తోలు బొమ్మలాటలు - సన్నపురెడ్డి వెంకటరామరెడ్డి
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.ఎస్.సుందరం
3. రాయలసీమ జానపద కళలు - పేటశ్రీ
4. జానపద కళలు - భక్తవత్సల రెడ్డి
5. జానపద కళారూపాలు - చిగిచర్ల కృష్ణారెడ్డి

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# రూపకం - సమాహార కళ ఒక పరిచయం

## (Rupakam - Samahara Kala Oka Parichayam)

- డా॥. వెంకట నరేష్ బుర్ల, అసిస్టెంట్ ప్రొఫెసర్, సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ జార్ఖండ్, రాంచి.

(**Abstract :** The art 'theatre' is a mirror of human life. The Play thrives on multiculturalism, not onlyas a source of community consciousness and inspiration, but also as a part of modern education and as a way of documenting the history of human society. Unfortunately in the present scenario theatre art is considered as the least preferable art. This article delineate to understand about he characteristics and importance of theatre arts in digital age)

రూపకం (వాడుక భాషలో నాటకం) మానవ జీవితానికి దర్పణం వంటిది. నాటకం, మానవసమాజ పరిణామ క్రమాన్ని అనుసరిస్తూ ఇప్పటి రూపానికి చేరింది. నాటకం, సమాజ చైతన్యానికి, స్ఫూర్తికి ప్రేరణకూ కారకమే కాకుండా, జనబాహుళ్యానికి మానసిక ఉల్లాసానికి తోడ్పడుతూ వారికి జ్ఞానాన్ని అందించడంలోనూ, ఆధునిక విద్యలో భాగంగానూ, మానవ సమాజ చరిత్రను నమోదు చేసే సాధనంగానూ బహుముఖీనంగా ప్రయోజనకారిగా వర్ధిల్లుతున్నది.

వర్తమానంలో నాటకం ఉనికిని దాని ప్రాముఖ్యతనూ - సినిమా, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ - వంటి సాధనాలు తగ్గించాయనే చెప్పవచ్చును. అయితే, శతాబ్దానికి పైబడి సామాజిక జీవనంలో విడదీయరాని భాగంగా మారిన నాటక ప్రదర్శనల విశిష్టతనూ, సమాహార కళగా నాటకానికున్న ప్రాశస్త్యాన్ని విస్మరించ లేము.

### చారిత్రక ప్రభావం :

అరచేతుల్లోనే దృశ్యమాధ్యమం ఒదిగిపోయి తేలిగ్గా వినోదాన్ని - విజ్ఞానాన్ని - విషఫలితాలను కూడా అందిస్తున్న, ఈ సాంకేతిక విప్లవ యుగంలో నాటక ప్రదర్శనల గురించి లేదా నాటక ప్రాముఖ్యతను గూర్చి తెలుసుకోవలసిన అవసరం ఏమిటి? దీనికి సమాధానం చారిత్రాత్మక కోణంలో నుంచి చూడవలసిన అవసరం ఉంది. నాటకం - ప్రస్తుత సమాజంలో అపరిమితమైన ప్రాచుర్యాన్ని కలిగి ఉన్న సినిమా, టెలివిజన్, కంప్యూటర్ గేమ్స్ మొదలైన కళా సాధనాలన్నింటికీ పునాది. మన దేశంలో దాదాపు రెండు వేల సంవత్సరాలకు పూర్వమే, నాట్య శాస్త్రము రచించబడింది. నటులు, నటన, ప్రదర్శనా స్థలాలు, సంగీతం, ఇతివృత్తం.. ఇలా ఈ ప్రదర్శనా కళకు సంబంధించిన ప్రతి పార్శ్వాన్ని సమగ్రంగా నాట్య శాస్త్రములో పొందుపరిచారు మన పూర్వీకులు. ప్రాచీన గ్రీకులు, విషాద మరియు సుఖాంత నాటకాల మధ్య తేడాలను కూలంకషంగా వర్గీకరించారు. ప్రాచీన రోమన్ నాటకాలు మధ్యతరగతి జీవితాలను ప్రతిబింబించే ఇతివృత్తాలతో నిర్మించబడ్డాయి.

దాదాపు రెండువేల సంవత్సరాల క్రితం రచించబడిన సంస్కృత నాటకం 'మృచ్ఛకటిక'; గ్రీకు విషాదాంత నాటకం 'రాజా ఈడిపస్' లేదా సుఖాంత నాటకం 'లైసిస్ట్రా'; ప్రాచీన రోమన్ నాటకం ''ది ట్విన్స్''... ఈనాటికీ ప్రదర్శింప బడుతున్నాయి. అవి ఈనాటి సామాజిక పరిస్థితులనూ ప్రతిబింబించడం గమనార్హం. నాటకం ఎప్పుడూ సమ కాలీనమే అనడానికి ఇవి కొన్ని ఉదాహరణలు.

చారిత్రక దృక్కోణంతో పాటు, నాటకాన్ని గూర్చి తెలుసుకోవలసిన మరో ముఖ్య కారణం నాటకంలోని జీవ లక్షణం. నాటకం ''సజీవకళ''. అలా భావించడానికి కారణం, కేవలం ప్రదర్శన ఉత్తేజభరితంగానూ, ఉత్కంఠను కలిగించడం వల్లనూ, వినోదాన్ని అందించడం వల్ల మాత్రమే కాదు, నాటకం సజీవమైన పాత్రలతో ప్రదర్శించబడుతుంది. ఈ లక్షణమే నాటకాన్ని ఇతర కళల నుండి ప్రత్యేకంగా నిలిచేట్లు చేస్తుంది.

ఒక కథ నాటకం ద్వారా ప్రదర్శించబడటం, అదే కథ ఒక సినిమా లేదా టెలివిజన్ లో దృశ్యీకరించబడడం మధ్య తేడాలను లేదా వైరుధ్యాలను సులువుగా గ్రహించ వచ్చు. సినిమా లేదా టి.విలో రికార్డు చేసిన ప్రదర్శనలు ఉంటాయి. కానీ, నాటకం ప్రదర్శించే వ్యక్తి (ప్రదర్శన కారుడు) - నాటకాన్ని తిలకించే వ్యక్తి (ప్రేక్షకుడు) ఒకే సమయంలో ఒకే చోట ఉంటారు, తాదాత్మ్యతకు చోటుం టుంది. ఫిల్మ్ మరియు టి.వి లో ఇమేజ్ (చిత్రం) ముఖ్య మైనది. ఒక మనిషి యొక్క కృత్రిమమైన చిత్రం ప్రదర్శించే భావోద్వేగాలకు - ఒక వ్యక్తి సజీవ ప్రదర్శన ద్వారా ప్రకటించే భావోద్వేగాలకు - ప్రేక్షకుల నుండి తక్షణ స్పందన లభించడం అనే అతి ముఖ్యమైన అంశంలో తేడాలుంటాయి. ఈ కారణం ద్వారానే నాటకం 'సజీవం'. అందువల్లనే అది ఇతర మాధ్యమాల కంటే విశిష్టతను కలిగి ఉంటుంది.

నాటకాన్ని గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకతలకు సంబంధించి మరో ముఖ్య కారణం, నాటకంలో ఉండే రెండు రకాలయిన ఆకర్షణీయతలు. మొదటిది నాటక ప్రదర్శనలోని మానవ భావోద్వేగాలను పరిపూర్ణంగా - తక్షణం - వినోదాత్మకతను మేళవించి ప్రేరేపించగల గుణం, రెండవది కాలానుగుణమైన మానవ పరిస్థితులను లోతైన విశ్లేషణతో ప్రదర్శించడం. ఆలోచనాత్మక విశ్లేషణ లతో వినోదాత్మకంగా భావోద్వేగాలను ప్రదర్శించి మానవ హృదయాలలోనికి చొచ్చుకుపోయి, వ్యక్తుల లోలోపల అంతర్గత చర్చకు దారితీసే చింతనాత్మక ధోరణిని ప్రవేశ పెట్టగలగడం నాటకం యొక్క ప్రధాన లక్షణం, అన్నిటి కంటే ముఖ్యంగా ఈ అంశాలన్నీ సజీవ పాత్రధారుల ద్వారా ప్రదర్శించడంతో జనబాహుళ్యం వారి ఉనికిని నాటకంలో చూసుకోగలగడం, భావించడం జరిగి తక్షణ మానసిక స్పందన కలిగే అవకాశం వల్ల, ఈ సజీవ కళ మానవ సమాజపు వినోద విజ్ఞాన పార్శ్వంగా వెలుగొందు తూనే ఉంది.

నాటకం ప్రదర్శనా కళ ... అయితే నాటకం యొక్క స్వరూపాన్ని అవగాహన చేసుకోవడానికి, కళ లేదా కళల యొక్క లక్షణాలను స్వరూపాలను పరిశీలిద్దాం.

## కళ అంటే ఏమిటి?

సాధారణ పరిభాషలో 'కళ' జీవితానికి అద్దం లేదా ప్రతిబింబంగా చెప్పుకోవచ్చు. కళ - మానవ జీవనంలోని వివిధ పరిస్థితులు, ఆలోచనలు మరియు అనుభూతుల సంగ్రహణ లేదా అంచనాల సమాహారం. కళ ప్రజల జీవితంలో ఆశా నిరాశలను, భయానుభూతులను లోతుగా విశదీకరిస్తుంది. కళ కేవలం మానసిక ఆనం దాన్ని, ఉల్లాసాన్ని పంచే సాధనంగానే కాకుండా మానవ మనుగడలో ఒక సంపూర్ణ అవసరంగా అర్థం చేసుకోవలసి ఉంటుంది.

జీవితంలో ఎదురయ్యే అన్ని అనుభవాలను, అను భూతులను మాటల్లో వర్ణించలేము. కేవలం కళాత్మక రూపంలో మాత్రమే కొన్ని భావాలు, భావోద్వేగాలు, ఆలోచనలను వ్యక్తీకరించగలుగుతాము. ఉదాహరణకు అందమైన ముఖాన్ని, లేదా మనోహరమైన దృశ్యాన్ని పదాలలో వర్ణించినప్పుడు, వినేవారందరికీ మనసులో ఏర్పడే రూపం దృశ్యం. అది అందరికీ ఒకే మాదిరిగా ఉండదు. కారణమేమంటే, ఆయా దృశ్యాలు వారి వారి అనుభవాలలో ఉన్నవాటితో పోల్చుకుంటారు. కానీ ఆ రూపం ఒక చిత్ర రూపంలో ప్రదర్శించబడినట్లయితే పరిపూర్ణ సమాచారం వారికి అందుతుంది. అదే విధంగా ఒక గానం ఎంత విన సొంపుగా ఉందో మాటల్లో వర్ణించ లేము. కానీ పాడి వినిపించవచ్చు. ఒక సంక్లిష్టమైన వ్యక్తి త్వాన్ని నవల లేదా నాటకంలోని పాత్ర ద్వారా ఆ వ్యక్తి యొక్క అంతరంగాన్ని వెల్లడించే విధంగా బంధించ వచ్చును. ఆనందం లేదా బాధలను సంగీతం లేదా కవిత్వం ద్వారా సమర్థవంతంగా తెలియజేయవచ్చు. ఈ విధంగా జీవితంలోని అనేక వ్యక్తీకరణాలను కళ ద్వారా తప్ప వేరే ఏ విధంగా ఊహించలేము. భాష లేకుండా మానవ జీవితాన్ని ఏ విధంగా ఊహించలేమో, కళ లేక పోతే మానవ జీవితం నిస్సహాయము, భావ రహితంగానూ ఉండేదని చెప్పవచ్చును.

## కళలు - రకాలు :

కళలను ముఖ్యంగా మూడు రకాలుగా వర్గీకరించ వచ్చు. అవి సాహిత్య కళ, దృశ్య కళ మరియు ప్రదర్శనా కళలు. సాహిత్యం, కథలు, కవిత్యం, నవలలు మరియు నాటక రచన మొ॥లైన విభాగాలు. దృశ్య కళలలో చిత్రలేఖనం, శిల్పం, నిర్మాణాలు మరియు ఛాయా చిత్రాలు ముఖ్య భాగాలు. ఇక ప్రదర్శనా కళలలో నాటక ప్రదర్శన, సంగీతం మొ॥నవి. చలన చిత్రం దృశ్య మరియు ప్రదర్శనా కళల సమాహారం.

## కళ యొక్క లక్షణాలు :

కళల యొక్క ముఖ్య లక్షణం ఎంపిక. ఒక్కోరకం కళ కొన్ని లక్షణాలను ఎంపిక చేసుకొని మిగిలిన లక్షణా లను విసర్జిస్తాయి. ఉదా॥ దృష్టి మరియు స్పర్శ - దృశ్య కళల యొక్క ప్రాథమిక ఎంపిక. దీనిలో శబ్దం మినహా యింపబడి విసర్జించబడి ఉంటుంది. దృశ్యకళలోని ఆకృతుల కూర్పు స్థిరంగా స్తంబింపబడి ఉంటుంది. ఉదా॥ వేయి సంవత్సరాల క్రితం కట్టిన తంజావూరు గుడి లేదా, దానిలోని శిల్పాలు ఇప్పుడు కూడా అదేవిధంగా స్థిరంగా ఉంటాయి. అంటే వాటి మొదటి వీక్షకుడు ఏ విధంగా ఆ కళాకృతిని చూసాడో (శిల్పి ఏ విధంగా ఆకృతి నిచ్చాడో) అదే విధంగా ఈ రోజు కూడా ఆ కళాకృతిని చూడవచ్చు. (ప్రకృతి వైపరీత్యాలకు గురికాకుండా ఉంటే). మరొక ఉదాహరణగా సంగీతాన్ని తీసుకోవచ్చు. సంగీతం ధ్వని ప్రధాన కళారూపం. ఒక కళాకారుని స్వరం పాటను వినిపించవచ్చును. లేదా వేణువునో మృదంగాన్నో వాయించవచ్చు. సంగీత కచేరీ అనేది ప్రేక్షకుల కంటి ముందు జరుగుతున్నా లేదా వారు కళ్ళు మూసుకుని సంగీతాన్ని విన్నా సంగీతం యొక్క ముఖ్యమైన ఎంపిక ధ్వని. సంగీతం దృశ్యాన్ని విసర్జిస్తుంది. "ఎంపిక" అనేది ఏ కళారూపమైనా సమర్ధవంతంగా చేసే ఒక ముఖ్యమైన గుణంగా చెప్పవచ్చును.

కళ యొక్క మరొక ముఖ్యమైన లక్షణం కళలో స్థలకాలాలలో ఉండే సంబంధం. 'ఎంపిక' తరువాత కళలలో బేధాలు అర్ధం చేసుకోవడానికి రెండవ మార్గం ప్రతి కళకు స్థల లేక కాలాలతో ఉండే సంబంధం. దృశ్య కళ అనేది స్థలాక్రమణం ద్వారా ఉనికిలో ఉంటుంది. చిత్రలేఖనం కాన్వాస్ మీద లేదా పేపర్ మీద చిత్రించ బడుతుంది. అదే విధంగా ఏదేని కట్టడం, శిల్పాలు మొ॥ స్థలాలను ఆక్రమిస్తాయి. అనగా 'స్థలం' అనేది దృశ్య కళ యొక్క ప్రాథమిక స్థితి.

దీనికి విరుద్ధంగా సంగీతం కాలంలో, సమయంతో చలిస్తుంది. సంగీతం స్థలాన్ని ఆక్రమించదు. (కచేరి సమయంలో సంగీత కళాకారులు ఒక ప్రదేశంలో కూర్చుని ప్రదర్శన ఇచ్చినప్పటికీ వాస్తవంగా సంగీతం వినేటప్పుడు శబ్దాల శ్రేణి మీద మనస్సు ఉంటుంది తప్ప ప్రదర్శనాకారుల మీద కాదు). సంగీతం అనేది శబ్దాల శ్రేణి, గమనికల మధ్య వ్యవధి మరియు గమనికల మధ్య విరామాలు సంగీతంలో ముఖ్యమైన 'లయ' ను సృష్టి స్తాయి. ఈ గమనికలు ఒకదాని తరువాత ఒక నిరంత రాయంగా మారుతూ ఉంటాయి. రూపకం నృత్యం మొ॥లైనవి స్థలకాలాలు రెండిటినీ ఆక్రమిస్తాయి.

## ప్రదర్శనా కళల యొక్క ముఖ్య లక్షణాలు :

ప్రదర్శనా కళలో సంగీతం, నృత్యం మరియు నాట కానికి కొన్ని సారూప్య లక్షణాలు ఉన్నాయి. మొదటిది పైన ఉదహరించినట్టుగా స్థలకాలాలు రెండింటినీ ఉప యోగించుకోవడం, రెండవది ఈ కళలు సృష్టిలో క్రియేటర్ అండ్ ఇంటర్ప్రిటర్స్ అంటారు. ఉదా॥ ఒక రచయిత నాటకాన్ని రచించినట్లయితే నటులు దానిని ప్రదర్శిస్తారు. (దానికి కావలసిన సంగీతాన్ని సంగీతకారుడు తయారు చేస్తాడు) పాటను తీసుకొని సంగీతకారుడు ఆపాటను స్వరకర్త మరియు వాయిద్య కారులతో స్వరపరుస్తాడు. నృత్య దర్శకుడు నర్తకుల ద్వారా నృత్యాన్ని తయారు చేస్తాడు.

మరొక ముఖ్య లక్షణం ఈ ప్రదర్శనా కళలు ప్రద ర్శనకు ప్రేక్షకులు అవసరం. ఒక ప్రదర్శనను రికార్డు చేసి ప్రదర్శించవచ్చు. కానీ ప్రదర్శనా కళల యొక్క ముఖ్య అక్షణం "సజీవం" అనగా ప్రదర్శన ఒక ప్రదేశంలో ప్రేక్షకులు - ప్రదర్శనాకారులు కలిసి ఒకే సమయంలో చేసి - చూడవలసి ఉంటుంది. అనగా ప్రదర్శన చేసే

వ్యక్తి చూసే వ్యక్తి ఏకకాలంలో ఒకే ప్రదేశంలో ఒకరినొకరు ప్రభావితం చేసుకోవడం జరుగుతుంది.

### నాటక కళ యొక్క మౌలిక విషయాలు, ప్రదర్శనా కారులు :

నాటకానికి సంబంధించి ముఖ్యమైన అంశం ప్రదర్శన. రంగస్థలం మీద ఉన్న నటీనటులు పాత్రోచితంగా, నాటకీయంగా వ్యవహరించడం. నటన నాటకానికి గుండె వంటిది. నటీనటులు తమ ఆంగిక వాచక ఆహార్యాభిన యాలతో ప్రదర్శనా సమయానికి పాత్రగా రూపంతరం చెందుతారు. ఈ రూపాంతరాన్ని ఆ ప్రత్యేక సమయానికి ప్రేక్షకులు పూర్తిగా అంగీకరిస్తారు. ఈ మార్పు లేదా రూపాంతరం అటు ప్రేక్షకులు ఇటు నటులు నియమిత సమయానికి అంగీకరించడం నాటకం యొక్క గొప్ప మాయ.

### ప్రేక్షకులు :

నిజానికి నాటకం యొక్క సారం మొత్తం ప్రదర్శకుల మరియు ప్రేక్షకుల పరస్పర సంబంధం మీద ఆధారపడి ఉంటుంది. ప్రదర్శన ప్రేక్షకులు లేకుండా జరగదు మరియు పరిపూర్ణం కాదు. ఒక నాటకం లేదా కథ చది వినా, ఒక రికార్డెడ్ సంగీతం విన్నా, ఒక చిత్రాన్ని చూసినా మనకు కలిగే అనుభూతి వ్యక్తిగతమైన అనుభూతి, భావ సారూప్యం కలిగిన అనుభూతి కాదు. కానీ 'సజీవ' ప్రదర్శన ఊహించబడిన లేదా పున:సృష్టించబడిన ఒక ప్రత్యక్ష అనుభవం.

### దర్శకుడు :

నాటకానికి సంబంధించి మరొక ముఖ్యమైన అంశం దర్శకుడు. నటీనటులతో రిహార్సల్స్ చేయించి వారి నటనను నేపథ్యానికి తగినట్లుగా తెలివిగా ఉత్తేజకరంగా, అద్భుతంగా దృశ్యాలను సమన్వయ పరిచే వ్యక్తి దర్శ కుడు.

### రంగస్థలం :

నాటకానికి సంబంధించి మరో ముఖ్యమైన అంశం రంగస్థలం. నటీనటుల ప్రదర్శనా స్థలం మాత్రమే కాదు, ప్రేక్షకులు ఏ విధంగా ప్రదర్శనను తిలకించాలి అని ముందుగానే నిర్దేశించుకుని, ఎంపిక చేసుకునే స్థలం. ఆధునిక నాటక రంగంలో వివిధ రంగస్థల ఆకృతులు ఉన్నాయి. (అవి ప్రొసీనియం, సాండ్ విచ్, ఎరినా, త్రస్ట్ స్టేజ్ మొ॥) నాట్య శాస్త్రంలో చతురస్ర, వికృష్ట నాట్యశాలలను గూర్చి చర్చించడం జరుగుతుంది.

### రూపకల్పన అంశాలు :

ఇవి నాటకం యొక్క భౌతిక దృశ్యానికి సంబంధించిన అంశాలు. నాటకంలో వస్త్రధారణ, లైటింగ్, సెట్ మరియు సౌండ్ ముఖ్యమైన భూమికను పోషిస్తాయి. సామాన్యంగా దృశ్యానికి సంబంధించిన అంశాలు నాటకంలో ఎక్కువ ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. ఈ భౌతిక అంశాల ద్వారానే నాటకంలో పాత్రల మధ్య సామూహిక, ఆర్థిక వైరుధ్యం, స్థల కాలమానాల వైరుధ్యం మనో భావాలు, సమయాన్ని సమర్థవంతంగా సూచించ గలవు.

### నాటక రచన, రచయిత :

నాటకంలో ముఖ్యమైన మరియు చివరి అంశం నాటక రచన. ఒక కథ, సంఘటన లేక ఒక విషయం ఏదైనా దానికి నాటకీయతను జోడించి రూపాన్ని ఇచ్చేది మొదట రచయిత. తరువాత నటీనటులు లేదా దర్శ కుడు. విషయం ఏదైనప్పటికీ ఒక సంఘటనను విపులీ కరించి పాత్రల ద్వారా తాను చెప్పదలచిన విషయాన్ని అక్షరాల రూపంలో బంధిస్తాడు. నటీనటులు ఆయా పాత్రల రూపంలో దర్శకుని ఆలోచనలకు అనుగుణంగా దృశ్యానికి పెద్దపీట వేస్తూ రచయిత యొక్క ఆలోచనలను ప్రేక్షకుల ముందు ప్రదర్శిస్తారు. అందువలన రచన నాటకంలో ముఖ్యమైన భూమిక పోషిస్తుంది.

### నాటకం సమాహార కళ :

నాట్య శాస్త్రంలో చెప్పినట్లుగా నాటకంలో వాడని జ్ఞానం కాని, కళ కాని, శిల్పం కాని, యోగం కాని, విద్య కాని, ఏమీ లేవు. కళలలోని ప్రతి కళ నాటక ప్రదర్శనలో

భాగమవుతుంది. నాటక దర్శకుడు ఒక రచనను (సాహిత్య కళ) ఎంపిక చేసుకొని నటీనటులతో ఆ రచనకు రూపమిస్తాడు. అదే విధంగా నాటకంలో స్థలకాలాలను భావోద్వేగాలను ప్రేక్షకులకు పూర్తిగా చేరవేయడానికి దృశ్య కళలో భాగమైన శిల్పం, చిత్రలేఖనం తో పాటుగా ప్రదర్శనా కళలలో భాగమైన నృత్యం మరియు సంగీతాన్ని కూడా ఉపయోగించుకుంటాడు. అన్ని కళలను ప్రదర్శనా సమయంలో సమన్వయం చేసుకుని ఒక అర్థవంతమైన ప్రదర్శనను ఇవ్వడానికి ప్రయత్నం చేస్తాడు. అందువలనే నాటకాన్ని సమాహార కళ అని అంటారు.

**ముగింపు :**

ఈ సమాహార కళ మానవ జీవితానికి దర్పణం మరియు దిక్సూచి. అందువలన ఈ నాటక సాధన మరియు చర్చ భవిష్యత్తు తరాలకు అందించవలసిన బాధ్యత నాటక సమాజాలకు, దర్శకులకు, రచయితలకు మరియు ప్రేక్షకులకు ఉంది.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# ప్రపంచీకరణ దుష్ఫలితాలను చిత్రించిన వచన కవిత

- డా॥. డి. మస్తానమ్మ, అతిథి అధ్యాపకులు, తెలుగు విభాగం, ఎ.పి.జె. అబ్దుల్‌కలాం ఐఐఐటి, ఒంగోలు.

'ప్రపంచ మొక పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం,' అన్నాడు మహాకవి శ్రీశ్రీ. అటువంటి పద్మ వ్యూహాన్ని ఛేదించింది శాస్త్రసాంకేతిక విజ్ఞానం. సైన్సు సాధించిన విజయాల పుణ్యమాని నేడు ప్రపంచమంతా ఒక కుగ్రామంలా మారిపోయింది. ఈ పరిణామ క్రమం లోనే 'ప్రపంచీకరణ' మన్నది పుట్టుకొచ్చింది. దీనినే ఆంగ్లంలో 'గ్లోబలైజేషన్' అంటారు. 1990 దశకంలో ఇది ప్రారంభమై నేడు ప్రపంచమంతటా వ్యాపించింది. నేడు మనదేశంలో అమలవుతున్న ప్రపంచీకరణ, సరళీకరణ, ఆధునీకరణ విధానాలు అటు సమాజంలోనూ, ఇటు కుటుంబ జీవితంలోనూ పెనుమార్పులు తెస్తున్నాయి. ప్రపంచీకరణ అంటే ప్రపంచంలోని ఏదేశాల మధ్యనైనా ఎలాంటి ఆంక్షలు పరిమితులు లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చని అర్థం. ఈ విధానాలవల్ల భారత దేశంలోని ప్రజల జీవన విధానంలో అనూహ్యమైన మార్పులు వచ్చాయి. సంస్కృతి దెబ్బతిన్నది, సంప్ర దాయాలు తెరమరుగయ్యాయి, వృత్తులు అంతరిం చాయి, పల్లెలు బోసిపోయాయి. స్త్రీల బతుకులు అంగడి వస్తువుగా మారాయి. రైతులు కూలీలయ్యారు. కూలీలు వలస కూలీలయ్యారు. నైతిక విలువలు పతనం వైపు పయనించాయి. పెట్టుబడిదారీ సమాజానికి సాఫ్ట్ వేర్ రంగం చక్కగా దోహదపడింది.

సాఫ్ట్‌వేర్ రంగం విజృంభించింది. లక్షలకు లక్షలు జీతాలిచ్చింది. ఆ వ్యామోహం లోపడి చదివిన తరువాతి తరం వారికి మొండిచేయి చూపింది. మానసికంగా శారీరకంగా జనాలను దెబ్బతీసింది. మానవ సంబంధాలు మచ్చుకైనా కానరాకుండా చేసింది. బహుళ కంపెనీల రంగ ప్రవేశం చేసి సెజ్‌ల పేరుతో పంట పొలాలను ఆక్రమిం చాయి. ఖనిజ సంపదకోసం కొండలను తొలగించేపనికి పూనుకున్నది. దాని ద్వారా గిరిజనుల సంస్కృతి కాల గర్భంలో కలిసిపోయే ప్రమాదం ఏర్పడింది. వీటన్నికంటే ముఖ్యంగా సమాజంలో ఆర్థిక అంతరాలు పెరిగి పోయాయి. ఒక పక్క ధనవంతులు ఇంకా ధనవంతు లుగా మారుతుండగా పేదలు ఇంకా నిరుపేదలుగా మారుతున్నారు. సెల్‌ఫోన్‌లు, ట్విట్టర్‌లు, సమాజహితానికి కాకుండా వినాశనానికి దారి తీస్తున్నాయి. ఉగ్రవాదానికి అవి ఊతమిస్తున్నాయి. ఇలాంటి పరిణామాలను అక్షర బద్ధం చేసారు కవులు. వాటిని దిజ్మాత్రంగా పరిశీలించటమే ఈవ్యాస ప్రధానోద్దేశం.

### గిరిజన యువతుల జీవితం :

గిరిజన స్త్రీలు ఎదుర్కుంటున్న దుర్భర జీవితాన్ని జీవన్ అనే కవి 'ఈ పాపం ఎవరిది' అనే కవితలో ఇలా చిత్రించారు.

"గూడెం నడి కొప్పున
రగిలిన ఆకలి కార్చిచ్చుకు
ఆర్త నాదా లైన
ఆది వాసీ యువతులంతా
ముంబై రెడ్ లైట్ లా
క్షణ కాలం తళుక్కుమని
ఆరిపోతారు మరుక్షణం
ఉపాధి గాలానికి చిక్కుకున్న
ఈ నిర్భాగ్య దళిత పడుచులంతా
సంపన్న అధికార గణాల
'సుఖ' రోగ గల్ఫ్ షేకుల
విలాస మందిరాలు బంది ఖానాలకు
యౌవనమంతా ధారపోస్తారు
కరువు కాటకాల కలికాలం
కక్షగట్టి వెంటబడి తరుముతుంటే
బతుకు బరువై వలస జీవులై
నగరం పంచన చేరిన

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

అసహాయ పల్లె పడుతులు
కాల సర్పకాటుకు విలవిల్లాడుతారు.
మిరు మిట్లు గొలిపే
పబ్బుల బ్లార మాయాలోకంలో
హిప్ హాప్ శాపగ్రస్తులైన
ఈ అమాయక యువతులంతా
ఊడల మర్రిలా విస్తరించిన
సైబర్ ప్రపంచాన
నీలి చిత్ర సంచలనాలవుతారు
శరీరాలు అంగడి సరకులై
అమ్ముకునే ప్రతి సరుకుకీ
ఫ్యాషన్ షోల ర్యాంప్ వాక్‌లవుతారు,
ఫ్యాక్టరీలు పంటపొలాలు
విద్యాలయాలు పనిప్రదేశాలు
వీధులు అంగళ్లూ
అత్యాచారనిలయాలవుతాయి,
అడుగడుగునా
ఖైర్లంజీ వాకపల్లి
ప్రత్యక్షమవుతాయి.
ఉపగ్రహాల నుండి ఛానళ్ళు ఛానళ్లుగా
లక్షల టన్నులుగా కురుస్తున్న
నికృష్ట సాంస్కృతిక బాంబుదాడి ప్రభావం
కప్పిపుచ్చే అధికార ప్రమధ గణం
నిమిషానికన్ని మాన భంగాలంటూ
హత్యలంటూ లెక్కజెప్పి
చేతులు దలుపుకుంటుంది,
నేరాన్ని వ్యవస్థీకృతం చేస్తున్న రాజ్యం
నెపం వ్యక్తులమీదకు నెట్టి
కళ్లు మూసుకు పాలు తాగే పిల్లిలా
మీసాలు నా కేసుకుంటుంది”

అంటాడు కవి. ఈ కవితలో దళిత స్త్రీల దుర్భర జీవితం చిత్రించబడింది. దళిత యువతులు పొట్ట కూటి కోసం ముంబయి రెడ్‌లైట్ ఏరియాకు వెళ్లి ఒళ్ళమ్ము కుంటున్నారు. పబ్‌లు, బార్లలో డ్యాన్సులు చేస్తున్నారు. ఉపగ్రహాల ద్వారా టీవి ఛానళ్లలో బహుళజాతి పెట్టుబడి దారులు విషసంస్కృతిని మన మెదళ్లకు అందిస్తున్నారు.

పబ్‌లు బార్లలో అశ్లీలనృత్యాలు చేస్తున్నారు దళిత యువతలు. ఎందుకలా చేస్తున్నారు. కేవలం పొట్ట కూటి కోసమే. ఈ విషసంస్కృతిని మన యువతకు అందించింది బహుళజాతి కంపెనీలే. కరువు కాటకాల కారణంగానూ, ప్రభుత్వాలు ఉపాధిచూపని కారణంగానూ అన్ని వర్గాల ప్రజలు తమ జీవన మూలాలను కోల్పోయారు. ఆ పరంపరలో భాగంగానే దళితుల జీవితాలు దుర్భర మయ్యాయి.

**ప్రజా జీవితం :**

ప్రపంచీకరణ ప్రభావంతో బతుకులు అతలాకుత లమవుతున్నాయని సి.హెచ్. ప్రకాష్‌గారంటారు. తన ఆవేదనను ఈ క్రింది కవితలో అభివ్యక్తం చేస్తారు. భవితకు బతుకు శ్వాసిస్తున్నదంటాడు.

“విభిన్న మనస్సుల
మనుషులన్న ధరిత్రిలో
బురుజుల
బురుజులు వెదకే చరిత్రలో
కుతంత్రాల
ఇనుపయంత్రాల
ప్రపంచీకరణ పాదాల కింద నలిగిన
మానవ హక్కులు
సామాజిక అసమానతల మీద
అసహనం ప్రకటించడం
అసహజ మేమి కాదు
శరీరంలో అణువణువూ
ఒత్తిగిల్లినప్పుడు
నాడుల్లో స్పందనలు
చెమ్మగిల్లినప్పుడు
నాళాల్లో వేదనా రుధిరం
ఉరక లెత్తి నప్పుడు
ఆర్ద్రత నిండిన కళ్లతడి నుండి
కవిత్వం ఉద్భవించి
ఉద్యమాలకు ఊపిరిపోస్తుంది” అంటాడుకవి.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

ప్రపంచీకరణ పాదాల కింద మానవహక్కులు నలిగిపోయాయి. సామాజిక అసమానతలు ఎక్కువయ్యాయి. రాజ్యం చేసే అరాచకాలను ఎదిరించిన వారిని పోలీసుల చేత అణచివేస్తున్నారు. ప్రజా ఉద్యమాలను ఉక్కు పాదంతో నలిపివేస్తున్నారు. అయినా ప్రజలు సామాజిక అసమానతలపట్ల అసహనం ప్రకటిస్తూనే ఉన్నారు. తమ జీవితం ఆవేదనా భరతమైనపుడు తిరుగుబాటు చేస్తున్నారు. వాటిని అణచివేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా సొంపేట ఘటనే దీనికి ప్రబల నిదర్శనం.

## కృత్రిమ ప్రేమ :

గ్లోబలైజేషన్ కారణంగా యువతీ యువకుల మధ్య అంకురించిన ప్రేమ ఎలా మొదలై ఎలా ముగుస్తుందో జంధ్యాల రఘుబాబు 'గ్లోబల్ ప్రేమ' అనే కవితలో చక్కగా వర్ణించారు.

"నీ కిష్టమైన రంగు?
వంకాయలో నలుపు మిక్స్
అబ్బో నాకూ అదే ఇష్టం!
నీవు డ్రెస్ ఏది లైక్ చేస్తావు
'ఫో' జెంట్స్, మరినీవు
'ఫో' విమెన్
అబ్బో అబ్బో ఇద్దరిది
నెట్ వర్క్ ఏది?
'గూగుల్' మరి నీ సంగతో
అరెరె, అబ్బో అబ్బో నేనూ అదే
మన చూపులు
మన మనసులు
మన ఇష్టాలు
అన్నీ అన్నీ కలిసాయే
థాంక్స్, నన్ను రోజు డ్రాప్ చేస్తున్నందుకు
మనలో అలాంటివి ఉండకూడదు
టూ స్మార్ట్!
టూ అఫెక్షనేట్!
ఇష్టమైన వెడ్డింగ్ రింగులు
ఇష్టమైన పెళ్లి కార్డులు
పిప్పి, దుండుం
రెండు క్యాలెండర్లు మారాయి,
మనషులతో, మనసులతో సహా
ఎందుకీ మధ్య పిక్ అప్ చేసుకోవట్లేదు
ఆఫీసులో బిజీబిజీ
నువ్వు వీకెండ్
పార్టీలివ్వటం మానే శావ్
నువ్వు ఆ రెండు రోజులూ
కనిపించటమే మానేశావ్
డ్రెస్ ఎందుకు మార్చావు
బోర్ కొట్టింది.
నెట్ వర్క్ యాహూ
ఎందుకు మారావు
నానెట్ వర్క్ నా ఇష్టం
నేను రోస్ట్ చేసిన బ్రెడ్ పడేస్తున్నావ్
నేను తెచ్చిన గాగుల్స్ విసిరేశావ్
నిన్ను నమ్మకూడదు
నిన్నూ అంతే
నువ్వు మారావ్
నువ్వు అంతే
నువ్వు మొండివి
నువ్వు జగమొండివి
నేను వెడుతున్నా!
నేను కూడా!!-

ప్రపంచీకరణ నేపథ్యంలో ఏర్పడిన ప్రేమలు ఎంత త్వరగా కలిసి పోతాయో, అంతే త్వరగా విడిపోతాయని, వాటిలో కృత్రిమత్వం తప్ప సహజత్వం ఉండదని కవి చక్కగా చిత్రించాడు.

## చిరువ్యాపారుల బతుకులు :

గ్లోబలైజేషన్ ప్రభావంతో చిరువ్యాపారుల బతుకులు ఎలా బండబారిపోయాయో, వారు ఏ స్థితికి దిగజారారో ఈ కవిత చిత్రిస్తున్నది. చైతన్య ప్రసాద్ గారు "అయ్యో! చిల్లర దుకాణం!" శీర్షికతో ఈ కవిత రాసారు.

"గత దసరా సెలవులకు ఇంటికెళ్లినపుడు చూశా
ఆ చిల్లర కొట్టు ఎత్తేశాడట- మెయిన్ రోడ్డు మీద పెట్టిన రిలయన్స్ దెబ్బకు
ఆ షావుకారు ఇంటింటా పాల పాకెట్లు వేసుకుం టుంటే
వాళ్లమ్మాయి రిలయన్స్‌లో పన్నెండు గంటల పనికి కుదిరిందట
మా వీధిలో చాలా చిల్లర కొట్లు అలానే మూత పడ్డాయి
భవిష్యత్తులో చిల్లర దుకాణాలంటే తెలియవుకాబోలు
మళ్లీ మొన్న దసరా శలవుల కెళ్లినపుడు గమనించా.
వాల్ మార్ట్ 'బెస్ట్ ప్రైస్' హవా హంగామా! మన టౌన్ కూడా పర్వాలేదే అనుకున్నా!
పండుగ సరుకులకని - రిలయన్సు కెళ్లా... బావురు మంది
ఆఫర్లు లేవు - ట్రాలీలు తుప్పుపట్టాయి - రేక్‌లు ఖాళీగా ఉన్నాయి.

.........................................................

సెక్యూరిటీ నడిగా 'వాల్‌మార్ట్ తిమింగలం అందర్నీ మింగేస్తుంది' అన్నాడు.

.........................................................

అవును మనదేశంలో ఉప్పు, పప్పు, బెల్లం, చింత పండూ అమ్మడానికి
అమెరికానుండి వాల్‌మార్ట్ రావాలా? మన దుకాణాలు మూసుకోవాలా?
మన చిల్లర దుకాణాల్ని మింగేసి, రైతుల్నీ, ప్రజల్నీ నిలువునో దోచేసిన సొమ్ము
ఏరోజు కారోజు తమ దేశానికి జమ చేసు కుంటుంటే
మనం చూస్తూ ఉండాలా?

.........................................................

దేశ స్వావలంబన కాపాడు కుంటూ, సామ్రాజ్య వాదుల దోపిడీ నెదిరించాలంటే
గాంధీల బోసి నోళ్లు ఇప్పుడు పనికి రావు. ఆయన చేతికర్ర కావాలి!"

అంటాడు కవి. ఈ కవితలో బహుళజాతి కంపెనీలు మనదేశంలోకి ప్రవేశించి చిల్లర వర్తకులను ఎలా దెబ్బతీస్తున్నది చిత్రించబడింది. వాల్ మార్ట్‌లు, రిలయన్స్ మార్ట్‌ల మోజులో ప్రజలు అక్కడకెళ్లి వస్తువులు కొంటుండంతో చిల్లర వర్తకులకు వ్యాపారంలేక తమ అంగళ్లు మూసేసి, ఆ కంపెనీల్లోకి కూలీలుగా వెళ్లిన వైనం మనకు కన్నీరు తెప్పిస్తుంది. వాటిని ఎదుర్కొంటే తప్ప మనం ఆత్మాభిమానంతో బతకలేము. అది జరగా లంటే గాంధీలాగా బోసినోరు తెరచి వారిని వేడుకుంటే ప్రయోజనం ఉండదు. వారిని తరిమి వేయాలంటే గాంధీ చేతిలోని కర్రను తీసుకోవాలి.

ప్రపంచీకరణ ప్రభావంతో రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు, కులవృత్తిదారులు అందరూ దారుణంగా దెబ్బతిన్నారు. తమ జీవనమూలాలను కోల్పోయారు. సంస్కృతీ సంప్రదాయాలను మరచిపోయారు. దినదిన గండం నూరేళ్ల ఆయుష్షులాగా అత్యంత దుర్భరంగా జీవనం గడుపుతున్నారు. ఇది భారతీయ సమాజానికి హాని కలిగిస్తున్నదేతప్ప మేలు చేయటంలేదు. ఇంకా మనలో అభద్రతనూ, బానిసతనాన్ని పెంచిపోషిస్తున్నది. ఈ అంశాలన్నింటిని రచయితలు తమ కవితల్లో అద్భుతంగా చిత్రించారు.

❁ ❁ ❁

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలుగు తానీషా యస్వీ జోగారావు

- డా॥. శిరీష ఈడ్పుగంటి, న్యూఢిల్లీ.

తెలుగు తానీషాగా పిలువబడిన యస్వీ జోగారావు గారు సంస్కృతాంధ్ర, ఆంగ్లభాషలను అవపోశనము పట్టిన అపర భగీరథుడు. సాహిత్యంలోని అన్ని ప్రక్రియాలలో ఈయన చేయి కనిపిస్తుంది. పద్యం, గద్యం, ఛందస్సు, నవల, నాటకం, కథ, జానపదవాఙ్మయం, భాషాశాస్త్రం, యక్షగానం, అనువాదం, వ్యాకరణం, కవిత్వం, తదితర అంశాలన్నింటిలోనూ ఈయనకు ప్రవేశముంది. అన్నింటి యందు వీరి రచనలు కనిపిస్తాయి. వీరెంత ప్రాచీనులో అంత నవీనులు. పద్యరచనలో ఎంత సమర్థులో గద్య రచనలో కూడా అంత సిద్ధహస్తులు. తెలుగులో 'ఊహాప్రహేళిక' అనే సాహిత్య ప్రక్రియ ఈయన అపూర్వ సృష్టి. ఈయన విజయనగరం జిల్లా, పార్వతీపురంలో 1928 అక్టోబరు 2 న జన్మించారు. తల్లిదండ్రులు మంథా సరస్వతమ్మ, శ్లిష్టా సాంబశివరావు. రచనల రూపంలో ఎంతో పరిశోధన చేశారు. ముప్పైమందికి పైగా విద్యార్థు లకు ఈయన మార్గదర్శకత్వంలో డాక్టరేటు ఇప్పించారు. వీరు పరిశోధనకు ఎంచుకునే విషయాలు, విద్యార్థులకు సూచించే అంశాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటాయి. దేశ విదేశాలలో వివిధ విశ్వ విద్యాలయాలలో పనిచేశారు. పలు ఉపన్యాసాలు ఇచ్చారు. సాహిత్యంలో ఇంచు మించు అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశారు. మొత్తం తెలుగు సాహిత్యాన్ని భావితరాలకు చూపించారు. ఈయన రచనా విధానం చూస్తే మొట్టమొదట్లో సంవత్సరానికి ఒక పుస్తకం రాసేవారు. కొంతకాలం తర్వాత సంవత్సరానికి నాలుగైదు పుస్తకాలు కూడా రాసేవారు. ఇవన్నీ గ్రాంథిక భాషలోనే రాశారు. వీటిలో చాలావరకు రచనలు ముద్రించబడ్డాయి. కొన్ని అముద్రితాలుగానే ఉండి పోయాయి. అనేక గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. మరెన్నో సాహిత్య వ్యాసాలు రాశారు.

ఈయన రచనలలో ఒకటైనా మణిప్రవాళము (వ్యాస సంపుటి) రచనను ఈ వ్యాసంలో చర్చిస్తున్నాను. ఇందులో మొత్తం ఇరవై ఒకటి సాహిత్య వ్యాసాలున్నాయి. ఒక్కొక్క వ్యాసంలో ఒక్కొక్క సాహిత్య ప్రక్రియ కనబడుతుంది. కవితలు, గేయ నృత్య నాటికలు, కథానికలు, అను వాదాలు, వ్యాకరణం, మహాకావ్యాలు, నవలలు, నాటికలు, యక్షగానవాఙ్మయ చరిత్ర, జానపదవాఙ్మయ చరిత్ర మొదలైన అంశాలతో కూడిన వ్యాసమాలిక ఈ రచన.

విశ్వనాథవారి మేనకా విశ్వామిత్రము అనే వ్యాసంలో జోగారావుగారు మేనకా విశ్వామిత్ర ఘట్టమును విశ్వ నాథవారు వర్ణించిన తీరును పేర్కొన్నారు. దీనిని విశ్వ నాథవారు విశ్వామిత్రుని కథ అనుట కంటే మేనక కథ అనుటకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినట్లు తెలుస్తుంది. ఇందులో మేనకావిశ్వామిత్ర ప్రణయ ఘట్టమును సీతారాముల ప్రణయ ఘట్టముతో పోల్చి చెప్పడం విశేషంగా కనబడుతుంది. ఇందుకుగానూ రెండు మూడు సందర్భాలను కూడా వివరించారు. అలాగే సాహిత్యంలో మన సంస్కృతి సంప్రదాయాలను చూపించవచ్చు అనేం దుకు ఉదాహరణగా కొబ్బరిచెట్టు వయస్సు లెక్కించడం వంటి సంఘటనలు పేర్కొన్నారు. ఇట్లాంటి తెలుగు సంప్రదాయాలను విశ్వనాథవారి కావ్యాలలో చాలా చూడ వచ్చు. విశ్వనాథవారి కథ పాతదైన శిల్పం మాత్రం కొత్తదిగా ఉంటుందని జోగారావుగారు ఈ వ్యాసం ద్వారా తెలియజేశారు. రాయప్రోలువారి వైమర్శిక దృక్పథము అనే మరొక వ్యాసంలో సాహిత్యానికి కవిత్వానికి ఉన్న అనుబంధాన్ని గూర్చి, సాహిత్యం-విమర్శ గూర్చి చాలా చక్కగా చెప్పారు. కవి అన్నవాడు తప్పకుండా విమర్శ కుడు అయిఉంటాడు, కాని విమర్శకుడు కవి కానవసరం లేదు అనే విషయాన్ని విపులంగా పేర్కొన్నారు. 'రాయప్రోలువారి మాటలలో నేను ప్రాచీనపద్ధతిని నిర సించను కాని నవీనపద్ధతిని ఆదరిస్తాను' అని అనడంలో

ఆయనకు కొత్తదనం మీద ఉన్న ఆసక్తిని, ప్రాచీన నవీనులయందు ఉన్న నిష్పాక్షిక సుందరమైన అభిమానాన్ని స్పష్టంగా ఈ వ్యాసంలో చూపించారు. శబ్దార్థాల అనుబంధాన్ని హాయిగా, స్వయంగా అనుభవించినట్టు చెప్పడం రాయప్రోలు వారికే సాధ్యమైందని అన్నారు. మన అనుభూతి పరిధిలో ఉన్న సామగ్రితో చెప్పగలగడం విశేషంగా పేర్కొన్నారు. రాయప్రోలువారి మరొక సిద్ధాంతాన్ని కూడా ఇందులో తెలియజేశారు. నవభావకుల అభిప్రాయం ప్రకారం ఒకే సన్నివేశాన్ని ఇద్దరు నవభావకులు భిన్నంగా భావించినా అది సమంజసం, సహజం అని వారివాదన. పూవు తుమ్మెదల అనుబంధాన్ని ఒక కవి ప్రేయసి ప్రియుల అనుబంధంగా చెబితే, మరో కవి తల్లిబిడ్డల అనుబంధంగా చెప్తాడు. రాయప్రోలు వారికి గల ఉన్నతమైన కవితా తత్త్వ దర్శనాన్ని జోగారావుగారు ఈ వ్యాసంలో ప్రతిబింబించారు. కృష్ణశాస్త్రి వ్యాసంలో ఈయన రచనల వైశిష్ట్యాన్ని తెలియజేశారు. ఆనాటికి ప్రాచీనకవులలో అతినవీనుడు, ఈనాటికి నవీన కవులలో అతిప్రాచీనుడు అయిన కృష్ణశాస్త్రి పాండిత్యాన్ని వివరిస్తూ కుమారగంధర్వుడని కొనియాడారు. భావ కవితా భారత రచనకు రాయప్రోలు నన్నయ అయితే, కృష్ణశాస్త్రి తిక్కన అని జోగారావుగారు వ్యక్తంచేశారు. శ్రీశ్రీకి శ్రద్ధాంజలి అనే మరొక వ్యాసం రాశారు. ఇందులో శ్రీశ్రీ వివిధ సందర్భాలలో కవిత్వం గూర్చి వెలిబుచ్చిన అభిప్రాయాలను, భావాలను వాటి వెనుక ఉన్న ఆలోచనలను పేర్కొన్నారు. శ్రీశ్రీ అభిప్రాయాలలో ఆలోచన కంటె ఆవేశమే ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. ఆధునిక యుగంలో ఒక విశిష్టమైన విలక్ష ణమైన దృక్పథానికి శ్రీశ్రీ ఎంతమేరకు మార్గదర్శకుడైనాడో, అంతమేరకు అవ్యవస్థకు దురవస్థకు బాధ్యుడైనాడని జోగారావుగారి ప్రశంస, అభిశంస రెండూ ఈ రచనలో కనిపిస్తుంది. శ్రీశ్రీ మహాప్రస్థానం అసలు అచ్చవకముందే దానిమీద మొట్ట మొదట సమీక్ష రాశారు. అంతేకాకుండా విశ్వవిద్యాలయాలలో శ్రీశ్రీ కవితల మీద పరిశోధన చేయమని విద్యార్థులకు మంచి పరిశోధనను సూచించిన వ్యక్తి జోగారావుగారు. శ్రీశ్రీకి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఈ వ్యాసాన్ని రాశారు.

జక్కన కవితాప్రస్థానం వ్యాసంలో ఒక కవి ఇంకొక కవికి కృతిని సమర్పించుట విశేషంగా పేర్కొన్నారు. జక్కన సిద్ధనమంత్రికి కృతి సమర్పించాడు. తెలుగులో ఇతివృత్త త్రయాన్ని (ప్రఖ్యాతము, ఉత్పాద్యము, మిశ్రమము) గుర్తించిన కవి. జక్కన రచించిన విక్రమార్కచరిత్ర గూర్చి వివరించారు. జక్కన తర్వాత కొరవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశికను గూర్చి చెబుతూ ఇందు జక్కన కథాసామ్యములు కలవని గుర్తించారు. అలాగే మాదయ గారి మల్లన రాజశేఖరచరిత్ర ప్రబంధంలో కొన్నిమార్పులు చేశాడు. అయినప్పటికీ దీనికి జక్కన కావ్యం నందలి రాజశేఖరుని కథయే మూలం. శైలి విషయంలో శ్రీనాథునికి, జక్కనకు ఒకేవిధమైన పోలికలు కనిపిస్తాయని అన్నారు. తర్వాత సూరన ప్రతిభ అర్వాచీనకవులపై నతని ప్రభావం అనే వ్యాసం రాశారు. 'నన్నయ శ్రీనాథునికి, శ్రీనాథుడు పెద్దనకు పలుకుబడిలో పట్టుబడ్డారు. ఒక్క తిక్కన తప్ప. తిక్కనకు సరియైన అనుయాయి సూరన ఒక్కడే. పలుకుబడిలోనే కాదు, కావ్య శిల్ప ఘటనమున కూడా సూరన తిక్కన వలెనే పట్టుబడిపోవు రకము కాదని' పేర్కొన్నారు.

కవి సన్మానం వ్యాసంలో కవి అంటే ఎవరు? అనే విషయాన్ని కవిత రూపంలో జోగారావుగారు చెప్పారు. 'కవి హృదయాన్ని సమ్యగవగాహనం చేసుకోవడం కూడా కవి సన్మానమే అవుతుందని' అన్నారు. వాల్మీకి గూర్చి పలు వ్యాఖ్యానాలు, విమర్శలు వెలిశాయే కాని ఆయన గూర్చి ఒక స్మారక సంచిక గాని, శిలా విగ్రహ ప్రతిష్ఠ గాని ఎక్కడ జరిగినట్లు లేదని వాపోయారు. ఇతర దేశాలలో చూస్తే షేక్స్పియరుకు నదీతీరంలో శిలావిగ్రహం ఉంది. ఆయన వాడిన ప్రతివస్తువు భద్రపరచబడ్డాయి. ఒకసారి జోగారావుగారు షేక్స్పియరు మీద ఉన్న అభిమానంతో ఆయన ఊరికి వెళితే అక్కడ షేక్స్పియరు పుస్తకాలు, ఆయన గూర్చి ఉన్న బొమ్మల పుస్తకాలు అమ్ముతున్నారు. షేక్స్పియరు అంటే జోగారావుగారికి

ఎంత అభిమానం అంటే తన కుమారునికి షేక్స్పియరు అని పేరు పెట్టారు. ఇది ఒకరకంగా జోగారావుగారు షేక్స్పియరుకు చేసిన సన్మానమే అని చెప్పవచ్చు. అలాగే తెలుగు కవుల విషయంలో చూస్తే కొంతమంది కవుల విషయంలో మాత్రమే ఈవిధానం కనబడుతుంది. నెల్లూరులో తిక్కన, శ్రీనాథుల తిరునాళ్ళు ఏటా జరుగు తుంటాయి. తిక్కనకు సంబంధించిన ఇల్లును జాతీయ సంపదగా సేకరించమని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ మూడు ఉత్తరాలు జోగారావుగారు రాశారు. దేనికి సమా ధానం లేదు. రాజమండ్రిలో నన్నయ పీఠం, గుంటూరులో శ్రీనాథుని పీఠం, ఒంగోలులో ఎర్రనపీఠం, వరంగల్లులో పోతన పీఠం ఉన్నాయి. కందుకూరి, గురజాడ, విశ్వనాథ మొదలైన కవుల విషయంలో జయంతులు, వర్ధంతులు జరుగుతున్నాయి. కాళిదాసు మహాకవికి కార్తీక పూర్ణిమ నాడు ఆబ్దిక మహోత్సవం జరుగుతుంది. ఆంధ్ర విశ్వకళా పరిషత్స్వర్ణోత్సవ సారధి శ్రీ మేకా రంగయ్య ప్పారాయ మహోదయ కృతి సమీక్ష! ఈ వ్యాసంలో రంగయ్యప్పారాయగారి రచనల విశిష్టతలను తెలియ జేశారు.

పాతికేళ్ళ తెలుగు కవిత్వం అనే మరొక వ్యాసంలో విశ్వనాథ, రాయప్రోలు, వీరేశలింగం, గురజాడ, గిడుగు, శ్రీశ్రీ వంటి కవుల కవిత్వధోరణులు వివరించారు. పద్య గేయరచనలు చేసి కొంతమంది రచయితలు క్రమంగా వచన కవితల మీద మక్కువ చూపిన వైనాన్ని పేర్కొ న్నారు. సంప్రదాయ అభ్యుదయ మార్గాల గూర్చి చెబుతూ ఈ రెండు కూడా మానవ సమాజ సంక్షేమనే గమ్యం చేరుకోవడానికి పోటీపడతాయని అన్నారు. ఆధునిక కవితా ధోరణులు వ్యాసంలో విశ్వనాథవారి కవితా శిల్పంలో నవ్యత్వానికి దృక్పథంలో సంప్రదాయానికి ఉదాహరణగా ఒక విషయాన్ని ప్రస్తావించారు. కవిత్వంలో పరమ నవ్యుడని పేర్కొన్నారు. ఆధునిక కవులు, కవిత్వం గూర్చి చర్చించారు. ఇంతవరకు చెప్పిన వ్యాసాలలో ప్రాచీన, ఆధునిక కవులు, కావ్యాలు, కవిత్వం, వారి భావాలు రచనలు గూర్చి విశదీకరించారు. ప్రక్రియా వైవిధ్యాన్ని, పరిణతిని ప్రదర్శించిన దక్షిణాంధ్ర సాహిత్యం ఈ వ్యాసంలో దక్షిణాంధ్ర కవుల విశిష్టతలను, వారి రచనలను, రచనలలో అనుసరించిన పద్ధతులను, రాజుల వృత్తాంతాలను, ప్రజా జీవిత ఉదంతాలను, శాస్త్రగ్రంథాలను, స్థల మహాత్మ్యములను, ద్విపద ప్రక్రియను, యుగ విశిష్టతలను వివరించారు. దక్షిణాంధ్ర రాజులు కవులను తమకోసం వినియోగించుకున్నారు. కృతి రచన స్వీకృతులు విలాస లాంఛన ప్రాయాలుగా భావించారు. కొంతమంది రాజుల దగ్గర అసలు కవులే ఉండేవారు కాదు. అందుచేత వారి శృంగారాన్ని వారి స్వీయరచనలలో వారే చెప్పుకునేవారు. సాహిత్యాన్ని ప్రజా సన్నిహితం చేసిన యుగం దక్షిణాంధ్రయుగం. విజయ నగరం కింద పరిపాలింపబడిన ఆంధ్ర సామ్రాజ్యం ఒకానొక కాలంలో తంజాపుర మధురా మండలాలలో నాయక రాజుల యాజమాన్యంలో ఉంది. అయితే అక్కడి రాజుల ఆచార వ్యవహారాలు తదితర విషయాలు మాత్రం రాయ సామ్రాజ్యానికి నఖలుగా ఉండేవి. దీనికి సాక్ష్యం అప్పటి సాహిత్యమే అని పేర్కొన్నారు. మరొక వ్యాసం దేవుని దస్తూరీ. ఇందులో కళలు, కవిత్వం, సౌందర్యం మొదలైనవాటి గూర్చి వివరించారు. ఆయన గురువులు గూర్చి, గురు శిష్య సంబంధాలు గూర్చి, వారు సాహిత్యా నికి చేసిన కృషిని గూర్చి ప్రస్తావిస్తూ కొన్ని వ్యాసాలు రాశారు. జోగారావుగారు డాక్టరు పట్టా పరిశోధన నిబం ధానికి ఒక పరీక్షకులు అనంతకృష్ణుడుగారు. వీరిని గురువుగా భావించి వీరిగూర్చి అనంతకృష్ణుడు అనే వ్యాసం రాశారు. ఇందులో సంగీత సాహిత్యాలలో అనంతకృష్ణుడుగారి ప్రతిభను తెలియజేశారు. అలాగే జోగారావుగారి మరొక గురువు మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు. వీరినిగూర్చి శర్మగారి ధన్యజీవితం అనే వ్యాసంలో పేర్కొన్నారు. శర్మగారి హిస్టరీ క్లాసులకు జోగారావుగారు వెళ్ళే రోజులు గూర్చి ఇక్కడ చెప్పారు. 'ఆ రోజులలో బోధనలో వైవిధ్యం, విషయం మీద గాఢత, ధీమా కలిగిన వ్యక్తి శర్మగారు. విజయనగర చరిత్ర పాఠం దృశ్యాలు ఒక్కొక్కటే కన్నులకు కట్టినట్లు ఆవేశంతో

చెప్పేవారట. ఆ పాఠాలు విన్నవారంతా పదహారోశతాబ్ది కాలానికి వెళ్ళిపోయేవారట. ఆనాటి మనుషులు అయిపోయేవారు. విజయనగరం పతనం గూర్చి చెప్పేటప్పుడు ఆయనకు సరేసరి - మా క్కూడా సాత్త్వికోదయమయ్యేదని పేర్కొన్నారు'. గురు శిష్యులిరువురు మాటల సంభాషణలలో రాజుల చరిత్రల గూర్చి చర్చించుకునేవారని ఈ వ్యాసాన్ని బట్టి తెలుస్తుంది. జోగారావుగారు చరిత్ర గూర్చి ఎన్నో వివరాలు ఈ వ్యాసంలో ప్రస్తావించారు. జోగారావు గారికి శర్మగారిని తలచుకున్నప్పుడల్లా 'భారత ఇతిహాస కథల్లోని విదుర పాత్రయే అనిపించేదట'. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ నిర్మాత కీ.శే. మల్లంపల్లి సోమశేఖర శర్మ అనే పేరుతో మరొక వ్యాసాన్ని కూడా శర్మగారి గూర్చి రాశారు. వైదిక వాఙ్మయ మంతటిని అవగాహన చేసుకుని పరిపూర్ణంగా మహాభాష్యము చేసిన మొదటివాడు విద్యారణ్యుడు. ఇతనికి ఆ పేరు ఎలా వచ్చిందో జోగారావుగారు కొన్ని గ్రంథాల ఆధారంగా వారి అభిప్రాయాలను విద్యారణ్య మహత్వ భూమిక పేరుతో వ్యాసం రాశారు. సర్వాంధ్ర వ్యాసంలో ఆంధ్రజాతి గొప్పదనాన్ని వివరించారు. ఖండ ఖండాంతరాలలో ఆంధ్రప్రజలు విదేశీయులతో వియ్యమందుతూ ఉన్న విషయాల గూర్చి ప్రస్తావించారు. తరతరాల ..... తెలుగు భాష వ్యాసంలో యుగాల వారీగా తెలుగుభాష చరిత్రను, గొప్పదనాన్ని విశదీకరించారు. అజ్ఞాతయుగం (ప్రాచీన యుగం), ప్రాఙ్నన్నయ యుగం, నన్నయ యుగం, అర్వాచీన యుగం, ఆధునిక యుగం మొదలైనవి. ఆధునిక యుగంలో వచ్చిన మార్పులు గూర్చి చర్చించారు. ఆంగ్లభాషా సంపర్కం, వ్యావహారిక భాషావాదం, తత్సమం, తద్భవం, అన్యభాషల పదజాలం మొదలైనవి. ఈ వ్యాసంలో జోగారావుగారు తన అభిప్రాయాలను కొన్నింటిని వ్యక్తంచేశారు. 'కావ్యాలు అందరికీ అర్థం కావాలి అనుకోవడం పొరపాటు. కావ్యభాష లేక గ్రాంథిక భాషలోనే నిత్యవ్యవహారం జరగాలి అన్నచో అది ఎంత అవివేకమగునో కావ్యభాష అంతా వ్యవహారిక భాషలోనే జరగాలి అనుకోవడం అంతే అవివేకం అని ఆయన అభిప్రాయం'. తెలుగు నవల తీరుతెన్నులు వ్యాసంలో నవలా లక్షణాలు, సాంఘిక, చారిత్రక, హాస్య, అపరాధ పరిశోధక మొదలైన నవలలు గూర్చి పేర్కొన్నారు. నవలా వస్తువు మనిషి జీవితంగాని, సాంఘిక చరిత్రగాని అయ్యింది. నవలా రచయితలు వాళ్ళ అభిప్రాయాలను తెలియజేశారు. ఇతర భాషలలోకి తర్జుమా చేయడానికి తగిన తెలుగు నవలలు మూడు నాలుగు కన్నా ఎక్కువ లేవని పి.వి. రాజమన్నారు అన్నట్లుగా ఈ వ్యాసంలో పేర్కొన్నారు. నేదునూరి గంగాధరంగారి సెలయేరు పీఠిక లో జానపద వాఙ్మయంలో కృషిచేసిన వారందరినీ ప్రస్తావించారు. వాఙ్మయ సేవలో జీవితమే ఒక ఉద్యమంగా గడిపినవారు నేదునూరివారు. వీరికి పాత పాటల గంగాధరం అనే మరో వ్యవహారం ఉన్నట్లుగా పేర్కొన్నారు. జానపద పాటల సేకరణలో ఉన్న కష్టనష్టాలను వివరించారు. గంగాధరంగారు సేకరించిన పల్లెపాటలు, స్థానిక గాథలు, పొడుపు కథలు, మాండలిక పదాలు, సామెతలు, అన్ని కలిపి అచ్చులో నాలుగు వేల పేజీలయ్యే గ్రంథం వస్తుందనే విషయాన్ని చెబుతూ వారి కృషిని తెలియజేశారు. ఆంధ్ర సారస్వత శాఖలో యక్షగానము ప్రత్యేకత వ్యాసంలో ఆంధ్రజాతీయ సంగీత వాఙ్మయ రచనకు కొలమానం యక్షగానం అని పేర్కొన్నారు. ఆంధ్ర సారస్వతశాఖలో యక్షగానం ప్రత్యేకతను వివరించారు. యక్షగాన ప్రక్రియలో వస్తు వైవిధ్యం కలదని ఇంతటి వైవిధ్యం కలిగిన ప్రక్రియ మరొకటి లేదని అన్నారు. ఆంధ్ర ఛందస్సు సంహితా సర్వసము తయారగు అవకాశం వచ్చినచో దానికి అపురూపమైన సామగ్రిని చాలా సరఫరా చేయగలదు. యక్షగానం నందు పుస్తకాల కెక్కని పదజాలం, ప్రయోగ విశేషాలు, జాతీయాలు మొదలైనవి కలవు. సాహిత్యాన్ని ప్రజలకు దగ్గర చేసి ప్రజల హృదయాన్ని సాహిత్యంలో ప్రతిబింబింప జేసిన ప్రక్రియ యక్షగానం.

**ముగింపు :**

పాఠకులకు ఆసక్తిని కలిగించే అంశాలతో, విషయాలతో ఈ మణిప్రవాళము వ్యాససంపుటి ఉంది. కవితలలో

గాని వచనంలో గాని అధిక ప్రసంగాలు, వర్ణనలు కనిపించవు. విషయ స్పష్టతతో కూడిన వ్యాసావళి. తెలుగుజాతి, భాష, నాగరికత, వేదాలు, కావ్యాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు గొప్పదనాన్ని వర్ణించిన తీరు బాగుంది. నవల, కథ, జానపద, యక్షగాన వాఙ్మయ చరిత్ర గూర్చి తెలియజేశారు. చారిత్రక అంశాలు కూడా రుజువులతో చూపించారు. తెలుగు సంప్రదాయాలతో కూడిన కవులు కావ్యాల గూర్చి విశదపరిచారు. అలాగే ఆధునిక ధోరణులు కలిగిన కవులు, రచనలు గూర్చి పేర్కొన్నారు. చరిత్రకు సంబంధించిన అంశాలతో పాటుగా భాషకు సంబంధించిన అంశాలను కూడా చర్చించారు. సంప్రదాయాలు, కళలు, ఆచార వ్యవహారాలు గూర్చి తెలియజేశారు. ఒక్క శతక ప్రక్రియ తప్ప సాహిత్యంలోని మిగిలిన అన్ని ప్రక్రియలు మణిప్రవాళము రచనలో కనిపిస్తాయి. విషయం గ్రాంథికంలో ఉన్నప్పటికి విషయ స్పష్టతతో కూడిన లఘువాక్యాలు ఉండటం వలన సులభంగా అర్థమయ్యే రీతిలో రచన ఉంది. సాహిత్యం మానవ సంస్కృతికి ఒక ఆయుధం వంటిది. ఇది విశ్వజనీనమైన ఆనందాన్ని పాఠకుని అనుభూతికి తెస్తుంది. యస్వీ జోగారావుగారి ఈ మణిప్రవాళము సాహిత్య రచన కూడా పాఠకులకు అదే అనుభూతుని అందిస్తుంది.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. జోగారావు, యస్వీ. మణిప్రవాళము.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# అన్నమాచార్య సంకీర్తనల్లో సాంస్కృతికాంశాలు

- డా॥. గంధం అరుణ & డా॥. ఎ. రవీంద్రబాబు

సమాజం, సాహిత్యం ఒకదానిని మరొకటి ప్రభావితం చేస్తూ ఉంటాయి. అలాగే ప్రతి కవి చుట్టూ నిర్ధేశిత సాంస్కృతిక జీవనం ఉంటుంది. రచనలో ఆ జీవనం తాలూకూ అనేక అంశాలు ప్రతిఫలిస్తాయి. అంటే దేశ కాల పరిస్థితులకు అతీతంగా ఏ కవీ రచన చేయలేడు. అందుకే చరిత్రకారులు సాహిత్యాన్ని కూడా చరిత్ర రచనకు ఒక ఆధారంగా గ్రహిస్తారు. సాహిత్యంలో ఆ రచనాకాలం నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక పరిస్థితులు ఉంటాయి. అదే విధంగా రచనాకాలం నాటి సాంస్కృతిక వాతావరణాన్ని, సామాజిక పరిస్థితులను సాహిత్యం ప్రతిబింబిస్తుంది.

సంస్కృతి అంటే నిర్ధిష్ట ప్రదేశంలో నివశించే వారి భౌగోళిక, సామాజిక జీవన విధానం. వివరంగా చెప్పు కోవాలంటే ప్రజల ఆచారవ్యవహారాలు, సాంప్రదాయాలు, వారసత్వంగా వచ్చిన నమ్మకాలు, కట్టుబాట్లు, భాష, మతం, ఆహారపు అలవాట్లు, వృత్తులు, వంటలు, పండుగలు, వేషధారణ, వివాహాది కార్యక్రమాలు, ప్రకృతికి సంబంధించిన అంశాలు... అన్నింటిని కలుపుకుని సంస్కృతని చెప్పొచ్చు. సూక్ష్మంగా చెప్పాలంటే ఆ ప్రజల జీవితం. ఆ జీవితాన్ని సాహిత్యంలో చూపించడమే కాకుండా వాటిలోని మంచిచెడ్డలను బేరీజు వేస్తారు కవులు. విశ్లేషిస్తూ, తర్వాతి తరాలకు అందిస్తారు.

## పరిచయం :

తెలుగు సాహిత్యంలో నన్నయ నుంచి నేటి ఆధునిక సాహిత్యం వరకు వచ్చిన ప్రతి రచనలోనూ సంస్కృతి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కనిపిస్తూనే ఉంది. ఈ దృష్టితో అన్నమయ్యను, అతని రచనలను పరిశీలించొచ్చు. ఇప్పటి వరకు అన్నమాచార్యుడిని సంగీతకారునిగా, శృంగార ఆధ్యాత్మిక సంకీర్తనాచార్యునిగా మాత్రమే పరిశీలించారు. కొందరు అన్నమయ్య సంకీర్తనల్లోని భాషా విశేషాలను, జానపద బాణీలను విశ్లేషించే ప్రయత్నం చేశారు. కానీ ఆ కాలం నాటి ప్రజల జీవితాన్ని స్థూలంగా, సూక్ష్మంగా అన్నమయ్య రచనల ద్వారా తెలుసుకోవచ్చు. ప్రపంచీ కరణ నేపథ్యంలో స్థానిక సంస్కృతులకు, చరిత్రలకు ముప్పు వాటిల్లుతున్న సందర్భమిది. ముఖ్యంగా తెలుగు వారి ఆచార సంప్రదాయాల్లోని అనేక విషయాలు కను మరుగవుతున్న రోజులివి. భక్తికి, ముక్తికి, ఆధ్యాత్మిక తత్వానికి సోపానాలైన అన్నమయ్య సంకీర్తనల్లోని తెలుగు వారి జీవితాన్ని వెలికితీసి భావితరాలకు అందించవచ్చు.

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సంగమ, సాళు వ, తుళు, ఆరవీటి వంశాల కాలంలో తాళ్లపాక కవులు సాహిత్యాన్ని సృష్టించారు. ఆనాటి ప్రజల జీవితానికి సాక్ష్యం వీరి రచనా సారస్వతం. అన్నమయ్య రాజ్యాధికారం సంగమ వంశీకుల చేతి నుంచి సాళువ రాజుల ఏలు బడిలోకి వచ్చిన కాలంలోని వాడు. ఆ కాలం నాటి ప్రజల కష్టాలు, సుఖాలనే కాదు, జీవిత లోతులను కూడా తన సంకీర్తనల్లో నేరుగా, అన్యాపదేశంగా, ప్రగతివాదిగా అభి వర్ణించాడు. ముఖ్యంగా 14వ శతాబ్దం నాటి ప్రజల పెళ్లిళ్లు, కట్టుబాట్లు, వినోదాలు, విందులు, వేడుకలు, వ్యాపారాలు, పండుగలు, కులాలు, వృత్తులు, దుస్తులు, ఆభరణాలు, నమ్మకాలు, మూఢవిశ్వాసాలు, పాలనా విధానం, మనుషుల బలాలు, బలహీనతలు, బంధాలు, కుటుంబాలు, వ్యాపారవిధానం, కళలు, ఆటలు, పాటలు, నేరాలు, శిక్షలు... వంటి ఎన్నో సాంస్కృతిక విశేషాలు వీరి సంకీర్తనల్లో ఉన్నాయి.

## మతం :

మతానికి రాచరిక వ్యవస్థకు ఉన్న సంబంధం, దేవాలయాలలో నేరాలు, మత మార్పిడులు, ముస్లిం, జైనం, బౌద్ధ మతాల పరిస్థితి, శైవం, వైష్ణవ మతాల భేదాలు, రాజుల వైష్ణవ మతాభిమానం... వంటివి అన్న

మయ్యు సంకీర్తనల్లో కనిపిస్తాయి. అన్నమయ్య వైష్ణవమతాన్ని అవలంభించినా వెంకటేశ్వర స్వామిలో త్రిమూర్తులను చూశాడు. హిందూ మతంలో సామరస్యాన్ని ప్రకటించాడు.

పల్లవి - ఎంత మాత్రమున నెవ్వరు దలచిన అంత
మాత్రమే నీవు

చరణం - కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో
విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు - పర
బ్రహ్మంబనుచు
తలంతురు మిమ్ము శైవులు తగిన భక్తులకు
శివుడనుచు" అని రాశాడు.

## మత సంఘర్షణలు, రాజుల దురహంకారం :

ఆనాటి రాజులు అన్నమయ్యను తమ ఆస్థానానికి రప్పించుకును తమపై కీర్తనలు పాడమన్నారు. అందుకు అన్నమయ్య కాదని చెప్పడమే కాదు, మత సంఘర్షణలు, రాజుల చర్యలను ఎండగట్టాడు.

పల్లవి - తలగరో లోకులు తడవకురో మమ్ము
కలిగినదిది మా కాపురము

చరణం - నరహరి కీర్తన నానిన జిహ్వ
వొరులనుతింపగ నోపదు జిహ్వ
మురహరు పదముల మొక్కిన శిరము
పరుల వందనకు బరగదు శిరము

చరణం - తావులేలే రాజులకు దయకొంత పుట్టదాయ
కావరమే ఘనమాయ గలి కాల మహిమ" అని
రాశాడు.

## దేవాలయయాలు :

అందరూ అన్నమయ్య కేవలం తిరుపతి వేంకటేశ్వరుని గురించే తన సంకీర్తనల్లో కీర్తించాడని అనుకుంటారు. తిరుమల వేంకటేశ్వరునితోపాటు అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరుల్లోని దేవాలయాల ప్రస్తావన కూడా వీరి సంకీర్తనల్లో అక్కడక్కడా కనిపిస్తుంది.

పల్లవి - కదరి నృసింహుడు కంభమున వెడలె
విదితముగా సేవించరో మునులు" అంటూ
ఆనాటి దేవాలయాలు, అక్కడి దేవుళ్ల
వైభవాలను సంస్కృతిలో భాగంగా చెప్పాడు.

## కుల భేదాలు :

అన్నమయ్య సంకీర్తనల్లో ఆనాటి సమాజంలోని కులవ్యవస్థకు సంబంధించిన అనేక విషయాలు కనిపిస్తున్నాయి. వివిధ కులాల ప్రస్తావన ఉంది. అలాగే అన్నమయ్య బ్రాహ్మణుడు అయినా దేవుడి ముందు అన్ని కులాలు సమానమేనన్నాడు. హరి భక్తి ఉంటే అందరూ ఒకటేనని ప్రకటించాడు.

పల్లవి - ఏ కులజుండేమి యెవ్వఉడైన నేమి
ఆ కడ నాతడె హరి నెఱిఉగిన వాడు

పల్లవి - విజాతు లన్నియు వృథా వృథా
అజామిళాదుల కదియే జాతి" అని చెప్పాడు.

అలాగే "బ్రహ్మమొక్కటే.." వంటి సంకీర్తనల్లో వేంకటేశ్వర స్వామిని అన్ని కులాలకు దగ్గర చేసే ప్రయత్నం చేశాడు. కులం కాదు, స్వామిపై ఉన్న నమ్మకం ముఖ్యమని చెప్పాడు.

## మూఢాచారాలు :

సమాజం వైజ్ఞానికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఇప్పటికీ ప్రజల్లో అనేక మూఢనమ్మకాలు ఉన్నాయి. అన్నమయ్య తన కాలం నాటికి ప్రజల్లో ఉన్న పలు మూఢనమ్మకాలను, ప్రజల జీవితాల్లోని రుగ్మతలను, వాటికి హేతువులను సంకీర్తనల్లో చెప్పే ప్రయత్నం చేశాడు. పిండాలు పెట్టే సంప్రదాయం ప్రజల్లో ఉందని చెప్తూ, దానిని ఎండగడ్డాడు.

చరణం - నరులకు నరులే పరలోక క్రియలు
సిరిమోహాచారాల జేతురు గాక
తరుపాషాణ పశుతతులకెవ్వరు సేసే

రరయగ భ్రమగాక అవిపస్తులున్నవా!" అని ప్రశ్నించాడు. దీనిని బట్టి ఆనాటి ప్రజల్లో ఉన్న చనిపోయిన వారికి పిండాలు పెట్టే ఆచారం గురించి తెలుస్తుంది.

"ఒకరి కన్నెకల వేరొకరికి నమ్మించు" అనే వాక్యం ద్వారా ఆనాటి కాలంలో కన్యాశుల్కం ఉన్నట్లు చెప్పవచ్చు.

**క్షుద్ర దేవతలకిచ్చే బలులు :**

ఆ కాలంలో కూడా మంత్రతంత్రాలు, మాయలు, దెయ్యాలు పట్టడం వంటి వాటిని నమ్మేవాళ్లు. క్షుద్ర దేవతలకు బలులిచ్చేవాళ్లు. వాటిని తన సంకీర్తనల్లో ఆపమన్నాడు అన్నమయ్య. ఇవన్నీ గ్రామీణ ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తెలియజేసే సాంస్కృతి కాంశాలే.

పల్లవి - మొక్కరో మీరు మోసపోక మీకు
దిక్కుదెసైన అది దేవునికి

చరణం - సిడిదల లియ్య వద్దు జీవాల జంపవద్దు
బడిబడి పగ్గాల బారవద్దు
సిడి మీది బిత్తరపు బిమ్ముల చిమ్మగవద్దు
కదనుం...దారి గన్నఉజాలు" అని ప్రజల జీవనంతో ముడిపడిన లోపాలను ఎత్తి చూపాడు.

**వేశ్యావృత్తి :**

14వ శతాబ్ది కాలంలో కూడా తెలుగు నేలపై వేశ్యావృత్తి ఉండేది. సమాజంలో కొనసాగుతున్న వేశ్యలవల్ల జరుగు తున్న నష్టాలను, వారి బాధలను కూడా అన్నమయ్య అనేక సంకీర్తనల్లో చెప్పాడు.

"యిత్తుల నీ కూడిగాలు యెన్నియైన జేసేగాని
పొత్తుల యెంగిలి తోడి భోగము సయించదు"

అని ఆనాటి సమాజంలో వేశ్యల దగ్గరకు వెళ్తున్న భర్తల గురించి భార్యపడే వేదన చెప్పాడు అన్నమయ్య. అలాగే మరో సంకీర్తనలో భార్యాభర్తల మధ్య ఉండా ల్సిన అన్యోన్య దాంపత్యం గురించి వివరించి, కుటుంబ వ్యవస్థ ఎలా ఉండేదో కూడా చెప్పాడు.

**నాస్తికులు :**

ఆ రోజుల్లోని సమాజంలో ఎన్ని మతాలు ఉన్నా నాస్తికులు కూడా ఉండేవాళ్లు. వాళ్ల గురించి అన్నమయ్య భక్తుడైనా సాంస్కృతి జీవితంలో వాళ్ల భాగస్వామ్యం గురించి, వాళ్ల ఆలోచనా దృక్పథం గురించీ తెలిజేశాడు.

పల్లవి - ఇట్టి నాస్తికుల మాటయేమని నమ్మెడిదిక
పట్టి సముల మంటానే భక్తుల దూషింతురు"

అని సమాజంలోని విభిన్నమైన ఆలోచనా విధానాల గురించి తెలియజేశాడు అన్నమయ్య.

**మరికొన్ని సాంస్కృతికాంశాలు :**

అన్నమయ్య ప్రజా జీవితంలోని అన్ని సాంస్కృతిక అంశాలను సూక్ష్మదృష్టితో తిలకించి సంకీర్తనల్లో వర్ణిం చాడని చెప్పొచ్చు. పండుగల విషయానికి వస్తే కృష్ణాష్టమి, శ్రీరామనవమిలను గురించి చెప్పాడు. వీరి సంకీర్తనల వల్ల ఉట్లపండుగ అంతకు పూర్వం నుంచే ఉన్నట్లు తెలుస్తుంది. వేంకటేశ్వర స్వామికి చేసే పలు సేవలను వర్ణించే క్రమంలో ప్రజల జీవితాల్లోని అనేక సందర్భాలను వివరించాడు. దేవునికి చేసే పలు ఉత్సవాలను, పూజ లను, కైంకర్యాది కార్యక్రమాలను చెప్పాడు. అలాగే అయిదు రోజుల పెళ్లిళ్లు, ఆ పెళ్లిళ్లో జరిగే వివిధ క్రతువులు, ఆచారాలన్నీ వీరి సంకీర్తనల్లో కనిపిస్తున్నాయి. (బాసికాలు కట్టడం, పేరంటాళ్లు, ఎదుర్కోలు, పసుపు కుంకాల పంపకం... వంటివి) ఆభరణాలు, అలంకరణల గురించి కూడా ఆలపించాడు. పిల్లల పెంపకం, నోములు, వ్రతాలు, స్త్రీలు పురుడు పోసుకోవడం వంటివి సైతం వీరి సాహిత్యంలో ఉన్నాయి.

"ఎరుకచెప్పే నీ ఇచ్చ యెల్లా నెరుఉగుదు
మెరుగైన సొమ్ములిచ్చి మెచ్చవయ్య నన్ను"

సంకీర్తన ద్వారా ఆరోజుల్లో సోది చెప్పే ఆచారం ఉండేదని, ఎరుకలు ఆ వృత్తిలో జీవించేవాళ్లని తెలు స్తుంది.

"మంతము లేలాడీనే మగువలతో నెల్లాను
సంతలోని వలపుల జాజార కాడు" కీర్తనలో ఆనాటి సంతలు, వాటిలోని ప్రజల ప్రవర్తన అన్నీ తెలుస్తాయి.

"కొలది బ్రహ్మాండపు కుందెన లోన
కులికి జీవులను కొలుచు నించి

కలికి దుర్మోహపు రోకలి వేసి
తలచి తనువులను దంచి మాయ" అనే వాక్యాలలో తత్వంతోపాడు కుందెన, రోకలి వంటివి ఉన్నాయని, దంచడానికి ఉపయోగించే వాళ్లని అర్థమవుతుంది.

చరణం - మట్టపు మలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాటెనదే
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు
అట్టిటు చిమ్ముచు నలమేల్మంగ

చరణం - చిందుల పాటల సిరిపాలయాటల
అందెల మ్రోతల నాడెనదే
కందువ తిరు వేంకటపతి మెచ్చగ
అందపు తిరుపుల నలమేల్మంగ" కీర్తనలో స్త్రీలు ధరించే ఆభరణాల గురించి చెప్పాడు.

పల్లవి - ఆకటి వేళల అలపైన వేళలను
తేకువ హరినామమే దిక్కుమరి లేదు

చరణం - కొఱమాలియున్న వేళ కులముచెడిన వేళ
చెఱవడి వొరుల చేజిక్కిన వేళ"

అంటూ ఆ రోజుల్లోని మత మార్పిడులను, ఆకలి తీరని పేదరికాన్ని అన్నమయ్య సంకీర్తనల్లో రచించాడు. అన్నమయ్యది వ్యవసాయ కుటుంబం కాబట్టి దాని గురించి కూడా ప్రస్తావించాడు. రాజులు తవ్వించిన చెరువులు, నీటి పారుదల వ్యవస్థ, గుళ్లుగోపురాలకు రాజులు ఇచ్చిన మాన్యాల గురించిన విశ్లేషణలూ కనిపిస్తున్నాయి. ఆ రోజుల్లో వచ్చిన కరువు ప్రస్తావన కూడా ఉంది. ఓడల ద్వారా జరిగే వర్తక వ్యాపారాలు. దేశంలోని వివిధ ప్రాంతాలతోను, విదేశాలతోనూ జరిగిన వాణిజ్య వివరాలు కూడా ఉన్నాయి. ఇంకా గ్రామాల్లోని సంతలు, కోమట్లు చేసే వడ్డీవ్యాపారాల గురించి కూడా అన్నమయ్య ప్రస్తావించారు. స్త్రీల వస్త్రాధారణ, ఆటలు, పాటలు, కళలు, వినోద కార్యక్రమాలు వర్ణించాడు. పాములాటలు, గడాటలు, తోలుబమ్మలాటలు వంటివి ఆనాడు ప్రజల వినోద కార్యక్రమాలు. వీటిని ఆశ్రయించుకుని కొన్ని కులాలు కూడా బతికేవి. ఇక పిల్లలు బిల్లంగోడు, పుట్టచెండ్లాట, గచ్చనకాయలు, సిరిసింగనవత్తి వంటి ఎన్నో ఆటలు అన్నమయ్య స్వయంగా తన సంకీర్తనల్లో ఆలపించాడు.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# సమకాలీన హిందీ నాటకరంగం - ఒక పరిశీలన

- డా॥. గోవిందరాజు భరద్వాజ, అసోసియేట్ ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ విజువల్ ఆర్ట్స్, ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయము, న్యూ ఢిల్లీ.

మన దేశంలో సంగీతం, నృత్యం, చిత్రకళ , శిల్పకళ, సాహిత్యం లాంటి ప్రక్రియలతో సమానంగా రంగస్థల కళలకు కూడా సుమారు ఐదు వందల ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉంది. రామాయణ, మహాభారత, కాలం నుంచి కూడా కథా గానం కథా వాచకాల ప్రస్తావనల వల్ల ఆకాలం నుంచే ఆయా కళా రూపాలలో నాటకీయత ఉండేదని తెలుస్తుంది. భారతీయ ఆధునిక నాటకరంగం గురించి మాట్లాడుకుంటే సుమారు 1850 నుండి 1950 వరకు ఉన్న కాలాన్ని ప్రారంభ కాలంగా చెప్పుకోవాలి. పార్శీ నాటకరంగం కూడా దాదాపు అప్పుడే ప్రారంభం అయ్యింది. వ్యవసాయిక నాటకరంగంగా ఎదిగింది. హిందీ, ఉర్దూ భాషలలో వచ్చిన వారి నాటకాలు ఆనాటి శాస్త్రీయ, జానపద నాటకాలకు భిన్నంగా ప్రజల ముందుకు వచ్చాయి. పర్షియా దేశం నుండి వ్యాపారం కోసం మన దేశానికి వచ్చిన వ్యాపారస్తులు ఈ నాటక రంగాన్ని అభివృద్ధి చేసారు. పార్శీ నాటకరంగం లోని నటులు, రచయితలు, దర్శకుల ప్రతిభ వల్ల అదిఒక పాటలు, సంగీతం,నృత్యం తోపాటు మధ్య యుగపు నాటకరంగ ప్రభావంతో వచ్చిన రంగు రంగుల కర్టెన్లు భారతీయ నాటక రంగంలోకి వచ్చాయి. అవి ఇప్పటికి కొనసాగుతున్నాయి. ఆగా హశ్రు కాశ్మీరీ, నారాయణ ప్రసాద్ బేతాబ్, రాధే శ్యాం కథా వాచక్ వంటి రచయితలు దేశ ,విదేశ నాటకాలను ఆనాటి సమాజానికి అనువైన నుడికారంలో రచించారు . తరువాతి కాలంలో రేడియో,టెలివిజన్, సినిమా ప్రభావాల వల్ల పార్శీ నాటకం వెనకబడింది.

### దానికి ప్రముఖ కారణాలు.

1. పార్శీ నాటకాలు చూపించే చమత్కారాలన్నీ, కెమెరా చూపించ గలగడం.
2. పార్శీ నాటక నటి నటులు, రచయితలు సినిమా వైపు వెళ్లిపోవడం.
3. కొత్త ప్రక్రియ ఐన సినిమా ముఖ్యంగా 1930 నుండి ప్రేక్షకుల్ని తన వైపు లాక్కోవడం.
4. ఇవే కాక శైలి, హొరు, జోరుతో కూడిన పార్శీ నాటకరంగానికి విరుద్ధంగా వచ్చిన టెలివిజన్, రేడియో, సినిమా మాధ్యమాలతో వచ్చిన యదార్థ వాద ప్రభావ ప్రదర్శనలు కూడా పార్శీ నాటకరంగ పతనానికి కారణాలు. ఇలా ఆధునిక నాటక రంగంలో అనేక మార్పులు మొదలయ్యాయి. వాటిలో కొన్ని పాశ్చాత్య నాటకరంగ ప్రభావం, మన దైన శైలి లేదా కళారూపాలను తిరిగి ఆవిష్కరించడం , జానపద కళారూపాల జోడింపు, పార్శీ నాటకరంగ ప్రభావం, రియలిజం, వివిధ మాధ్యమాల ప్రభావంతో నాటకరంగం ముందుకు వెళుతోంది. ఈ ప్రభావం అన్ని భాషా నాటకాలపై వుంది. కొన్ని విపరీతంగా ప్రభావితమైతే మరికొన్ని ఇప్పుడు ఇప్పుడే ప్రభావితమవుతున్నాయి. ఇక సమకాలీన హిందీ నాటకరంగం పరిశీలిస్తే ఈ కింద ఉదహరించిన కొన్ని అంశాలు గమనార్హంలు.

- పాశ్చాత్య నాటకరంగ ప్రభావం
- ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్
- థియేటర్ ఆఫ్ రూట్స్ మూవ్ మెంట్.
- కహాని రంగమంచ్
- ఇన్ స్టలేషన్

### పాశ్చాత్య నాటకరంగ ప్రభావం :

భారతీయ నాటకరంగంలో ముఖ్యంగా హిందీ నాటకాలలో ఆధునికత భరతేందు హరిశ్చంద్ర తో

ప్రారంభం అయ్యింది. పాశ్చాస్య ప్రభావాలలో ఒకటైన ప్రతీకవాదాన్ని నాటకరచనలో ప్రక్షేపించి, రచనలు చేసి మార్గదర్శకుడు అయ్యాడు భరతేందు. ఈ ప్రభావంతో తరవాత వచ్చిన జయశంకర్ ప్రసాద్ భారతీయ-ఐరోపా సాహితి శైలులను ఒకటి చేయడానికి ప్రయత్నించాడు. అప్పటికే నాట్య శాస్త్రం రంగ నిషిద్ధాలుగా పేర్కొన్న హత్య, యుద్ధం లాంటి అంశాలను రంగస్థలం పైకి తెచ్చాడు ప్రసాద్. అంటే అప్పట్లో నాటకరంగంలో నూతన విధా నాలు ముందు రచయితలు తీసుకువచ్చారు. తరువాత వచ్చిన లక్ష్మీ నారాయణ్ లాల్, భువనేశ్వర్ రచనలు కూడా ఆ కాలాన్ని అధిగమించిన రచనా ప్రక్రియలని చెప్పవచ్చు. అప్పుడే అభివ ృద్ధి చెందిన ప ృథ్వి థియేటర్, నాటకం అంటే కేవలం పాఠ్యము (text )తో సరిపెట్టాకుండా దాన్ని ద ృశ్యమానం చేయడానికి ప్రయత్నం చేసింది. జగదీశ్ చంద్ర మాథుర్ రాసిన కోణార్క్ నాటకం ఈ కోవలోకి చెందిందే.

స్వాతంత్రం వచ్చిన తరువాత జరిగిన అనేక నూతన నాటక ప్రయోగ ప్రయత్నాలలో ముఖ్యంగా రెండింటిని ఉదాహరించవచ్చు. ఒకటి హబీబ్ తన్వీర్ రచించి దర్శ కత్వం వహించిన "ఆగ్రా బజార్" నాటకం. బ్రెచ్టియాన్ థియేటర్ ప్రభావం వాళ్ళ హబీబ్ ఈ రచన చేసారు. ఈ నాటకం ఢిల్లీ లోని ఓఖ్లా గ్రామంలో వీధుల్లో ప్రదర్శిం చబడి అప్పట్లో చర్చనీయాంశం అయ్యింది. ఇంకా రెండవది ధర్మవీర్ భారతి రచించిన అంధాయుగ్. అస్తిత్వాదం (Existentialism) ప్రభావంతో మహాభారత కథాంశం తో రాయబడిన నాటకం ఇది. దీనిలో ప్రతీక వాదం, అస్తిత్వవాద ప్రభావాలు ప్రస్ఫూటంగా కనిపిస్తాయి. తరువాత క్రమంలో మోహన్ రాకేష్ 1959లో రచించిన ఆషాఢ కా ఏక్ దిన్. షామానంద్ జలాన్ మొదటిసారి దీనికి దర్శకత్వం వహించారు. ఇందులో అస్తిత్వాదం, యదార్ధవాదే ఛాయలు కనిపిస్తాయి. సురేంద్ర వర్మ తరవాతవచ్చిన రచయితలలో వచ్చిన వాళ్లలో ప్రము ఖులు.. ఇంకా అనేకమంది దర్శకులు తమ నిరంతర ప్రయోగ ప్రదర్శనా ప్రక్రియల ద్వారా కొత్తదనాన్ని తీసుకు రావడానికీ ప్రయత్నాలు చేసారు. వారిలో ఇబ్రహీం అల్కాజి, షామానంద్ జలాన్, మోహన్ మహర్షి, సత్యదేవ్ దూబే, బివి కారంత్ ఓంశివ పురి, గిరీష్ రస్తోగి, సత్యవ్రత్ సిన్హా, జాయ్ మిచెల్, బ్రీజ్ మోహన్ షా, రాంగోపాల్ బజాజ్ ముఖ్యులు. ఇక అనిబధ రూపకాలు విషయానికి వస్తే విపిన్ కుమార్ రాసిన తీన్ అపాహిజ్, కుడేకా పీపా గురించి ప్రస్తావించాలి. వీటిని మొదటిసారి సత్యవ్రత్ సిన్హా వీటిని ప్రదర్శించారు.

ఐతే 1970 ప్రాంతాలలో వచ్చిన నాటకంలో ఆదర్శాలు, కలలు అవి చెదిరిపోవడానికి గల కారణా లను ప్రతిబింబించాయి. యయాతి, ఏవం ఇంద్రజిత్, అదే అధూరె లాంటి నాటకాలు ఈ కోవలోకి చెందు తాయి. 80 వ శతకంలో అనిశ్చితి, అనాసక్తత, అను మానాలు, ద్వంద వైఖరి లాంటి అంశాలు నాటకాలలో రాజ్యం చేసాయి. కోణార్క్, అంధయుగ్, ఆషాడ కా ఏక్ దిన్ లాంటి నాటకాలు ఇలాంటి ఆలోచనలను ప్రతిబింబించాయి. సమకాలీన మధ్యతరగతి జీవితం, సమాజపు స్థితి గతులు, రాజకీయ పరిస్థితులు హిందీ నాటకాన్ని చాల ప్రవితం చేసాయి. ఈ కారణంగానే 1990 ప్రాంతాలనుండి వచ్చిన నాటకాలు పాఠ్యము (text) ని యధాతథం గా ఎప్పుడు ప్రదర్శించలేదు . అప్పటికే ప్రాచుర్యంలో వున్న ప్రదర్శనాపద్ధతుల్ని కాల రాసి కూల్చేసి, కొత్త నాటక ప్రదర్శనలు జరిగాయి. వీటిని అప్పటికే వున్నా ప్రదర్శనా పరంపరకు వ్యతిరేకంగా వచ్చిన మార్పుగా గుర్తించవచ్చు. వీటికి గల ముఖ్య కారణం జీవన, ఆలోచన విధానాలలో వచ్చిన మార్పులుగా భావించవచ్చు.

ఈ మార్పులలో ముఖ్యమైనవి ఒకే పాత్రని ఒకే నాటకంలో చాలామంది కళాకారులతో వేయించడం లాంటివి. బివి కారంత్ విద్యాసుందరి, చోటే సైయద్ బడే సైయిాద్ లాంటి నాటకాలలో ఇలాంటి ప్రయత్నాలు చేసారు. అమల్, విమల్, కమల్ (ఏవం ఇంద్రజిత్ ) నాటకంలోకేవలం రెండు, మూడు పాటలు మాత్రమే ఉండే ఈ నాటకం చివర్లో దాదాపు ఓ సమూహం గా

మారిపోంతుంది. అంటే ఒక వ్యక్తిత్వాన్ని లేదా ఇమేజ్ ని ముక్కలు ముక్కలుగా చెస్ స్టేజి మీద పరిచేయడం.. పాత్ర యొక్క అనేక పార్శ్యాలను ఒకే సరి అర్ధం చేసుకోవడానికి ప్రయత్నం చేయడం. ఇంకా ఇతర ప్రయోగాల మాటకొస్తే చంద్రగుప్త, స్కందగుప్త, కామన, ధ్రువ స్వామిని లాంటి జయశంకర్ ప్రసాద్ రచించిన నాటకాలని దర్శకత్వం వహించేటప్పుడు బివి కారంత్, ప్రసాద్ రాసిన ఇతర నాటకంలోని పాటలని వాడుకోవడం, అలాగే కొన్ని సంభాషణల్ని యధాతధం గా తీసుకొని పాటలుగా మలచడం చెప్పుకోవచ్చు . ఈ ప్రయోగాల ద్వారా మనిషి ద్వంద ప్రకృతినీ నర్ధం చేసుకోవడానికి లేదా చేయించడానికి ఆధునిక దర్శకుడు ప్రయత్నాలు చేస్తున్నాడని చెప్పవచ్చు.

## ఇండియన్ ప్యూపిల్స్ థియేటర్ అసోసియేషన్ (IPTA) :

1943 వ సంవత్సరం లో ప్రారంభించబడింది IPTA. దేశంలోని మొట్ట మొదటి జాతీయ స్థాయి నాటక ఉద్యమంగా చెప్పుకోవచ్చు. అప్పటికే నాటక రంగంలో ప్రబలిన చౌకబారు గ్లామర్, సూడో సౌందర్య ప్రదర్శనల పేరిట నాటకాలకు వ్యతిరేకంగా అప్పటి సాంప్రదాయ కళలని ప్రదర్శనలలో పొందుపరచి రంగస్థలాన్ని పునర్జీవింపచేయడానికి IPTA కంకణం కట్టుకుంది. IPTA ఏకైక ఎజెండా అందరికి నచ్చే నాటకాన్ని ప్రదర్శించడం. అంటే ఎక్కువ జన బాహుళ్యానికి దగ్గరగా వుండే నాటకాన్ని ఆడటం. అప్పట్లో సాంప్రదాయ కళారూపాల పట్ల ఉన్న ఆరాధన వాటి ప్రభావాన్ని IPTA వాడుకున్నం తగా మరెవరు వాడుకోలేదేమో?

అంటే తాము చెప్పాలనుకున్న విషయం జనం లోకి త్వరగా వెళ్లాలంటే వారికీ దగ్గరగా ఉండే కళారూపాల మాధ్యమంగా చెబితే అది త్వరగా చేరుతుందని వారు భావించారు. అదే అనుసరించారు విజయాలను సాధించారు. IPTA సాధించిన విజయాలు అనేకం. బిజోన్ భట్టాచార్య, శంభు మిత్ర, ఉత్పల్ దత్ , హబీబ్ తన్వీర్, బాలరాజ్ సహానీ, దీన గాంధీ , KA అబ్బాస్, పృధ్వి రాజ్ కపూర్, షీలా భాటియా, రవిశంకర్, సచిన్ శంకర్ మహామహులు IPTAలో పనిచేసారు. నవ సమాజ నిర్మాణంలో నాటకాన్ని ఓకే ముఖ్యమైన అంశంగా భావిస్తూ IPTA నాటకాన్ని ప్రదర్శించింది.

## థియేటర్ అఫ్ రూట్స్ :

భారతీయ నాటక రంగంలో పాశ్చాత్య నాటక రంగ ప్రభావంతో రచయితలు, దర్శకులు చేస్తున్న ప్రయోగ ప్రవాహాల జోరు కేవలం ఒక రకమైన అనుకరణా మాయాజాలమేనని, మనదైన భారతీయ స్పృహ, ఆత్మ నాటకరంగంలో లోపించిందని భావిస్తున్న తరుణంలో ఒకప్పటి సంగీత నాటక అకాడెమి సెక్రటరీ సురేష్ అవస్థి "థియేటర్ అఫ్ రూట్స్" సిద్ధత్తాన్ని ప్రతిపాదించారు. ఇంతకూ ముందే ఇలాంటి ఆలోచనలని %ఖూూ% ఆచరణలో పెట్టిన దీనిని మరింత ప్రస్ఫుటంగా రచయితలు, దర్శకులు ఈ దిశగా ఆలోచించడం మొదలు పెట్టారు.

## ఈ థియేటర్ అఫ్ రూట్స్ ప్రధాన ఉ దేశ్యాలు:

- సాంప్రదాయ,జానపద కల రూపాలని నాటక నిర్మాణాలకు విరివిగా ఉపయోగించడం.
- నాటకాన్ని సాంప్రదాయ కళారూపాల వైపుకి మళ్లించడం.
- మౌఖిక, ముద్రిత పాఠ్యల మధ్య దూరాన్ని తగ్గించడం.
- వివిధ రకాలుగా ప్రదర్శించగలిగిన సామర్ధ్యంతో కూడిన ప్రదర్శన పాఠ్యలను (Performance Texts) నిర్మిచడం లేదా రచించడం.
- వేరువేరు జానపద, సాంప్రదాయ కళారూపాలను నాటకాలలో వాడడం ద్వారా వాటిని పునర్జీవితం చేయడమే కాకా ఆధునిక నాటకానికి కొత్త శైలిని ఆపాదించడం.
- ఆధునిక నాటక ప్రక్రియలో పరాయీకరణను తగ్గించి మనదైన ప్రదర్శనా అంశాలను జోడించడం

ద్వారా కళారూపాల్ని, నాటకాన్ని కలగలిపి ఒక కొత్త ప్రక్రియకి నాంది పలకడం!

ఈ పై ప్రయత్నాలలో భాగంగా ప్రొసీని a యం ఆర్చ్‌ని బద్దలు కొట్టి నాటకాల్ని ప్రదర్శించడం జరిగింది. ఇబ్రహీం అల్కాజి అంధయుగ్ , తుగ్లక్, హబీబ్ తన్వీర్ ఆగ్రా బజార్ నాటకాలు ఈ తరహా నాటకాలకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. అలాగే, మరికొన్ని సుపరిచిత నాటకాలైన ఘాసీరాం కొత్వాల్, చరణ్దాస్ చోర్, మిట్టి కి గాడి, ఆలా అఫ్సర్, దూలరి బాయ్ లాంటివి కొన్ని మచ్చుకు మాత్రమే.

## కహానీ రంగమంచ్ :

కథల్ని రంగస్థలంపై ప్రదర్శించే ఈ ప్రక్రియని హిందీలో శ్రీ దేవేంద్రరాజ్ అంకుర్ 1975 ప్రాంతాలలో ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటిదాకా ఇది నిరంతరం కొనసాగుతూనేవుంది.

కాదని రంగస్థలంపై ప్రదర్శించడానికి అనేక పద్ధతులు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి.......

1. కథని ఆధారం చేసుకుని ఓ కొత్త నాటకాన్ని రచించడం.
2. కథని నాటకీకరణ చేయడం.
3. కథని యధాతథంగా రంగస్థలంపై ప్రదర్శించడం.

కహానీ రంగమంచ్ ఈ చివరి పద్ధతినే పాటిస్తుంది. అంటే కథలో అలంటి మౌళిక మార్పులు చేయకుండా ఉన్నది ఉన్నట్లుగా ప్రదర్శించడం. ఇలాంటి ప్రయత్నం వాళ్ళ కథలోని మూలం అలాగే ఉంటుందని, ఉండాలని ప్రొఫెసర్ అంకుర్ వాదన.

కేవలం ఏకాంతంలో చదివి ఆనందించి, ఆస్వాదించే సాహితీ కళారూపం కథ. దానిని అందరితో కలసి, వినడంతోపాటు చూసే అవకాశాన్ని 'కహానీ రంగమంచ్' కల్పిస్తుంది. దీనివల్ల కథలోవుండే సహజత్వం పోకుండా ద ృశ్యమానమై ఒక కొత్త కళా రూపంగా అవతరిస్తుంది. ఇక నటీనటుల విషయానికి వస్తే మాములు నాటకంలో కేవలం ఒకే ఒక పాత్రగా మిగిలిపోకుండా బహుముఖ పాత్రల్ని అంటే కొండొకచో సూత్రధారుడిగా, కొన్నిచోట్ల కేవలం వక్తగా, వ్యాఖ్యాతగా ఇలా అనేక రూపాలని నటుడు ఆవిష్కరిస్తాడు. ఇక దర్శకుడి విషయానికి వస్తే రంగస్థల ప్రక్రియకి అనువైన కథని ఎంపిక చేసుకోవడం, ఎంపిక చేసుకున్న కథని ఏ మార్పులు లేకుండా దృశ్యమానం చేయడం,

ఈ క్రమంలో కథలోని ఈ క్రమంలో కథలోని సహజత్వాన్ని కాపాడుతూ ముందుకెళ్లడం నిజంగా ఓ సాహసం. ఓ ఛాలెంజ్. ఇలాంటి ప్రయత్నాలవల్ల నిస్సందేహంగా నాటక రంగంలో సరి కొత్త ప్రదర్శనా పాఠ్య నిర్మాణాలవల్ల నాటక రంగం పరిపుష్ట మవుతుంది.

## ఇన్స్టలేషన్ (Installation) :

నాట్యశాస్త్రంలో మొదటి అధ్యాయం, 48వ శ్లోకంలో, నాట్యంలో లేని జ్ఞానం, శిల్పం, యోగం, క్రియలు కానీ లేవని తెలియ చేస్తుంది. దీనివల్ల రంగస్థలం, అనేది, సంగీతం, నృత్యం, చిత్రకళ, శిల్పకళ మరియు సాహిత్యంతో కూడిన సమాహార కళగా చెప్పబడినది. ఇక ఇరవయ్యో శతాబ్దపు సినిమా, టివి, వీడియో, ఇంటర్నెట్, సంగీతం, నృత్యం, చిత్రకళ అన్నింటిని కలగలిపి నాటక రంగంలో ప్రయోగించడం ద్వారా దాని పరిమితిని, భాషని తద్వారా పరిభాషను అవి మార్చేస్తున్నాయి. ఈ వికాస క్రమంలో పైన ఉదహరించిన అన్ని ప్రక్రియలు కలగలసి రంగస్థలంపై ఆవరించి ఇన్స్టలేషన్ (Installation) పేరుతొ ప్రయోగింపబడుతోంది. ఇవన్నీ ఉత్తర ఆధునిక వాద ప్రభావానికి ప్రతీకలని చెప్పుకోవచ్చు. ఇక హిందీ నాటక రంగంలో అనామిక హక్సర్, అనురాధ కపూర్, కీర్తి జైన్, అభిలాష్ పిళ్ళై లాంటి దర్శకులు నిరంతరం ఈ దిశగా ప్రయోగాలు చేసారు. ఇలాంటి ప్రయోగాల నేపథ్యం లో అనేక వాదనలు వినిపిస్తున్నాయి . వాటిలో కొన్ని .....

1. ఆధునిక మానవ జీవితం యాంత్రిక జీవన శైలిలో మునిగిపోయింది. కాబట్టి, రంగస్థలం పైన కూడా అదే శైలి ప్రతిబింబించడం సహజం.
2. ఉత్తర ఆధునిక వదల ప్రభావం వల్ల ఒక పాఠ్యాన్ని అర్థం చేసుకోవడానికి దాన్ని చిన్న చిన్న భాగాలుగా చేసి అర్థాలు వెతికే ప్రయత్నం జరుగుతోంది. అలాగే

రంగస్థల ప్రక్రియని కూడా అర్థం చేసుకోవడానికి, దాన్ని వివిధ మాధ్యమాల ద్వారా విభజించి ఏదేనా ఒక అంశాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం జరుగుతోంది.

3. చివరగా.... నవీన మానవ జీవితం సంపూర్ణంగా వ్యక్తిగతంగా కాకుండా ఖండ ఖండాలుగా, జటిలంగా మారిపోయింది. కాబట్టి ఇన్ని అంశాలను అర్థం చేసుకోవడానికి, ఏ ఒక్క ప్రక్రియ వల్ల సాధ్యం కాదు కాబట్టి రంగస్థలంపై ఒకేసారి ఇన్ని రూపాల్ని (forms) పరి చేసి మానవ జీవన విధానం లోని వైరుధ్యాన్ని పేక్షకులకు పరిచయం చేయడం. ఇప్పుడనలు జరుగుతున్నా ప్రయోగాలు అవసరమా! అప్పుడే భారతీయ రంగస్థలానికి పాఠ్యము (Text) మీద నమ్మకం పోయిందా? ప్రేక్షకులలో అంత అనిబద్ధత (Absurdity) వచ్చేసిందా? ప్రతి అంశాన్ని లేదా ఒక అంశాన్ని ముక్కలు ముక్కలు చేసి, మళ్ళీ వాటిని పేర్చి, కూర్చి అర్థం చేసుకునే సమయం, సామర్థ్యం అంతకు మించి అవసరం ప్రేక్షకులకు ఉందా? వీటిలో శిల్ప కల, చిత్ర కళ లాంటివి స్థిరంగా ఉండే కళలు . ఇక వీడియో, సంగీతం, ఆ మాటకొస్తే నటన ఇలాంటివి నిరంతర గతి శీలకాలు. మరి వీటి మధ్య సమన్వయము ఎలా కుదురుతుంది? ఇన్నిటి మధ్య నాటకానికి అతి ముఖ్యమైన నటన లేదా నటుడు మరుగుజ్జు గ మారిపోతున్నాడు. ఇది ఒక భరించలేని వాస్తవం.

**ఉపసంహారం :**

చివరగా ఇంతవరకు చర్చించిన విషయాలను క్రోడీకరిస్తే భారతీయ / హిందీ / ఆధునిక నాటకరంగం ఎలా వుండబోతోంది ? లేదా ఎలా ఉంటుంది అంటే .......

కేవలం ప్రభోదాత్మకంగా ఉండదు.

అలాగని పూర్తి వినోదాత్మకంగా ఉండదు.

రాజకీయ నాటకరంగంగా ఉండదు.

కేవలం కవితాత్మకంగా ఉండదు.

అలాగని గొంతు చించుకుని వచన ప్రయోగంగా ఉండదు.

ఏదో ఒక రూపాన్ని,శైలిని విడిచిపెట్టి ఉండదు.

లేదా ఏదో ఒకే శైలిని, రూపాన్ని అంటిపెట్టుకుని ఉండదు .

కథా కథనం ఉండదు / లేదా ఉంటుంది.

కానీ ........ ప్రకృతి, సమాజం, మనిషి ఉన్నంత వరకు నాటకం...... నాటకంగానో , ప్రదర్శనగా నో ....ఏదో ఒక రూపంలో ఉంటుంది....ఏమో !

**ఉపయుక్త గ్రంథాలు :**

1. Bhatia, Nandi, Modern Indian Theater, New Delhi: Oxford University Press, 2009.
2. Dalmia, Vasudha. Poetics, Plays, and Performances The Politics of Modern Theatre. New Delhi, Oxford University Press, 2006.
3. Deshpande G P., Ed. Modern Indian Drama: An Anthology. New Delhi: Sahitya Akademi, 2004.
4. Dharwadker, Aparna Bhargava. Theatres of Independence New Delhi: Oxford University.
5. Jain, Nemichandra. Indian Theatre: Tradition, Continuity and Change. Delhi: Vikas Publication House Pvt. Ltd 1992.
6. Keith, A.B. The Sanskrit Drama. Delhi: Motilal Banarasidas, 1992.
7. Lal, Ananda., Ed. The Oxford Companion to Indian Theatre. New Delhi: Oxford University Press, 2004.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# పాఠ్యపుస్తకాల్లో లింగవివక్ష - ఒక పరిశీలన

# Gender Discrimination in Textbooks – An observation

– డా॥. కె.సుమలత, ప్రాంతీయ సంచాలకులు (ఇన్‌ఛార్జ్), ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో), విజయవాడ.

పాఠ్యపుస్తకాలు సామాజిక ప్రతిబింబాలు. సామాజిక విలువలు, ఆశయాలు, ఆకాంక్షలు, అవసరాలను అక్షర రూపంలో అందించి అభ్యసనానుభవాలు, ఆమోదయోగ్యమైన వైఖరులను కలిగించి విద్యార్థుల సమగ్రమూర్తిమత్వాభివృద్ధికి దోహదపడే సాధనాలుగా విద్యావేత్తలు వాటిని గుర్తించారు. జాతీయ విద్యావిధానం (1986) విద్యాప్రణాళికలో భాగంగా మనదేశంలోని అన్ని పాఠశాలల్లో పది మౌలికాంశాలను విధిగా పొందుపరచాలని నిర్దేశించింది. వీటిల్లో స్త్రీ, పురుష సమానత్వం ఒక అంశంగా ఉంది. ఈ అంశాన్ని గ్రహించి అప్పట్లో అమలులో ఉన్న పాఠ్యపుస్తకాలు - తెలుగు ప్రథమ, ద్వితీయ భాషా వాచకాలు, హిందీ ఇంగ్లీషు పాఠ్యపుస్తకాలు, ఇతర విషయాలకు సంబంధించిన వాటిని కూడ సమీక్షించారు. వివక్షకు అవకాశం ఇచ్చే అంశాలు, ఋణాత్మక విషయాలను తొలగించారు కూడ. సాంకేతిక ఎంతగా విస్తరించి, ఆధునిక బోధనాభ్యసన ఉపకరణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, పాఠ్యపుస్తకాలే ప్రధాన అభ్యసన వనరులుగా ఉంటున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాప్రణాళిక నిర్ణేతలు, పాఠ్యపుస్తక రచయితలు, సంపాదకులు తగినన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పాఠ్యపుస్తకాల్లో లింగవివక్షకు తావులేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యార్థి మనోవికాసానికి పాఠశాల పునాది వేస్తుంది. అక్కడి బోధన, అభ్యసన విధానాలు, ఈ విధానాల్ని అమలుపరిచేందుకు పాఠశాలలు విద్యార్థులకు అందుబాటులో ఉంచే వనరులు, అనుసరించే విధానాలు... ఇవన్నీ విద్యార్థుల మెదళ్ళలో అనేకభావనలు ఏర్పరుస్తాయి. వీటిల్లో ప్రధానమైంది 'లింగ వివక్ష'. అనాదిగా మన సమాజంలో లింగవివక్ష అనేది మందు కనిపెట్టటానికి అవకాశంలేని వ్యాధిగా వ్యాపించి ఉంది. తరతరాలుగా సమాజంలో అంటువ్యాధిగా విస్తరించిన ఈ సామాజిక సమస్యకు పాఠ్యపుస్తకాలు అండగా నిలుస్తున్నాయనటంలో ఎటువంటి సందేహానికి అవకాశం లేదు. ప్రాథమికస్థాయి మొదలు ప్రతి దశలోనూ ఇదే తీరు కొనసాగుతోంది. భాషకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు మొదలు విజ్ఞానశాస్త్రాల పాఠ్యపుస్తకాల వరకూ ఈ విధానమే కనిపిస్తోంది. బాహ్యంగా ఇదొక సమస్యగా కనిపించకపోయినప్పటికీ విద్యార్థుల మస్తిష్కాల్లో తీవ్రమైన భావజాలాన్ని మన పాఠ్యపుస్తకాలు ఏర్పరుస్తున్నాయి.

**ఆంధ్రప్రదేశ్ పాఠ్యపుస్తకాల పరిస్థితి :**

అప్పటి ఎనిమిదవ తరగతి ప్రథమభాష పుస్తకంలో ఆచార్య పేర్వారం జగన్నాథం గారు రచించిన 'ఏడు ఘడియల రాజు' సర్వాయి పాపన్నకు సంబంధించిన పాఠంలో సర్వాయి పాపన్న తల్లిని ఏడు బిందెల ధనం ఎక్కడ దాచావని వెంట్రుకలు పట్టి ఈడ్చాడట. ఆ విషయంలో అసెంబ్లీ సాక్షిగా పెద్ద గొడవే జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ఆ పాఠాన్ని తొలగించాలని ఆదేశించారు. తదుపరి వారిస్థానంలో ఆచార్య నాయిని కృష్ణకుమారి రచించిన కవలపిల్లలు అనే జానపద కథను ప్రవేశపెట్టారు. అదేవిధంగా 1994లో తయారైన ఒకటవ తరగతి తెలుగువాచకంలోని ఒక చిత్రంలో రైల్వే ప్లాటుపారం మీద ఒక బాలిక పువ్వులమ్ముతున్నట్టు చిత్రం వేశారు. అప్పటి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రాజాజీగారు ఈ విషయంలో అభ్యంతరం లేవదీశారు. పాఠశాలకు వెళ్లవలసిన అమ్మాయి ప్లాటుఫారం మీద ఎందుకుంది? ప్రభుత్వ విధానానికి ఇది వ్యతిరేకం, భంగకరమని చెప్పారు. తిరిగి ఆ చిత్రం స్థానంలో ఒక

ముసలమ్మ చిత్రం వేశారు ప్రముఖ చిత్రకారులు గోలి శివరాంగారు. మళ్ళీ ఫైలు తిరిగి వెనుకకొచ్చింది. వృద్ధులకు మీరిచ్చే గౌరవం అదేనా? అని రాశారు. అప్పుడు ఒక నడి వయసు స్త్రీ చిత్రాన్ని వేశారు. దానికి వారి ఆమోదముద్ర పడింది. పాఠ్యగ్రంథాల్లో స్త్రీ సమానత్వ భావంపై అప్పటి నాయకులు, అధికారులు చూపిన అభిమానం ఎనలేనిది.

1986 తరువాత పాఠ్యపుస్తకాల్లో స్త్రీ హోదా, సమానత్వం, వివక్ష మొదలైన అంశాలపై లోతైన అధ్యయనాలు జరిగాయి. అన్ని పాఠ్యాంశాలు, పురుషాధిక్యతకు సంబంధించినవే. కొన్ని పాఠాల్లో మాత్రమే స్త్రీల ప్రసక్తి ఉంది. దాదాపు 272 అంశాలు స్త్రీలను గౌరవించేవిగా ఉండగా, సుమారు 339 అంశాలు వివక్షతను కలిగించేవిగా ఉన్నాయని అప్పట్లో జరిగిన ఒక పరిధోధన వెల్లడించింది. 'అమ్మమనసు వెన్నకన్న మెత్తన' అనే అంశం స్త్రీని గౌరవించేదిగాను, 'చేసుకున్న పెళ్ళాన్నయితే కోసి కొరత వేయవచ్చు' అనే అంశం వివక్షతతో కూడుకున్నదిగాను పరిగణించారు. మొత్తం పాఠ్యపుస్తకాలను 117 మంది రచయితలు 85 మంది సంపాదకులు అన్ని సబ్జెక్టులు కలిపి తయారుచేయగా అందులో కేవలం పదిమంది స్త్రీ రచయితలు. ఇద్దరు సంపాదకులు ఉండటం కూడా లింగ వివక్షకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

1986 మొదలు ఇప్పటి వరకూ పాఠ్యపుస్తకాల్లో ఇదే తీరు కొనసాగుతోంది. నేడు అమల్లో ఉన్న పాఠ్యపుస్తకాల్లో కూడా లింగవివక్షత అనేక రకాలుగా చోటుచేసుకుంటోంది. పాఠ్యాంశాలు పురుషాధిక్యతను కలిగి ఉన్నాయి. పాఠ్యపుస్తక నిర్మాణంలో పాల్గొంటున్న కూడా స్త్రీల సంఖ్య కూడా చాలా తక్కువ. సంపాదకత్వం వహిస్తున్న మహిళల సంఖ్య మృగ్యం.

పాఠ్యాంశాల ఇతివృత్తం, ప్రదర్శన, భాష మొదలైన వాటిలో చిత్రాల్లో వివక్షత నేటికీ కొనసాగుతోంది. ఈ సమస్యని అధిగమించి, స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించే దిశగా పాఠ్యపుస్తకాలను సమీక్షించి సవరణలు చేసి పాఠశాలలకు అందించాల్సిన తక్షణ అవసరాన్ని వివిధ స్థాయుల్లోని విధాన నిర్ణేతలు గుర్తిస్తే బాగుంటుంది.

## వివిధ దేశాల్లో పాఠ్యపుస్తకాలు :

ప్రపంచమంతటా బడిపుస్తకాల్లో మహిళలను పూర్తిగా విస్మరించడమో లేదంటే మూసపాత్రల్లో చిత్రీకరించడమో జరుగుతోంది. ఇది స్కూళ్లలో లింగ అసమానత్వాన్ని పెంచుతోందని ఒక పరిశోధనలో వెల్లడైంది. హైతీలోని ఒక ప్రాథమిక పాఠశాల పాఠ్యపుస్తకంలో అమ్మలు 'పిల్లల సంరక్షణ చూసుకుంటూ అన్నం వండుతారు' అని, తండ్రులేమో 'ఆఫీసుల్లో పనిచేస్తార'ని ఉంది. ఇక పాకిస్తాన్‌లోని ఒక పాఠ్యపుస్తకంలో శక్తిమంతమైన, అధికారం గల రాజకీయవేత్తలందరినీ పురుషులుగానే చిత్రీకరించారు. టర్కీలోని ఓ పాఠ్యపుస్తకంలో ఒక బాలుడు తాను డాక్టర్ కావాలని కలగంటున్నట్లు చిత్రీకరించిన బొమ్మ, ఆ పక్కనే బాలిక తాను భవిష్యత్తులో తెల్లగౌను ధరించిన పెళ్ళికూతురుగా కలగంటున్నట్లు చిత్రీకరించారు. బాలిబాలికల ఆలోచనారీతులను చిన్నవయసు నుంచే వివక్షాపూరితంగా ప్రభావితంచేసే ఇలాంటి పాఠ్యాంశాల జాబితాకు అంతులేదు. ఈ జాడ్యానికి భౌగోళిక సరిహద్దులూ లేవు.

ప్రాథమిక పాఠశాలల పాఠ్యపుస్తకాల్లో లింగవివక్ష చాలా తీవ్రంగా ఉంది. దిగ్భ్రాంతికరమైన అంశమేమిం టంటే దాదాపు ప్రతి దేశంలోనూ ఈ వివక్ష ఏదో ఒక రకంగా కొనసాగుతోంది. అగ్రరాజ్యం అనుకునే అమెరికా సహా ఏ ఒక్క దేశమూ ఇందుకు మినహాయింపు కాదు. ఇది 'కళ్ల ముందే ఉన్నా కనిపించని' సమస్య.

'స్త్రీపురుషులకు వారి వారి జెండర్‌ను బట్టి సమాజంలో చిరకాలంగా ఖాయం చేసిన పాత్రలు ఉన్నాయనే ముసుగులో వారి వారి మూస నమూనాలను చిన్నారుల మెదళ్ళలోకి ఎక్కిస్తున్నారు' అని ప్రొఫెసర్ రే లెస్సర్ బ్లూమ్‌బర్గ్ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియాకు చెందిన సోషియాలజిస్ట్ బ్లూమ్‌బర్గ్ ప్రపంచ వ్యాప్తంగా స్కూళ్ళలో పాఠాలు చెప్పేందుకు ఉపయోగించే పాఠ్యపుస్తకాలను దశాబ్దకాలంగా అధ్యయనం చేసి, తన పరిశీలనలను వెల్లడించారు. పాఠ్యపుస్తకాల్లో మహిళలను ప్రణాళికాబద్ధంగా విస్మరించడమో, లేదంటే వారిని

పరాధీన పాత్రల్లో చిత్రీకరించడమో చేస్తున్నారని ఆమె తెలిపారు. 'విద్యాంశాల్లో లింగ వివక్ష గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఎందుకంటే.. లక్షలాది మంది పిల్లలు స్కూలు విద్యకు దూరంగా ఉన్న పరిస్థితుల్లో అది పతాక శీర్షికలకు ఎక్కే విషయం కాదని భావిస్తున్నారు' అని ఆమె వివరించారు.'ఈ పుస్తకాలు లింగ అసమాన త్వాన్ని ప్రచారం చేస్తాయి. భావి ప్రపంచపు బాలికలకు గత కాలపు పుస్తకాలతో పాఠాలు చెప్పకూడదు' అని ప్రొఫెసర్ బ్లూమ్‌బర్గ్ అంటారు.

## పాఠ్యపుస్తకాల్లో వివక్ష - ఫలితాలు :

పాఠ్యపుస్తకాల్లో లింగ వివక్ష ధోరణులు ఎంత లోతుగా ఉన్నాయంటే... అవి బాలికల విద్యను నిర్లక్ష్యం చేయడంతో పాటు, వారి వృత్తి పరమైన, జీవన పరమైన ఆకాంక్షలను చాలా వరకు కుదించి వేస్తున్నాయని, లింగ సమానత్వాన్ని సాధించడానికి అవి 'పరోక్షమైన అడ్డంకి'గా నిలుస్తున్నాయని యునెస్కో చెబుతోంది. పాఠాల్లోని వాక్యాలు, పేర్లు పెట్టిన పాత్రలు, శీర్షికల్లో ప్రస్తావనలు, సూచికల్లో ప్రస్తావనలు, ఇతరత్రా అంశాల్లో లెక్కించి చూస్తే "పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాల్లో మహిళల ప్రాతి నిధ్యం చాలా చాలా తక్కువగా ఉంది" అని యూనివర్సిటీ ఆఫ్ ఆల్బనీకి చెందిన ఆరన్ బెనావట్ పేర్కొన్నారు. యునెస్కో 2016 గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (జీఈఎం) నివేదికకు ఆమె డైరెక్టర్‌గా పనిచేశారు. ఇది ముప్పేట సమస్యని నిపుణులు చెప్తున్నారు. ఇందులో చాలా ముఖ్యమైన కోణం... మానవాళి మొత్తానికి ప్రతి నిధిగా పురుషులను మాత్రమే ఉపయోగించే లింగ వివక్షతో కూడిన భాషను ఉపయోగించడం.

రెండో అంశం.. విస్మరణ. పాఠ్యాంశాల్లో తరచుగా మహిళలకు చోటు ఉండదు. చరిత్రలోనూ రోజువారీ జీవితంలోనూ మహిళల పాత్రలు కూడా పురుష పాత్రలలో కలిసిపోతాయి. "నాకు ప్రత్యేకంగా గుర్తున్న ఒక పాఠ్యపుస్తకం ఉంది. అందులో ఉన్న ఏకైక మహిళ మేరీ క్యూరీ" అని ప్రొఫెసర్ బ్లూమ్‌బర్గ్ తెలిపారు. "మరి ఆమె రేడియం కనుగొన్నట్లు చూపారా అంటే.. అదీ లేదు. ఆమె ఎంతో గొప్పగా కనిపిస్తున్న తన భర్త వెనుక బిడియంగా నిల్చుని ఉన్నట్లు.. అతడు ఎవరితోనో మాట్లాడుతుంటే ఆమె వెనుక నుంచి చూస్తున్నట్లు చిత్రించారు" అని బ్లూమ్‌బర్గ్ వివరించారు.

మూడో విషయం.. ఇంటా బయటా పురుషులు, స్త్రీలు చేసే పనుల గురించి సంప్రదాయ మూస పాత్రలు.. స్త్రీ, పురుషుల నుంచి ఆశిస్తున్నట్లుగా వ్యక్తీకరించే సామాజిక ఆకాంక్షలు, లింగాన్ని బట్టి ఆపాదించే లక్షణాలు. ఒక ఇటాలియన్ పాఠ్యపుస్తకం ఇందుకు చక్కటి ఉదాహరణ. ఆ పుస్తకంలోని ఒక పాఠ్యాంశం విభిన్న వృత్తులకు సంబంధించిన పదాలను బోధిస్తుంది. అందులో పోస్ట్‌మాన్ నుంచి దంత వైద్యుడి వరకూ పది విభిన్న వృత్తుల్లో పురుషులను చూపారు. కానీ మహిళలను ఒక్క వ ృత్తిలో కూడా చూపలేదు. మరోవైపు.. వంట చేయడం నుంచి బట్టలు ఉతకడం, పిల్లలు, వ ృద్ధుల సంరక్షణ చూసుకోవడం వంటి ఇంటి పనుల్లో ఎక్కువగా మహిళలనే చిత్రీకరిస్తున్నారు.

'లింగపరమైన మూస పాత్రలను నిర్వర్తించే నిష్క్రియా పరులుగా, విధేయులుగా మహిళలను చూపుతుండటం ఆందోళనకరమైన విషయం' అని యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ ఆంగ్లియా లెక్చరర్ కేథరీన్ జేర్ పేర్కొన్నారు. విద్యారంగ నిపుణురాలైన ఆమె కూడా జీఈఎం నివేదికలో పాలు పంచుకున్నారు. "విద్యలో ఈ లింగ వివక్ష వల్ల పరిస్థితి ఏటేటా దిగజారుతోంది. ఎందుకంటే ప్రపంచం పురోగమి స్తోంది. మహిళలు కొత్త వృత్తుల్లోకి ప్రవేశిస్తున్నారు. ఇంట్లో నిర్వహించే పాత్రలు మారుతున్నాయి. కానీ అదే వేగంతో పుస్తకాలు మారడం లేదు. దీనివల్ల వాస్తవానికి - పాఠాలకు మధ్య తేడా ఇంకా పెరుగుతోంది" అని కేథరీన్ చెబు తున్నారు. 'ఒకవేళ మన దగ్గరికి గ్రహాంతరవాసులు వచ్చి ఈ పాఠ్యపుస్తకాలు చదివితే.. ఇక్కడ మహిళలు నిజానికి వ ృత్తిపరంగా కానీ వ్యక్తిగతంగా కానీ ఏం చేస్తారు అనేది వారికి ఏమాత్రం అర్థం కాదు' అని ఆమె వ్యాఖ్యానిం చారు.

ఈ సమస్య దాదాపుగా విశ్వవ్యాప్తంగా ఉందని పరిశోధన చెప్తోంది. తీవ్రతలో కొన్ని తేడాలు ఉన్నప్పటికీ

అల్పాదాయ, అధికాదాయ దేశాలన్నిటి పాఠ్యపుస్తకాల్లోనూ లింగవివక్ష ఒకే తరహాలో ఉంది. ఆ సమాచారం విడివిడిగా ఉంది. కానీ గత దశాబ్దకాలంలో ప్రచురితమైన అధ్యయనాలు దీనికి సాక్ష్యంగా ఉన్నాయి. ఉదాహరణకు భారతదేశంలో మూడో తరగతిలో బోధించే చరిత్ర పుస్తకంలో ప్రధానమైన స్త్రీ పాత్ర ఒక్కటీ లేదు. కెన్యాలో బోధనకు ఉపయోగించే ఒక ఇంగ్లిష్ పుస్తకంలో పురుషులకు 'ఆసక్తికరమైన ఆలోచనలు' ఉన్నట్లుగాను, మహిళలు, బాలికలు అన్నం వండుతూ, బొమ్మ జుట్టుదువ్వుతూ ఉన్నట్లుగానూ చిత్రించారు. ఇరాన్‌లో విద్యాశాఖ రూపొందించిన పుస్తకాల్లో 80 శాతం పాత్రలు పురుషులవే. భారతదేశం రూపొందించిన పుస్తకాల్లో మహిళలను చూపే చిత్రాలు కేవలం ఆరుశాతం మాత్రమే ఉన్నాయి. జార్జియాలో ఇది ఏడుశాతంగా ఉంది.

2007లో నిర్వహించిన ఒక అధ్యయనంలో కామెరూన్, ఐవరీ కోస్ట్, టోగో, ట్యునీసియాల్లోని గణిత పాఠ్య పుస్తకాల్లో పురుష పాత్రలతో పోల్చిచూసినపుడు మహిళల పాత్రలు 30 శాతం కన్నా తక్కువగా ఉన్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్), చైనాలలో సైన్స్ పుస్తకాలను పరిశీలించినపుడు 87 శాతం పాత్రలు పురుషులవేనని వెల్లడైంది. ఆస్ట్రేలియాలో 2009లో నిర్వహించిన ఒక అధ్యయనంలో పాఠ్యపుస్తకాల్లోని పాత్రల్లో 57 శాతం మంది పురుషులే ఉన్నారు. నిజానికి ఆ దేశంలో పురుషుల కన్నా మహిళల సంఖ్యే ఎక్కువ.

## ప్రభావవంతమైన పాఠాలు :

స్కూలు పిల్లలకు సమాజంలో మామూలు విషయాలు ఏమిటనే అవగాహనను ఈ పుస్తకాలు కల్పిస్తాయని, ఇది పిల్లల ఆలోచనలను వివక్షాపూరితంగా రూపొందిస్తాయని నిపుణులు చెప్తున్నారు. దేశంలోని విద్యారంగంలో పాఠ్యపుస్తకాలు శక్తిమంతమైన పనిముట్లు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయి వరకు పాఠ్యపుస్తకాల్లో 32,000 పేజీలు చదువుతారని ఇటీవల జరిగిన పరిశోధనల్లో వెల్లడైంది. క్లాస్ వర్క్‌లో దాదాపు 75 శాతం, హోంవర్క్‌లో 90 శాతం విద్యార్థులే చేస్తారు. ఇంటర్నెట్, ఇతర డిజిటల్ వనరులు అందుబాటులోకి రావడం వల్ల అభ్యాస పరికరాల శ్రేణి విస్తృతమవుతున్నప్పటికీ ఇంకా పాఠ్యపుస్తకాలే ప్రధాన వనరులుగా ఉన్నాయని కూడా పరిశోధనల్లో వెల్లడైంది.

బాలురు, బాలికలు ఏమేం చేయాలి అనే దాని మీద పాఠ్యపుస్తకాలు చాలా సంకుచిత భావనలను చూపుతున్నపుడు.. స్కూలు పిల్లలు సమాజం అలాగే ఉంటుందని, ఉండాలని భావిస్తారు. అయితే వివక్షను తగ్గించడంలో గత దశాబ్దకాలంలో కొంత పురోగతి కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పాఠ్యపుస్తకాల్లో లింగ సమానత్వానికి సంబంధించిన అంశాలు పెరిగాయని యునెస్కో జీఈఎం నివేదిక చెప్తోంది. ముఖ్యంగా యూరప్, ఉత్తర అమెరికా, సబ్-సహారా ఆఫ్రికా దేశాల్లోని పాఠ్యపుస్తకాల్లో మహిళల హక్కులు, లింగ వివక్షకు సంబంధించిన విషయాల ప్రస్తావన పెరిగిందని ఆ నివేదిక పేర్కొంది. కొన్ని దేశాలు ఈ మార్పునకు సారథ్యం వహిస్తున్నాయి.

లింగ సమానత్వం విషయంలో అగ్రస్థానంలో ఉన్న స్వీడన్ ఈ విషయంలో కూడా అగ్రభాగాన ఉంది. ఆ దేశంలోని కొన్ని పాఠ్యపుస్తకాల్లో లింగ భేదం లేని పాత్రలు, సర్వనామాలను చేర్చడంతో పాటు రోజువారీ జీవితాలను మరింత సమానత్వంతో చిత్రీకరించారు.

## ముగింపు :

ఎంతగా పరిశోధనలు జరుగుతున్నప్పటికీ, ఎన్ని విస్మయకరమైన విషయాలు వెల్లడవుతున్నప్పటికీ జాతీయ స్థాయిలో పాఠ్యపుస్తకాలను సమగ్రంగా సమీక్షించడం సుదీర్ఘమైన, వ్యయప్రయాసలతో కూడిన ప్రక్రియ. ఇలాంటి పనికి ప్రధానంగా నిధుల కొరత, అధికార యంత్రాంగం అలసత్వం అవరోధాలుగా ఉంటాయి. 'కొన్ని మార్పులు పై పై మెరుగులే. ఇక ప్రభుత్వాలు మారితే ఈ విషయంలో నిబద్ధత కూడా కొనసాగదు' అని విద్యావేత్తలు అంతర్గత చర్చల్లో అనుకుంటారు.

ఇటువంటి పరిస్థితుల్లో పాఠ్యపుస్తకాల్లో కనిపించే వివక్షను తిప్పికొట్టడానికి నిపుణులు కొన్ని ప్రత్యామ్నాయ

పద్ధతులను సూచిస్తున్నారు. విద్యార్థులు బృందచర్చల్లో భాగంగా ఇటువంటి పుస్తకాల్లో గల లింగవివక్షను గుర్తించి, మూసధోరణులను ప్రశ్నించటం వంటి కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా మనదేశంలో ఇటీవల కొన్ని ప్రయత్నాలు జరిగాయి. 'ఈ లింగ వివక్షను గుర్తించేలా విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు. విద్యార్థులు కూడా ఈ 'డిటెక్టివ్ పని'ని ఆస్వాదిస్తార'ని పలువురు విద్యావేత్తలు చెబుతున్నారు. కానీ అందుకోసం ముందుగా టీచర్లకు శిక్షణనివ్వాల్సి ఉంటుంది. చివరికి ఉత్తమ విద్య కావాలనుకుంటే ఈ పుస్తకాలను తిరగరాయాల్సి ఉంటుందని కూడా వారు సూచిస్తున్నారు.

**సంప్రదించిన గ్రంథాలు :**

1. 1 నుంచి 10వ తరగతి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు
2. పాఠ్యపుస్తకాలపై యునెస్కో నివేదిక
3. తెలుగు బోధన పద్ధతులు, తెలుగు అకాడమి, హైదరాబాదు
4. బోధన అభ్యసన ప్రక్రియల్లో లింగ వివక్షత యొక్క ఔచిత్యం, ఉపాధ్యాయుల శిక్షణ కరదీపిక, ఎస్.సి.ఇ.ఆర్.టి, తెలంగాణ ప్రభుత్వం.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# కందుకూరి వీరేశలింగంగారి కాలంనాటి ఆంధ్ర సమాజం

– డా॥. శీలం శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, చరిత్ర విభాగం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, తమిళనాడు.

ఆంధ్రనాట అనేక వర్గాలలో సామాజిక మార్పు, అభివృద్ధి చాలా వేగంగా ఏర్పడుతూ ఉంది. అయినప్పటికీ, ఈ వేగవంతమైన మార్పులు నాటి, నేటి సమాజంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రస్తుత పత్రంలో చర్చించదలచిన ముఖ్యవిషయం ఆంధ్రనాట ఏర్పడ్డ సాంఘిక వైరుధ్యాలు, సాంఘిక మార్పులు. వార్తాపత్రికలు నాటి కాలంలోని సాంఘిక వైరుధ్యాలపైన దృష్టి పెట్టాయి. ప్రస్తుతం నా పరిశోధన వ్యాసం లక్ష్యం సామాజిక సంస్కర్తలో లేక సాంఘిక సాంఘిక సంస్కర్తలో కాదు, సమకాలీన సాంఘిక సంస్కర్తలు. తెలుగునాట ఏర్పడ్డ సాంఘిక సంస్కరణలు మరియు సామాజిక వైరుధ్యాలను నా ఈ పరిశోధన పత్రంలో ప్రస్తావించదలిచాను.

### ముఖ్యాంశాలు :

సంఘసంస్కరణ, సాంప్రదాయవాదం, సామాజిక సంఘర్షణ, సాంస్కృతిక సంఘర్షణ, వర్గాలు, కులాలు, పత్రికలు.

### పరిచయం :

సాంఘిక, సంప్రదాయాల సంస్కరణల ద్వారా 1847 - 1958 సంవత్సరాల మధ్యకాలంలో ఏర్పడ్డ ఆధునిక ధోరణులను అంచనా వేయడానికి రెండు వైరుధ్యమైన ఆధారాలు మనకు లభిస్తున్నాయి. అవి ఆనాటి వార్తా పత్రికలలో ఇంగ్లీషు, తెలుగు భాషలలో ప్రచురితమైన స్వీయచరిత్రలు, జీవితచరిత్రలు. 1907 వరకు బెంగాల్ విభజనను నిరసిస్తూ బిపిన్ చంద్రపాల్ దక్షిణ భారత దేశాన్ని పర్యటించినప్పుడు, ఆంధ్రులు విస్తృతంగా ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతీయ సరిహద్దులను అధిగమించిన సంఘటనలలో ఇది గమనించదగినది. ఈ గుర్తింపుతో ఆంధ్రుల చరిత్ర, సంస్కృతీ మద్రాసు చరిత్ర, సంస్కృతులకు భిన్నమైందని పూర్తిగా అర్థం కాలేదు. మద్రాసులోని కొన్ని ఆంగ్ల వార్తాపత్రికలు రెండు రాష్ట్రాల మధ్యనుండే సాంస్కృతిక, సాంఘిక వైరుధ్యాలలోని కొన్ని ముఖ్యాంశాలను, ఆంధ్ర ప్రాంతంలోని కాలక్రమానుసారమైన కార్యక్రమాలను పేర్కొన్నాయి. ఈ కాలక్రమానుసారమైన కార్యక్రమాల గుర్తింపు కేవలం ఒక ఉత్తమమైన అంచనా మాత్రమే.

ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక మరియు సాంస్కృతిక వైరుధ్యాలపై పూర్తి అవగాహన కోసం, లభ్యమయ్యే వనరులు కీలకమైనవి. వాటిలో కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర, అతని రచనలు చాలా విలువైనవి. వార్తా పత్రికలు నివేదికలు ఆ సమయంలో చాలా క్లుప్తంగా ప్రచురించబడ్డాయి. ఇవి వాస్తవానికి నాటి వైరుధ్యాలను వివరించడానికి సరిపోయేవి కావు. డి.వి. ప్రకాశరావు, రాస్యం వెంకట శివుడు, వల్లూరి సూర్యనారాయణరావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, వేదం వేంకటరాయశాస్త్రి, కె. వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం, అయ్యదేవర కాళేశ్వరరావు మొదలైన వారి రచనలు, స్వీయచరిత్రలు, జీవితచరిత్రలు నాటి సాంఘిక, సాంస్కృతిక వైరుధ్యాంశాలను బహిర్గతం చేశాయి.

### 19-20 శతాబ్దాలలో భారతీయ సమాజం :

భారతదేశ సమాజం మొత్తం వివిధ సంస్కృతులుగా వికేంద్రీకరించబడింది. వలసరాజ్యాల కాలంలో మానవతావాదం, హేతువాదం తాలూకు ఆలోచనలు, సామాజిక సమానత్వ సిద్ధాంతం మొదలైనవి భారతీయ సమాజంలోకి ప్రవేశించాయి. ఇవి భారతీయ సమాజంలోకి రావడానికి ఆంగ్లవిద్య మరింత దోహదం చేసింది. భారతీయ మేధావులు ఈ విషయాల పట్ల రెండు విభిన్న మార్గాల్లో స్పందించారు. ఒకటి సామాజిక సంస్కరణ, రెండవది కౌంటర్ రిఫార్మేషన్.

భారతీయ మేధావులలోని ఒక భాగం పాశ్చాత్య ఆధునికత ప్రభావంతో భారతీయ సమాజం మారుతున్న

వైనాన్ని గమనించారు. వారు అభ్యసించిన జ్ఞానంతో భారతీయ, పాశ్చాత్యుల యొక్క సామాజిక, సాంస్కృతులను తులనాత్మకంగా గమనించారు. ఈ తులనాత్మక పరిశీలన ద్వారా తమ సంస్కృతిలోని అమర్థతను కనుగొన్నారు. తత్ఫలితంగా బ్రహ్మసమాజం, ప్రార్థనా మందిరం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణ మిషన్ వంటి ఉద్యమ సంస్థలు రూపొంది, పాశ్చాత్య ఆధునికతకు అనుగుణంగా భారతీయ సమాజ సంస్కరణ కోసం ఈ సంస్థలు పనిచేశాయి. ఈ సంస్థలే కాకుండా ఆంగ్ల విద్యా వ్యాప్తి, క్రిష్టియన్ మిషనరీలు భారత సమాజానికి చెందిన అన్ని విభాగల మధ్య పూర్వ జ్ఞానోదయ హేతువాదం తాలూకు ఆలోచనలను ప్రచారం చేసేందుకు దోహద పడింది. మరోవైపు దివ్యజ్ఞాన సమాజం, ఆర్య సమాజం వంటి కౌంటర్ సంస్కర్తలు పాశ్చాత్య ఆధునికత తాలూకు సారాంశాన్ని సంపాదించి, పాశ్చాత్య సంస్కర్తల ప్రభావం నుండి భారతీయ సంప్రదాయాలను కాపాడే మిషతో భారతీయ సమాజ సంస్కృతిని పునర్నిర్వచించడానికి ప్రయత్నించారు. ఈ రెండువర్గాల సంఘటనలతో సమాజంలో వివిధ సమయాల్లో, వివిధ ప్రదేశాల్లో, వివిధ సామాజిక సమూహాలలో కొన్ని మార్పులు జరిగాయి.

భారతీయ వర్గాలన్నీ తాము నేర్చుకున్న విద్యల ద్వారా తమ వాదాలను సులభతరం, ఆధునికీకరణ చేసుకోవడానికి ప్రయత్నించాయి. ప్రారంభ దశలలో పత్రికలు ఉన్నత వర్గానికి మాత్రమే చేరుకున్నాయి. సంస్కర్తలు మరియు క్రిష్టియన్ మిషనరీల చొరవ వలన పత్రికలు ఇతర వర్గాల వారికి కూడా అందుబాటులోకి వచ్చాయి. సాంఘిక సమూహాలు పాశ్చాత్య భావజాలంతో అధికారం పొందాయి. ఆ సమూహాలు సామాజిక మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో తమ పాత్రను సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నించాయి. ఒక వైపు పాశ్చాత్య విద్య, దాని తాలూకు భావజాలాలు ఒక వైపు సంస్కరణలకు దారి తీశాయి. దేశీయ వ్యవస్థకు మద్దతు ఇచ్చే సాంస్కృతిక ధోరణుల అభివృద్ధికి దోహదపడ్డాయి. "ప్రజలు సంస్కృతీ సోపానక్రమంలో వారి స్థానాన్ని గుర్తించి సాంస్కృతిక జ్ఞానం ఉపయోగించబడుతుంది. ఇవి సాంస్కృతిక సంకేతాల ప్రజలు ఉపయోగించే మార్గాలు అన్వేషిస్తున్నాయి. వారు సామాజిక నిచ్చెనపై 'పైన' ఉన్నవాటిని గుర్తించి, 'దిగువ' నుండి వారి వ్యత్యాసాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తారు. ఇది ప్రత్యేకించి సృజనాత్మక పోరాటం కాదు. కానీ, మధ్యతరగతి వాగ్దానాలను బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. ఆంధ్రదేశంలో మనము మూడు ధోరణులను చూడవచ్చు. హిందూ సమాజ సాంప్రదాయిక విభాగానికి దూరమయిన సంస్కర్తలను పాశ్చాత్యీకరించడం ఒకటి. రెండవది పాశ్చాత్య సామాజిక సంస్కరణకు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్ష సంస్కర్తలు. సంస్కర్తలు మరియు ప్రతి-సంస్కర్తల మధ్య ఉన్న వైరుధ్యాల నుండి మూడవ ధోరణి ఏర్పడింది. వీరు సంస్కరణకు సానుభూతిపరులే కాని, సంస్కరణల కార్యకలాపాలను నేరుగా మద్దతివ్వడానికి వారి సాంస్కృతిక ఆంక్షల నుండి బయటకు రాలేరు. అయితే, వారు పరోక్షంగా సంస్కరణ కార్యక్రమాలకు మద్దతు ఇచ్చారు.

ఇలాంటి పరిస్థితుల్లో కందుకూరి వీరేశలింగం గారు 19, 20 శతాబ్దాలలో సమాజాన్ని సంస్కరించే బాధ్యతను భరించడానికి ఒక సంస్థాగత ఏర్పాటు ద్వారా ముందుకు వచ్చాడు. పశ్చిమాన ఆధునికతను సాధించిన ప్రక్రియను ఉపయోగించి, ఆంధ్ర సమాజాన్ని ఆధునీకరణ చేయాలని భావించారు. మరో మాటలో చెప్పాలంటే, ప్రజలలో శాస్త్రీయ విద్య మరియు హేతుబద్ధమైన ఆలోచనలు విస్తరించడం అనేది మూఢనమ్మకాలను వదిలించుకోవడానికి మరియు ఆధునీకరణ వైపు సమాజాన్ని నడిపించే ఏకైక పరిష్కారంగా చెప్పవచ్చు. ఆంధ్ర ప్రజల మధ్య ఉద్యమాన్ని విస్తరించేందుకు ఆయన తెలుగు భాషలో ముద్రణను సమర్థవంతంగా ఉపయోగించారు. సంస్కరణల కార్యక్రమంలో భాగంగా, తెలుగు భాషాసాహిత్యాల ఆధారంగా ఏర్పడిన ప్రాంతీయ సాంస్కృతిక గుర్తింపు తరువాత ఇటువంటి విధంగా రూపాంతరం చెందింది. వీరేశలింగంగారి సాంఘిక సంస్కరణల ప్రణాళిక పాశ్చాత్య విద్యావంతులైన యువతను ఆకర్షించి, వారి మద్దతును

ఆకర్షించింది. ఈ విద్యావంతులైన యువకులు వివిధ కులాలకు చెందినవారు, వీరు సాంఘిక సంస్కరణలను అమలుపరచడానికి మరియు మూఢనమ్మకాలను నిర్మూలించడానికి సంబంధిత కుల సంఘాలను నిర్వహించారు. ఇది సాంప్రదాయిక సంస్కృతికి అనుబంధం కలిగి ఉన్న ఏ వ్యవస్థలోనూ సహజమైన దృగ్విషయం కాదు. మానసికంగా ఇంజెక్ట్ చేయబడిన, జన్యుపరంగా శతాబ్దాలుగా వేళ్ళూనుకున్న సమాజంలో ఈ మార్పు అకస్మాత్తుగా పొందడం సులభం కాదు.

ఆ విధంగా వీరేశలింగంగారి పాశ్చాత్య సంస్కరణల ప్రణాళిక ఆంధ్రలో విరుద్ధంగా లేదు. సాహిత్యస్థాయిలో, వీరేశలింగంగారి సాంఘిక సంస్కరణల కార్యకలాపాలు కాకినాడ నుండి బ్రహ్మయ్య శాస్త్రి వంటి పండితుల నుండి సవాలు చేయబడ్డాయి. 1828లో సామాజిక సంస్కరణోద్యమాలను విమర్శించడానికి ఆర్యమతబోధిని ప్రారంభించారు. తణుకు నుండి సురసనందన పత్రికలో, 1905లో సువర్ణలేఖలో వ్యాసాలు ప్రారంభించారు. సాంఘిక సంస్కరణల చర్యలను విమర్శించారు. కందుకూరి వారి సత్యవాదిని పత్రికను లక్ష్యంగా చేసుకుని ఈ విమర్శలో వెలువడ్డాయి. ఉన్నత వర్గానికి చెందిన కొందరు వీరేశలింగంగారి సాంఘిక సంస్కరణ ప్రాజెక్టులకు మద్దతునిచ్చారు. మరికొందరు వ్యతిరేకించారు. ఒక్క మాటలో చెప్పాలంటే వీరేశలింగంగారి సంస్కరణలను వ్యతిరేకిస్తున్న వారిలో సాంప్రదాయ బ్రాహ్మణులు మాత్రమే కాదు, విద్యావంతులైన కొందరు ఉన్నత వర్గాల వారు కూడా. వారిలో కొందరు వలసరాజ్య ప్రభుత్వానికి ఉద్యోగం కల్పించారు. సంస్కరణ వ్యతిరేక కార్యకలాపాలకు నాయకత్వం కూడా చేశారు. ఈ రకమైన కౌంటర్ సంస్కరణలో పాశ్చాత్య విద్యను అభ్యసించిన ఉన్నత వర్గాల వారు పాల్గొనడం గణనీయమైన మార్పును తీసుకొచ్చింది. ఆంధ్రాలో మొదటి వితంతు వివాహ సంర్భంలో సంస్కర్తలు, ప్రతిసంస్కర్తల మధ్య జరిగే పోరు నుండి ఇది గమనించవచ్చు. మొదటి వితంతు పునర్వివాహం వరకు సంప్రదాయ బ్రాహ్మణ పూజారులు, పండితులు వ్యతిరేకులుగా ఉండేవారు. సంప్రదాయాల ఆంక్షలను అమలు చేయడం వంటి కార్యక్రమాలతో సంస్కర్తలు స్పందించారు. 'దేశీయ రచనల నుండి ఉపసంహరించుకొంది, వారితో లాంటి సంబంధం లేద'ని చాటారు. అయితే మొదటి వితంతు పునర్వివాహ సమయం నాటికి కొంతమంది విద్యావంతులైన ఉన్నతవర్గాల వారు కౌంటర్ సంస్కరణలో చేరడం ప్రారంభించారు. శంకరాచార్యకు సంస్కరణల కార్యక్రమాలలో పాల్గొన్న వారిని ప్రకటిస్తూ ఫిర్యాదులు చేశారు. శంకరాచార్యుల నిర్ణయాన్ని విద్యావంతులైన భారతీయ ఉన్నతాధికారి అయిన రాజమండ్రి పురపాలక కమీషనర్ ప్రకటించారు. మద్దతుదారులు చాలా మంది తమ కులం మరియు సాంస్కృతిక గుర్తింపును నిలుపుకోవటానికి సంస్కరణలకు వ్యతిరేకంగా తిప్పికొట్టారు. సంస్కరణల కార్యకలాపాలకు నిధులు సమకూర్చిన పైడా రామకృష్ణయ్య, మొదటి వితంతు వివాహం తరువాత రాజమండ్రిలో సంస్కరణ సంఘంకు ప్రత్యక్షంగా నిధులు సమకూర్చలేదని శంకరాచార్యకు వాగ్దానం చేశారు. సంస్కర్తలకు వారి వ్యతిరేకులకు మధ్యనున్న ఈ వివాదానికి మరో ఆసక్తికర అంశం వలసరాజ్య న్యాయస్థానం. శంకరాచార్యుల నిర్ణయాన్ని సంస్కర్తలు స్థానిక కోర్టుకు నివేదించారు. హిందూ మతం, సమాజం, సంస్కృతులను అప్రతిష్ట చేయడాన్ని వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకోవడంలో తన అధికారాన్ని సమర్థించిన శంకరాచార్యకు వ్యతిరేకంగా కోర్టు తీర్పు ఇచ్చింది. వీరేశలింగం గారికి బ్రహ్మతత్త్వశాస్త్రం నేర్పించిన అట్లూరి లక్ష్మీ నరసింహం ఈ తీర్పుతో సంతృప్తి చెందలేదు. అదే కేసును మద్రాసు హైకోర్టులో నివేదించాడు. కోర్టు కూడా దిగువ కోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. శంకరాచార్య కోర్టు ప్రకటించిన విధంగా జరిమానా విధించారు. అతను పరువుకు నష్టం కలిగించే విధంగా చట్టాలు ఉల్లంఘించాయని పోస్టుకార్డులను పంపాడు. మరొక సందర్భంలో కళాశాల విద్యార్థులు ఒక పూజారిపై రాళ్ళతో దాడి చేశారు. ఈ విషయం కోర్టుకు నివేదించబడింది. కోర్టులో శిష్యులకు వ్యతిరేకంగా తీర్పు ఇవ్వబడింది. అందువలన

సంస్కర్తలకు, వారి ప్రత్యర్థులకు మధ్య వైషమ్యాలు, న్యాయస్థానాల మధ్యవర్తిత్వాలను ఇక్కడ ఆసక్తికరంగా మారాయి.

ముందుగా చెప్పినట్లుగా, హిందూ సమాజం నుండి బహిష్కరణకు భయపడటంతో, సంస్కర్తల మద్దతు దారులపై కౌంటర్-రిఫార్మేషన్ ప్రభావం చూపడంతో వారు వారి కులాలలోకి తిరిగి రావలసి వచ్చింది. ఇక్కడ కులం ముఖ్యమైన పాత్రను పోషించింది. వితంతు పునర్వివాహానికి మద్దతు ఇస్తున్నట్లయితే వారు తమ కులాల నుండి బహిష్కరింపబడతారని మద్దతుదారులు భయపడ్డారు. సంస్కరణల కార్యకలాపాలకు ప్రత్యక్ష మద్దతు ఉపసంహరించుకోవడం ద్వారా కులనియమాలు వారిపై విజయం సాధించాయి. సాంఘిక సంస్కరణల నుండి వారు పూర్తిగా ఉపసంహరించుకున్నారని కాదు. వారు తమ కులసంఘాల సభ్యులని, హిందూ సాంఘిక, సాంస్కృతిక నిర్మాణంలో భాగంగా, తమ కులాల ఆర్థిక మరియు సాంస్కృతిక పరిస్థితిని మెరుగుపర్చడమే లక్ష్యంగా పనిచేసినప్పటికీ, వారిలో కొందరు సంస్కరణకు మద్దతునిచ్చారు. కానీ మద్దతు ప్రత్యక్షంగా కాక పరోక్షంగా ఉంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి సంస్కర్తలకి నిధులు ఇవ్వలేదని శంకరాచార్యకు వాగ్దానం చేసిన పిడ రామకృష్ణయ్య మద్రాసు సంస్కర్తల ద్వారా నిధులను మళ్ళించడం ద్వారా పరోక్షంగా తన ఆర్థిక మద్దతును విస్తరించారు. తన మరణానంతరం 10,000 రూపాయల విలువైన ట్రస్ట్ ఫండ్ వితంతు పునర్వ్యవస్థ ఉద్యమానికి విరాళంగా ఇవ్వబడేటట్లు ఏర్పాటు చేశారు.

అదే సమయంలో, సామాజిక వ్యవస్థ మారింది. సంస్థలు బహిరంగంగా ఏర్పడ్డాయి. అవకాశాలు అంది పుచ్చుకోవడానికి, సాంస్కృతిక ఉనికిని రక్షించడానికి, మూఢాచారాలను వదిలించుకోవడానికి ఆ సంస్థలు ప్రయత్నించాయి. బ్రిటీష్ ఇండియా పరిపాలన నుండి తమను తాము రక్షించుకోవడానికి, పత్రికలను ప్రారంభించారు. పత్రికలలో సాహిత్యం, చరిత్ర వంటి వాటిని ప్రచురించారు. సంస్కర్తల ధోరణి ఎప్పటికప్పుడు మారుతూ ఉంది. సమాజంలో వేళ్ళూనుకుంటున్న బ్రిటీషు వ్యవస్థను దెబ్బతీయడానికి ప్రయత్నించారు. దేశీయ సంస్కృతిని, సాంఘిక వ్యవస్థను గుర్తించి రక్షించడానికి ప్రయత్నం చేశారు. పాశ్చాత్య దేశాలకు చెందిన మానవతావాదం, హేతుబద్ధమైన మరియు వైజ్ఞానిక విధానంతో జీవితాన్ని, సాంఘిక సమానత్వ సిద్ధాంతాన్ని రక్షించడానికి ప్రయత్నం చేశారు. కానీ సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల్లో కులం కీలక పాత్ర పోషించింది.

ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో రాజకీయ అభివృద్ధి వలన భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో కుల వ్యతిరేక ఉద్యమాల రూపకల్పనకు దారితీసింది. ఈ ఉద్యమాల ప్రధాన లక్ష్యాలు కులాల అణచివేత నుంచి దళితులను విముక్తి చేయడం, గౌరవం, సమానత్వాలకు వీలు కల్పించడం. అగ్నికుల క్షత్రియ, ఎరుకల, దేవాంగ, తెలగ, రాజపుత్ర, సెట్టిబలిజ వంటి కులాలకు చెందిన సంఘాలు పత్రికలను ప్రారంభించాయి. సామాజిక, సాంస్కృతిక విధానంలో భాగమైన 'నియమాలు, నిబంధనలు మరియు బాధ్యతల'కు సంబంధించి వారు మొదటగా మాట్లాడాలనుకున్నారు.

దక్కన్ వైశ్య, భారతీయ వైశ్య వంటి పత్రికలు జాతీయ కులభావనలను ప్రతిపాదిస్తే, ఆర్యవైశ్య, ఆది ఆంధ్ర వంటి పత్రికలు కులాల సాంస్కృతిక ప్రవృత్తిని ప్రతిపాదించాయి. పంచమ కులాన్ని ఆదిఆంధ్రగా మార్చడాన్ని గమనిస్తే సమకాలీన సమాజానికి చెందిన సాంఘిక, సాంస్కృతిక మూలధోరణి కనిపిస్తుంది. వీరి ఉనికిని కాపాడటానికి సంస్కర్తలు ఇరువైపులా కష్టపడ్డారు. పాశ్చాత్య ఆలోచనా విధానానికి వారి పూర్వ ఆచారాలు, సంప్రదాయాలకు మధ్య జరిగిన సంఘర్షణ ఒకటైతే, తమ ఉపన్యాసాలతోనూ, పత్రికల ద్వారా సనాతన సంప్రదాయాలను ఎదుర్కోవడం మరొక ఎత్తు. సంస్కర్తల కార్యకలాపాలు సమాజానికి ఒక పిడుగుపాటులా తాకడమే కాక, ఒక అపూర్వమైన పద్ధతిలో విస్తృతమైన ప్రచారాన్ని పొందాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దువ్వూరి సుబ్బమ్మ, పెరంబదూరు సుభద్రమ్మ, కంబంపాటి,

మాణిక్యాంబ, రాచర్ల సామ్రాజ్యం, బుట్టల కామక్షమ్మలను తమ రచనల ద్వారా సంస్కర్తలు ప్రోత్సహించారు.

మరోవైపు సాంప్రదాయ వాదులు సంస్కర్తలపై వారి వాదనలను ప్రసంగాల రూపంలోనూ, పత్రికలలో వ్యాసాల రూపంలోనూ ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. సాంప్రదాయికమైన ఆచారాలను, సంస్కృతిని ఉల్లంఘించినందుకు వారు వివాహం చేసుకున్న మహిళలపై, సంస్కర్తలపై మద్రాసు కోర్టులో కేసులను కూడా దాఖలు చేశారు. మొదటి వితంతు వివాహం జరిపించిన నెలలో పెద్ద ఎత్తున హింసలు జరిగాయి. కళాశాల విద్యార్థులు, యువకులైన పూజారుల శిష్యుల మధ్య గొడవలు జరిగాయి. ఇందులో పూజారుల శిష్యులు మాత్రమే దోషులైనప్పటికీ ఇరుపక్షాల వారూ కోర్టుల చుట్టూ తిరగవలసి వచ్చింది.

**ముగింపు :**

19వ శతాబ్దం చివరిలో ఆంధ్ర సమాజంలో సామాజిక మరియు సాంస్కృతిక మార్పులను తీసుకువచ్చిన వారిలో కందుకూరి వీరేశలింగంగారు ముఖ్యమైన వ్యక్తి. ప్రధానంగా ఆయన విద్యార్థుల మద్దతుతో 20వ శతాబ్దం ప్రారంభంలో ఆంధ్ర సమాజంలోని ఆనాటి పోకడలు మర్చాగలిగారు. ఈ క్రమంలో వారు తమ స్వసమాజం నుండి అనేక ప్రతిఘటనలను కూడా ఎదుర్కొన్నారు. ఆయన తన సంస్కరణోద్యమాన్ని ఎలాంటి పరిస్థితుల్లో రాజీపడకుండా, తన మరణం వరకు కొనసాగించాడు. ఆయన భావజాలం ఆంధ్రప్రాంతంలో కొత్త లౌకిక, జాతీయవాద పత్రికలకు జన్మనిచ్చింది. కానీ 1905 నుండి సాధారణ సాంస్కృతిక మరియు స్థానిక ఐడెంటిటీ కారణంగా, జాతీయత మరియు ప్రాంతీయతల కారణంగా సమాజం విస్తృతమైన చర్చోపచర్చలు జరిగాయి. మొదట సాంస్కృతిక మరియు సామాజిక మూలధనం కోసం జరిగినప్పటికీ, తరువాత ఆధిపత్యధోరణి బలంగా పాతుకు పోయింది. జస్టిస్ పార్టీ మరియు బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలు తెలుగు ప్రాంతంపై మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలోకి రావని మనం గమనించవచ్చు. కులం, రాజధాని, రాజకీయ అధికారం ఆంధ్ర సమాజంలోని సామాజిక రాజధానిని నియంత్రించాయి. చివరకు రాజకీయ శక్తి పంపిణీ చేయబడలేదు. అది కొన్ని వర్గాలలో మాత్రమే కేంద్రీకృతమై ఉంది.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. స్వీయచరిత్ర, కందుకూరి వీరేశలింగం పంతులు.
2. E. M. S. Namboodiripad, A History of Indian Freedom Struggle.
3. Islam, M. Rezaul, Social Research Methodology and New Techniques in Analysis, Interpretation, and Writing.
4. Darisi Chenchayya. Nenu Naa Desam, an autobiography of Darisi Chenchayya ( Translated in to English from Telugu language)
5. Journals Published in Telugu prior to 1947.
6. Censes report of India, Madras,1818.
7. Statement of Suryanarayana Rao, V, A student of Veeresalingam in his autobiography, Suryanarayana was quoted in Rama Krishna, V, A Social Reform movement in Andhra.
8. John Leonard and Karen Leonard, Religious controversy in British India.
9. Burton, Burden of History- British Feminists, Indian Women and Imperial culture, 1865.
10. A.Vijaya Kumari, Social Change Among Balijas, M.D. Publications Pvt. Ltd., 1998.
11. G. Sudharshan Reddy, Caste Reform in Andhra 1900-1930, Proceeding Volume of Indian History Congress, 63, Session, Amritsar, 2002.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# నూతన విద్యా ప్రణాళిక - పంచతంత్రం

- డా॥. కొమ్మనబోయిన సుజాత, తెలుగు లెక్చరర్, ప్రభుత్వ మహిళా కళాశాల, (స్వయంప్రతిపత్తి), గుంటూరు.

సకల విధ ధర్మాలను, నీతులను బోధించిన హితోప దేశ కావ్యాలలో అగ్రతాంబూల మందుకోదగిన కావ్యం పంచతంత్రం. విష్ణుశర్మ రచించిన ఈ పంచతంత్రం విద్యాబోధన విషయాల్లో ఒక క్రొత్త మార్గాన్ని చూపింది.

అమరశక్తి అను పేరుగల రాజు చదువునుండి విము ఖులై, మిక్కిలి చెడ్డవారై తిరుగుచున్న తన పుత్రులను చూచి దుఃఖించి మంత్రులను రావించి సభ ఏర్పాటు చేయగా ఆ సభలోని మంత్రులలో ఒకరు మీ బిడ్డలను విష్ణుశర్మ అనే పండితుడు మాత్రమే విద్యావంతులను చేయగలడని సలహా ఇచ్చెను. రాజు విష్ణుశర్మను పిలిపించెను. రాజుద్వారా విషయాన్ని గ్రహించిన విష్ణుశర్మ ఆరు మాసాలలో మీ బిడ్డలను నీతిశాస్త్రమునందు సాటిలేని మేటివారిగా చేస్తానని చెప్పి, అట్లు చేయకున్న తన పేరు విడిచి మారు పేరు పెట్టుకుంటానని రాజుకు హామీ ఇచ్చెను. ఆ మాటలకు ఎంతో సంతోషించిన రాజు తన బిడ్డలను విష్ణుశర్మకు అప్పగించెను.

వయస్సు వచ్చిన వారికి, విద్యయందు కోరిక లేని వారికి, బుద్ధి పెడతోవ పట్టిన వారికి సంప్రదాయ పద్ధతిలో చదువు చెప్పుట సాధ్యము కాదు. ఒకవేళ చెప్పుటకు పూనుకొన్నను నెగ్గదు. అందువల్లే ఆనాటి రాజాస్థానములో ఉన్న అయిదువందల మంది పండితులు ఆ రాచ బిడ్డలకు చదువు చెప్పలేకపోయిరి. అయితే విష్ణుశర్మ క్రొత్త పద్ధతిలో వారికి విద్యా బోధన చేయడానికి సంకల్పించాడు. ఆ రాచ బిడ్డలకు కావలసిన విషయ సారాన్నంతటిని సమస్త శాస్త్రములనుండి గ్రహించి సందర్భాను గుణంగా దానిని కథల రూపంలో నిక్షిప్తం చేసి ఒక గ్రంథాన్ని రచించాడు. ఇందుకు గాను విష్ణుశర్మ దేశంలో ప్రచారంలోవున్న ప్రసిద్ధమైన కథలనుకూడా ఎన్నిటినో గ్రహించాడు. విద్యాబోధన పేరుతో కథా సాహిత్యాన్ని మొట్ట మొదటిగా ప్రజలకందించిన ప్రజ్ఞాశీలి విష్ణుశర్మ. ఆ గ్రంథాన్ని ఆ రాచ బిడ్డలకు బోధించి, చదివించి, ఆరు మాసాలలో విద్యావంతులను చేసి తన ప్రతిన నిలబెట్టుకున్నాడు. ఆ గ్రంథమే పంచతంత్రం. ఇది ఒక నూతన విద్యా ప్రణాళికకు ఆలవాలం. ఈ విషయాన్ని గ్రహించిన దేశదేశాల విజ్ఞులు ఆరవ శతాబ్దము నాటికే తమ తమ భాషలలోనికి మార్చుకున్నారు.

మంచి గురువు తానుగా కథలను కల్పించనక్కరలేదు. లోకంలోని ప్రసిద్ధమైన కథలను గ్రహించి, అందు తాను చెప్పదలచిన శాస్త్రీయ విషయాలను చేర్చి విద్యార్థులకు బోధించవచ్చు. దీనినే బోధనా ప్రణాళిక అంటారు. దీనినే ఈనాడు మనం లెసన్ ప్లాన్ అంటున్నాం. ఆనాడే విష్ణుశర్మ ఈ విధమైన బోధన చేసి సాటిలేని గొప్ప గురువుగా పేరుపొందాడు.

విష్ణుశర్మ రాజనీతి శాస్త్రమును అయిదు భాగాలుగా విభజించి దానిని కథలద్వారా చెప్పదలచి దానికి పంచ తంత్రమను పేరు పెట్టెను. తంత్రము అను పదమునకు చాలా అర్థాలున్నాయి. "ఆలోచన" అను అర్థమును ఈ సందర్భంగా మనం తీసుకొనవచ్చును. విష్ణు శర్మ ఈ అయిదు తంత్రములకు చక్కని పేర్లు పెట్టెను.

1) మిత్ర భేదము 2) మిత్ర సంప్రాప్తి
3) కాకోలూకీయము 4) లబ్ధ ప్రణాశము
5) అపరీక్షిత కారిత్వము

పంచతంత్రంలోని మొదటి నాలుగు భాగాలలో జంతువులను, పక్షులను ప్రధానపాత్రలుగా కథ నడిపిన విష్ణుశర్మ అయిదవ తంత్రములో మాత్రము మనుషులను ప్రవేశపెట్టి కథను నడిపిస్తాడు. అపరీక్షిత కారిత్వము అనగా ఆలోచించకుండా పనిచేయుట అని అర్థము.

మనుషులు ఆలోచించకుండా పనులు చేస్తుంటారు అని చెప్పి సున్నితంగా చురకనంటించిన విధంగా హితవు చెప్పడం విష్ణుశర్మ యొక్క లౌక్యానికి నిదర్శనం.

విష్ణుశర్మ విద్యా ప్రణాళిక, విషయ సేకరణ, బోధనా పద్ధతి విద్యా విముఖులను కూడా సుముఖులుగా మార్చి విద్యావంతులను చేసింది. కష్టతరమైన శాస్త్ర విషయాలను కూడా సులభంగా, ఆకర్షణీయంగా బోధించవచ్చు అని విష్ణుశర్మ ఆనాడే నిరూపించాడు. పంచతంత్రంలోని ఎన్నో విషయాలు నిత్య నూతనాలు, సార్వదేశికాలు, సార్వకాలిక సత్యాలు. పంచతంత్రము నందు విష్ణుశర్మ గొప్ప విషయాలనెన్నింటినో చెప్పాడు. ఉదాహరణకు "బృహస్పతి చెప్పినను నీవు నమ్మవద్దు" - బృహస్పతి బుద్ధిలో గొప్పవాడు, అతని మించినవాడు లోకాన లేడు. అందు వలన బృహస్పతి చెప్తే అది ఖచ్చితంగా నిజమే అయి వుంటుందని నమ్మకం. మా తాత చెప్పాడు. మా నాన్న చెప్పాడు, మా కులపెద్ద చెప్పాడు అని ఎవరు ఎవరి మాటను గుడ్డిగా నమ్మవద్దు అని, ఆలోచించి మంచిదని మనసుకు అనిపిస్తే తప్ప ఏది నమ్మవద్దని చెప్తూ చక్కగా ఆలోచించడాన్ని నేర్పాడు విష్ణుశర్మ. ఇలాంటివే మచ్చుకు మరికొన్ని.

1) బైటకు కనపడక పెద్ద దూలములోనున్న నిప్పునకు ఎవరును భయపడరు. అందరు ఆ దూలమును తేలికగా దాటిపోవుదురు. అటులనే శక్తి సంపన్నుడు తన శక్తిని చూపకున్న ఎవరును లెక్కగొనరు. పైగా అవమానింతురు.
2) సమయము కాని సమయాన తగని విషయమును బృహస్పతి చెప్పినను అవమానమును తిరస్కారమును పొందును.
3) కుడి ఎడమల భేదము తెలియనిచోట మంచివాడు ఎవ్వడును ఒక్క క్షణకాలమైనను ఉండడు. పరీక్షకులు లేనిచోట సముద్రము నుండి పుట్టిన మంచి రత్నాల విలువలు తెలియవు. మణిని గాజుగా, గాజును మణిగా తలంచు పండితులున్న చోట సేవకుడు ఎవ్వండును ఉండడు.
4) పురుగుల నుండి పట్టుదారము, రాళ్లనుండి బంగారము, బురదనుండి ఎఱ్ఱ తామర, పామునుండి మణి, కట్టెనుండి నిప్పు పుట్టి తన గుణము చేతనే ప్రకాశించుచున్నవి కాని పుట్టుకచేత మాత్రము ప్రకాశించుట లేదు.
5) దాచనందున రహస్యము, లాభము వలన స్నేహము, తియ్యని పలుకుల వలన రోగము పోవునందురు.
6) ధీరులు బ్రహ్మ భయపెట్టినను ధైర్యమును వీడరు. వేసవి ఎండలకు చెరువు ఎండును గాని సముద్రము వాగలు వేయుచూ నిండుగనే ఉండును.
7) ఆపదలందు క్రుంగనివాడు, సంపదలందు మిడిసిపడనివాడు, యుద్ధమున భయపడని వాడు ముల్లోకాలలో శ్రేష్టుడగును.
8) వాణి వీణ నారి నరుడు గుఱ్ఱము శస్త్రము శాస్త్రము మంచివారిని పొంది మంచిగను, చెడ్డవారిని పొంది చెడ్డగను అగును.
9) గొప్పవారు దీనులమీద కోపింపరు. పెద్ద సుడిగాలి వంగిన చిన్న మొక్కలను నాశనము చేయదు. గొప్పవారి స్వభావము అట్లుండును. శూరులు తమకంటే పరాక్రమవంతుల మీదనే తమ పరాక్రమము చూపుదురు. మదపుటేనుగు చెక్కిళ్ళపై తుమ్మెదలు కోరి కాళ్లతో తన్నినను ఆ ఏనుగు కోపము పొందదు.
10) మంచి సారము కలిగి వంకలు తొఱ్ఱలు లేని స్తంభముల మీద ఇల్లు చక్కగా నిలిచినట్లు మంచి బుద్ధి బలము కలిగి తిన్నని నడత కలిగిన మంత్రుల మీద రాజ్యము చక్కగా నిలుచును.
11) యౌవనమున ఎవడు శాంతముగ నుండునో వాడే నిజముగ శాంతుడు. వయస్సు ఉడిగిన పిమ్మట అందరు శాంతులుగానే ఉందురు.
12) ఉపాయముతో సాధింపతగిన దానిని పరాక్రమముతో సాధింపలేము. బలము లేకున్నను ఉపాయశాలిని శూరులు కూడా నాశనము చేయలేరు.
13) బుద్ధిగలవాడే బలవంతుడు. బుద్ధిలేని వానికి ఎంత బలమున్నను ప్రయోజనము లేదు.

14) పుట్టిన శత్రువును, వచ్చిన రోగమును నాశనము చేయనివాడు ఆ శత్రువుచేత, ఆ రోగము చేత చచ్చును.
15) తన శక్తిని, శత్రువు శక్తిని ఎరుంగక కోరి కయ్యము నకు వెళ్ళువాడు నిప్పులోపడిన పురుగువలె నాశనమగును.
16) ప్రేమించ దగిన వారియందు కూడా మొదటిగా ప్రేమను చూపరాదు. ఒకవేళ ప్రేమించిన ఆ ప్రేమ ప్రతిరోజు పెంపొందునట్లు చూడవలయును.
17) గ్రద్దలు చుట్టుకొన్న కలహంసను ప్రేమింపరాదు, సేవింపరాదు. అటులనే దుష్ట మంత్రులు చుట్టును చేరియున్న రాజును ఎవరును సేవింపరాదు. హంసలవంటి సభాసదులున్న చోట గద్దవంటి రాజు నైనా సేవించవచ్చు.
18) మెత్తని నీటి ఉరవడికి నేర్పరుల చెడు మాటలకు మంచివారి మనస్సు కూడ మారుచున్నది.
19) ఏనుగు చాలా లావుగా ఉన్నది అయినా అంకుశము నకు లొంగును. అంకుశము ఏనుగంత ఉన్నదా? దీపమును వెలిగించిన చీకటి మాయమగును చీకటి దీపమంత మాత్రమేనా? ఆకారము పెద్దదయినంత మాత్రమున ప్రయోజనము లేదు.
20) ప్రజ్ఞావంతుడు బీదవాడయ్యి పరదేశమునందైనను ఎన్నడును దుఃఖమును పొందడు. కష్టించి పని చేయువానికి దూరములేదు. విద్యావంతులకు విదేశము లేదు మంచిగా మాటాడు వారికి శత్రు వులు లేరు.
21) పురుషుడెప్పుడు ఉత్సాహవంతుడుగా నుండవల యును. దైవము వలన అన్ని పనులు నెరవేరునని తలంచి తన యత్నమును మానరాదు. నువ్వులను పిండకుండ నూనెరాదు. మందబుద్ధియై కొంచె ముతోనే సంతసించు దరిద్రునకు ఇచ్చిన సొమ్ముకూడా తుడిచి పెట్టుకొని పోవును.
22) లాభమును మించిన శత్రువును, శీలమును మించిన అలంకారమును సంతోషమును మించిన ధనమును లోకాన కానము.
23) సింగము ఎలుకలు కొరకై రాతి నేలను తవ్విన గోళ్ళూడి పోవునుగాని గొంతులోనికి కొంచెమైనను తినుబండారము దొరకదు. ఒకవేళ దొరికినను ఎలుక మాంసము మాత్రమే. అట్లే ఎక్కువ ప్రయాజనము లేనప్పుడు యుద్ధము చేయరాదు.
24) జ్వరమును స్వేదక్రియ చేత తగ్గింప వీలుండగా బ్రదుక నెంచిన వాడెవడును చన్నీటి స్నానము చేత తగ్గింప యత్నింపడు.
25) అందమైన వానిని, ఆశలు లేనివానిని, తియ్యగా మాటాడు వానిని, సకల శాస్త్రములు నేర్చిన వానిని, ఇతరుల మనస్సులోని మర్మము నూహింపగల వానిని దూతగా పంపవచ్చును.
26) బుద్ధిమంతుడైనవాడు ఎంత బలవంతుడైనా తనంత తానుగా కోరి పోరును కొని తెచ్చుకొనరాదు వైద్యుడున్నాడు కదా అని బుద్ధి ఉన్నవాడెవడును కోరి విషము నారగింపడు. పండితుడైన వాడు పలువురున్నచోట పరనింద చేయరాదు.
27) గొప్పవాడైనా తక్కువ వాడైనా నేర్పరితనము గల బుద్ధితో మేలును కలిగించు మార్గమును అనుస రింపవలె. అర్జునుడంతటివాడు మిక్కిలి బలము గల ఏనుగు తొండము వంటి తన చేతులను గాజులు తొడిగిన ఇంతి చేతులవలె చేసినాడు.
28) మనము రక్షింపకున్నను దేవుడు రక్షించినది బాగుగా నిలుచును. దేవుడు రక్షింపకున్న మనము మిక్కిలి జాగరూకతతో రక్షించుచున్నను నాశన మగుట నిజము.

ఈ విధముగా అడుగడుగునా ఎన్నో గొప్ప సూక్తులతో మంచి మాటలతో కథను నడిపి విసుగు విరామం తెలియకుండా చదవాలనిపించే గ్రంథ రాజమైన విష్ణుశర్మ రచించిన పంచతంత్రం అతని ప్రజ్ఞకు, ఉపజ్ఞకు నిదర్శనం. విద్యాబోధన విషయంలో ఒక చక్కటి మార్గాన్ని చూపిన గ్రంథం విష్ణుశర్మ పంచతంత్రం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు పంచతంత్రము - వేములపల్లి ఉమా మహేశ్వరరావు. 2. నీతి చంద్రిక - పరవస్తు చిన్నయసూరి.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో - పాట

- జె. లక్ష్మినర్సయ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ (ఓరియంటల్), ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

భారత దేశ చరిత్రలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఒక ప్రత్యేకమైన ప్రజా ఉద్యమం. లక్షలాది మంది పీడిత ప్రజలు పాల్గొన్న ఉద్యమం. నిజాం రక్కసి పాలనకు, దోపిడి నిరంకుశ భూస్వాములపై,రజాకారు మూకలపై, తెలంగాణ ప్రజలు భూమి కొరకు, భుక్తి కొరకు, విముక్తి కొరకు సాగించిన సాయుధ రైతాంగ పోరాటం ఇది.తమను పాలిస్తున్న నిజాం తమ మతాన్ని, భాషను, సంస్కృతిని అణగదొక్కడం వల్ల కార్మికులు, కర్షకులు, వర్తకులు, దేశ భక్తులైన భూస్వాములు కూడా పాల్గొన్నారు. ఈ మహోద్యమం తెలంగాణ ప్రజలకే గాక మొత్తం భారత ప్రజానికానికే తమ విముక్తికి విలువైన పాఠాలు నేర్పినది.

ఇది ప్రధానంగా భూస్వామ్య వ్యతిరేక పోరాటం, కుళ్లిన ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా నిజాం నిరంకుశ పాలనకు జమిందారీ, జాగిర్దారీ, దేశముఖులు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన మహోద్యమం. వెట్టి చాకిరి, రకరకాల లంచాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం బంజర్లు, కౌలు, బంజరాయిలు, అన్యాక్రాంత భూములు, భూస్వాముల ఆక్రమణదాక పురోగమించిన మహా ఉద్యమం.ఇది సాయుధ రైతాంగ పోరాట ఉద్యమం. కరువు, అణచివేత, అంటరానితనం మనుషుల్ని పీడిస్తుంటే, ఈ పీడన పట్ల తమ నిరసనను వ్యక్తం చేయడానికి, రాజుల నిరంకుశం పట్ల తమ వైఖరిని ప్రకటించడానికి, క్షోభితుల పట్ల ప్రతిఘటన స్వరాన్ని వినిపించడానికి, దోపిడి తనం పట్ల నిరసనను వెళ్ళ గక్కడానికి, కరువు, కాటకాల నుండి అనుభవించిన క్షోభను వ్యక్తం చేయడానికి పాట ప్రజా వాహికగా పనిచేస్తుంది.

పాట ఎప్పుడు పేదవాని ఆకలి కేక అయింది. బానిస బ్రతుకులను రూపుమాపే చైతన్యమైంది. ఉద్యమాలకు ఊపిరిని ఊదింది. పాట దోపిడి దారు గుండెల్లో గునపం అయింది. నక్సల్బరీ ఉద్యమంలో విప్లవ ఢంక అయింది. పాట భూస్వాములను పారద్రోలడానికి ఆయుధం అయింది. ఇలా ప్రజా ఉద్యమాలకు చైతన్య బావుట అయితూనే ఉంది. చారిత్ర్మాక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోకి గ్రామీణ ప్రజానికాన్ని సమీకరించ డానికి పాట ప్రధాన భూమిక వహించింది. ఇలాంటి పాట ఆనాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజలను చైతన్య పరిచిన తీరును, బానిస బ్రతుకులను, వెట్టి చాకిరిని పారతోలిన తీరును, భూస్వాములను పల్లెల నుండి పట్నం దాక ఉరికించిన చైతన్య బావుటను నా ఈ వ్యాసం ద్వారా తెలియజేస్తున్నాను.

తమ అస్తిత్వం కోసం శ్రమ జీవులు జరిపే పోరాటంలో పాటే ఆయుధంగా ధరించి పోరాడిన చరిత్ర విశ్వ వ్యాపితం. ఎక్కడ పజ్రా పోరాటం ఉంటుందో అక్కడ పాట ఉంటుంది. అనాదిగా వస్తున్న చారిత్రక సందర్భా లలో, దశలలో పీడిత ప్రజల పక్షపాతియై తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది పాట. అణచివేతను ధిక్కరించే సామూహిక గాణం అయింది పాట.

తెలంగాణ గడ్డ మీద తిరుగుబాటు తత్వం సహజం గానే అలవడుతుంది. ఈ భూమి స్వభావం అట్లాంటిది. తెలంగాణ పోరాటమే రైతాంగ సాయుధ పోరాటం. భూమి సమస్య ఇరుసుగా మొదలైన ఈ పోరాటం. వెలాది ఎకరాల భూమి కొద్ది మంది భూస్వాముల చేతుల్లో బందీగా ఉండటం వల్ల కౌలు రైతు శ్రమనంతా భూస్వాములు కొల్ల గొట్టి, పండిన పంటనంతా దొర గడీల నింపి బుక్కెడు బువ్వ దొరకని పరిస్థితి తెలంగాణ పల్లెలో కనిపిస్తుంది.

"కుప్ప నూర్చి నాడమ్మ చందమామ
రైతు అప్పులన్ని తీర్చినాడమ్మ చందమామ

భూస్వామి బాకి సాకి చందమామ
సావుకారి చిల్లర పద్దు చందమామ
ప్రభువు పన్ను రంది చందమామ'' అని రైతు పండించిన పంట మొదలు ఎన్ని రకాల దోపిడికి గురి అవుతున్నాడో ఈ పాట ద్వారా వివరిస్తునాడు.

నిజాం వ్యతిరేక పోరాటం అంటేనే జమిందార్, జాగిర్ దార్, దేశ్ ముఖ్, భూస్వామ్య వ్యతిరేక పోరాటం. ఈ దోపిడి వర్గాలకు తెలంగాణ ప్రజలకు మధ్య జరిగిన పోరాటమే నిజాం వ్యతిరేక పోరాటం. గ్రామాల్లో పెత్తం దార్లు, పోలీసు పటేల్లు, భూస్వాములు, దేశ్ ముఖ్‌లు ప్రజలను పీడిస్తూ శిస్తు వసూలు చేసేవారు. అంతే కాకుండా ఉత్పత్తి కులాల వెట్టి చాకిరి, స్త్రీల మాన పాన రక్షణ, కనీస పౌర, ప్రజాస్వామిక హక్కులు ఉండేవి కావు. ప్రజలను పీడించే వారందరికి నిజాం సర్కార్ మద్దతు ఎదో ఒక రూపకంగా ఉండేది. ఇలాంటి పరిస్థితిని నిరసిస్తూ సుద్దాల హన్మంతు గారు...

''మన ఉప్పు పప్పు తిని మధమెక్కిన నైజాము
కన్నుల గానక నేడు కయ్యానికొడిగట్టి
మత పిచ్చి కుక్కలను తెలుగొడ
మన పైకి ఉసిగొల్పె మొనగాడ'' అని నైజాం యొక్క నీతి తక్కవ చర్యలను, మత దురంకారాన్ని దుయ్య బటాడు.

అర్ధరాత్రి ఆయుధాలతో వచ్చిన రజాకార్లు ప్రజలను చిత్ర హింసలు చేస్తూ, మండుతున్న గడ్డివాముల్లో సజీవ దహనం చేసినా, జైళ్ళలో చిత్ర హింసలు చేసిన నిరాశ చెందకుండా ప్రజలను పోరాటంలో కలిసిరమ్మని కవి ఆహ్వానిస్తూ...

''తెల్ల వీరులు బాల చంద్రులై లేవాలి
మగువలందరు రుద్రమాంబలై కదలాలి
నీజాతి వారంత తెలుగొడ
నిలిచి ఎడురించాలి మొనగాడా'' అని తన పాటతో ప్రజలలో స్ఫూర్తిని నింపాడు హన్మంతు గారు.

తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు చేస్తున్న పోరాటాలను, త్యాగాలను, పోరాట రూపాలను, నిజాం నిర్బంధ పద్ధతులను ఎండగడుతూ బండి యాదగిరి సూర్య పేట ప్రాంతంలోని ప్రతాప రెడ్డి అనే దేశ్ ముఖ్‌ను దృష్టిలో పెట్టుకుని...

''బండెనుక బండి కట్టి
పదహారు బండ్లు కట్టి
ఏ బండ్లె వస్తవు కొడుకో'' అని ప్రజలను విముక్తి చేసే దారుల్లో నడిపించాడు. తర్వాతి కాలంలో ఇదే పాట తర్వాతి కాలంలో....

''నైజాము సర్కరోడా
నాజీల మించినోడా
యమబాధపెట్టివి కొడుకో
నైజాము సర్కరోడా !'' అని దున్నడానికి భూమి లేక, ఉండడానికి ఇల్లు లేక నానా కష్టాలను పడుతుంటే, పండిన పంటను తిండికి ఉంచకుండా ఎత్తుకెల్లిన తీరును ఎండగడుతూ, పోలీసు, మిల్ట్రిని జూచి, వాళ్ళ లాఠీ దెబ్బలకు గానీ, తుపాకీ గుళ్ళకు మేం లొంగిరామూ అంటూ..

''చుట్టు ముట్టు సూర్య పేట
నట్ట నడుమ నల్లగొండ
ఆవలా హైదరాబాద్
తర్వాత గోలకొండ
గోలకొండా ఖిల్లా కిందా
నీ గోరి కడ్తం కొడకో
నైజాము సర్కరోడా !'' అని తెలంగాణ వ్యాపితంగా ప్రజలు చేస్తున్న పోరాటాలను, త్యాగాలను, పోరాట రూపాలను, నిజాం నిర్బంధ పద్ధతులను ప్రస్తావిస్తూ, ఒక ప్రాంతంలో జరుగుతున్న పోరాటాన్ని మరొక ప్రాంత ప్రజలు తెలుసుకోవడానికి, ఉత్తేజం పొందడానికి పాట ప్రాణాధారమైనది.

నిజాం నవాబు పాలన కింద తెలంగాణ గ్రామ సీమలు భయంకరమైన సామాజిక పరిస్థితుల్లో కొన సాగాయి. గ్రామ ప్రజలు అక్కడి నలుగురు భూస్వాము లకు బానిసలుగా బ్రతికే వారు. దుర్భరమైన వెట్టి చాకిరి,

అధికార జులూం, నిత్యం తిట్లు, తన్నులు వంటివి నిత్య కృత్యాలుగా ఉండేవి. ఇట్టి వెట్టిని నిరశిస్తూ......

"వెట్టి చాకిరి విధానమో రైతన్న
ఎంత జెప్పిన తీరదో కూలన్న" అంటూ మాల, మాదిగ మరియు ఉత్పత్తి కులాల వాళ్ళు భూస్వాముల ఇళ్ళలో పైసా ఆశించకుండా చేసిన వెట్టిని గుండె పగిలిపోయేలా వివరించాడు హన్మంతు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరుడైన బందగీ శవ యాత్రలో విసునూరు రామచంద్రా రెడ్డి అనుచరులు ఊరేగింపు మీద జరిపిన కాల్పులలో మరణించిన దొడ్డి కొమరయ్య అమరత్వాన్ని గురించి...

"నిన్న గన్న తల్లిదే ధన్య జీవితమాయె
కొమురయ్య నీ జీవి అమరజీవితమోయి" అని కొమరయ్య అమరత్వాన్ని, ఉద్యమ స్ఫూర్తిని కొని యాడుతూ, ప్రజా చైతాణ్యాన్ని నింపుతూ, అమర వీరుల స్మృతి పాటల ద్వారా స్మరించుకున్నారు.

ఈ మహోద్యమం తెలంగాణ ప్రజలకే గాక మొత్తం భారత ప్రజానికానికే తమ విముక్తి విలువైన పాఠాలు అందజేసింది. ఇది కేవలం భూస్వామ్య వ్యతిరేక పోరాటమే కాదు నిజాం రక్కసి పాలన నుండి తెలంగాణ ప్రజలు సాగించిన విముక్తి పోరాటం. ఈ తెలంగాణ ఉద్యమం ఆంధ్ర ప్రజల జాతీయ వాంఛతో మిళితమైన ప్రజా ఉద్యమం. తెలుగు భాషా పరిరక్షణకు, అభివృద్ధికి, ముక్కోటి ఆంధ్ర ప్రజలను ఐక్య పరిచిన ఉద్యమం. ఇట్టి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాట పోషించిన పాత్ర వలన తెలుగు నేలలో జరిగిన ప్రతీ పోరాటానికి పాటే ప్రధానమైంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర, సం.ఆచార్య. రవ్వా శ్రీహరి, తెలుగు అకాడమి, హైదరాబాద్,2016.
2. తెలుగులో ఉద్యమ గీతాలు, సం.డా॥ యస్వీ. సత్య నారాయణ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, హైదరాబాద్,2005.
3. వీర తెలంగాణ (నా అనుభావాలు - జ్ఞాపకాలు), సం. రావి నారాయణ రెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,2012.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# శ్రీమద్భాగవతం - ప్రహ్లాదుని విశ్వమానవతా విలువల ప్రబోధం

- డా॥. పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చిత్తూరు.

"చదువనివాడజ్ఞుండగుఁ
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువగ వలయును జనులకు
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ!"

మానవ సమాజానికి భారతదేశం అందించిన వెలకట్ట లేని కానుకలు రామాయణం, భారతం, భాగవతాది ఇతి హాస పురాణాలు. ఈ పురాణేతిహాసాలు మానవాళికి విశేష జ్ఞానానందించి, అంధకార బంధురమైన మానవ జీవితాల్లో ఆనంద వెలుగులు నింపాయి. సమస్యాత్మకమైన మానవ జీవితానికి చక్కటి పరిష్కారమార్గాలను చూపెడు తున్నాయి. అజ్ఞానంతో నిద్రాణమై ఉన్న సమాజాన్ని మేల్కొల్పుతున్నాయి. జడత్వం గల మానవాళిలో చైతన్య శక్తిని నింపుతున్నాయి. ఆప్యాయతలు, అనురాగాలతో కూడిన మానవ సంబంధాల ఆవశ్యకతను నొక్కివక్కాణి స్తున్నాయి. ద్వేషం, అసూయ, పగ, ప్రతికారాలతో గల సమాజాన్ని నిర్మూలించాలని హితోపదేశానందిస్తున్నాయి. మానవాళిలో సత్యం, ధర్మం, న్యాయం వంటి నైతిక విలువల ఆవశ్యకతను ప్రబోధిస్తున్నాయి. అలాంటి పురాణేతిహాసాలలో సత్పురుషుని గుణశీలాలు ఎలా ఉండాలో, నీచ ప్రవర్తన వల్ల ఎలాంటి పతనం మాన వాళికి సంభవిస్తుందో రామాయణం హెచ్చరిస్తే సమాజంలో ధర్మం ఆవశ్యకతను, ధర్మం ఎప్పటికైనా అధర్మం పై విజయాన్ని సాధిస్తుందని మహాభారతం వివరిస్తుంది. అలాగే మానవాళి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసా నికి భక్తిమార్గం ఎలా దోహదపడుతుందో, వ్యక్తిలోని మానవతావిష్కరణకు భక్తి ఎలా సాధనమౌతుందో భాగ వతం చక్కగా ప్రబోధిస్తుంది. అలాంటి భాగవతాన్ని సంస్కృతంలో వ్యాసభగవానుడు సృష్టిస్తే, దానిని ఆంధ్ర భాషలో సహజధోరణిలో ఆంధ్రత్వం ఉట్టిపడేటట్లు భక్తకవివరణ్యుడు పోతనామాత్యుడు అనుసృజన చేసాడు. ప్రస్తుతం ఆంధ్రభాగవతంలో సప్తమస్కంధంలోని ప్రహ్లాదుని విశ్వమానవతా ప్రబోధాన్ని ఆవిష్కరించ దలచాను.

ప్రహ్లాదుడు వైష్ణవాంశంలో జన్మించిన రాక్షసపుత్రుడు. రాక్షస వంశంలో జన్మించినా ప్రహ్లాదుడు నిరంతరం విష్ణు నామస్మరణ చేసే గొప్ప హరిభక్తుడు. అంతకంటే గొప్ప మానవతావాది. సకల జీవులయందు సమదృష్టిని కలిగి ఉండే మహోన్నతుడు. తనకు పెద్దలు ఎదురైనపుడు గౌరవంతో నమస్కరించే వినయశీలి. పరస్త్రీలను తల్లిలాగా భావించే సుగుణవంతుడు. దీనులను ఆదరించే స్వభావం గల ఆర్ధ్రహృదయుడు. స్నేహితులను సోదరుల్లాగా చూసుకొనే సహృదయుడు గురువులను దైవంగా కొలిచే ఆదర్శ విద్యార్థి. హాస్యానికైనా అబద్ధమాడని సత్యవంతుడు. మంచి మర్యాదలు తెలిసిన మహోత్త ముడు. భోగభాగ్యాల మధ్య పెరిగినా చంచలత్వం లేని ధీరుడు. అలాంటి ప్రహ్లాదుడు నిరంతరం విష్ణుమాయలో జీవిస్తుంటే శత్రుజపాన్ని సహించని తండ్రి హిరణ్యకశిపుడు తన ముద్దుల కుమారుడు ప్రహ్లాదుని తన వంశ గౌరవం నిలబెట్టేటట్లు చేయాలని గురువుల వద్దకు పంపించాడు. అలా ప్రహ్లాదుడు గురువుల వద్ద సర్వవిద్యలను అభ్య సించి రాక్షస స్వభావాలకు విరుద్ధమైన గొప్ప విశ్వమా నవతా విలువలను తండ్రికి విన్నవించాడు. ప్రహ్లాదుడు తండ్రికి ప్రబోధించిన విశ్వమానవతా విలువలను ఇప్పుడు పరిశీలిద్దాం.

నేడు సర్వమతాల సారం దేవుడు ఒక్కడే, మానవు లంతా సమానమే. అలాంటి ఆర్యసత్యాన్ని ప్రహ్లాదుడు ఏనాడో చెప్పాడు. భగవంతుని దృష్టిలో అందరూ సమాన మని, అజ్ఞానంతో, రక్తసంబంధ బాంధవ్యాలతో మీరు, మేమనే భేదభావాలతో మానవులు జీవిస్తున్నారని ప్రబోధిం చాడు. గురువుల వద్ద విద్యనభ్యసించిన ప్రహ్లాదుని

జ్ఞానాన్ని పరీక్షించదలచి హిరణ్యకశిపుడు ప్రహ్లాదునికి ఇష్టమైనది, నచ్చిన విషయం ఏదని ప్రశ్నించినపుడు ప్రహ్లాదుడు తండ్రికి సమాధానంగా మానవులంతా సంసార మనే చీకటి నూతిలో పడి మేము, మీరనే భ్రమతో బ్రతుకుతుంటారని, కానీ ఈ భగవంతుని సృష్టిలో అందరూ సమానమని, భేదభావాలు లేకుండా మానవులు జీవించాలని, సమదృష్టి లేనివారు సంపదలను విడిచి కారడవిలో నివసించడం మంచిదని ప్రహ్లాదుడు ఇలా హితోపదేశం చేసాడు.

"ఎల్ల శరీరధారులకు నిల్లను చీఁకటి నూతిలోపలం, ద్రెళ్ళక వీరు నేమను మతిభ్రమణంబున భిన్నులై ప్రవ ర్తిల్లక సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునం దుల్లముఁ జేర్చి తారడవి నుండుట మేలు నిశాచరా గ్రణీ!"

142వ పద్యం - 4వ అధ్యాయం - సప్తమస్కంధం.

ఈ సర్వసృష్టి భగవంతుడైన విష్ణుమూర్తి సృష్టియని, సృష్టియంతా దివ్యకళామయమని ప్రహ్లాదుడు భావించాడు. యావత్ ప్రపంచం కుటుంబమే తమ సర్వస్వమని, పరులు తమకు సంబంధం లేదనే భ్రమలో జీవిస్తున్నారు. అలాంటి వారు నూతిలో కప్పలా సంకుచిత బుద్ధితో ప్రవర్తిస్తూ నిజమైన కుటుంబం ఏదో గ్రహించలేకపోతున్నారని ఆవేదన చెందుతున్నాడు. అలాంటి వారు సర్వం విష్ణుమయమని భావించి, అసలైన ఆనందాన్ని అనుభవించాలని ఆశిస్తున్నాడు. అంతేగాకుండా కాలం ఈశ్వర స్వరూపమని కాలక్రమంలో వృక్షం పుట్టి పెరిగి ఫలాలు అందించి చివరకు ఎండిపోయినట్లే మానవ జీవితం కూడా శాశ్వతం కాదని బోధించాడు. మానవదేహానికి మరణం ఉందిగానీ, ఆత్మకు మరణం లేదని, ఆ ఆత్మ ఈశ్వర స్వరూపమని, సర్వ మానవుల్లో ఉండే ఆత్మ దైవస్వరూపమని ఆ జ్ఞానాన్ని గ్రహించి సమభావం కల్గివుండాలని హితోపదేశం చేశాడు. దేహంపై భ్రాంతిని కల్గించే అహంకారాలు, మమకారాలను విడిచి పెట్టాలని దేహాదుల కంటే ఆత్మను భిన్నంగా భావించినపుడే బ్రహ్మజ్ఞానం సాక్షాత్కారం పొందుతారని సూచించాడు. కాబట్టి మానవులంతా భేదభావాలను విడనాడి వివేకంతో ఆలోచించాలని అప్పుడే సమస్త ప్రాణులయందు సమ దృష్టి ఏర్పడుతుందనే సత్యవచనాన్ని సమాజానికి అందించాడు. దీనిని బట్టి మానవులంతా సమానమనే భావాన్ని అలవరచుకోవాలని, సోదరభావంతో మెలగాలని ప్రహ్లాదుని ప్రబోధంగా భావించవచ్చు.

మానవుని నిరాశ నిస్పృహలకు, అసూయద్వేషాలకు అవినీతి అక్రమాలకు చివరకు అతని పతనానికి కారణం అపరిమిత కోరికలని చెప్పవచ్చు. మానవుని దుఃఖానికి కారణం కోరికలనే బుద్ధుని ఆర్యసూత్రాన్ని మనం మరువ కూడదు. అలాంటి సత్యాన్ని బుద్ధునికంటే పూర్వమే ప్రహ్లాదుడు మానవాళికి చక్కగా ప్రబోధించాడు. మానవుడు తన ప్రాణాలకంటే తియ్యగా అనిపించే ఆశకు దాసోహమౌతాడని, ఆ కోరికల కారణంగా ఇతరుల ధనాన్ని అపహరించాలని చూస్తాడని, సేవకులు, దొంగలు వ్యాపారులు వంటి వారిచేత ప్రాణం పోగొట్టుకోవడానికైనా సిద్ధపడతాడని, ఆ కోరికల కారణంగా రహస్యంగా పరస్త్రీల సౌఖ్యం కోరుకుంటాడని తన దుష్టచాతుర్యబలంతో వాటిని పొందాలని తపిస్తాడని, అలాంటి కోరికలు కల్గిన మానవుడు సాలీడుగూటిలో చిక్కుకొని బయటకు రాలేకపోయే చిన్న పురుగులాగా మానవుడు పతనమై నశిస్తాడని ప్రహ్లాదుడు హెచ్చరించాడు. మానవుడు ధర్మమార్గాన్ని ఆచరిస్తే కోరికలపై మమకారం తగ్గి సత్ప్రవర్తన గల్గిన వాడుగా వ్యవహరించగలడని, అదే మానవుని కర్తవ్యమని తెలియజేసాడు. అలా ప్రహ్లాదుడు ప్రబోధించిన మానవ కర్తవ్యాన్ని పరిశీలిద్దాం.

"వినుండు సకల జన్మంబులందును ... కామక్రోధ లోభమోహమదమత్సరంబులను పాశంబులం గట్టువడి విడివడ సమర్థుండు గాక ప్రాణంబుల కంటె మధు రాయ మాణమైన తృష్ణకు లోనై భృత్య తస్కరవణి క్కర్మంబులఁ బ్రాణహానియైని నంగీకరించి పదార్థంబుల నర్థించుచు రహస్య సంభోగ చాతుర్య ... సుకరంబులైన పశుభృత్య నికరంబులను, వంశ పరంపరాయత్వంబులయిన విత్తంబులను వర్జింపలేక సంసారంబు నిర్జించు నుపాయంబుఁ

గానక తంతు వర్గంబున నిర్గమద్వార శూన్యంబయిన మందిరంబుఁ జేరి చిక్కువడి వెడలెడి పాటవంబు చాలక తగులువడు కీటకంబు చందంబున ... నారాయణ చరణారవింద సేవనంబు కర్తవ్యంబు".

వచనం - 213, 6వ అధ్యాయం - సప్తమాశ్వాసం.

మానవుడు బుద్ధి జీవి అయినప్పటికీ కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరు రకాల దుష్టశక్తులచే కీలు బొమ్మయినాడు. మానవుడు గొప్ప దేహ ధారుడ్యం కలిగి బయట శత్రువులతో గొప్ప పరాక్రమవంతంగా భీకర యుద్ధం చేయగలడు. కానీ తనలో అంతర్గతంగా దాగివున్న శత్రువులతో పోరాడలేక పతనమైపోతున్నాడు. అవి యమపాశంలా మానవుని ప్రాణాలను హరించివేస్తున్నాయి. అలా మానవుడు పతనమైపోవడానికి కారణం కోరికలని ప్రహ్లాదుడు ప్రబోధిస్తున్నాడు. డబ్బు, బంగారం, ఆభరణాలు వంటి సంపదలకు, తరతరాలుగా వచ్చే ధనధాన్యాలకు వంశపారంపర్యంగా వచ్చే అధికారానికి దాసుడై వాటిని విడిచి పెట్టలేక మానవుడు కామక్రోధాది బంధాల్లో చిక్కుకొని పతనమైపోతున్నాడని, వాటికి కోరికలే కారణమని ప్రహ్లాదుని ప్రబోధం ద్వారా మనం గ్రహించవచ్చు.

ఈ సువిశాలమైన విశ్వంలో సకల ప్రాణికోటిలో మానవుడు సమున్నతుడు, సర్వోన్నతుడు. అలాంటి మానవ జన్మ ఎంతో విలువైనది. మానవ జన్మకు ధర్మాచరణ అత్యంతావశ్యకం. ధర్మాలు ఆచరించగల్గిన మానవ జన్మ పొందటం చాలా కష్టమని, కానీ మానవునిగా జన్మించడం ఎంతో అదృష్టమని, అలాంటి జీవితకాలాన్ని ఏ మాత్రం వృథా చేసుకోకూడదని ప్రహ్లాదుడు సూచించాడు. ఇంకా మానవుని ఆయుర్దాయం నూరు సంవత్సరాలు మాత్రమేనని, అందులో సగం కాలం కారు చీకట్లతో కూడిన రాత్రి వల్ల నిద్రలాంటి వాటితో వృథాగా వ్యయమైపోతుందని, ఇక మిగిలిన యాభై సంవత్సరాలలో ఇరవై సంవత్సరాలు బాల్యం, యవ్వనం వంటి అజ్ఞానంతో ముగిసిపోతుందని, మిగిలిన ముప్పై సంవత్సరాలు ఇంద్రియ సుఖాలకు వసమైపోయి కామ, క్రోధ, మదాది బంధాలకు చిక్కుకుపోతాడని అందమైన మానవ జన్మను మానవుడు ఎలా వృథా చేసుకుంటున్నాడో ప్రహ్లాదుడు క్రింది మాటల్లో చక్కగా వివరించాడు.

"వినుండు సకల జన్మంబులందును ధర్మార్థచరణ కారణంబున మానుష జన్మంబు దుర్లభం, బందు బురుషత్వంబు దుర్గమంబదియు శతర్ష పరిమితంబైన జీవిత కాలంబున నియతంబైయుండు, నందు సగమంధకార బంధురంబయి రాత్రిరూపంబున నిద్రాది వ్యవహారంబుల నిరర్థకంబయి చనుఁ జిక్కిన పంచాశద్వత్సరంబులందును బాల్యకైశోర వయో విశేషంబులయిన కామక్రోధ లోభమోహ మదమత్సరంబులను పాశంబులం గట్టువడి..."

వచనం - 213, 6వ అధ్యాయం - సప్తమాశ్వాసం.

వంద సంవత్సరాల మానవ జీవితం నిద్రాదువల్ల, అజ్ఞానాదుల వల్ల ఎలా వృథా అయిపోతున్నదో, అలాంటి జీవితాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని ఒక ఆనందదాయక జీవితంగా మలచుకోవాలని, ఒక సార్థకత జీవితాన్ని నిర్మించుకోవాలని ప్రహ్లాదుని హితోపదేశం ద్వారా మనం గ్రహించవచ్చు. జీవితం బుద్బుద ప్రాయని, అది కరిగిపోయే మంచని బోధించే ఎందరో మహానుభావులకు ప్రహ్లాదుడు ఒక మార్గదర్శకుడని చెప్పవచ్చు. పుట్టలో చెదలు పుట్టి క్షణాల్లో నశిస్తుంటాయి. అలా చెదపురుగుల్లా మానవజీవితం కాకూడదని, ప్రతి మానవ జీవితం ఒక సార్థకత జీవితంగా నిలిచిపోవాలని ప్రహ్లాదుని ఆకాంక్ష.

మానవుడు సంఘజీవి. బుద్ధిజీవియే కాదు స్వార్థజీవి కూడా. అలాంటి స్వార్థ పరత్వం వల్ల అజ్ఞానకూపంలో ఇరుక్కుపోతాడు. అజ్ఞానం వల్ల మానవునికి ఎలాంటి సుఖసంతోషాలు లభించవు. ఈ స్వార్థపరత్వం వల్ల కల్గిన అజ్ఞానం వల్ల ఎంతో తెలివి గల మహావిద్వాంసుడు కూడా మధువు తాగి మత్తులో కన్నులు తెరవకుండా ఉంటాడని, తన అస్థిత్వాన్ని తాను మరచిపోతాడని, కాంతల చిత్రమైన చూపుల సంకెళ్ళలో చిక్కుకొనిపోతాడని, అతి విలువైన జీవిత సమయం వృథా అయిపోతుందని ఏ

మాత్రం గమనించలేడని, ఆడవారి ఆకర్షణకు లోనై వాళ్ళ చేతిలో కీలుబొమ్మలా మారి మానవుడు తన ఉత్తమస్థితి నుండి హీన స్థితికి దిగజారిపోతాడని ప్రహ్లాదుడు మాన వాళికి అజ్ఞానంవల్ల కలిగే పతనాన్ని ఆవిష్కరించాడు. ప్రహ్లాదుని ఆ హితోపదేశాన్ని క్రింది పద్యంలో మనం గమనించవచ్చు.

"హాలాపాన విజృంభమాణ మదగర్వాతీత దేహోల్లస
ద్బాలాలోకన శృంఖలానిచయ సంబద్ధాత్ముడై లేశమున్
వేలానిస్ఫురణంబు గానక మహా విద్వాంసు(డుం గామినీ
హేలాకృష్ణకురంగ శాబక మగున్ హీన స్థితిన్ వింటిరే!"

215వ పద్యం - 6వ అధ్యాయం - సప్తమస్కంధం.

అల్పసంతోషాలకు వసమై స్వార్థపరమైన ఆలోచనల వల్ల అజ్ఞాన కూపంలో కూరుకుపోయిన మానవుడు మహాపండితుడైనప్పటికీ నీచ ప్రవర్తనల వల్ల ఉత్తమ స్థాయి నుండి అధమ స్థాయికి ఎలా పతనమైపోతున్నాడో ప్రహ్లాదుని ప్రవచనం వల్ల మనం గ్రహించవచ్చు. సద్గుణ సంపన్నుడై నిత్యం సత్యవచనడు, ధర్మపరాయణుడైనప్ప టికీ కేవలం నీచమైన తృష్ణలకు బలై మానవుడు ఎలా పతనమైపోతున్నాడో మనకు తెలియవస్తున్నది.

మనిషిలోని పాశువికతను నశింపజేసేది జ్ఞానం. అలాంటి జ్ఞానం నిరంతర అభ్యసనం వల్ల లభిస్తుంది. విద్యను ఆర్జించకపోతే మానవుడు అజ్ఞానుడై పశు సమానమైపోతాడు. అందుకే చదువనివాడు అజ్ఞుడౌతా డని పోతన బోధించాడు. విద్య ద్వారా ఆర్జించిన జ్ఞానంతో సకల సమస్యలను పరిష్కరించుకోగలడు. లోకాలన్నింటిని జయించగలడు. లోకంలోని శత్రువులందరినీ జయించ గలడని ప్రహ్లాదుడు ప్రబోధించాడు. కానీ ప్రతి మనిషికి నిజమైన శత్రువులు బయట ప్రపంచంలో లేరని వారు మనసులోనే ఉన్నారని, వారే కామము, క్రోధము, మదము, మోహము, లోభము మాత్సర్యాలని సూచిం చారు. కామం వల్ల మానవుడు ధర్మాన్ని మంటగలుపు తాడని, క్రోదం వల్ల అజ్ఞానుడవుతాడని, మోహం వల్ల మానవత్వాన్ని మరచిపోతాడని, లోభం వల్ల వ్యక్తిత్వాన్ని కోల్పోతాడని, మాత్సర్యం వల్ల అసలైన ఆనందాన్ని దూరం చేసుకుంటాడని కాబట్టి ముందు మానవుడు బయట శత్రువులకంటే అంతశ్శత్రువులను జయించాలని హితువు పలికాడు. అలాగే అంతశ్శత్రువులను జయించడం అంత సులభంకాదని, బయట శత్రువులను ఒక గడియలో జయించవచ్చని వక్కాణించాడు. కాబట్టి ప్రతి మనిషికి ఇంద్రియ నిగ్రహశక్తి అత్యంత అవసరమని, వాటిని తన ఆధీనంలో ఉంచుకుంటే ప్రతి మానవుని జీవితం స్వర్గధామమని ఈ క్రింది ప్రహ్లాదుని మాటలను బట్టి చెప్పవచ్చు.

"లోకములన్నియున్ గడియలోన జయించిన వాడవింద్రియా
నీకము జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధు( జేయు నీ
భీకర శత్రులార్వురు( బ్రభిన్నుల( జేయుము ప్రాణికోటిలో
నీకు విరోధి లే(డొకడు నేర్పున( జూడుము దానవేశ్వరా!"

267వ పద్యం - 8వ అధ్యాయం - సప్తమాశ్వాసం.

మానవునికి జ్ఞానసంపద ఎంత అవసరమో ఇంద్రియ నిగ్రహశక్తి కూడా అంతే అవసరమని మనకు తెలుస్తున్నది. మానవుని మనసు గుర్రంలాంటిదని, దానిని జ్ఞానమనే కళ్ళెంతో బంధించాలని ప్రహ్లాదుని ప్రబోధం వల్ల మనకు తెలుస్తుంది. ఇంద్రియ నిగ్రహం లేని మనిషి అత్యంత ప్రమాదకారియని మనం ఈ సందర్భంగా గ్రహించవచ్చు. అది అతనికే కాదు యావత్ సమాజానికి కూడా ప్రమాదం. కాబట్టి మానవుడు బుద్ధిబలంతో ఇంద్రియ నిగ్రహశక్తిని కలిగివుండాలని, అప్పుడే అతనిలోని అంతర్గత శక్తులను జయించడం సాధ్యపడుతుందని చెప్పవచ్చు.

ఇలా ప్రహ్లాదుడు మానవులందు సమదృష్టి ఉం డాలని, మానవ జీవితం శాశ్వతం కాదని, మానవునిగా జన్మించడం ఎంతో అదృష్టమని, అలాంటి జీవితాన్ని అజ్ఞానంతో వృథాచేసుకోకూడదని, కామక్రోధాది బంధాల్లో

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

చిక్కుకొని కోరికలకు వసమై పతనం చెందకూడదని, మానవుడు స్వార్థ పరత్వాన్ని విడనాడి దయాదాక్షిణ్యాలు పెంపొందించుకోవాలని నేటి మానవ సమాజానికి చక్కగా ప్రహ్లాదుడు ప్రబోధించాడని చెప్పవచ్చు. నేటి సమాజంలో స్వార్థపరులు ఎలా స్వైరవిహారం చేస్తూ అధర్మ, అన్యాయ, అక్రమ మార్గాలలో ప్రవర్తిస్తున్నారో వారిని సన్మార్గంలో నడిపించడానికి ప్రహ్లాదుని విశ్వమానవతా విలువలు ఎంతగానో దోహదపడుతాయని భావిస్తున్నాను.

**ఆధార గ్రంథం :**

1. శ్రీమదాంధ్రమహాభాగవతం - టి.టి.డి ప్రచురణలు
2. తెలుగు సాహిత్య సమీక్ష - నాగయ్య .జి
3. తెలుగు సాహిత్య చరిత్ర - శాస్త్రి . ద్వా. నా..

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# కొత్త క్యాలెండర్ - సరికొత్త కవితావిష్కరణ

- డా॥. పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

'కష్టజీవి' కి ఇరువైపులా ఉండేవాడు కవి. 'సమాజం', సమాజానికో చరిత్ర, చరిత్రకో పరిణామక్రమం, ఆ పరిణామక్రమాన్ని వేగవంతంగా నడిపించేవాడు కవి అన్నాడు శ్రీశ్రీ. అయితే 'కవి' కవిగా కరిగిపోయి కవితగా ప్రపంచంలోకి ప్రవహించి, జనంలోకి ఇంకిపోయి, మనుషులలో మానవతా మొక్కగా మొలకెత్తి, మనసులో పరిమళాలు చక్కగా ప్రసరించాలి అంటాడు రావిరంగా రావు. ఇటీవలే రావిరంగరావుగారు 'కొత్త క్యాలెండర్' పేరుతో కవితా సంపుటి వెలువరించారు. సంవత్సరానికి సంవత్సరానికి కాలెండర్ మారుతూనే ఉంటుంది. కాలెండర్ మారినా కొత్త కాలెండర్ వచ్చినా రోజూవచ్చే ఉదయం మారదు, విచ్చుకునే వెలుగుపుష్పం ఆగదం టాడు. సూర్యుడికి చీకటి మసిపూయక మానదని, వెలుతురు బంగారం దోచుకోవటం ఆపదని అంటాడు. కాలెండర్ మారుతుంది కాని బతుకులు మారవని, కాక పోతే బతుకురంగుని ఓసారి చూసుకోవచ్చని, అవసరమైతే మళ్ళీ తీర్చిదిద్దుకోవచ్చని, ఏవేవో కొత్త రంగులు మన తృప్తి కోసం పూసుకోవచ్చంటాడు. కొత్త సంవత్సరం అంటే పాతకాలెండర్లను చీకటిలోకి తోసేసి, కొత్త క్యాలెండర్ను నిట్టనిలువునా దేవుడిలా నిలబెట్టటం అంటాడు. క్యాలెం డరు మారిందని పూసే పూలు పూయకమానవు, పూసినవి రాలకా మానవు. కాయలు పండకా ఆగవు, పండినవి పడిపోకా మానవంటాడు.

జీవనం పరుగులో అలిసిన మనిషికి
క్షణకాలం ఆగినపుడు మంచినీళ్ళు అందించే
దారిసత్రం ఈ కొత్త సంవత్సరం,
మళ్ళా మనిషి పరుగు మొదలు పెట్టాల్సిందే
చివరి మైలురాయి చేరేదాకా సాగాల్సిందే.

జీవన చదరంగంలో జీవితపు పరుగులు చివరి మజిలీ వరకు సాగాల్సిందే అంటాడు. నీ ప్రయాణంలో చీకటి ముక్కలు కిందపడితే అవి రేపు ముళ్ళ చెట్లయి జాతి గమనాన్ని చంపేస్తాయి. నీ ప్రయాణంలో చెమట కిర ణాలు వదిలిపెడితే అవి రేపు నేలమీద పండి నలుగురినీ బతికిస్తాయి అంటాడు.

నేటి మన కష్టమే, రేపటి భవిష్యత్తుకు ఉజ్వల ప్రగతి ఫలం అవుతుందన్న భావన వ్యక్తం చేసాడు. జీవన ప్రయాణంలో నీవు ఉషస్సుకి ఊపిరి అవ్వాలి గాని చీకటి ముక్కలు కిందపడితే అవి రేపు ముళ్ళచెట్లయి జాతి గమనాన్ని చంపేస్తాయన్న దూరదృష్టి భావన కూడా కన్పిస్తుంది. కాలగమనంలో ఎన్నో మార్పులు వస్తూనే ఉన్నాయి. ఇంకా పాత కవితలెందుకు? కొత్త కవిత మొద లెట్టి, గుండెలోని దిష్టిబొమ్మల ప్రతిరూపాలను తొలగించి దేశాన్ని దేవతగా నిలబెట్టమంటాడు. పల్లెల్లో సజీవ శిల్పాలుంటాయి. వాటిని చూసి సరికొత్త శిల్పానికి శ్రీకారం చుట్టు. 'కృషి'ని గుండెలో నాటుకుని ప్రపంచం కోసం మంచిపంట పండించమంటాడు. అపుడే ప్రజలందరూ నిన్నే కొత్త కాలెండర్గా బతుకుగోడ మీద ఎదురుగా పెట్టుకొని నిత్య పూజలు చేస్తుంటారని పేర్కొన్నాడు.

జీవితంలో ప్రతిక్షణం చాలా విలువైనదే. జీవితమంతా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, భూగోళమంత బంతి నీదే అయినా సూదిమొనంత కన్నమైనా పడకుండా చూసుకోవాలని పిలుపునిచ్చాడు. ఒక్క క్షణం చాలు ఏమైనా జరగవచ్చు. కళ్ళు మూతపడితే ఒక్క క్షణం చాలు వెలుతురు కుంటిది కావచ్చు, చీకటి కుర్చీ ఎక్కొచ్చు అంటాడు. కొద్దిపాటి నిర్లక్ష్యం కొండంత సమస్యకు దారితీస్తుంది అన్నభావన స్ఫురిస్తుంది.

ఈనాడు సమాజంలో ఎంతటి గొప్పవాడయినా తన స్థాయికి తగిన పని అనే గనిని కనుగొనాల్సిందే. గనుల లోని ఖనిజాల్ని కష్టించి తవ్వి తీయాల్సిందే అంటాడు. గనులలో బొగ్గు, బంగారం, నీళ్ళు, పెట్రోలు, మట్టి,

మణులు ఇలా ఏదైనా దొరకొచ్చు కాని అందులో పని ముఖ్యమని, పనిలో ఏది దొరికినా అది దేశం ఖాతాలోనే వేయాలంటాడు. గని నీ దేశం గుండెకాయ, అది అందరికీ అందించాలి నెత్తురు అంటాడు.

దినపతి సూర్యుడు ఉదయం ఆరు గంటలకు అటు ఇటుగా ఉదయిస్తాడు. మనిషి గుండె నిముషానికి 72 సార్లు అటో ఇటో కొట్టుకుంది. అధికారి మాత్రం ఆఫీసుకి పది గంటలకు అటో ఇటో వస్తానంటాడు. ఇటువైపు ముందెపుడూ రాడు కాని అటు తర్వాత ఎపుడొస్తాడో తెలియదంటాడు.

ఒకరోజు ప్రమాదంలో గాయపడి
అధికారి ఆసుపత్రి పాలయ్యాడు
ప్రమాద పరిస్థితిని అడిగితే
''అటో ఇటో'' అన్నాడు డాక్టరు...

అంతే చావకుండా బతకాల్సినవాడు కూడా 'అటో, ఇటో' అనేసరికి అధికారి గుండె ఆగిపోయింది. ఆఫీసులో ఓ పనయిపోయిందంటాడు. ప్రతి ఒక్కరు బాధ్యతా యుతంగా ప్రవర్తించాలి. లేకపోతే ఎవరికైనా కర్మణాను సారం ఫలితం ఉంటుంది. సమాజంలో ప్రతిఒక్కరు వృత్తిని దైవంగా భావించి బాధ్యత నిర్వర్తిస్తే ఉత్తమ సమాజం ఆవిష్కరిస్తుంది అన్న భావన రంగారావు గారి కవిత్వంలో కనిపిస్తుంది.

అద్దం అద్దంలా పని చేయాలని, నీ మనసు కూడా మంచి అద్దంలా వుండాలని కొత్త అద్దంలో పాత మనిషిని చూడు స్పష్టంగా కనిపిస్తాడు. పాత అద్దంలో మాత్రం కొత్త మనిషిని చూడకు సరిగా అర్థంకాడు, నీకన్నీ విడ్డూరాలే గోచరిస్తాయి అంటాడు.

సమాజంలో మనిషి ఏ విధంగానైనా ఎదగాలను కుంటున్నాడు. అవసరమైతే పక్కవాణ్ణి నెట్టుకుంటూ, వీలయితే పడదోస్తూ, కుదిరితే తొక్కేస్తూ దూకుడు ప్రయాణం చేసి ఎదుగుతారు.అయితే ఇలా ఎదగడమే జీవితం కాదు. వెనక్కి తిరిగి చూసుకోవాలి. ఆత్మ పరిశీలన చేసుకోవాలి. చీకటిపడినా అలాగే ముందుకు దూసుకు పోతానంటావా అయితే చీకటిలో కలిసిపోతావు జాగ్రత్త! అంటూ కవి హెచ్చరిస్తున్నాడు.

''ప్రయాణంలో సాయం సమయం
గమనించినవాడే జ్ఞాని
భూగోళం ఎంత ఆక్రమించినా
చీకటి కమ్మేలోగా స్వస్థలం చేరడానికి
తిరుగు ప్రయాణం మొదలుపెట్టినవాడే సుజ్ఞాని''

తిరుగు ప్రయాణం అంత సులభమైనది కాదని బయలుదేరినపుడు ఎలా ఉన్నావో తిరుగు ప్రయాణంలో కూడా అలానే ఉండాలని, అలా వస్తేనే కౌగిలించుకుం టుంది నీ తల్లి, అలా వస్తేనే కలిపేసుకుంటుంది నీ గడ్డ అంటాడు. జీవితంలో 'తిరుగుప్రయాణం' తెలియనివాడు చెట్టును శాశ్వతంగా పోగొట్టుకున్న పక్షిలాంటివాడు; తల్లి ఒడిలోకి రాకుండా తప్పిపోయిన పిల్లవాడని పేర్కొన్నాడు. ఎవడికి వాడు తన చుట్టూ గట్టిగా గోడలు కట్టుకొని పగిలిన వెలుతురు అద్దంతో చీకటిలో కులుకుతున్నాడని, తన చుట్టూ అదృశ్య దుర్భేద్య సౌందర్యలోహకవచాలు కట్టుకొంటున్నాడని మరి నీవు చీకటి గరళమవుతావో! నీలోంచి బయటపడి, మనుషుల కోసం సూర్యపరిమళ మవుతావో! అని అడుగుతున్నాడు.

మనసున్న నిశ్శబ్దం 'హంస', మనసులేని శబ్దం 'హింస' అంటాడు. ఆకాశం మొక్కకు పూచిన పువ్వులు చుక్కలు. కాంతుల పరిమళాలు వెదజల్లుతుంటే అందరి కళ్ళు ఆ పువ్వులమీదే పడ్డాయంటాడు.

ఈ పువ్వులతో
చీకటిదేవుడిని పూజిస్తున్నారు కొందరు,
ఈ పువ్వులను
చంద్రభామకు బహుమతిగా ఇస్తున్నారు కొందరు,
ఈ పువ్వులతో
మాలకట్టి రాత్రి పెద్దమనిషి మెడలో వేస్తున్నారు
కొందరు
ఈ పువ్వుల్ని
ఎండబెట్టి ఔషధాలుగా వెలిగిస్తున్నారు కొందరు

సమాజంలో రకరకాల మనుషులు రకరకాల భావా లతో, రకరకాలుగా పువ్వులను వినియోగిస్తున్నారు. ఈ పూలు విజయం కంఠసీమలో ఆభరణాలు అని, అపజయ

మృత్యుపేటిక మీద రాసే విషాద చరణాలు అని రచయిత పేర్కొన్నాడు. గాలిని దైవంగా భావిస్తాడు. గాలిని మించిన అమ్మ ఈ సృష్టిలో ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నిస్తాడు? గాలి నుండి నన్ను విడదీయాలని చూస్తే "గాలిలోనైనా కలిసిపోతాను కాని గాలిని వదిలిపెట్టి బతకలేను, గాలి లేకుండా చావలేనంటాడు.

ఒక బియ్యం గింజను మోసుకొని పోతున్న
చిన్నారి చిట్టి చీమను చూస్తుంటే
చిటికెన వేలుమీద పర్వతాన్ని మోస్తున్న శ్రీకృష్ణుడు
గుర్తొస్తాడు
స్వేదకణం మీద నిఖిల ప్రపంచాన్ని భరిస్తున్న
శ్రామికుడు కనిపిస్తాడు

పట్టుదలకు పుట్టినిల్లు చీమలని, ప్రాణికోటి మొత్తాన్ని జయించాలనే తలంపుతో చీమలు పుట్టాయేమో అని 'చిన్నారి శ్రమజీవి చీమ' కవితలో పేర్కొన్నాడు. తీర్మానాలంటే క్రమశిక్షణకు కొలమానాలు అని తీర్మానాలంటే, కాగితాల మీద విరిసే పరిమళాల పువ్వులని, నిర్భయంగా తిరిగే వెలుతురు గువ్వలని, 'తీర్మానాలు' కవితలో వ్యక్తం చేశాడు.

ఒకటి దేహం, ఒకటి దేశం. ఈ రెండు ప్రపంచాల్ని
కలిపే మనస్సు ద్వారం
ఒకటి వెలుతురు
ఒకటి చీకటి
ఈ రెండు ప్రపంచాల్ని కలిపే సంధ్య ద్వారం
ఒకటి మెలకువ
ఒకటి నిద్ర
ఈ రెండు ప్రపంచాల్ని కలిపే ధ్యానం ద్వారం
ఒకటి ప్రగతిమార్గం
ఇంకొకటి ఆధ్యాత్మిక మార్గం

ఇలా ఎన్ని దార్లలోనైనా ప్రయాణం చేసి జీవన ప్రగతి వికాసానికి గమ్యం చూపే మార్గదర్శి రంగారావుగారు.

మనుషులు చాలామంది జంతువులైపోయారు, అందుకే ప్రపంచాన్ని గడ్డిపాలంగా మార్చారు. ఇప్పుడు ఎక్కడ చూసినా ఎవడికి వాడే గడ్డిని బాగా పెంచుకుంటున్నాడు, తప్పనిసరై కొందరితో పంచుకుంటున్నాడు... అని అన్నం తిని బతికే మనుషుల్లారా! గడ్డితిని బతికే వాళ్లతో జాగ్రత్తగా ఉండమని ప్రబోధిస్తున్నాడు. కంచంలాగే మంచం కూడా చాలా ముఖ్యం. నాలుగు కాళ్ళను నాలుగు దిక్కుల మీద పెట్టి నాలుగు చేతులతో గట్టిగా పట్టుకొని మనభారం మోసే మంచం మహాత్యాగిగా పేర్కొని అదే పనిగా మంచాన్ని కౌగిలించుకొనేవాడు, భోగి కాదు రోగి అని శ్రమించి వచ్చి అలా పడుకొనేవాడు 'యోగి' అని నాలుగు కాళ్ళను నాలుగు దిక్కుల మీద పెట్టి నాలుగు చేతులతో గట్టిగా పట్టుకొని మన భారం మేసే మంచం మహాత్యాగి అంటాడు. మంచం మమతల తల్లి, మధురప్రేమ పంచే చెల్లి, కమ్మదనం చల్లే మల్లిగా అభివర్ణించాడు. ఎపుడైన మనిషి మృగం అయితే అయ్యాడు కాని ఇపుడు మనిషి మహాధికార దేవుడు కావడానికి అడ్డమైన దేవేంద్ర కృత్యాలన్నీ చేస్తున్నాడన్న మాట అంటాడు. తన పీఠం పదిలంగా ఉండటానికి ఇంద్రుడు చేసే కృత్యాలన్నీ మనిషి అధికార దాహంతో మహాధికార దేవుడు కావడానికి చెయ్యాల్సిన అడ్డమైన కృత్యాలన్నీ చేస్తున్నాడు. వర్షం కవితలో "మనుషుల్ని కడుగుతున్న వర్షం మనసుల్ని కూడా కడిగితే ఎంత బాగుంటుంది"! అంటాడు. ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా కుండ బద్ధలుకొట్టినట్లు మానవాభ్యుదయం కోసం కలాన్ని ఖడ్గంలా ఝుళిపించాడు రావిరంగారావు గారు.

బతికితే చెట్టులా బతకాలి
పోతే పిట్టలా పోవాలి
మనం నడిచిన ఈ నేల మీద
మన మురికి పాదముద్రలు పడకుండా వెళ్ళిపోవాలి
నలుగురూ నడిచేదారుల్లో
మనం నాటిన ముళ్ళు తొలగించి వెళ్లిపోవాలి.

జీవించిన జీవితం చావులో తెలుస్తుందంటారు. మన జీవిత పయనం సమాజంపై చెరగని ముద్ర వేయాలి. పరోపకార మార్గం పదిమందికి ఆదర్శం కావాలి అన్న భావన "చెప్పివెళితే బాగుంటుందేమో!" అనే కవితలో

వ్యక్తం చేశాడు. మొదటి అట్ట జననం, చివరి అట్ట మరణం, రెండు అట్టల మధ్య ప్రవహించే జీవనసారం పుస్తకం అంటాడు.

"సూర్యుడు చేసే పని
ప్రపంచ దేహాన్ని చకచకా కత్తెర్లతో కోసి
అనారోగ్య భాగాన్ని తీసేసి
ఆరోగ్య అనుబంధంతో ఆపరేషన్ - పగలు
చీకటి పడేవేళకు
సూర్యుడు ప్రిస్క్రిప్షన్ రాస్తాడు
ఆపరేషన్ తరువాత కుట్లు కట్టి
నెమ్మదిగా చల్లని గదిలోకి చేర్చి
మత్తుగా నిద్రపుచ్చుతున్న విశ్రాంతి - రాత్రి"

పగలు, రాత్రిని "డాక్టరు సూర్యుడు" కవితలో విభిన్నంగా వ్యక్తం చేశాడు. సృష్టిలో నేనే గొప్పవాణ్ణని చెలరేగిపోతున్న మనిషి చెట్టును, కొండను, మట్టిని చూడాలి, గంభీర మౌనధైర్యాన్ని చదవాలి. చదివాక తానెంత అల్పుడో అని అర్థం చేసుకొని ప్రకృతిలో మరింతగా ఒదగాలి అని రచయిత అభివ్యక్తం చేశాడు.

చీకటి నీళ్ళలో కొన్ని పాలు కలిపి మొత్తం పాలే అని అధికారపక్షం చెప్తుంది. ఉన్న కొన్ని పాలలో మురికి నీళ్ళు పోసేసి మొత్తం చీకటి అంటోంది ప్రతిపక్షం. ప్రజలకు దూరంగా ప్రవహిస్తున్నది పాలనది. పాలులేక గుక్కపట్టి ఏడుస్తున్న పసిపిల్లలా నా దేశం ఉందని "అందరూ పాలదొంగలే" కవితలో వ్యక్తం చేశాడు.

ప్రపంచంలో సూర్యుణ్ణి కూడా తిట్టేవాళ్ళున్నారంటాడు.

"పొద్దున్నే నెత్తురోడేలా
తూర్పును గాయపరుస్తున్నాడట
పువ్వులాంటి భూమి మీద
కిరణాల కత్తులు గుచ్చుతున్నాడట"

"ఏడు గుర్రాల రథంతో జనాన్ని తొక్కుకుంటూ
దుష్ట చక్రవర్తిలా రహదారుల్లో సాగిపోతున్నాడట!
సాయంత్రం చీకటి భవనం తలుపులు పగలగొట్టి
రాత్రి చంద్రుడిగా సింహాసనం మీద కూర్చొని
చుక్కలతో శృంగార రాజ్య విహారం చేస్తున్నాడట"

సమాజంలో సూర్యుణ్ణి తిట్టేవాళ్ళు తగ్గాల్సింది పోయి రోజురోజుకి పెరుగుతున్నారని పగటి ప్రాణాన్ని క్రమంగా పీల్చేసి రాత్రిని చిరంజీవిగా నిలపటానికి అదేపనిగా బతుకుతున్నారని రచయిత వినూత్న కోణంలో ఆవిష్కరించాడు. మనిషికి ప్రధానమైనది మనస్సు. మనసులో నాటే బీజాలను బట్టి ఆలోచనల వృక్షాలు మొలకెత్తుతాయి, పుష్పిస్తాయి, ఫలిస్తాయి. ఔషధమైనా, విషమైనా మనసు లోంచే తయారయ్యేది! మనసులో పుట్టేదే బతుకంతా పాకేది అని "మనసు" కవితలో పేర్కొన్నాడు.

మట్టి అంటే క్షేత్రం. బీజాలను సృష్టించగలదు. పురుషుడు సాగిలపడి మొక్కుతుండాలి అని "సూర్యుడైనా మట్టిని సృష్టించలేడు" కవితలో వ్యక్తం చేశాడు. ఆకాశం మనసులోని కోరిక చంద్రబింబం, పెరుగుతుంటుంది, తరుగుతుంటుంది. ఏ కోరికలేని జీవితం అమావాస్య; లోకకళ్యాణ సంపూర్ణకాంక్ష పున్నమి అంటాడు. పుస్తకం ఒక తియ్యని సముద్రం అని సముద్రాన్ని చేతిలోకి తీసుకుంటే విశ్వం లోతులు తెలుస్తాయి. విశ్వం లోతుల్ని మించిన నీ లోపలి లోతులు కూడా మెరుస్తాయి అంటాడు. భూమిలో పడిన విత్తనం మెల్లగా నిద్రలేచి తలెత్తటమే ప్రశ్న అని అయిపోయిందనుకున్న మోడు చిగురును ప్రకటించటమే ప్రశ్న అని, ప్రశ్న ఒక వెలుతురు అని, ప్రశ్న ఒక అగ్గిపుల్ల అని దాన్ని సరిగా వినియోగించు, ప్రశ్న ఒక ఆడపిల్ల అని, ఆమెను సున్నితంగా గౌరవించమంటాడు. ఆరిపోయింది దీపం కాదు 'మనిషి' అని 'మనిషి ఆరిపోతే' కవితలో వ్యక్తం చేశాడు. ఇలా సమాజంలో ఎన్నో పార్శ్వాలను తన కవిత్వం ద్వారా మానవాభ్యుదయాన్ని కాంక్షించి రావిరంగారావు గారు 'కొత్త క్యాలెండర్' పేరుతో అక్షర సృజన చేశారు.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# పాల్కురికి సోమనాథుడి రచనల్లో వైద్య విజ్ఞానం

– డా॥. పంతంగి వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

పాల్కురికి సోమనాథుడు రాసిన బసవపురాణం, పండితారాధ్యచరిత్ర కావ్యాలు విజ్ఞాన సర్వస్వాలలాంటివి. పేరుకు పురాణాలు అయినప్పటికీ అవి చారిత్రక మహా కావ్యాలు. తన కాలానికంటే కొంచెం ముందు జీవించిన బసవేశ్వరుడు, మల్లికార్జున పండితారాధ్యుడి జీవిత చరిత్రలే ఇవి. అంతే కాకుండా అనేక మంది శివభక్తుల కథలు ఈ కావ్యాల్లో చెప్పబడ్డాయి. సమకాలీన భక్తుల కథలతోపాటు సమకాలీన విషయాలను ఎన్నింటినో సోమనాథుడు ఈ కావ్యాల్లో పొందుపరిచాడు. ముఖ్యంగా భక్తుల కథలు చెపుతున్న సందర్భాలలో వివిధ రోగాలకు ఎలాంటి చికిత్సలు చేసేవారో తెలుస్తుంది. వాటిలో కొన్నింటిని పరిశీలించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

## వాత రోగాలు :

బసవపురాణంలోని మూడో ఆశ్వాసంలో 'నాట్యన మిత్తండి' అనే కథ ఉంది.వాతరోగాలు, వాటికి సంబంధించిన చికిత్సలను గురించి పాల్కురికి సోమనాథుడు ఇందులో చెప్పాడు.

నాట్యనమిత్తండి కాంచీపురం నివాసి. గొప్ప శివభక్తుడు. ఒకరోజు కాంచీపురంలో ఉన్న ఏకామ్రనాథుడి గుడికి వెళతాడు. అక్కడ ఆయనకు శివుడు వంకరలు పోయి కనపడతాడు. 'దేవుని దివ్యతనువు వంకరలు పోయి కన్పిస్తుందేమిటి?' అని మనసులో అనుకొని వెంటనే అక్కడున్న పూజారిని పిలిచి అడుగుతాడు. ఈశ్వరుని నడుము అటువైపుకు కొంచెం వంగి ఉంది.గౌరీశ్వరుడి చేతులు ఏమిటో అదో రకంగా వంకర పోయి ఉన్నాయి. మూడు వంకరలతో ఒక పాదంపై శివుడు నిలిచి ఉన్నాడు. రెప్పలు కనపడటం లేదు. శివుడి శిరస్సు పక్కకు వాలి ఉంది. జటాజూటం వీడిపోయింది. చాలా చోద్యంగా ఉంది కారణం ఏమిటి? అని నాట్యన మిత్తండి అడిగిన ప్రశ్నలకు ఆ పూజరి ఇలా అంటాడు.

"ఈ శివునకు రోగమిట్టలైనదియు
వాయుదోషము, దీని వారింపకున్న
గాయజహరునకు గడు ప్రమాదంబు
దడసిన నింకొండు దలచిన శివుని
యొడలెల్ల గూడ నిప్పడ కొంకువోవు"

ఈ శివునకు వాయుదోషం ప్రకోపించింది. ఇప్పుడు వైద్యం చేయకపోతే ఇంకా ప్రమాదం. నిర్లక్ష్యం చేస్తే ఈ వంకరలే కాదు, చాలా వంకరలుపోతాడు. వెంటనే ఈ వ్యాధికి చికిత్స అవసరం అని చెపుతాడు. ఇందులో వంకరలు పోతాడు అని చెప్పడం వల్ల ఇది వాతరోగం అని తెలుస్తుంది. శరీరంలో వాతం, పిత్తం, కఫం అనే మూడు ధాతువులు ఎప్పుడు సమత్యలంగా ఉండాలి. వాతం అంటే గాలి, పిత్తం అంటే అగ్ని, కఫం అంటే నీరు. ఈ ధాతువుల సమతుల్యం ఎప్పుడైతే దెబ్బతింటుందో అప్పుడు ఆరోగ్యం చెడిపోతుంది. వాయుదోషం వల్ల వచ్చే జబ్బులను వాతరోగాలు అంటారు. ఇవి మొత్తం 80 రకాలుగా ఉంటాయని ఆయుర్వేద వైద్య శాస్త్రం చెపుతుంది. ఈ జబ్బులు వస్తే కీళ్ల కణుపులు బిగిసిపోతాయి. చేతులు, కాళ్లు, వీపు, నడుము, మెడ ఈ అవయవాలన్నీ బిగుసుకొని నొప్పులు మొదలవుతాయి. ఇవి ఈ జబ్బు లక్షణాలు. ఒకే రకమైన పదార్థాలను ఎక్కువగా తినడం వల్ల వాతరోగాలు వస్తాయని ఆయుర్వేద వైద్యులు చెపుతారు. పాల్కురికి సోమనాథుడు వాతరోగాలకు చికిత్స ఇలా చెప్పాడు.

"తవిలి యా వావిలి చివుళులుమ్మెత్త
చివుళులు దక్కెడ చివుళులాముదము"

వావిలి చివుళ్లు, ఉమ్మెత్త చివుళ్లు, తక్కిలి చివుళ్లు, ఆయుదపు చివుళ్లు, ఆముదపు నూనె ఇవన్నీ కలిపిచేసిన మందును శరీరానికి మర్ధన చేయాలి. ఆ మందుతో శరీరానికి మర్ధన చేసిన తరువాత వేడి చేసిన ఇసుకను

గుడ్డలో చుట్టి కాపాలి. అరచేతులను బాగారాసి ఆ వెచ్చదనాన్ని కూడా నాట్యన మిత్తండి శివుడికి కలిగించాడు. ఇట్లా రోజూ చేస్తూ పథ్య పదార్థాలనే ఆరగింపుగా ఇచ్చాడట. ఆయుర్వేదంలో పథ్య పదార్థాల అవసరాన్ని కూడా ఈ కథ చెపుతుంది.

## నేత్రవ్యాధులు :

బసవపురాణంలోని ఉడుమూరి కన్నప్ప కథలోను, పండితారాధ్య చరిత్రలోని మరికొన్ని భక్తుల కథల్లోనూ నేత్రవ్యాధులకు సంబంధించిన విషయాలను సోమ నాథుడు చెప్పాడు. శివునికి కళ్ల నుండి నీరు కారుతున్న సందర్భంలో

"చెప్ప జిత్రము,గోడి తెప్ప వెర్గినదో
తప్పవోనోపునో? పొరగప్పెనో? మాదతెవులో
పువ్వు వట్రిల్ల నాపువు కంటిపోటో?
మయిల వడదియొ దుర్మాంస దోషంబొ?
అయిరయో వెండియు నక్షిరోగంబొ"

అని కన్నప్ప అనుకుంటాడు. లోపల ఏదైన కోడిరెప్ప పెరిగిందేమో! దుర్మాంసమేమైనా పెరిగిందా? పొర గప్పిందా? మాదతెగులా? పువ్వు తయారవుతుంటే ఆ పువ్వు కంటికి సంబంధించిన పోటా ఏమిటి? అంటూ కన్నప్పకు కలిగిన సందేహాల ద్వారా కొన్ని రకాల కంటి వ్యాధులను సోమనాథుడు తెలియజేస్తాడు.ఈ కంటి జబ్బుకు మందు, మాకు ఏమిటో? అంటూనే కొన్ని సపర్యలు చేశాడు. కంట్లో నలుసు పడిందేమోనని కంటిరెప్పలను ఎత్తి ఊదాడు. నాలుకతో కనుగుడ్డు చుట్టూ తిప్పాడు. వస్త్రాన్ని ముద్దగా చుట్టి నోటితో ఆవిరి చేసి కంటికి తాకించాడు. ఈ పద్ధతులు ఇప్పటికి ఆచరణలో ఉన్నవే. కళ్లల్లో ఎప్పుడో పడ్డ రాళ్లను కూడా నాలుకతో కనుగుడ్డు చుట్టూ తిప్పి తీసేవారిని ఇప్పటికి గ్రామాల్లో అక్కడక్కడ చూస్తూనే ఉన్నాం.

బసవపురాణంలోని ఈ కన్నప్ప ధూర్జటి శ్రీ కాళహస్తి మహత్యంలో తిన్నడిగా కనిపిస్తాడు.ధూర్జటి కాలం నాటికి కళ్లకు సంబంధించి కొన్ని కొత్త చికిత్సలు కన్పిస్తాయి. శ్రీకాళహస్తి మహాత్మ్యంలోని తిన్నడు శివునికి కంటినీరు కారుతున్న సమయంలో తంగేడు ఆకును నెత్తిపై మొత్తాడు. తెల్ల దిరిసిన పువ్వు రసమును కంట్లో పోశాడు. కలివె పువ్వు రసాన్ని కంట్లో పిండాడు. పేరిన నేతిలో దూదిని ముంచి కంటిపై అద్దాడు. చనుబాలను తెచ్చి కంట్లో పోశాడు.ధూర్జటి కాలానికి ప్రజలకు తెలసిన నేత్ర వైద్యం ఇది.

పండితారాధ్య చరిత్రలో కూడా సోమనాథుడు కొన్ని రకాల నేత్రవ్యాధులను పేర్కొన్నాడు.

"దప్పవోయిన కన్ను దడికన్ను బొరయ
గప్పినన్గుడ్కు గన్నొడ్డు కన్ను
గ్రుడ్డి కన్నెరిగన్ను గోడ్రెప్ప కన్ను
పాల గట్టిన కన్ను బ్రంగుడు కన్ను
గ్రాలు కన్నును నీరుగారెడు కన్ను
బ్రొంద కన్నును బొరిబొరి బ్రుస్సు కన్ను"

మొదలైన ఎన్నో రకాల నేత్రవ్యాధులున్న వారు చికిత్స కోసం వచ్చేవారట. బసవ పురాణం, పండితారాధ్య చరిత్రలో అనేక నేత్ర వ్యాధుల ప్రస్తావన తీసుకరావడాన్ని బట్టి పాల్కురికి సోమనాథుడికి వైద్యం పట్ల,వ్యాధుల పట్ల ఎంతటి లోతైన అవగాహన ఉందో అర్థమవుతుంది. ఉడుమూరి కన్నప్ప కథలో కన్నప్ప తన కళ్లు తీసి శివునికి అమర్చడం, పండితారాధ్య చరిత్రలో పండితుడు తన కళ్లను పెకిలించుకోవడం ఈనాటి కంటి శస్త్ర చికిత్సలను గుర్తుకు తెస్తాయి. కళ్లు తీసి కళ్లు పెట్టవచ్చు అన్న ఆలోచనకు ఇక్కడే నాంది జరిగిందేమో అని కూడా అన్పిస్తుంది. పండితారాధ్య చరిత్రలోని మహిమ ప్రకరణంలో 'ఇరిత్తాండారి' కథ ఉంది. ఇరిత్తాండారి గుడ్డివాడు. ఈ గుడ్డివాడి కథ చెపుతూ పాల్కురికి సోమనాథుడు భక్తుల మాటల ద్వారా కన్నప్ప త్యాగాన్ని వివరిస్తాడు.

"నా కళ్లు లేకపోతే ఎట్లా? అనుకోలేదు. కన్నప్పదేవర ఒక్కడే కదా! ఆయన మాత్రమే ఏకైక దృష్టాంతం కదా, అప్పటి నుంచి ఇప్పటి వరకు గౌరీశ్వరుడికి కళ్లు ఇచ్చిన మొట్టమొదటి మహాభక్తుడు. ఇక తక్కిన భక్తులున్నారంటే ఉగ్రుడి నుంచి కళ్లు తీసుకున్న వాళ్లెందరెందరో ఉన్నారు

కాని ఖర్గుడికి కళ్లచ్చిన వాళ్లు కన్నప్ప తప్ప మరెవ్వరూ లేరు.....కన్నప్ప త్యాగం నభూతో నభవిష్యతి''(బసవ పురాణం, అక్కిరాజు రమాపతిరావు వచనానువాదం) అని భక్తులు కన్నప్ప త్యాగాన్ని గురించి చెప్పుకుంటారు.

వెలనాటి చోడుని ఆస్థానంలో పండితారాధ్యుడు తన కళ్లు పెకిలించుకున్న విధానాన్ని అద్భుతంగా వర్ణిస్తాడు కవి.

''కొంచెం ఎడుమ పక్కకు మెడవాల్చి కుంభకం సాధించి, భుజాలు నిక్కజేసి, అనువుగా తన ఎడుమ చేతి వేళ్లతో కనురెప్పలు ఒత్తిపట్టి, అవి వాలి పోకుండా చేసి, సాహసంతో తన కుడి చేతితో గోరుగల్లు తీసుకొని, కుడి కన్ను కొలికిలో ఉంచి, నేర్పుగా, నెమ్మదిగా కంటి గుడ్డు చెడిపోకుండా, చిద్రుపలు కాకుండా, ఆ గుడ్డూ చుట్టూ గుచ్చి,ఒకసారి తిప్పి, గుడ్డును పెరికి పెకల్చి బయటికి తెప్పించి, కొలకుల నరాల నుంచి ఆ గుడ్డు విడిపోయేట్లుగా చేసి'' (బసవ పురాణం, అక్కిరాజు రమాపతిరావు వచనానువాదం) అంటూ వర్ణిస్తాడు. ఆపరేషన్ థియోటర్‌లో డాక్టరే ఇట్లా తొలగిస్తున్నాడా అనిపిస్తుంటుంది ఈ వర్ణన చూస్తే.

## బెజ్జ మహాదేవి - బాల్యోపచారాలు :

బసవ పురాణంలోని బెజ్జ మహదేవి కథలో..... బెజ్జ మహదేవి శివుడికి చేసిన బాల్యోపచారాలు పిల్లల ఎదుగుదలకు సంబంధించిన అంశాలను వెల్లడిస్తాయి. బెజ్జమహాదేవి పసిబాలుడైన శివునికి ఇలా తలంటు స్నానం చేపిస్తుంది.

''తొంగిళ్లపై నిడి లింగమూర్తికిని
నంగన గావించు నభ్యంజనంబు
ముక్కొత్తు జక్కిత్తు ముక్కన్ను బులుము
నక్కొత్తు కడుపొత్తు నటవీపు నివురు
బెరుగంగ వలెనని తరుణి వీడ్వడగ
జరణముల్కరములు జాగంగ దిగుచు
నలుగులు నలుచు నర్మిలి గట్టిపెట్టి
జలములు వీపున జఱచు నంతంత
వెగచి బెగడకుండ వ్రెన్ను వేయుచును
నొగి మస్తకమున నీరొత్తు దోయిటను
వదనంబు సొచ్చునో యుదకంబులనుచు
నదుము బొట్టను నోరికడ్డంబు పట్టు
జెన్నుగా బసుపార్చి చేయు మజ్జనము
గన్నులు జెవులును గాడంగ నూదు
నంగిట ముల్లొత్తు నందంద వ్రేల
దొంగిళ్ల గార్నీరు దోనెత్తి మిడుచు
బడతిచే నీర దూపొడి బొట్టిడును
మడది యంగుష్ఠంబు మన్నింత మెదిచి
కడవ నంటినయట్టి పిడుక విభూతి
యడర బుత్రుని నొసలారంగ బూయు
నెత్తు గ్రుంగెడు నని యెత్తంగ వెఱచి
యత్తన్వి ఔమ్ముృన నక్కున నదుము''

శివున్ని పసివాడిగా భావించి, కాళ్లపై పడుకోబెట్టుకొని బెజ్జమహాదేవి తలంటు స్నానం చేయించేది. ముక్కు ఒత్తి, చెక్కు ఒత్తి, కన్నులు పులిమేది. అక్కుఒత్తి, కడుపుఒత్తి వీపు నిమిరేది. ఒళ్లు బాగా పెరగాలని పాదాలూ, చేతులూ సాగదీసేది. నలుగు పెట్టేది. వీపున నీళ్లు చరిచేది. భయపడకుండా వెన్నుమీద గట్టిగా తట్టేది. దోసిటితో నీళ్లు మాడు మీద పోసేది. పసుపు పెట్టి స్నానం చేయించేది. కన్నుల్లో చెవుల్లో నలుసు లేమి లేకుండా గట్టిగా ఊదేది. వేలు నోట్లో జొనిపి అంగిటి ముల్లును ఒత్తేది. చేతిలో నీరు తీసుకొని తలచుట్టూ 'తూతూ' అని తిప్పి పోసేది. చట్టిలో అడుగున ఉన్న విభూతి పూసేది. కాటుక పెడితే కళ్లు విశాలం అవుతాయని మూడు కన్నులకు కాటుక పెట్టేది.

ఇలా బెజ్జమహదేవి శివుడికి ఉపచారాలు చేసేది. 800 ఏళ్ల క్రితం తల్లులు పిల్లలకు స్నానం చేయించే విధానానికి, నేటి తల్లులు పిల్లలకు స్నానం చేయించే విధానానికి ఎటువంటి తేడా లేదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. బసవపురాణంలో చెప్పిన విధానమే నేటికీ ఆచరణలో ఉంది. ఒక విధమైన వ్యాయామం జరిగి పిల్లలు బాగా పెరగడానికి ఇటువంటివి తోడ్పడుతాయి. ఈ అభ్యంజన స్నానం వలన కఫం తగ్గి బలం, సుఖం,

నిద్ర, దేహ కాంతి కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు కూడా చెపుతారు. నలుగు పిండి పెట్టడం వల్ల శరీరంలోని శ్లేష్మం, కొవ్వు కరుగుతాయి. పసుపు రాయడం వల్ల చర్మ వ్యాధులు నివారింపబడి, బంగారు వర్ణం వస్తుందని భావి స్తారు. కాటుక పెట్టడం వల్ల కళ్లు విశాలం కావడమే కాకుండా చల్లదనం కలుగుతుంది. ప్రయోజనాలు ఉండడం వల్లే ఈ ఆచారం నేటికీ కొనసాగుతుంది.

## గొంతు వ్యాధులు :

బెజ్జమహాదేవి తల్లిలేని శివున్ని తన బిడ్డగా భావించి పెంచుతున్న క్రమంలోనే......శివుడు ఒకసారి ఆమె భక్తిని పరిక్షించాలని భావిస్తాడు. బెజ్జమహాదేవి పెట్టిన ఆహారాన్ని తినకుండా మొండికేస్తాడు. శివుడు తాను పెట్టిన ఆహా రాన్ని ఎందుకు తీసుకోవడం లేదో బెజ్జమహాదేవి ఇతరుల ద్వారా తెలుసుకొని మందలిస్తుంది. శివుడు బయటికి వెళ్లి భక్తుల ఇండ్లలో నియమం తప్పి ఆహారం భుజి స్తాడు. చిరుతొండనంబి ఇంటికి వెళ్లి ఆయన కొడుకు మాంసం వండించుకొని తింటాడు. కరికాళవ్వ ఇంటికి వెళ్లి మామిడి పండ్లు తిన్నాడు. సామవేదుల ఇంటికి వెళ్లి పెయ్య మాంసం తిన్నాడు. నిమ్మవ్వ ఇంటికి వెళ్లి ఇంకేదో తిని కడుపు నింపుకున్నాడు.

ఇలా బయిటి ఇండ్లలో ఏదిబడితే అది తింటే ఆరోగ్యం చెడిపోదా? అని బెజ్జమహాదేవి శివున్ని ప్రశ్నిం చింది. 'కొలది దప్పిన కుడ్పు కుడువంగనేల' మితిమీరి ఆహారాన్ని ఎందుకు స్వీకరించావు? అని అడుగుతుంది. తాను క్రమం తప్పకుండా ఇచ్చే పాలు, మీగడ, వెన్న వదిలిపెట్టి బయటి తిండ్లు తినడం వల్ల కడుపుబ్బడం, కడుపునొప్పి రావడం జరుగుతాయని ఆమె బాధపడు తుంది. అంతేకాకుండా-

"ఏలపల్కవు సెప్పవే అన్న నీకు
అఱిమియో? కోవయో? అంగిటిముల్లో
యెఱుగను మందు మ్రాకేమియు"

అరిమి, కోవ, అంగిటిముల్లు ఈ మూడు రకాల వ్యాధుల్లో శివునికి ఏదో ఒకటి సోకి ఉంటుందని బెజ్జ మహాదేవి భావించి బాధపడింది. అరిమి అనేది ప్రస్తుతం డిఫ్తీరియాగా పిలువబడుతుందని కోవ అంటే గొంతు గ్రంథి అని, అంగిటిముల్లు అంటే అంగిలిలో ముల్లులా పెరిగే వ్యాధి అని ప్రొఫెసర్ పాకనాటి జ్యోతి తను రాసిన ఒక వ్యాసంలో పేర్కొన్నారు. అంగిటిముల్లునే ముఖ పాకము, జిహ్వ కంటకము అంటారని అని పిండి సూర్య నారయణమూర్తి తన సిద్ధాంత గ్రంథంలో వివరణ ఇచ్చారు.

## మాదాంబ తల్లి కాబోతున్న సందర్భంలో :

బసవపురాణంలోని బసవని పుట్టుక సందర్భంలో బసవని తల్లి మాదాంబ గర్భం ధరించిన చిహ్నాలను కూడా పాల్కురికి సోమనాధుడు ఎంతో శాస్త్రీయంగా వివరించాడు."మాదాంబకు నెల తప్పిన చిహ్నాలు కన బడ్డాయి. గర్భ చిహ్నాలన్నీ అంకురించాయి. అమృతాంశు డైన పుత్రుడు తన కడుపున పడ్డాడు. రుచులన్నీ వెగటై పోయాయి శరీరమంతా పాలిపోయింది. ఆమెకు వేవిళ్లు పుట్టాయి. ఓకలింతలు కలిగాయి. ఆవలింతలు పుట్టాయి. ఒకటే నిద్ర ఆమెను వశం చేసుకుంది. ఆమె చనుమొనలు నలుపెక్కాయి. ఆమెకు అంచ నడకలు మొదలైనాయి. అడుగుల అలసట ఆవహించింది"(బసవ పురాణం, అక్కిరాజు రమాపతిరావు వచనానువాదం). ఇలా మాదాంబ గర్భం ధరించిన లక్షణలను సోమనాధుడు ఒక వైద్యుడిలాగా చెపుతాడు.

## బెలిదేవి వేమనారాధ్యుల కథలో :

పండితారాధ్య చరిత్ర పురాతన ప్రకరణంలోని బెలి దేవి వేమనారాధ్యల కథలో పాములు కరచినప్పుడు చేసే చికిత్సలను వివరిస్తాడు. అష్టనాగాలు కరచినప్పుడు గారుడ మంత్రవేత్త చికిత్స చేస్తాడని చెపుతాడు. అష్ట నాగాలు కరచినపుడు వాటి కాట్లను బట్టి తప్త చికిత్స ద్వారా, జలాభిషేకాల ద్వారా, మంత్రాల ద్వారా, ఔషధాల ద్వారా చికిత్స సాధ్యమే అంటాడు. నాలుగు దంతాలు నాటుకొనేట్లు కరచిందా ఇక ఆ వ్యక్తి ఆయువు మూడినట్లే అంటాడు.

పిళ్లనైనారు అనే భక్తుడు విభూతి మంత్రించి దిగ

దుడిచితే పాండ్యరాజుకు వచ్చిన జ్వరం తగ్గిందట. అలాగే ఏకాంతరామయ్య కథలో....తిరునావుక్కరసు అనే జైనుడికి శూల కుట్టు అనే వ్యాధి వస్తే ఏకాంత రామయ్య పంచాక్షరి మంత్రాన్ని చదివి, విభూతిని దిగదుడిచితే శూలకుట్టు తగ్గిందట. ఇలా పాల్కురికి సోమనాథుడు తన బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర కావ్యాల్లో వైద్య సంబంధ మైన ఎన్నో విషయాలను తెలియజేస్తాడు. పండితారాధ్య చరిత్ర పర్వత ప్రకరణంలో 38 వృక్షజాతుల పేర్లు, 20 పత్రుల పేర్లు, 25 పూల పేర్లు, 26 పండ్ల పేర్లు, బసవ పురాణంలోని సకలేశ్వర మాదిరాజయ్య కథలో, రాజయ్య శ్రీశైల పర్వతాన్ని సందర్శించిన సమయంలో మరెన్నో చెట్ల పేర్లను పాల్కురికి సోమనాథుడు తెలుపుతాడు. దీన్ని బట్టి మూలికా వైద్యం పట్లకూడా సోమనాథుడుకి ఎంతో అవగాహన వున్నట్లు మనం అర్థం చేసుకోవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. బసవ పురాణం - పాల్కురికి సోమనాథుడు
2. బసవ పురాణం - అక్కిరాజు రమాపతిరావు వచనానువాదం
3. విమర్శిని - కాకతీయ విశ్వవిద్యాలయం,తెలుగు విభాగం ప్రచురణ
4. పండితారాధ్యచరిత్ర - అక్కిరాజు రమాపతిరావు వచనానువాదం

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# నెల్లూరి కేశవస్వామి కథలు - పరిశీలన

**- జి. శ్రీమతి,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ (ఓరియంటల్), ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

అనేక యుగాల నుండి ప్రవహిస్తున్న తెలుగు సాహిత్యంలోని ఏన్నో పరిణామాలు కనిపిస్తాయి. వర్త మానంలో మనం చెప్పుకుంటున్న కథ లేదా కథానిక పూర్తిగా వచన రూపం.అందువలన కథ అంటే కేవలం ఒక సందర్భాన్నో, ఒక సంఘటననో, ఒక జీవితాన్ని చిత్రించే ఇతివృత్తంగా కాక రూప పరంగా వచనంలో ఉన్న భాగాన్నే కథగా చెప్తారు. అగ్నిపురాణం కథను ఆరు రకాలుగా చెప్పింది. ఖండ కథ, పరి కథ, కథానికలు...... ఇలా ఆరు రకాలుగా చెప్పారు. తెలుగులో మొదటి కథ మౌఖికంగానే మొదలైంది. అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగు కథ దిద్దుబాటుతోనే మొదలైందని సాహిత్యకారుల అభిప్రాయం. భాషా పరంగా గ్రాంథికంలో ఉన్నప్పటికీ చిన్నయ సూరి పంచ తంత్రం కనిపిస్తుంది.కానీ అచ్చమైన తెలుగుజీవితం ప్రతిబింభించే కథ గురజాడతోనే మొదలైందనే భావనలున్నాయి. బండారు అచ్చమాంబే మొదటి రచయిత్రి అన్న వివాదం కూడా ఉంది.

## తెలుగు కథ చారిత్రకత :

ఏ తరానికైనా ఒక సాంప్రదాయం ఉంటుంది. పరిణామం చెందిన చరిత్ర పాతలోని కొంతను మిగులు చుకుని తనను తాను పున్ణసృజించుకుటూ ఈ చరిత్ర సంప్రదాయికంగా అన్ని పరిణామాల్లో కనిపిస్తుంది. గతంలోపల మనకు మిగిలే మంచే సంప్రదాయం.తెలుగు కథానిక నిర్మాణంలో చిరిత్రక బాగం కూడా ప్రధానంగా కనిపిస్తుంది. ఈసందర్భంలో ఉమ్మడి ప్రాంతాలు కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు హైదరాబాద్ సంస్థానంలో కలిగిన అనేక చారిత్రక,రాజకీయ పరిణామా లను నెల్లూరి కేశవ స్వామి కథలు సమగ్రంగా వివరిస్తాయి. ఒక రకంగా కేశవ స్వామి కథలు ప్రాచీన హైదరాబాదు నగర సంస్కారాన్ని, సంస్కృతిని, సంప్రదాయాన్ని, సత్యాన్ని సత్యదృష్టితో పరిశీలించేవిగా ఉన్నాయి.

## నేల్లూరి కేశవ స్వామి జీవితం :

కేశవ స్వామి గారు హైదరాబాద్ నగరంలో జన్మిం చాడు. నిజాం కళాశాలలో ప్రీ డిగ్రీ చదివి, ఉస్మా నియా విశ్వవిద్యాలయంలో ఇంజనీర్గా పట్ట భద్రుడై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పబ్లిక్ డిపార్టుమెంటు నీటి పారుదల శాఖలో ఇంజనీరుగా పనిచేసి రిటైరయ్యారు. కేశవ స్వామి హైదరాబాద్ నగరంలో నివసిస్తూ అక్కడి జీవితాలను, సంస్కృతిని తెలుగులో చిత్రించిన రచయిత. కేశవ స్వామి సమకాలీనా కథకులు, గూడూరి సీతారాం, డి. రామలింగం, డి. సురమౌళి, దాశరథి రంగాచార్య మొదలగు వారు. వీరి కథలు తెలుగు స్వతంత్ర, ఆంధ్ర ప్రభ, వార పత్రిక, తెలుగు దేశం, సుజాత, పల్లెటూరు, ప్రజాను వార పత్రిక, స్రవంతి మాస పత్రికల్లో కథలు అచ్చు అవుతుండెవి. పల్లా దుర్గయ్య,దాశరథి కృష్ణమా చార్య, సినారె, వట్టికోట, బిరుదురాజు, హీరాలాల్ మోరియా వీరందరిది మిత్ర బృందం.

## కేశవ స్వామి కథల్లో సమాజం :

హైదరాబాద్లో జరిగిన చారిత్రక, సామాజిక పరి ణామాలను సంక్షుభిత సమాజాన్ని, మానసిక సంఘ ర్షణను కథల రూపంలో నిక్షిప్తం చేసిన కథకుడిగా నెల్లూరి కేశవ స్వామి ప్రసిద్ధుడు. ఆనాటి సంక్షుభిత వాతా వరణంలో హిందూ, ముస్లీంల సఖ్యత కోసం ఎందరో ప్రజాస్వామిక వాదులు నడుం బిగించారు. రచయితగా, లోహియా, సోషలిస్టుగా నెల్లూరి కేశవ స్వామి ఈ సంఘ టనల పట్ల చలించిపోయి తన రచనల ద్వారా బయట పడ్డారు.అందుకు ఉదాహరణ 'యుగాంతం' కథ ప్రత్యేకంగా చెప్పాల్సిన కథ.

## కథలు :

చార్మినార్ కథలు, యుగాంతం, రుహీ ఆపా,షరీఫా, ప్రతీకారం, వంశాకురం, ఆకరి కానుక, కేవలం మను

షులం, అదృష్టం, కన్నెరికం, విముక్తి, అక్కయ్య పెళ్ళి మొదలగు కథలు హైదరాబాద్ సంస్కృతిని, సాంప్రదాయ విభిన్న రీతులను కేశవ స్వామి తన కథల ద్వారా ఆవిష్కరించారు. వీరి తోలి కథల సంపుటి ''పసిడి బమ్మ'' రెండ వ కథలసంపుటి ''చార్మినార్ కథలు'' వీటిల్లో నవాబులు, దేవిడీలు, మహబూబ్ కీ మెహన్దీ కేలీలు, దివాన్ ఖాన్ లు మొదలగు ముస్లీం దేశాల సంస్కృతిని తెలియజేశాయి.

## కేశవ స్వామి కథల్లో పాత్రలు :

కేశవస్వామి మొదటి కథా సంకలనమైనా 'పసిడి బమ్మ' రాజా రావు, శంకరం పాత్రలు ప్రధానమైనవి. ఈ కథలో శంకరం పాత్రలోని నిర్లిప్తతను అద్భుతంగా చిత్రీ కరిస్తాడు రచయిత. అలవాటు కథలోని గోపి, సూరి పాత్రలు ముఖ్యమైనవి. ఈ కథలో ఉద్యమ స్ఫూర్తితో నిండిన సూరి ప్రశాంతత కోరుకుని తన స్నేహితుడైన గోపి వద్దకు వస్తాడు. కానీ తనలో ఉన్న ఉద్యమ స్ఫూర్తి ఉండనీయక ఫాక్టరీ గొడవలా కలుగజేసుకుని స్నేహి తుడు గోపిచే పంపిచబడతాడు. ప్రాంత మారినంత మాత్రాన వ్యక్తిలోని స్వభావం మారదు అనే సార్వజనీన సత్యాన్ని తెలిపాడు రచయిత. అభిమానం కథలోని వెంకట్రావు. అక్కయ్య పెళ్ళి కథలోని విశాల, విజయ పాత్రలు ఉత్తర ప్రత్యుత్తరాలతో నడిచిన ఈ కథ అక్కా చెల్లెల్ల మధ్య ఉన్న అనుబంధాన్ని తెలియ జేస్తుంది. రెండ వ కథా సంకలనమైన 'చార్మినార్ కథలు' హైదరా బద్ సామాజిక పరిణామాలకు సాహిత్య రూపం ఇచ్చిన సామాజిక రచన అని చెప్పవచ్చు. కేశవ స్వామి రాసిన 'రూహీ ఆపా' కథ మహోన్నతమైన మానవీయ సంబంధా లను, మనిషిలోని సున్నితమైన హృదయాన్ని కుల - మతాలకు అతీతంగా స్పందిచే మనిషిని చిత్రించిన 'రమణి' పాత్రను అపూర్వంగా తీర్చిదిద్దారు. 'కన్నెరికం' కథలోని పాత్రకు కూడా అదే పేరు ఉంచడంతో రచ యిత ఒక స్పష్టమైన దృష్టితో రాసాడని చెప్పవచ్చు.

## రూహీ ఆపా పాత్ర :

నవాబు మరియు నవాబు కొడుకు వజ్రాల 'రమణిని' స్వంత ఇంటి వారిగా గౌరవించిన తీరును చిత్రించడాన్ని బట్టి ముస్లీం నవాబులో హృదయ సంస్కారాన్ని రచయిత ఓడిసి పట్టాడని చెప్పవచ్చు. 'కేవలం మనుషులు' కథలో ఉస్సేన్ మిర్జా, మహబూబ్ రాయ్ సక్సేనా దశాబ్దాల స్నేహితులు. వారి కుటుంబాల మధ్య స్నేహం రెండ వ తరం వచ్చే సరికి బంధుత్వంగా మారింది. ఆకరి కానుకల బీదరికంలో మునిగి పోతున్న ముస్లీం కుటుంబాలు అరబులోని షేక్‌లకు తమ కూతుల్లను ఇచ్చి ఆర్థిక సౌలభ్య ం పొందాలనుకునే దుస్థితిని తెలియజేస్తుంది. ఇందులోని అమీనా పాత్ర తాను నరకం అనుభవిస్తూ కూడా తన తల్లి తండ్రుల వద్ద సుఖంగా ఉన్నట్లే చెబుతుంది. చివరికి విష ప్రయో గంతో చంపబడుతుంది. అమీనా దుర్భర జీవితం గురించి కేశవ స్వామి రాసిన కథ దశాబ్దాలుగా హృదయ విదారకంగా కొనసాగుతూ వచ్చింది.

## వంశాంకురం కథలోని నజ్మా పాత్ర :

వంశాంకురం కథలో నజ్మా, ఇమ్రూల పాత్రలు మరిచిపోలే నివి రక్త సంబంధాలు, మత సంప్రదాయాలు మనకు ఈ కథలో కనిపిస్తాయి.ఇమ్రూ తండ్రి ఛాందస భావాలతో నజ్మాను పెళ్ళి చేసుకుంటాడు.తన అన్న కిచ్చిన మాట ప్రకారం తన మొండి తనంతో ఈ వివాహం జరుగుతుంది. నజ్మా నాకు చెల్లెలు అనే మాట ఇమ్రూ ఎందుకు అనే వాడో అర్థం కానీ నజ్మా చివరికి తన పరిస్థితి తెలుసుకుని తానే దూరంగా వెళ్ళిపోవాలనుకుంది. తన చిన్నాన మొండి తనం తెలిసిన నజ్మా వంశానికి, వంశాం కురాన్ని ఇవ్వలేక తన ఇమ్రూకి దూరంగా బ్రతక లేక మళ్ళీ పెళ్ళి చేసుకో అని తాను ఉత్తరం రాస్తుంది. దీని తోనే రచయిత కథను ముగించాడు.

అన్నింటిలోకి 'షరీఫా' అనేది అత్యద్భుతమైన కథ రాత్రి మందు పార్టీలో పాల్గన్న ఒక అతను ఇంటికి వెళ్తూ ఉ ంటే రిక్షా వాడు ఆపి రిక్షలో ఉన్న వేశ్యను చూపిస్తాడు. ఆమె అతన్ని తన గదికి తీసుక వెళ్ళి బట్టలు విప్పుకొని పక్కకు మార్చుకుంటుంది. అతను ఆమె వక్షోజం తాక

గానే మొఖం మీద పాలు చిమ్ముతాయి. ఆమె అతనికి క్షమాపన చెప్పి పరదా వెనుక ఏడుస్తున్న చంటి వాడికి పాలు కుదుపుతుంది. అతను తన జేబులోని డబ్బంతా తీసి ఆమె చేతిలో కుక్కి వడి వడిగా బయట పడతాడు. నేనెవరి దగ్గర బిక్షం తీసుకోను అని బయటకు వచ్చిన షరీఫా క్రోధంగా కేకలేస్తుంది. ఆ ఇచ్చిన డబ్బు తనకు కాదని చంటి బాబుకు కానుక అని చెప్పి విటుడు చీకటిలో మాయమవుతాడు. నాలుగు పేజీల కథలో ఒక పూర్తి జీవితాన్ని చిత్రించిన తీరు ఒక అద్భుతమైతే, ప్రతి సంఘటనను ఒక మలుపుతో ఉత్కంఠభరితంగా రాయడం మరో ఎత్తు. వారి పరిస్థితిని అర్థం చేసుకున్న విటుడు డబ్బిచ్చి చంటి వాడి కానుక అని అనటం వల్ల రచయిత ఉదాత్తంగా, హుందాగా కథను ముగించి నట్లయింది. దానితో పాఠకుడు విస్మయానందాన్ని పొందుతాడు. ఇందులో విశ్వ జనీనత ఉంది. మానవ జీవితంలోని దైన్యం, విషాదం ఈ కథలో కనిపిస్తుంది. మనం మనుషులం అని గర్వంగా చెప్పుకోగలిగే అంశం ఈ కథలో కనిపిస్తుంది.

కేశవ స్వామి ఆ రోజుల్లోనే తన కథా నైపుణ్యాన్ని , సృజనాత్మకతను, ప్రయోగాత్మకతను తన రచనల్లో పొందు పరిచాడు. చార్మినార్ సంపుటిలోని కథలు ఇంకా పరిణితి చెందినవి మరియు వైవిధ్యమైనవి. హైదరాబాద్ నడిబడ్డున మరో 'చార్మినార్' ను నిలబెట్టిన గొప్ప రచయిత నెల్లూరి కేశవ స్వామి.

**ఆధార గ్రంథాలు :**

1. నెల్లూరి కేశవ స్వామి ఉత్తమ కథలు - గూడూరి సీతారాం.
2. నెల్లూరి కేశవ స్వామి కథా సర్వస్వం - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. నెల్లూరి కేశవ స్వామి కథలు - గూడూరి సీతారాం.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలంగాణ కవిత్వంలో వివిధ కులవృత్తులు

– గ్రైని రవి, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

"తలబక్షచ్ఛట గ్రుచ్చి బాతువులు కేదారంపు గుల్యాంతర /
స్థలి నిద్రింపగ జూచి యారెకులుషస్నాత ప్రయాతద్విజా/
వలి పిండీకృత శాటులన్ నవి దదావాసంబు జేర్పంగ రే/
వుల డిగ్గన్వెసబాఋవాని గని నవ్వున్నాలి గోప్యోఘ మల్"

ఈ పద్యం ఆముక్త మాల్యద ప్రబంధ కావ్యంలో శ్రీ కృష్ణ దేవరాయలు రాసాడు. రజక వృత్తికి చెందిన ఒక సన్నివేశాన్ని చిత్రించాడు. తెల్లవారు జామున ఆరోగ్య వంతులైన ప్రజలు చన్నీటి స్నానం కోసం ఊరిబయట వున్న నీటి ప్రవాహం దగ్గరకు వెళతారు. అక్కడ స్నానం చేసి బట్టలు ఉతుక్కుంఆరు. కొందరు సచేల స్నానం చేస్తారు. ఉతికిన బట్టలను వరిమడుల మీద ఆరవేసు కుంటారు. ఒకరోజు గస్తీ కాపలదారు అటుగా వెళ్లి చూస్తాడు. అక్కడ వరిమళ్ల దగ్గర బాతులు కునుకు తీస్తూండటం చూసాడు. వాటిని చూసిన కాపలాదారునికి అవి రజకులు పిండి ఉంచిన వస్త్రాలుగా కనిపిస్తాయి. అంటే అంత తెల్లగా రజకులు బట్టలు ఉతుకుతారని తెలియవస్తుంది.

తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమైన లక్షణాలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలికను చూసినప్పుడు తెలంగాణ రాష్ట్రం భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే భౌగోళికంగా పీఠభూమి ప్రాంతానికి చెందింది. పరి పాలనా పరంగా నిజాం పాలనలో రాజకీయ ఆర్థిక స్వేచ్ఛ లేకుండా నిరంకుశంగా పరిపాలన జరిగింది. ఇక్కడి సామాజిక సాంస్కృతిక నేపథ్యం కూడా కొంచెం భిన్నంగా ఉంటుంది. తెలంగాణలోని ప్రతీ కులం ఒక వృత్తి చేస్తూ ఆ ఊరిలోని వ్యవసాయానికి సహాయపడుతూ ఉం డేవారు. ప్రతీ ఒక్కరు తమ వృత్తిని నిర్వర్తిస్తూ ఆ వృత్తి ద్వారా ఆ గ్రామంలోని పెద్దలకు సేవ చేయడం సౌకర్యాలు కల్పించడం ఆనవాయితీగా వచ్చింది. దీని ఆధారంగానే తెలంగాణాలో సాంస్కృతిక జీవనం పెంపొందింది. గ్రామల్లో కలిగిన చైతన్యం వల్ల చిన్న రైతులు బలమైన శక్తిగా ఎదిగారు. అంతకు ముందున్న కులపరమైన శ్రమ విభజన అంతరించి పోయి వృత్తులు చేస్తూ బతికే మరికొన్ని కులాలు ఏర్పడ్డాయి. కమ్మరి కుమ్మరి చాకలి మంగలి మాల మాదిగ గౌడలు గొల్లలు మొదలైన కులాలు ఏర్పడ్డాయి. ఈ వృత్తి కులాల కష్టాలను గుర్తించి వృత్తుల శ్రమ సౌందర్యం గురించి వర్ణించే కవితలు ఎంతోమంది కవులు రాసారు. రాస్తూనే ఉన్నారు. ధ్వంసమవుతున్న చేతి వృత్తులను కవులు వేదనా భరితంగా చిత్రించారు.

కవులు కులవృత్తులపైన జీవనం గడుపుతున్న పల్లె ప్రజల బాధలకు అద్దం పట్టేలా తమతమ భావాలకు అక్షర రూపమిచ్చుకున్నారు. కవి పెత్తందారీ వ్యవస్థను వ్యతిరేకిస్తూ పీడిత జనం పక్షాన నిలిచాడు. కవితలలో అడుగుడుగునా వృత్తికులాల జీవితాలను అక్షరాల్లో బంధించాడు. వారిలో చైతన్యం నింపేందుకు ప్రయత్నం చేసాడు. మొత్తం సమాజాన్ని మోస్తున్నది చేతివృత్తుల వారే అయినప్పటికీ పాలకుల నిరాదరణకు గురి కావడంపట్ల కవి తన ఆవేదనను కవిత్వ పరంగా వ్యక్తం చేయటంలో సాహిత్య పటిమ సమాజానికి హితోధికంగా పనిచేస్తుంది. అన్నవరం దేవేందర్ రాసిన బువ్వకుండ కుమ్మరి కులవృత్తి లోని కళాత్మక నైపుణ్యాన్ని మూలాల్ని రికార్డు చేసిన కవిత ఇలా ఉంది.... "మట్టిని లోహం పురాగ మింగింది/ అయినా మన్ను పరిమళం మిగిలే ఉంది/ మట్టి నుంచే ప్రపంచానికి పట్టెడు ధాన్యం / మట్టే వస్తు సేవలకు మూల్యాంకనం/ మట్టి కుండలో మొదలైన మనిషి జీవితం / మట్టి కుండతోనే అగ్గిల మాయం" అంటూ మట్టికి మనిషి జీవితానికి ఉన్న సంబంధాన్ని చిత్రీకరించాడు. సమాజంలో రజక వృత్తి చేయాల్సిన సంప్రదాయాలు చాలా ఉంటాయి పెళ్లి

పురుడు చావు వంటి సామాజిక సేవలు చేయటం బట్టలు ఉతకడం వంటి సేవలు రజకులు వృత్తి ధర్మంగా భావిస్తూ పని చేస్తారు. ఇదే రజక వృత్తిగా ఏర్పాటైంది. ఈ రజక వృత్తి పల్లెను విడిచి పట్నం వలస వెళ్లి పోయింది. అంతటితో ఆగకుండా ప్రతి ఇంటికి వాషింగ్ మిషన్ వచ్చి వారి బతుకుల్ని ఎగతాళి చేసాయి.

రజక వృత్తిని గౌరవిస్తూ ఒక కవి రాసిన వచన సాహిత్య పటిమ ఇలా ఉంది.... "ఎప్పుడూ తానే సూర్యుణ్ణి ముందుగా నిద్ర లేపుతుంది./ ఇంటింటికి పోయి బట్టలు వెయ్యండమ్మా అంటూ ఊరంతా / మేలుకొలుపు పాడుతుంది / పులిసిన చద్ది కూడుతో / పచ్చిమిరపకాయ జతచేస్తూ అర్ధాకలి తీర్చుకొని / పెనిమిటికి కుడిభుజంగా నిలుస్తుంది. / తన ఇల్లు ఊరందరి బట్టకు ఖజానా అయినప్పటికీ/ పేలికలనే పట్టు వస్త్రాలుగా భావించి / తన శరీరాన్ని పదిలంగా దాచు కుంటుంది/ దండుకొచ్చిన మెతుకుల్ని పసివాళ్లకు సమా నంగా వాటా పంచి/ తాను మాత్రం ఉపవాస దీక్ష చేయటం లాంటి సంఘటనలు ఇంకా పల్లెల్లో తచ్చాడు తూనే ఉంది.

ఇప్పుడు మిషన్ల నైపుణ్యం ముందు కమ్మరి బతుకు భారమైన విధానాన్ని సిద్ధంకి యాదగిరి ప్రశ్నిస్తున్నాడు. ఊపిరితిత్తులు గాలి ఊదితే/ కొలిమి మండటానికి / నిలువెల్ల తడిసిన చెమటలో/ సుత్తి సమ్మెట పట్టుకారు ఒక్కటై / కాక మీద కొడితే ఎట్ల గావాలనుకుంటే గట్లైతది/ బతుకు చెడగొట్టినోళ్లకు/ కమ్మరి కొలిమిలో కాలబెట్టి సరుస్తది/ ప్రపంచ మార్కెట్ బాడిసె చెక్కుతది / కొలిమి ధగధగ మండుతది"......అంటూ దశా దిశను చూయించే కవిత్వాన్ని పండించాడు.

ఎండ్లూరి సుధాకర్ రాసిన గూర్ఖా అనే కవితలో... "అతడు రాత్రి సూర్యుడు/ కళ్ల బొరియల్లో నిదుర చాప మడతపెట్టి/ దొంగ చీకటిని వెంటాడుతూ ఉంటాడు". కుటుంబ బాధ్యతలు నిర్వహించడానికి ఇక్కడి సంపాదన సరిపోక, అధిక సంపాదన సరిపోక అధిక సంపాదన కోసం విదేశాలకు వెళ్లి రెండు మూడేళ్లకు ఒకసారి వచ్చే భర్త కోసం దిగులుగా ఒంటిరిగా ఎదురు చూస్తున్న భార్య గురించి షాజహాన రాసిన కవిత దుస్రా ఆస్మా "ఏ రెండు మూడేళ్లకో/ నువ్వు వస్తున్న కబురు/ రోహిణీ తర్వాత భూమి ఆకాశం వైపు చూసి చూపు నాది/ నీ ఎన్ని రాకలకు చల్లబడతానో" అని తన దీనత్వాన్ని చెబుతుంది.

దూది ఏకే వృత్తిలో ఉన్నతల్లిని వర్ణిస్తూ ఖాజా ఫత్వాలో ఇలా అన్నాడు. 'విత్తిన చెట్ల మధ్య దూది తీసిన పత్తి గింజ అయిపోయిన నా ముసలి తల్లి" ప్రపంచీకరణ ప్రభావంతో చేతివృత్తుల మనుగడ దెబ్బతిన్నది. ఆయా కులాలను నమ్ముకుని జీవించే కులవృత్తులు కనుమరుగై పోయాయి. "అగ్గిపెట్టెలో అమర్చ గల / అద్దకపు చేనేత చీర/ ప్రపంచ ప్రసిద్ధి కళా కేతనం/ పొట్ట చేత పట్టులకొని / పట్టణ యంత్రాల చుట్టూ పరుగులు తీస్తున్న వలస పక్షి / ఆకలి చావుల ఆత్మ హత్యల కుక్షి" అంటూ కులవృత్తులు నగరాలకు వలస పోయిన విధానాన్ని తెలుగు కవిత్వం బలంగా చిత్రీకరిం చింది.

ఊళ్లోని చేతివృత్తులు ధ్వంసమైన విధానాన్ని చూసి గోరేటి వెంకన్న "పల్ల కన్నీరుపెడుతుందో" పాట రాసాడు. పల్లెల్లోని బతుకుల్ని సహజంగా రూపుకట్టించాడు చేతివృత్తుల్ల విధ్వంసం చిత్రీకరిస్తూ.... "కమ్మరి కొలిమిల దుముమ్మ పేరును /పెద్ద బారిశ మొద్దు బారినది /సాలెల మగ్గం సడుగులిరిగినది/చేతివృత్తుల చేతులిరిగిపోయే నా పల్లెల్లోనా/ గ్రామ స్వరాజ్యం గంగలోన పాయె నా పల్లెల్లోన" అంటూ హృదయానికి హత్తుకునేలా కవి గోరేటి వెంకన్న పల్లె బాధను ప్రజలకు మందుంచాడు.

చెప్పులు కుట్టే వృత్తి లెదర్ టెక్నాలజీగా ఆధునీకరణ చెంది అగ్రవర్ణ బడా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లి పోయింది. అందుకే కవి "నేడు నా వృత్తి / లీగల్గా దోపిడీ కాబడి / బాట కంపెనోడి బూటైంది" అని గుర్తిస్తారు. " ప్రంచీకరణ వ్యాపారీకరణ మాదిగ, మాదిగ అవశేష జీవిత సమాధులపై జెండాలై ఎగుదుతున్నాయి" అని తన ఆవేదనను వెలి బుచ్చుతున్నాడు.

తెలంగాణ కులవృత్తుల మీద జరిగిన దోపిడీని వ్యతిరేకిస్తూ కవులు కవిత్వం రాసారు మృతులకు

జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించారు. కులవృత్తి చేసే వారి జీవితాల్లో చైతన్యం కలిగించడానికి కవిత్వం తన కర్తవ్యాన్ని నిర్వర్తించింది. కులవృత్తులు ప్రపంచీకరణ ప్రభావానికి ఎలా కనుమరుగై పోయాయో కవులు కవిత్వం ద్వారా ప్రశ్నించారు. "అది రాట్నమా జీవిత చక్కురము /ఒక సేత్తో దారమెత్తి జురుమంటు / కండె సుడతరు సుడుతూ సుడుతూ ఆకలితో రాలిపోతరు" అంటూ యెన్నం ఉపేందర్ రాసిన కవిత్వం కులవృత్తుల స్థితికి అద్దం పడుతుంది.

కులవృత్తులు కూలి పోవడం అనేది ఒక విషాద సంఘటన అయినా వాటిని కాపాడుకోవాలని ఎవరూ ఆలోచించరు వీటిని దాటుకొని వృత్తి కులాల వారు ముందుకు రావాలి. మనదేశంలోని కులాలు లాభ దాయకమైనవి కావు. సామాజిక సేవకోసం పుట్టిన కులాలు. నేడు ఆ కులాల వల్ల, కులాల గౌరవ మర్యాదలు కూడా తగ్గి పోతున్నాయి. కావున ఆ కులవృత్తులను పట్టించుకోవడం లేదు. దీని ద్వార కులవృత్తులు అంతరించి పోయే ప్రమాదానికి చేరు కున్నాయి. కులవృత్తులు అన్నీ కూడా చేతితోనే చేసేవిగా ఉన్నాయి. అందువల్ల వారికి లాభాలు రాక, వాటిని వదిలేసుకొని పల్లెలు విడిచి పట్నం చేరుకుంటున్నారు. ప్రపంచీకరణ కోరల్లో పడి కులవృత్తులు నాశనమై పోతున్నాయి.

ఆధునిక విద్య, ఆధునిక వృత్తుల్లో ఎదిగినపుడే రాజకీయ చైతన్యం పెరుగుతుంది. అది అధికారం అందుకోటానికి బాటలు వేస్తుంది. కులవృత్తుల్లో కూరుకు పోయే వారికి అది సాధ్యం కాదు. పొట్టకోసం బతుకంతా ధారపోసి తీరిక సమయం దొరకక, అక్షర జ్ఞానం లేక, అలమటించే వారికి రాజకీయ చైతన్యం ఎలా వస్తుంది. కుల వృత్తుల్లో ఉన్న వాళ్ల కనీసం మధ్యతరగతి స్థాయికి ఎదగలేక పోతున్నారనడంలో సందేహం లేదు. "కుల వృత్తులొల్లారు సందమామ/ కూడె కరువై పాయె సంద మామ/ నీడనిచ్చిన వృత్తి సందమామ/ పాడెక్కిపోతుంది సందమామ" అందువల్ల కులవృత్తులను వదిలేసే చైతన్యం పెరగాలని, ముఖ్యంగా మురికి బట్టలు ఉతికే చాకలి పని, మురికి కాల్వలు తీసేపని, రోడ్లు ఊడ్చేపని, చెత్త శవాలు, కళేబరాలు తీసేపని, తాళ్లెక్కేపని, రాళ్లుకొట్టేపని మొదలైనవి సమాజానికి ఎంతో అవసరమై నవి అయినా గానీ వాటికి తగిన ప్రాతినిధ్యం లేకపోవటం వాటిని నమ్ముకున్నందుకు మానవ మనుగడ కొసాగటం లేదనే విషయం అందరికీ తెలుసు. కాబట్టి ఈ కులవృత్తుల చైతన్యపు సత్యాలను సామాన్య ప్రజలు తెలుసుకొని తమ భవిష్యత్తును తామే కాపాడు కోవలసిన ఆగత్యం ఉం దనే సత్యాన్ని తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# అద్దేపల్లి కవిత్వంలో స్త్రీ జీవిత చిత్రణ

- గల్లా వెంకటేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆధునిక కవిత్వం ఎంత విస్తృతమైందో అంత విలక్షణ మైంది కూడా. మానవకార్యకలాపాలు అనేక రంగాల్లో విస్తరించడం మూలంగా జీవితం పలు రకాల ఆటు పోటును ఎదుర్కొనడం ప్రారంభమైంది. ఇటువంటి సమయంలో మానవుని సౌఖ్యాన్ని, దుఃఖాన్ని రెండు పార్శ్వాల నుండీ ఆధునిక సాహిత్యం కూడా చూపించడం ప్రారంభించింది. మానవ మేధస్సు విస్తృతం అయ్యే కొద్దీ నూతన ఆవిష్కరణలు, విధానాల వల్ల లాభాల లాగే దాని నష్టాలూ విస్తరించాయి. వాటి నుండి వచ్చే ఆపద లను, అస్థిత్వాలకు ఉన్న ముప్పును కవిత్వం ద్వారా అనేక మంది కవులు వ్యక్తీకరించే ప్రయత్నం చేశారు. అటువంటి వారిలో అగ్రగణ్యులు అద్దేపల్లి రామమోహన రావుగారు. అద్దేపల్లి వారు ఎక్కువగా ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ దాని వల్ల సంస్కృతులు పొందుతున్న వికృతులను, పరాయీకరణను ప్రస్తావిస్తూ కవిత్వం రాశారు. ఈయన రాసిన 'ఆకుపచ్చని సజీవసముద్రం నానేల', 'పొగచూరిన ఆకాశం', 'కాలంమీద సంతకం' మొదలైన కవితా సంపుటాల్లో ప్రపంచీకరణ వ్యతిరేక భావజాలం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

ఒకప్పుడు గ్రామాల్లోని గడీల్లో తిష్టవేసిన భూస్వామ్య వ్యవస్థ, స్వాతంత్ర్యానంతరం తన కుతంత్రం బయట పడిందని గ్రహించి, పల్లెల నుండి పట్టణాలకు చేరి తన దోపిడీని మరో రూపంలోకి మార్చుకుంది. ఇది రెండు వర్గాలుగా చీలి ఒక వర్గం తెల్ల బట్టలు ధరించి రాజ్యాధి కారాన్ని చేజిక్కించుకుంటే, మరొక వర్గం పెట్టుబడి దారులుగా మారి ఆర్థిక వనరులను ఆక్రమించుకుంది. ఇప్పుడు ఈ రెండు వర్గాలు కలిసి ఏర్పాటు చేసిన నవీన దోపిడీ విధానమే ప్రపంచీకరణ. ఇది డబ్బే లక్ష్యంగా, లాభమే ధ్యేయంగా పని చేసే దోపిడీ సూత్రం. అప్పటి నుండి ఇప్పటి దాకా సంప్రదాయ చట్రంలో బిగించ బడిన మహిళ పురుషాదిపత్యంతో పోరాటం చేస్తూనే ఉంది. దీనికి తోడు ప్రపంచీకరణ నుండి వ్యాపార దోపిడీ కూడా ప్రారంభమైంది. ఈ రెండు రకాల అణిచివేతను అద్దేపల్లి వారు తన కవిత్వంలో-

పురుషాహంకారాన్ని కూల్చడానికి పైట బిగిసి
ఒక దిక్కు నుండి యుద్ధానికి బయలు దేరగానే
మరో దిక్కు నుండి మార్కెట్ మగాడు ప్రవేశించి
వలువలు ఒలిచేసి
దానికి నాగరికత అని పేరు పెట్టి
పైటని దోచుకు పోగానే
చెయ్యిదాటిపోయిన స్త్రీ శక్తి
యుద్ధ భూమిలో కాలు జారి పడిపోయింది

(దీపాన్ని మింగుతున్న నీడలు) అని తెలియచేశారు. ప్రపంచవ్యాప్తంగా 1975 నాటికి పలుదేశాల్లో మహిళా ఉద్యమాలు తీవ్రరూపందాల్చడంతో ఐక్యరాజ్య సమితి 1975-85 మధ్య కాలాన్ని మహిళా దశాబ్దంగా ప్రకటిం చింది. సమాజంలో స్త్రీల పట్ల అనుసరిస్తున్న అణిచివేత, అవిద్య, బాల్య వివాహాలు, ఆత్మగౌరవం, శ్రమ దోపిడీ, గృహ హింస, స్వేచ్ఛ, సమానత్వం, సమాన అవకాశాలు, సమాన వేతనం వంటి పలు అంశాలను తెరమీదకు తెచ్చి విస్తృతంగా చర్చించింది మేధోవర్గం. ఫలితంగా పురుషాధి పత్యానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు ప్రారంభమై ఫలితాలు అందుతాయి అనే సమయానికి మార్కెట్ మగాడి రూపంలో పెట్టుబడి దార్లు ప్రపంచీకరణ అనే కొత్త దోపిడీ విధానాన్ని ప్రారంభించారని, దాని మూలంగా మహిళా ఉద్యమాలు బలహీన పడ్డాయని అద్దేపల్లి వారు సూచించారు. ఇదే విషయాన్ని -

నేను భోగ వస్తువును కానంటూ
పరిగెత్తి పరిగెత్తి
పడింది ఫ్యాషన్ ఊబిలో

... ... ...
అసభ్యతకి నిర్వచనం లేదంది
మగ వ్యాపారస్థుల కోర్టు
... ... ...
సుప్త నేత్రాలతో స్త్రీ
అడుగు ముందుకేస్తే
అడుగుకింతని మగవాడు
కొనకపోతే అడుగు

అని దీపాన్ని మింగుతున్న నీడలు అనే కవితలో స్పష్టం చేశారు. ఇప్పటికే ఇంటి మగాడి ఆధిపత్యాన్ని ఎదుర్కొం టున్న మహిళ ఇక మీదట మార్కెట్ మగాడి ఆధిపత్యాన్ని కూడా ఎదుర్కొనవలసి ఉంటుందన్న భవిష్యత్ సూచనను కూడా పై కవితలో చేశారు.

ప్రపంచీకరణ వస్తు సంస్కృతిని విస్తృతం చేస్తున్న ఒక ఆర్థిక సూత్రం అంటారు అద్దేపల్లి. దీనిని నిజానికి నేడు దీనికి అనుకూలంగానే అన్ని వ్యవస్థలు, రంగాలు రూపుదిద్దు కుంటున్నాయి. అలా రూపుదిద్దు కోవడానికి ఏ దైనా ప్రతి బంధకమైతే నిరంతరం అమెరికా జపం చేసే మన నాయకులు చట్ట పరంగా ఉన్న అడ్డంకులను తొలగించి ప్రంచీకరణ కరుణకు పాత్రులౌతారు. స్త్రీని కూడా ఒక వ్యాపార వస్తువుగా చూసే సంస్కృతిని ఈ దేశం మీదికి నెడుతున్నారు. ఇదంతా పైకి కనిపించకుండా జరిగే చాపకింద నీరులాంటి వ్యవహారం. దీనిని 'మార్కెట్ మగాడి రెక్కలు' అనే కవితలో -

మార్కెట్ మగాడు ప్రవేశించాడు
... ... ... ...
వాడికి మార్కెట్ల గాజు బొమ్మ ఎలాంటిదో
రక్త మాంసాలున్న స్త్రీ కూడా అలాంటిదే
స్త్రీకి శరీరం మాత్రమే ఉంది.
... ... ... ...
స్త్రీకి బాల్యం లేదు
యౌవనం లేదు
వార్థక్యం లేదు
ఒక జీవిత కాల మదన స్పర్శ స్రవంతి

అంటూ వ్యక్తం చేశారు అద్దేపల్లి. నిన్నటి వరకు దేశీయ మూఢాచారాలు స్త్రీని రక్త మాంసాలున్న బానిసగా మార్చాయి. నేడు అదే స్త్రీని ఈ నయా వినిమయ సంస్కృతి రక్తమాంసాలున్న ఒక గాజు బొమ్మగా మారుస్తోందని ఆవేదన చెందారు. నాడు కనీసం ప్రాణిగా నైనా గుర్తించబడిన మహిళ, నేడు ఒక వస్తువుగా గుర్తించబడుతున్నది. మార్కెట్ మగాడికి ప్రాణులకు వస్తువులకు మధ్య భేదం ఉండదు. వాడి దృష్టిలో, సృష్టిలో అన్నీ వస్తువులే. వాటిని వాడు కోవడం, అమ్ముకోవడం మాత్రమే వాడికి తెలుసు. దీన్ని ప్రస్తావిస్తూ -

స్త్రీని భోగ వస్తువు అనుకుంటారు మీ మగవాళ్ళు
అసలు భోగం అనేది
అందుకే ఆ పదాన్ని మేం తొలగిస్తాం
కేవలం వస్తువు అనేది మిగులుస్తాం
ఈ వస్తువుని భాగ భాగాలుగా వేరు చేస్తాం
దేని వెల దానిగా లెక్కేసుకుంటాం

అని స్త్రీ విషయంలో ప్రపంచీకరణ దృక్పథాన్ని స్పష్టం చేశారు. ఇది నేడు టి.విలలో వచ్చే వ్యాపార ప్రకటనలను, సినిమా గోడపత్రికలను, హోర్డింగులను గమనిస్తే ఈ విషయం అర్థమౌతుంది.

భారతీయ సంస్కృతి ఔన్నత్యానికి మూలం భారత నారీమణి అని నిన్నటి వరకు సగర్వంగా చెప్పుకున్నాం. నేడు సినీరంగ బాధ్యతా రాహిత్యం వలన, ఫ్యాషన్ మోజు వలన సంస్కృతికి, స్త్రీకి ఎదురౌతున్న సమస్యల్ని కూడా ప్రపంచీకరణ దృక్పథం నుండే అర్థం చేసుకోవాలి.

గ్లోబల్ మార్కెట్ నడివీధిలో
స్త్రీత్వం తల వంచుకు నిలబడుతుంది
సౌందర్య హంతకి యైన వ్యాపారం
ఆమె తలపై తన జండా కర్ర పాతి పెడుతుంది
(సౌందర్యానికి చరమగీతం)

అనే కవితలో కేవలం వ్యాపారం కోసం విలువల్ని, సభ్యతల్ని తొక్కి పడుతున్న వైనాన్ని గమనించాలి. దీన్నే అద్దేపల్లి వారు నగ్నశరీరాల మీద ఏడు జన్మల ప్రేమల్ని చక్కడంగా కూడా అభివర్ణించారు. అంటే సినీ నిర్మాతలు

తాము నిర్మిస్తున్న సినిమాలు ఎన్ని అవార్డులు పొందాయి, ఎంత ధనాన్ని సంపాదించాము అని ఆలోచిస్తున్నారు. కాని వాటి వలన సమాజం పై ఎటువంటి ప్రభావం ఉంటొంది అన్న అంశాన్ని విస్మరిస్తున్నారు.

దృశ్యం ప్రేక్షకుణ్ణి కౌగిలించుకునే సరికి
అదొక వికృతమైన
శరీర వ్యాపారమై పేలుతుంది
(వెలుతురు కిరణాల చీకటి కొరడా)

అనే కవితలో స్త్రీ శరీరం వ్యాపార వస్తువైన స్థితిని తెలియ చేశారు. అర్థనగ్న శరీర క్రీడలే సినిమాలైనప్పుడు వ్యాపారానికి బలైంది స్త్రీ. ఆ సినిమాల ప్రేరణ వల్ల ఉద్రేకితమైన సమాజ దుశ్చర్యలకు బలౌతున్నది కూడా స్త్రీనే. దీన్ని గుర్తించిన అద్దేపల్లి

స్త్రీలపై అత్యాచారాలు జరిగినప్పుడల్లా
కఠినంగా శిక్షించాలి అంటూ ఉంటారు
మీ ప్రభుత్వాలకీ కోర్టులకీ
కఠినంగా శిక్షించే దమ్ములేవు
మమల్ని నమ్ముకోండి త్వరలో మీకందరికీ
ఆత్మ రక్షణకోసం ఆయుధాలు అమ్ముతాం

అని వ్యాపార రంగం ఆంతర్యాన్ని బట్ట బయలు చేశారు. సమస్య సృష్టికర్త వ్యాపార వర్గమే, సమస్య పరిష్కార కర్త వ్యాపారవర్గమే. మధ్యన బలౌతున్నది మాత్రం మహిళాలోకం. దీన్ని గుర్తించి

మహిళా సమాజం నూతన పోరాటానికి సిద్ధం కావాలి అంటే నిన్నటి వరకు సంప్రదాయ పద్ధతిలో ఇంటి పురుషుని మీద చేసిన పోరాటానికి పూర్తి భిన్నమైన పద్ధతిలో ఆదునిక ఉద్యమాన్ని నిర్మించాల్సి ఉంది. దీనికి కారణం ఈ రెండు సమస్యల స్వభావం, సైద్ధాంతిక నేపధ్యాలలో వైరుద్యం ఉండటమే.

భారత దేశం సంస్కృతీ విలక్షణ దేశంగా మనం భావిస్తున్నాం. అయితే నేడు ఆ విలక్షణతకు బీటలు వారుతున్నాయి. ప్రత్యేకతలను అంతం చేసి, అమెరికా సంస్కృతిని ప్రపంచ సంస్కృతిగా మార్చడమే లక్ష్యంగా ప్రపంచీకరణ ముందుకు సాగుతున్నది. విద్య, వైద్య, వ్యవసాయ, సాంఘిక, సాంస్కృతిక కళాది రంగాలు అమెరికా సంస్కృతిని అనుసరిస్తున్నాయి. తమ అస్థిత్వాన్ని కోల్పోతున్నాయి. సంస్కృతీ పరిరక్షకురాలుగా గుర్తించ బడిన మహిళ నేడు ప్రపంచీకరణ వలన అనేక నూతన సమస్యలను ఎదుర్కొంటున్నది. దీన్ని గుర్తించి జాగరూకతతో నడుచుకోవాల్సి ఉంది.

# భాగవతంలో "ధర్మం" విశిష్టత

- డా॥. మంద సురేఖారెడ్డి

జీవుడు మానవ జన్మ ఎత్తినందుకు సాధించాల్సిన పురుషార్థాలు నాలుగు. అవి ధర్మ-అర్థ-కామ-మోక్షాలు. హిందూ మతానికి వేదాలు మూలం. దానిలో యజ్ఞ యాగాలు, క్రతువులు, షోడశకర్మలు, షట్కర్మలు, నిత్యనైమిత్తిక కర్మలు, పూజలు, వ్రతాలు, నోములు అంతర్భాగాలుగా వుంటాయి. వీటన్నింటి లక్ష్యం పురుషార్థ సాధన. అంటే పురుషుడు సాధించాల్సిన లక్ష్యం అవి ప్రతి మనిషి సాధించాలి. అవి ధర్మం-అర్థం-కామం-మోక్షం వీటిలో ధర్మార్థకామాలను "త్రివర్గం" అంటారు. ఈ మూడు ఇహలోకానికి సంబంధించినవి మోక్షం - పరలోకానికి సంబంధించినది. మనిషికి "ధర్మం" అతి ముఖ్యమైనది. ధర్మబద్ధమైన జీవనము అన్నింటికి పునాది - మూలం.

మన ప్రాచీన సాహిత్యంలో నైతిక విలువలకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. భారత - రామాయణ - భాగవతాల్లో ఉత్తములైన వ్యక్తిత్వం కలవారి కథలను వివరిస్తాయి.

ఆశ్రితులను రక్షించండం, ఆడినమాట తప్పక పోవడం, తాము సంపాదించిన దానిలో శక్తిమేరకు దానం చేయడం - అతిథి - అభ్యాగతులను ఆదరించడం అనేవి మానవులకు ఉండవలసిన మంచి గుణాలు. మన పురాణాల్లో, చరిత్రలో ఇటువంటి మహనీయుల కథలు ఎన్నెన్నో వున్నాయి. వాటి ద్వారా మానవులు స్ఫూర్తి పొంద వలసిన అవసరం ఉంది.

బలిచక్రవర్తి ఇచ్చిన మాటకు కట్టుబడి తన గురువైన శుక్రాచార్యుడు హెచ్చరిస్తున్నా "వామనుని"కి దానం చేస్తాడు.

దాతల్లో గొప్పవాడా! ఓ బలిచక్రవర్తి! నీ కులాన్ని, రాజ్యాన్ని, పరాక్రమాన్ని నిలుపుకో. ఈ పొట్టివాడు విష్ణువు. బ్రహ్మాండమంతా నిండిపోతాడు. అతన్ని ఎవరాపగలరు. నామాట విను అని శుక్రాచార్యుడు హెచ్చరిక చేస్తుంటే - బలిచక్రవర్తి ఓ మహాత్మా! మీరు చెప్పింది నిజమే. లోకంలో గృహస్థుల ధర్మం కూడ ఇదే. పలికి లేదనుట కంటే పాపమేది. పూర్వం భూదేవి

"యెట్టి - దుష్కర్ముని నే భరించెదగాని - సత్యహీనుని
మోపజాల" ననుచు
బలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ"

అని పూర్వం భూదేవి ఎటువంటి వారినైనా భరిస్తాను గాని, ఆడిన మాట తప్పిన వానిని మాత్రం మోయలేను అని బ్రహ్మతో చెప్పింది కదా!

శా॥ కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్న
తింబొందరే
వారేరే సిరిమూట గట్టుకొని పోవంజాలిరే?

ధర్మంగా, సత్యంగా బ్రతికిన వారి చరిత్రలు నేటికి లోకం మరువలేదు! అందునా యజ్ఞాలు - పుణ్యకార్యాలు ఎన్ని చేసినా విష్ణువును చూడటం - సాధ్యంకాదు అటువంటి శ్రీహరికి ఇవ్వటంతో జన్మ ధన్యం కదా!

కాబట్టి మరణం వచ్చినా సరే, నా నాలుక వెనుదిరుగదు. ఆడినమాట తప్పను అని వామనుని పాదాలను కడిగి నీళ్లు తలపై చల్లుకొని

శా॥ విప్రాయ ప్రకట వ్రతాయ భవతే విష్ణు
స్వరూపాయ వే
ద ప్రామాణ్యవిదే త్రిపాద ధరణీం దాస్యామి"
మూడడుగల నేలను దానం చేస్తున్నానని పలికి
పరమాత్మునికి ప్రీతి కలుగుగాక! అంటూ ధార
పోసాడు.

ఈ రకంగా సత్యానికి కట్టుబడిన రాజు (రాక్షస వంశంలో కూడ) వున్నాడని ఎట్లా ధర్మంగా జీవించాలో తెలుసుకోవాలి.

### భక్త ప్రహ్లాదుడు - శ్రీమహావిష్ణువును :

మోక్షాన్ని ప్రసాదించమని కోరినాడు. అంటే

జీవితమంతా ధర్మంగా బ్రతికితేనే మోక్షం కల్గుతుంది కదా!. రంతిదేవుడు అనే రాజు తన సందను దాన ధర్మాలకే ఉపయోగించాడు. చివరకు తిండి - నీరు తన గురించి ఆలోచించకుండా ఎదుటివారి ఆకలి దప్పిక తీర్చిన మహాదాత. ఇట్లా పురాణాల్లో ఎన్నో ప్రాతలున్నాయి. వాటి నుంచి సమాజానికి తర తరాలుగా నీతిని, ధర్మాన్ని, సత్యాన్ని బోధించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

వ్యక్తి మానసికంగా ఆరోగ్యవంతుడైతేనే చాలా శక్తి సామార్థ్యాలు కల్గివుంటాడు. ధర్మ ప్రవర్తనను అలవర్చు కోవడానికి పురణేతిహాసాలలో విశిష్టమైన వ్యక్తుల చరిత్ర లను చదవడం వల్ల సత్యం, ధర్మం, నీతి ద్వారా జీవన విలువలను పెంపొందించుకుంటాడు. కాబట్టి సమాజా నికి ధార్మిక విషయాలను ఇంకా ఎక్కువగా అందించ వలసిన అవసరం ఎంతైనా వుంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలంగాణ కథలు - గిరిజన, దళిత జీవన చిత్రణ

- బి. మోతీన్ నాయక్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

డా॥ బన్న ఐలయ్య స్వయంకృషితో అనేక కష్టాలను అధిగమించి ఎదిగాడు. చిన్నప్పుడే నాలుగవ తరగతిలో తండ్రి చనిపోవడంతో తల్లి ఐదుగురు పిల్లలను పెంచి పోషించడం ఎంతకష్టం! ఐదుగురిలో చిన్నవాడైన ఐలయ్య అందరితోపాటు కూలి పనికి వెళ్తూ తన చదువు కొనసాగించాడు. డా॥ బన్న ఐలయ్య వరంగల్ జిల్లా నర్సంపేటలో ముత్తయ్య, కనకలక్ష్మి దంపతులకు చివరి సంతానం.

నర్సంపేటలో హైస్కూల్లో చదువుకుంటున్నప్పుడు తెలుగునేర్పిన మహమ్మద్‌నవాజ్అలీగారు సాహిత్యం పట్ల ఆసక్తిని పెంచడంతోపాటు, విద్యార్థులను కవిత్వం రాయాలని ప్రోత్సహించేవారు. స్వయంగా ఆయన 'సంజీవని' అనే కవితా సంపుటి ప్రచురించారు. విద్యార్థులతో కవిత్వం రాయించి చదివించేవారు. ఆ స్ఫూర్తితో డా॥ బన్న ఐలయ్య తెలుగు సాహిత్యంపై అభిరుచి పెంచుకున్నారు. ఆ తర్వాత కాలంలో కాకతీయ విశ్వవిద్యాలయంలోకి వచ్చాక పేర్వారం జగన్నాథం, సుప్రసన్నాచార్య, అనుమాండ్ల భూమయ్యగార్ల పరిచయ భాగ్యం జీవితాన్ని మలుపు తిప్పింది.

బన్న ఐలయ్య నర్సంపేటలో ఒకటోతరగతి నుంచి ఇంటర్మీడియట్‌దాకా చదువుకొని, డిగ్రీ కాలేజ్ నర్సంపేటలో లేకపోవడంతో హన్మకొండకు డిగ్రీ కోసం వచ్చారు. గ్రామీణప్రాంతం నుంచి, పట్టణ ప్రాంతానికి రావడంలో ఎన్నో అనుభవాలు.

ఐదవతరగతి నుంచి ఇంటర్‌దాకా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్లో ఉండి చదువుకున్నారు. మొత్తం విద్య అంతా హాస్టల్ సౌకర్యాలద్వారానే కొనసాగింది. సెలవుల్లో ఈ పని, ఆ పని అనకుండా అన్ని పనులు చేసి కూలి సంపా దించి తల్లికి చేదోడువాదోడుగా అయ్యారు. తల్లితో, మిత్రులతో పొలాల్లో, వ్యవసాయకూలీగా, భవన నిర్మాణ పనుల్లో, రైస్‌మిల్లులు, ప్రింటింగ్ ప్రెస్‌లు, సైకిల్‌షాపు వంటి అనేక రకాలైన పనుల్లో చేరి పని చేశారు. దళిత విద్యార్థుల జీవితాలు ఇంతకు భిన్నంగా ఎలా ఉంటాయి. ఇలాంటి నిరుపేద జీవితం నుంచి విశ్వవిద్యాలయ ఆచార్యులుగా ఎదగడం అనేది అంత సులభం కాదు. చాలామంది టీచర్ ఉద్యోగం సంపాదించడానికే కష్టం. కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ పుట్టిన్నుంచి చేరిన మొట్టమొదటి దళితుడు డా॥ బన్న ఐలయ్యగారే. రిజర్వేషన్లు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలు జరగలేదని, ఈ విషయం స్పష్టం చేస్తుంది.

దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక 1992లో ఏర్పడిన తర్వాత తెలుగుసాహిత్య, సామాజిక రంగాలలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. అంతదాకా సాగిన తెలుగుసాహిత్య విమర్శ, సాహిత్యదృక్పథం ఒక్కసారిగా ప్రకటించబడింది. బీసీ, ఎస్సీ, ఎస్టీల జీవితాలు, సంస్కృతి, భాష, ఆశలు, ఆటపాటలు, ఆచార వ్యవహారాలు, కష్టాలు, కన్నీళ్లు, ఆనందాలు చిత్రించని సాహిత్యం అది ఏదైనా కావచ్చు కానీ, దళిత, బహుజన సాహిత్యం ఎలా అవుతుంది అని ప్రశ్నించారు. ఏ దృక్పథంతో రాసినా సాహిత్యంలో కుల సమస్య, కులం సృష్టించే సమస్యలు, వాటిని ఎదుర్కొంటున్న తీరు చిత్రించని సాహిత్యం దళిత, బహుజన సాహిత్యం ఎలా అవుతుందని నిలదీశారు. ఆ క్రమంలో కన్యాశుల్కంను ఇప్పుడు ఎలా చూడాలి? గతితర్కతత్త్వదర్శన భూమిక, యాభైఏళ్ల తెలుగు కథా తీరుతెన్నులు వంటి రచనలతో విశ్వవిద్యాలయాల పరిశోధనల్లో ఒక కొత్త వెలుగు వచ్చిందని ఐలయ్య భావించారు. ఇంతదాక తత్త్వశాస్త్రం అంటే ఏమిటో అనుకున్న దశనుంచి మన జీవితంలో ఉన్న సత్యాల్ని వెలికి తీయడమే తత్వశాస్త్రమని తెలిసిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, విద్యావంతులు ఎందరో ఎదిగారు. అందులో తానొకరినని వినయంగా చెప్తుంటారు.

హైస్కూల్లో చదువుతున్నప్పుడే ఐలయ్య డా॥ అంబేద్కర్ భావజాలంపట్ల ఆకర్షితులయ్యారు. హన్మకొండకు వచ్చాక, బొమ్మల కట్టయ్యగారి సహచర్యంలో ఎండ్లూరి చిన్నయ్య రాసిన డా॥ బి.ఆర్.అంబేద్కర్ జీవితచరిత్ర మళ్లీమళ్లీ చదవడం, అనేక అంబేద్కరిజం సంఘాల సభలకు వెళ్లడం, అంబేద్కరిజం సంఘాల నిర్మాణం చేపట్టడం ద్వారా క్రమక్రమంగా అంబేద్కరిజం తన జీవన తాత్త్విక సామాజిక దృక్పథంగా మలుచుకోవడం సహజంగా జరిగిపోయింది. ఏ ఊర్లో మీటింగ్ జరిగినా, వెళ్లడం పరిపాటి అయింది. నర్సంపేటలో అంబేద్కర్ విగ్రహం స్థాపించడంలో ఆనాటి మండలాధ్యక్షుడు కీర్తిశేషులు కె. మల్లయ్య తదితరులతోపాటు చురుకుగా పనిచేశారు. అంబేద్కర్ యువజన సంఘాలని స్థాపించారు. అను మాండ్ల భూమయ్య పర్యవేక్షకుడిగా తెలంగాణలో సాహిత్య సంస్థలు అనే అంశంపై పరిశోధన చేశారు.

ఇలా ఆచార్య బన్న అయిలయ్య తన జీవితానికి దారి వేసుకొని తన బాటలోని ముళ్లను, రాళ్లను తొలగించు కున్నది తానే. దళితుల జీవితం పూలపాన్పు కాదు. ఎన్నో దశలు అధిగమిస్తే తప్ప ఉన్నత స్థాయికి ఎదగడం సాధ్యపడదు. తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఎదిగిన కుటుంబంలో ఉండే సౌకర్యాలు మొదటి తరం దళిత విద్యార్థులకు ఉండవు. ప్రోత్సహించేవారుంటేనే ఎదగడం సాధ్యం. తన జీవితం ఈ విషయాన్ని అర్థం చేయించాక అటు పల్లెల్లో, ఇటు విశ్వవిద్యాలయాల్లో పేద విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించి ఎదిగించే చేసే కృషికి అంకితమయ్యారు. శ్రీమతి విజయ సహచరిగా ఐలయ్యతో పోటీపడి పిజి, బీఈడీ చేసి క్రమక్రమంగా ఎదిగి ప్రస్తుతం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. సావిత్రిబాయి పూలే వంటి చరిత్ర వీరిది. ఆ వారసత్వాన్ని స్వీకరించి బాలికల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధతో పని చేయడం ఒక ఆదర్శం. దళిత బాలికలు ఉన్నత విద్య అందుకోవడంలో ఆగి పోతున్నప్పుడల్లా మేమున్నామని ఆదరిస్తూ, ఆర్థికంగా, నైతికంగా మద్దతు ఇచ్చి ఎంతో మంది తెలుగు పండిట్, బిఈడి శిక్షణ పూర్తి చేయడానికి సహకరించిన ఆదర్శదంపతులు వీరు. వీరి ఇల్లు నిరంతరం విద్యార్థులతో సందడిగా ఉంటుంది.

అంబేద్కరిజం తన జీవన దృక్పథమైనప్పటికీ బన్న అయిలయ్య ఒక ఆచార్యులుగా తరగతి గదిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఉంటారు. జాషువా గబ్బిలాన్ని ఎంత చక్కగా పాడి వినిపిస్తారో అంతే చక్కగా శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని, విశ్వనాథ రామాయణ కల్పవృక్షాన్ని పాడి వినిపించి అర్థం చేయిస్తారు. ఇలా తరగతి గదిలో విద్యార్థులకు అనేక రకాల భావజాలాల ను ఒకే స్థాయిలో, ఒకే శ్రద్ధతో పరిచయం చేస్తారు. విద్యార్థులు వారికి నచ్చింది, జీవితానికి అవసరమయ్యేది స్వీకరిస్తారని వీరికి తెలుసు.

తాను ఎదిగిన క్రమంలో ఎదుర్కొన్న కష్టాలు ఎన్నో... తాను ఎదిగిన తర్వాత తనకు చేతనైన విధంగా దళిత విద్యార్థులకు ఉన్నత చదువుల విషయంలో అనేక విధాలుగా, ఆర్థిక, హార్దిక నైతిక ఇచ్చిన సహకారం విద్యార్థులు మరువలేనిది. గత శతాబ్దం చివరి దాక కాకతీయ విశ్వవిద్యాలయంలో గానీ, ఇతర విశ్వవిద్యాలయాల్లో గానీ కొన్ని సామాజిక వర్గాల సాహితీవేత్తలపైనే ఎం.ఫిల్, పిహెచ్.డి. పరిశోధనలు జరుగుతూ వచ్చాయి. ఒక్కొక్క సాహితీవేత్తలు, 50, 60 దాకా పరిశోధనలు వెలువరించారు. అంతేగాని, మరికొన్ని రచనలపైగాని, సాహితీవేత్తలపై గాని పరిశోధించడానికే అనుమతించని వారి ఆధిపత్యం అన్ని విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతూ వచ్చింది. మొట్టమొదటిసారిగా కాకతీయ విశ్వవిద్యాలయంలో దీన్ని బద్దలు కొట్టినవాడు డా॥ బన్న అయిలయ్య. తన పర్యవేక్షణలో ఎంతోమంది యువ పరిశోధకులు అంతదాకా నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ సాహితీవేత్తల గురించి, సమకాలీన సాహితీవేత్తల గురించి పరిశోధన చేయడానికి పూర్తి ప్రోత్సాహం అందించారు. రాష్ట్రంలో సమకాలీన సాహితీవేత్తలపై పరిశోధనలకు నేతృత్వం గావించిన పర్యవేక్షకుల్లో డా॥ బన్న అయిలయ్యగారు ప్రథముడు.

డాక్టర్ బన్న ఐలయ్య ఒక రోల్ మోడల్. ఒక సామాజిక క్రమంలో దళితులు కష్టపడి స్వయంకృషిపై ఎదిగి వచ్చిన క్రమానికి ఒక ప్రతీక. ఒక ప్రతినిధి. ఐలయ్య యూనివర్సిటీ అధ్యాపకులుగా చేరకముందు వేరు. చేరిన తర్వాత వేరు. విశ్వవిద్యాలయాల్లో, పరిశోధనల్లో అనేక పరిమితులు ఏర్పడుతుంటాయి. కొన్ని సామాజిక వర్గాల విద్యార్థులకు ఎక్కువ అవకాశాలు లభిస్తుంటాయి. కొందరి పర్యవేక్షణలో కొన్ని కులాల వారే ఉండటం, వారి పరిశోధనలను చూస్తే తెలుస్తుంది. బన్న ఐలయ్య వద్ద అన్ని సామాజిక వర్గాల పరిశోధక విద్యార్థులు పరిశోధనలు చేయడం గమనించవచ్చు.

విద్యార్థుల్లో, వారి పరిశోధనల్లో వచ్చిన మార్పు ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. అంతకుముందు సామాజిక చైతన్యాన్ని కలిగించే సాహిత్యానికి అవకాశం తక్కువ. అందులోను దళిత జీవితాల గురించిన పాఠాలు ఇంకా తక్కువ. బన్న ఐలయ్య పాఠ్యపుస్తకాలు రూపకల్పనలో జాషువా 'గబ్బిలం', బోయి భీమన్న 'పాలేరు', 'గుడిసెలు కాలిపోతున్నాయి' వంటి రచనలను ఎంఏ పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టారు. అదే క్రమంలో వర్ధమాన సుప్రసిద్ధ తెలంగాణ రచయితల రచనలను పాఠ్యాంశాలుగా నిర్ణయించడం జరిగింది. అలా విద్యార్థి దశలోనే ఆధునిక కథ, నవల, ఆధునిక జీవితం, సాహిత్యంలో ప్రతిఫలించే తీరు తెలుసుకునే అవకాశం కలిగించారు. అట్లా నిర్ణయించిన పాఠ్యాంశాల్లో బి.ఎస్. రాములు, కాలువ మల్లయ్య వంటి వారి రచనలు కూడా ఉన్నాయి.

రాష్ట్రమంతటా అనేక సభల్లో పాల్గొంటూ వరంగల్ జిల్లాలో జాషువా సాహిత్య భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో విశేష కృషి చేశారు. బన్న ఐలయ్య విద్యార్థులతో కలిసిమెలిసి ఉండడం, తాను చదువుతూ విద్యార్థులచే చదివించడం వల్ల గురుశిష్య సంబంధాలు బలపడుటంతో పాటు ఒక కొత్త తరానికి మార్గదర్శకంగా ఉన్నారు.

## గిరిజన జీవనం :

### కథ - ఇప్పపూలు :

ఎక్కడో అడవి మధ్యలో నివాసయోగ్యం కాని పర్వత పాద ప్రాంతంలో నాగరిక సమాజానికి దూరంగా, సాంకేతిక ప్రగతికి నోచుకోని ప్రాచీన సంస్కృతికి వారసులై అడవితల్లి బిడ్డలుగా బతికిన గిరిజనుల్లో ఆధునిక నాగరికత చిచ్చు పెట్టింది. విప్లవోద్యమాల విస్తరణలో ప్రభుత్వ యంత్రాంగానికి, నక్సలైట్లకు మధ్యన జరిగిన కుమ్ములాటలో గిరిజనులు బలయ్యారు. ఈ పరిణామాల్ని తెలంగాణ కథా సాహిత్యంలో అల్లం రాజయ్య, సాహూ మున్నగు కథకులు తమ కథల్లో నిక్షిప్తం చేశారు.

నాగరికులు గిరిజన ఆవాసాల్లోకి వెళ్లడం, గిరిజనులు నాగరిక సమాజంలోకి రావడం మూలాన సాంస్కృతిక జీవనంలో మార్పులు వచ్చాయి. ప్రపంచీకరణ పరిణామాలు గిరిజనులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టివేశాయి. గిరిజన గూడెల్లోకి, తండాల్లోకి నాగరికుల చొరబాటు ఎక్కువయ్యాక వ్యాపార సంస్కృతి తండాల్లోకి ప్రవేశించాక గిరిజనుల బతుకుల్లో అపశృతి దొర్లింది. నాగరికులు అడవిబిడ్డల కష్టార్జితాన్ని, ఆస్తుల్ని, అడవి సంపదను దోచుకోవడంతో గిరిజనుల బతుకులు అస్త వ్యస్తమయ్యాయి. ఈ పరిణామాలన్నీ తెలంగాణ కథకులు సమకాలీన కథాసాహిత్యంలో ప్రతిఫలింప చేస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో గిరిజనలైన లంబాడీలు సంక్షోభాన్ని ఎదుర్కోవడాన్ని బోయ జంగయ్య "ఇప్పపూలు" (2004) కథలో చిత్రించారు.

అడవి బిడ్డలుగా పొద్దంతా కాయకష్టం చేసి అలసి సొలసిన లంబాడీలు అడవిలో దొరికే ఇప్పపూలను ఏరుకొని సారా తయారు చేస్తూ ఇష్టంగా తాగేవారు. మిగిలిన సారాను అవసరాల నిమిత్తం అమ్ముకుంటూ వచ్చేవారు. ప్రభుత్వం సారాను నిషేధించాక చాటుమాటుగా సారాను కాయడం జరిగింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ వాళ్ళ దాడి పెరగడం, డబ్బులు ఇవ్వకుంటే పోలీసులు స్త్రీలను లైంగికంగా వేధింపులకు గురిచేయడం మామూలై పోగా, ప్రైవేటీకరణలో భాగంగా డిస్టలరీ ఫ్యాక్టరీ వెలువడడంతో సేకరించిన ఇప్ప పూలను ఫ్యాక్టరీకి తరలించడం జరుగుతుంది. అంత వరకు ఇంట్లోనే ఖర్చు లేకుండా తయారుచేసుకున్న సారా స్థానంలో వైన్ పేరుతో డబ్బులు

పెట్టి కొనుక్కొని తాగాల్సి రావడం, కుటుంబ అవసరాలు పెరిగిపోగా నవమాసాలు మోసి కన్న పసిబిడ్డల్ని అమ్ముకోవాల్సి వచ్చిన దుస్థితికి ఈ కథ అద్దం పట్టింది.

ఈ కథలో ఆప్కారి వాళ్ళు దాడులు చేసి డబ్బులు ఇచ్చిన వారిని వదిలివేయగా, దాడి జరిపినందుకు ఒక్క కేసన్న కావాలని బిక్య కుటుంబంపై దాడి చేసి ఆయన భార్యను, కోడల్ని జీప్ ఎక్కించి తీసుకు వస్తారు. దరోగా వయస్సులో ఉన్న ఆ ఇంటి కోడలు లచ్చిమి రొమ్ముపై చేతితో తాకితే గుడ్లురిమి చూడగా ఆ అక్కసుతో కేసు రాస్తాడు. పోలీస్ స్టేషన్ లోనే లచ్చిమిని ఎస్సై అనుభ వించడానికి ప్రయత్నిస్తాడు. పక్క ఊరి గిరిజన నాయకుని ప్రమేయంతో ఎస్సై వదిలివేయటం జరుగుతుంది. కొద్ది రోజుల్లో ఆ ఊరి పక్కన డిస్టలరీ ఫ్యాక్టరీ ఏర్పడడంతో గిరిజనులు అడవిలో ఇప్పపూలను సేకరించి ఆ ఫ్యాక్టరీకి చేర్చాల్సి రావడంతో అక్కడ వైన్ తయారవుతుంది. లచ్చినాయక్ పెద్ద కూతురు పెళ్లి నిశ్చయం కావడంతో ఖర్చులకోసం సంవత్సరం నిండని చంటి బిడ్డను భార్యకు తెలియకుండా రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా పట్నం తీసుకెళ్లి అమ్మి వస్తాడు. ఎలుగుబంటి ఎత్తు కెళ్లిందని తండ వాసులు భావించడంతో ఊపిరి పీల్చు కుంటాడు.

ఇట్లా ప్రపంచీకరణ నేపథ్యంలో గిరిజనుల బతుకులు అగమ్య గోచరమైన పరిస్థితుల్ని ఈ కథ ప్రతిబింబించింది.

ఖమ్మం జిల్లా గిరిజన జీవితాల్ని శిరంశెట్టి కాంతారావు 'సమిధలు' (2011) కథలో చిత్రించారు.

### కథ - సమిధలు :

అడవి బిడ్డలు అయిన గిరిజనులు ఆకలికి తట్టుకోలేక 'యాస గడ్డలు' తింటారు. గిరిజన స్త్రీలను అవమానించిన పోలీసుల్ని గిరిజన పెద్దలు సాహు, లెజ్జు చంపగా చివరికి పోలీసుల చేతికి చిక్కే పరిస్థితి ఏర్పడడంతో ఇష్టం లేక పోయినా విషపు గడ్డలు తిని చనిపోతారు. ఛత్తీస్గఢ్ నుంచి ఖమ్మం జిల్లాకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వస్తే అన్నలు, పోలీసులు, సల్వాజుడుంల మధ్య నెలకొన్న శత్రుత్వం వలన వారి జీవితాలు తెగిన గాలిపటాలు కావడం కనిపిస్తుంది. అమానుష నాగరికత శక్తులుగా ఎదుగుతున్న సామాజిక ధోరణులపై తిరుగుబాటు చేయాల్సిన ఆవశ్యకతను ఈ కథ తెలుపుతుంది.

### దళిత జీవనం :

### కథ - గద్దెత్కపోయిన బతుకమ్మ :

స్వాతంత్ర్యానికి పూర్వం దళితులపై అంతులేని వివక్ష కొనసాగింది. భూస్వామ్య, ధనిక వర్గాలు దళితుల్ని అణచి వేస్తూ వెట్టి చేయించుకునేవారు. సమాజంలో అట్టడుగు వర్గాలుగా, అంటరానివారుగా ముద్రపడి అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. స్వాతంత్ర్యానంతరం రాసుకున్న రాజ్యాంగంలో దళితులు అయినవారు ఈ సమాజంలో గర్వంగా తలెత్తుకొని జీవించేందుకు గాను హక్కులు, రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. చదువుతూ ఎదుగుతున్న క్రమంలో అంబేద్కర్ భావజాల వ్యాప్తి జరిగి సామాజిక గౌరవాన్ని జీవన ప్రమాణాల్ని మెరుగు పరుచుకున్నారు.

తెలంగాణలో విప్లవోద్యమాల విజృంభణతో ధనిక భూస్వామ్య వ్యవస్థ బీటలు వారగా పల్లెల్లో దళితులు ఎదిగి జీవితాల్ని గెలుచుకోవడం మంచి పరిణామం. అయినా ఇప్పటికీ దళితులపై వివక్ష ఏదో ఒక రూపంలో కొనసాగడం చూడవచ్చు.

తెలుగు సాహిత్యంలో విప్లవవాదంతో పాటు దళిత వాదం ఒక పాయగా ముందుకు కొనసాగింది. దళితులు చదువుకొని ఎదిగిన క్రమంలో దళిత వాదం ఒక ప్రత్యేక వాదంగా స్థిరపడింది. తెలంగాణ కథకులు సామాజిక మార్పులకు స్పందిస్తూ అనేక కథలు రాశారు.2000 నాటికి దళితవాదం సన్నగిల్లినప్పటికీ తమ మూలాల్ని తెలుసు కునే క్రమంలో తెలంగాణ నుండి అనేక కథలు వెలు వడ్డాయి. సమకాలీన సమాజపు తీరుతెన్నులు ప్రతిఫలిస్తూ వస్తున్నాయి. తెలంగాణలో బతుకమ్మ ప్రధానమైన పండుగ. ఆ పండుగను దళితులు జరుపుకొనీయకుండా అడ్డుకున్న కులాధిక్య పోకడల్ని జూపాక సుభద్ర

'గద్దెత్కపోయిన బతుకమ్మ' (2008) కథలో చిత్రిం చారు.

భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల పుణ్యమా అని దళితులకు ఈ మాత్రమైనా రాజకీయ పదవులు లభిస్తున్నాయి. ఆ అవకాశమే లేకపోయినట్లయితే దళితులకు పదవులు అందని ద్రాక్షే. ఈ కథలో రిజర్వేషన్ కారణంగా దేవమ్మ ఊరి సర్పంచ్ అవుతుంది. బతుకమ్మ పండుగ సందర్భంగా తన వాళ్లతో బతుకమ్మలు సిద్ధం చేయించి చెరువు వద్దకు తీసుకెళ్లి ఆడిస్తుంది. సర్పంచ్ హోదాలో అన్ని కులాల వారి బతుకమ్మలను చూస్తున్న క్రమంలో మాదిగోళ్ళకు బతుకమ్మ లేనే లేదాయె మీరెట్లా ఆడతారని కాపోల్ల బాలకృష్ణ ఆమెను అడ్డుకుంటాడు. యువకులు అండగా ఉండటంతో తమ గూడెం వాళ్లతో కలిసి ఆడుకుంటుంది. సద్దుల ఫలహారం పంచుకున్నాక దేవక్క కూతురు స్వాతి తమకు బతుకమ్మ పండుగ ఎందుకు లేకుండాపోయిందో నానమ్మ నరసమ్మను అడుగుతుంది. ఆమె ఆ కథను చెబుతూ 'మనగ్గాడ పాడాయె. దొరసాని బతుకమ్మకు పూలు తెంపుకొని వచ్చి ఇచ్చి, ఇంటికొచ్చే వరకు పొద్దంగిదాట దొరసానికిచ్చే టప్పుడు ఒల్లేసుకున్న గునుగుపూలు, తంగేడు పూలు, సో పువ్వు, ఇంటి చుట్టూ ఉన్న కట్లపూలు, బీర పూలు, సూరుకు చెక్కిన సిబ్బి తీసుకొని సీకటందని దబదబ బతుకమ్మ పేర్సిందాట. బతుకమ్మ ఆడినక పంచి పెట్టనీకి పిడికెడు గింజలు ఇంట్లో లేకుండే నట. దండెం మీద ఆరేసిన దొబ్బ తున్నను జూసి ఇదేమన్నా తినకూడదా గిదే ఫలారమని పంచిపెడతా. బతుకమ్మ దండం పెడతా తల్లి జర ఏమనుకోకు అని దండెం మీది దొబ్బ దీసి పొయ్యిలేసి కాల్చి బతుకమ్మ పక్కన పెట్టుకొని పోయింది సెరువుకాడికి. చెరువు కాడికి చేరకముందే గద్దచి ఆ దొబ్బ నెత్క పోయిందంట బిడ్డా. గది చూసి ఊరంతా "సీ.. సీసీ..ఏం మనుషులే మీరు బతుకమ్మ మీద దొబ్బను గద్దెత్క పోయిందీ... నీ దొబ్బను కాదు మీ బతుకమ్మనే ఎత్తుకపోయింది. ఈ కాన్నుంచి మీరు బతుకమ్మ కద్దు, బతుకమ్మను బదనాం చేయద్దు బంధు పెట్టండ్రి' అని కరాఖండిగా తీర్మానం చేసిండ్రంట అని తెలుపుతుంది.

ఇట్లా ఉన్నత కులాలవాళ్ళు పన్నిన కుట్ర వల్ల చానాళ్ళు మాదిగలు బతుకమ్మకు దూరంగా ఉండిపోయారని, మలిదశ తెలంగాణ ఉద్యమంలో చైతన్యవంతులై ప్రతి ఊరిలో దళితులు తమ వారసత్వ సంపదను కాపాడుకోవడానికి ముందడుగు వేయడం జరిగింది.

## కథ - బొగ్గులు :

'బొగ్గులు' (2006) కథలో బోయ జంగయ్య పేద దళితుల జీవితాన్ని ఆవిష్కరించారు.

ఈ కథలో మైసయ్య దళితుడు. అతడు బతుకు దెరువు కోసం తాను ఎంచుకున్న మార్గంలో వాచ్మెన్ నుండి మంత్రుల వరకు లంచాలు ఇవ్వాల్సి వస్తుంది. బతుకు యమకూపంగా మారిన పరిస్థితుల్లో లంచగొండులు, బ్రోకర్ల పేరుతో కట్టెలను కాష్టంలా పేర్చి నిప్పు అంటించి మనసులో వారిపై ఉన్న అక్కసును తీర్చుకోవడం ఈ కథలో కనిపిస్తుంది.

దళితులు చదువుకొని ఎదిగిన క్రమంలో వచ్చే ప్రేమ-పెళ్లి విషయంలో తలెత్తే సమస్యల్ని కాలువ మల్లయ్య 'నిర్ణయం' (2000) కథలో చిత్రించారు.

## కథ - నిర్ణయం :

అగ్రవర్ణపు ఆదిపత్యం కొనసాగుతున్న సమాజంలో అవమానాల్ని, అణచివేతను తట్టుకొని కష్టపడి చదివి ఉద్యోగాన్ని సంపాదించిన రాజారాం పట్టణంలో స్థిరపడు తాడు. తన కొడుకు సురేందర్‌ను కష్టపడి చదివించి డిప్యూటీ కలెక్టర్ అయ్యేలా తీర్చిదిద్దుతాడు. రాజారాం ఊరికి చెందిన బ్రాహ్మణుల అమ్మాయి సువిధ సురేందర్ ను కులాంతర వివాహం చేసుకోవడానికి ముందుకు వస్తుంది. ఆమె కుటుంబం వాళ్లు సుముఖత వ్యక్తం చేయడంతో సురేందర్ ఈ విషయాన్ని రాజారాంకు తెలుపు తాడు. బాల్యంలో ఒక దళితునిగా తాను పొందిన అవ మానాల్ని, ఛీత్కారాలను రాజారామ్ కొడుక్కు చెప్పాతడు. 'ప్రేమించడం తప్పు కాదు, కులాంతర వివాహం చేసు కోవడం అంతకంటే తప్పు కాదు, కానీ పీడిత కులాల నుంచి పుట్టుకొచ్చిన ఒకరిద్దరిని గద్ద తన్నుకు పోయినట్లు తన్నుకు పోతున్నారు కొందరు. మనం సంపాదించిన

విజ్ఞానం, చదువు, హెూదా ఇంత కాలంగా పీడితులుగా ఉన్న మన కుటుంబంలోని ఓ అమ్మాయికి దక్కితే మంచిది కదా అని నేననేది' అని చెప్పడంతో నేనిప్పుడు ఏం చేయాలని కొడుకు అడగడంతో నిర్ణయం నీకే వదిలేస్తున్నానని రాజారాం చెప్తాడు. తన తండ్రి చెప్పి నట్లుగా సువిధ బ్రాహ్మణికాని వదులుకొని మాదిగల్లో మాదిగగా మారిపోవడానికి సిద్ధంగా ఉందో, లేదోనని తెలుసుకోవడానికి వెళ్తాడు సురేందర్. ఇట్లా సమకాలీన సమాజంలో ఉత్పన్నమవుతున్న కొత్త సమస్యల గురించి ఈ కథ ఆలోచింపజేస్తుంది.

## ఉపయుక్త గ్రంథాలు :

1. అయిలయ్య, బన్న., తెలంగాణ కథ - పరామర్శ, నాని ప్రచురణలు, హనుమకొండ, 2017.
2. అయిలయ్య, బన్న., తెలంగాణ సాహిత్య పీఠికలు, నాని ప్రచురణలు, హనుమకొండ, 2016.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# కాల పరిణామంలో వృత్తుల విధ్వంసం

**- మునగపాటి అరవింద,** పరిశోధక విద్యార్థిని, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

వృత్తి మనుగడకు ప్రశ్నార్థకం అయినప్పుడు సంఘర్షణ అనివార్యం. నిజంచెప్పాలంటే ఈ సంఘర్షణ నేపథ్యం లోంచె కుల పురాణాలు ఉద్భవించాయి. ఈ కుల పురాణాలు అస్తిత్వాన్ని నిలబెట్టుకునేందుకు ఉద్యమించాయి. ఈ అస్మిం నిలబెట్టుకోవడానికి వెనుక ప్రేరణలయ్యాయి. కుల సిద్ధాంతాలను ప్రస్తావించినప్పుడు ప్రధానంగా చెప్పుకోవల్సింది వృత్తి సిద్ధాంతం. ఎందుకంటే ఈ వృత్తి సిద్ధాంతం కులాలు స్థిరపడడానికి భూమిక అయ్యిందనే విషయాన్ని సుస్పష్టం చేస్తుంది.

సమాజం నిరంతరం కొనసాగే ప్రక్రియ భౌతికంగా కనిపించకపోయినా దీనికి ఉనికి వుంది. అంతే కాకుండా జనంతో సంబంధం వుంది. సామాజిక శాస్త్రవేత్తలు రెండుగా విభజించిన మానవ సమాజం, జంతు సమాజాలలో బుద్ధిజీవుల సమాజంగా అధిక ప్రాధాన్యత మానవ సమాజానికే ఇచ్చారు.

నిజానికి సమాజం వ్యక్తుల సమూహం వ్యక్తులంత ఒకే సమాజంలో జీవిస్తున్నా వారి మధ్య వైరుధ్యాలు తప్పనిసరిగా వుంటాయి. ఈ వైరుధ్యాలలో ప్రధానపాత్ర పోషించేది కులం. కులం సమాజంలోని వ్యక్తులకు క్రమానుగతి, వేరుగా వుండడం అనే విషయాలలో వైరుధ్యాలకు కారణం అయినప్పటికీ పరస్పర ఆధారం మాత్రం తప్పనిసరిచేస్తుంది.

ఈ భారతీయ సమాజంలో కులం అస్పృశ్యతలో అంతర్భాగమైంది అన్నది అందరూ ఒప్పుకోవాల్సిన నిజం. ఈ అస్పృశ్యత వర్ణపరంగా ప్రపంచ సమాజంలోని కొన్ని దేశాలలో జనులను వెంటాడి వేధించింది. దక్షిణాఫ్రికాలో ఈ వర్ణ వివక్షే గాంధి లాంటి మహాత్ముని రైల్లోంచి కిందికి తోసేందుకు కారణమైంది. ఇది అక్కడితో ఆగలేదు. అసమానతలతో, వివక్షలతో అణగదొక్కబడ్తున్న నల్లజాతి వారి ముక్తికై యత్నించిన 'నెల్సన్ మండేలాను' రమారమి ఇరవై ఏడు సంవత్సరాలు జైలు పాలు చేసింది.

ఇక భారతీయ సమాజంలో అస్పృశ్యత అనే కారణం సమాజం నుండి 'విడగొట్టబడిన' వారనే అర్థంలోనే సాహితీవేత్తలచే 'దళితులుగా' తెలియచేయబడ్డారు. పవిత్రత, అపవిత్రతలు రెండూ ఒకదాన్ని ఒకటి వెన్నంటీ వుంటాయి. నిజానికిది మానవులు ఏర్పరచుకున్న ఆచార సంప్రదాయాల మూలాల నుండి రూపొందిన ఒక భావనగా చెప్పుకోవచ్చు. ఆదిమ కాలంలో ప్రకృతి శక్తులతో మానవుడు విభేదించే నేపథ్యంలో ఉపశమనం కోసం ప్రకృతిలోని పంచభూతాలను దైవశక్తులుగా భావించుకున్నాడు. మరో కోణంలో చెప్పాలంటే ప్రకృతితో జరిపిన పోరులో తను వైఫల్యమైన సందర్భంలో తనకంటే తెలివి తక్కువ వున్నవారిని తన ప్రాబల్యంతో ఆధీనంలోకి తెచ్చుకొనే ప్రయత్న చేశాడు. అక్కడి నుండే పీడన ప్రారంభమైంది. "పీడించెవాడు, పీడింపబడెవాడు వున్న సమాజం కావాలని ఎవరూ కోరుకోరు. దీని ఫలితాలు ఆదిమ సమాజం నుండి పరిణామక్రమంలో నాగరికత (నిప్పు, చక్రం ద్వారా ఏర్పడింది) పుట్టుకొచ్చాక ఆదిమ జాతి నుండి పీడన అనేది వారసత్వంగా నాగరిక సమాజాన్ని ఆవహించింది. నాగరికత మనిషికి ఎన్నో నేర్పింది. స్థిర జీవనం అందించింది. అప్పటి వరకూ సంచార జీవనం సాగించిన మనిషి స్థిరజీవనానికి శ్రీకారం చుట్టాడు. వ్యవసాయం ప్రధాన వృత్తి అయింది. సమూహాలన్నీ ఒక చోట చేరి గ్రామీణ సమాజం ఆవిర్భావమైంది. దీనికి కారణం వ్యవసాయం, గ్రామం అంతటికీ ప్రధాన వృత్తి అయినప్పటికీ ఆ వ్యవసాయానికి అనుబంధంగా వృత్తులు దాన్ని అనుసరించి కులాలు ఏర్పడ్డాయి.

గ్రామీణ సమాజంలో తెలివితో కూడిన విద్య ఒక వర్గాన్ని వున్నతంగా నిలబెట్టింది. ఈ కారణంగా అంటరానితనం, సాంఘిక అణచివేత, ఆర్థిక వ్యత్యాసం, పీడన, రాజకీయ అణచివేతలు, మేధావి కులంవారి నుండి విశ్వరూపం దాల్చాయి. ఈ మేధావి వర్గం గ్రామీణ సమాజంలో

ఆక్రమణ, అధికారాలను సొంతం చేసుకుని గ్రామీణ సమాజంలో నిస్సహాయులను మనుషులుగా పరిగణింప బడక పోవడం, పశువుల కన్నా హీనంగా చూడడం చేయడం ప్రారంభించింది.

క్రింది కులాలవారి వృత్తి నైపుణ్యాన్ని తమ అవసరాలకు వాడుకుందేగాని, మనుషులుగా పరిగణించలేదు. ఈ కారణంగా అటు వృత్తి కులాలువారు గాని, అంతకంటే దిగువన వ్యవసాయాధారిత వృత్తి నమ్ముకున్న కింది కులాలు ఈ నేపథ్యంలో ఆత్మగౌరవం అణగారిపోతున్నా తలవంచి పైవర్గాల వారికి బానిసలై జీవించడం జరిగింది. అయితే కాలం ఎప్పుడూ ఒక్క రీతి వుండదన్నట్లు పీడనను వోరిమితో సహించిన నిస్సహాయుల అంతరంగంలో అసమానతలపై సంఘర్షించే (విభేదించే) విధానాలు రూపుదిద్దుకున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆలోచన' పుట్టుకొచ్చింది. ఈ ఆలోచనల భావజాలం సాహిత్యంగా పరిణామం చెందింది. భాషతో చేయి కలిపింది. ఈ విధంగా ఏర్పడిన సాహిత్యం ప్రధానంగా దళిత సాహిత్యం వినోదం కోసం కాకుండా, సామాజిక చైతన్యానికి, పరివర్తనకు బాధ్యతాయుతమైన ఆచరణకు, దళితులు రాజ్యాధికారాన్ని చేపట్టే దిశగా ప్రేరణనిచ్చింది.

అభ్యుదయ కాంక్ష ప్రారంభమైంది. అలాగే అభ్యుదయ సాహిత్యం పీడిత, శ్రామిక వర్గ సమస్యలలో భాగంగానే దళిత సమస్యలకూ పరిష్కారాన్ని అందించింది. సాంస్కృతిక రంగాలలో కూడా దళిత చైతన్యం విస్తరింపచేసింది. ప్రధానంగా దళిత సమస్య 'కులం'తోనే ముడిపడి వుందని గుర్తించేలా చేసింది.

ఇదంతా ఒక కోణం అయితే, మరొక కోణంలో తెలంగాణ గ్రామాల్లో జరిగిన కుల విధ్వంసం, వృత్తుల విధ్వంసం 20వ శతాబ్దం స్వాతంత్ర్యానికి పూర్వం ఈ ప్రాంతం గ్రామాల్లో వృత్తిపరంగా రజక, క్షురక వృత్తుల వారిని అన్ని పనులకు వాడుకోవడం జరిగింది. దొరలిండ్లలో శుభకార్యాలకు పనులన్నీ చేయడమే కాకుండా ఈ వృత్తులవారిని పత్రికలు (లగ్గపత్రికలు) ఇచ్చి రావడానికి మైళ్ళ తరబడి దూరాలు నడిపించె ఆచారానికి గురిచేసింది. ఇలా చేసినందుకు పాచిపోయిన అన్నం పెట్టడమో గాని, కల్లు తాగించడమో గాని జరిగింది.

ఈ విధంగా గత చరిత్ర గాయాలను, తెలంగాణలో సాహితీ ప్రక్రియల్లో భాగమైనవి కవిత్వం, కథ, నాటకం, నవల, నూతన లఘు ప్రక్రియలైన నానీలు, రెక్కలు, వ్యంజనాలు ఎన్నో విషయాలు అందించాయి.

ఉదాహరణకు కేరాంమోహనరాజు గారు 'గొల్ల కథ' తెలంగాణ గ్రామాల్లోని గొల్లల వృత్తి దైన్యాన్ని తెలంగాణ మాండలికంలో తెలియచేశారు. ఈ కథలో గొల్లలు గొర్రెలకు గడ్డి లేని కరువు ప్రభావంతో, కభేళాకు పంపడం, తద్వారా వచ్చిన డబ్బుతో పొట్ట గడుపుకోవడం దృశ్యమయం చేశారు రచయిత.

అలాగే డా॥ కాలువ మల్లయ్యగారు తెలంగాణ గ్రామాల్లో వివిధ వృత్తుల ప్రజలను నేపథ్యంగా తీసుకొని నశించిన, నశిస్తున్న వృత్తులను, దానికి కారణాలను విశ్లేషిస్తూ గ్రామాల్లో వృత్తుల నాశనం కారణంగా పతనమైన విలువలను, వివిధ జీవిత సంఘర్షణలను తెలంగాణ మాండలిక భాషలో ''అవ్వతోడు గిది'' తెలంగాణ శీర్షికలతో రాసిన కథలు పాఠక లోకానికి పరిచయం చేశారు.

అలాగే చిత్త వృత్తికి భౌతిక వాస్తవికతన నేర్పేకథగా ''కుల వృత్తి'' కథను ఆచార్య ఇనాక్ గారు రచించారు. ఈ కథ 2006 లో ప్రజాసాహితి మాస పత్రికలో ప్రచురితమైంది. ఈ కథలో రచయిత దేవుడికి భక్తుడికి మధ్య పూజారి అవసరాన్ని, పవిత్రతను ఎలా అర్థం చేసుకోవాలనే అంశాలను ప్రతిపాదించారు. అలాగే దేవుడికి భక్తునికి మధ్య పూజారి వారధి అనేది భ్రమగా నిరూపించారు. అంతేకాకుండా అన్ని వృత్తుల వస్తువులకూ ఆ వృత్తులు చేసే వారికి సమాన గౌరవం, సమాన వ్యక్తిత్వం దక్కాలనే సామాజిక సమస్యను 'కులవృత్తి' కథలో ఇనాక్ గారు తెలియచేశారు.

1990 తరువాత ప్రపంచీకరణ నేపథ్యంలో కుల వృత్తుల విధ్వంసాన్ని తెలియజేస్తూ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో అనేక కథలు వెలుగులోకి వచ్చాయి. అలాగే కులవృత్తులకు దూరమైన కుటుంబాలు ఎదుర్కొంటున్న

సమస్యలపై కూడా అనేక కథలు చోటుచేసుకున్నాయి. సుంకోజి దేవేంద్రాచారి గారి కథ 'అన్నంగుడ్డ' కథలో మగ్గాలు మరుగున పడడానికి, నేత కార్మికులు కులవృత్తికి దూరం కావడానికి యంత్రాల రాకను ప్రధానంగా తెలియచేశారు. అలాగే పెద్దింటి అశోక్ కుమార్ గారు 'కుల వృత్తులు' కథలో ఫ్రిజ్‌లు వచ్చి కుండలు మాయం కావడాన్ని చిత్రించారు. కథీర్‌బాబు గారు తమ 'న్యూబాంబె టైలర్స్' కథలో టైలర్ వృత్తికి విఘాతంగా 'రెడిమేడ్ దుస్తులు' రావడాన్ని తెలియచేశారు. అలాగే ఫ్రిడ్జ్‌లురాక కుమ్మరి వృత్తి విధ్వంసానికి కారణమైన వైనాన్ని 'కాగుబొత్త' కథలో పెద్దింటి అశోక్ కుమార్ తెలియచేశారు. జాతశ్రీగారు "అంతర్ముఖం" కథలో గీత కార్మికుల కల్లును పూడ్చిపెట్టే విదేశీ మత్తు పానీయాల గురించి తెలియచేశారు. అలాగే బెస్త జీవితాల ఆటు పోట్లను జాతశ్రీగారు 'అగ్ని తుఫాను' కథలో తెలిపారు.

ఈనాడు కుల వృత్తుల విధ్వంసానికి కారణాలేవైనా కుల వృత్తులపై విషప్రభావం చూపిందన్నది నిజం. అలాగే ఆశ్రిత కులాలు, వాటికి సంబంధించిన కుల పురాణాలు వాటిని ప్రదర్శించే కళాకారుల కుటుంబాలు చిన్నాభిన్నమై రోడ్డున పడ్తున్నాయి. అటు కళాకారులు గాని, వృత్తి పనివారు గాని వారి వారి వృత్తులకు దూరమై ఆటో డ్రైవర్లుగానూ, వాచ్‌మెన్‌లుగానూ, కర్మాగారాల్లో కూలీలు గాను మారిపోవడం గమనిస్తే హృదయం ద్రవించక మానదు. అలాగని శోకిస్తూ కూర్చోవడం వల్ల సమస్యలకు పరిష్కారాలు లభించవు. ఈ భారతీయ సమాజంలో ఏ ప్రాంతంలోనైనా కులవృత్తుల విధ్వంసంలో పాత్ర వహిస్తున్నా సమస్యల నిర్మూలన బాధ్యత మనందరిపై వుంది. ప్రకృతి కారణాలకు తలొగ్గినా ప్రవృత్తి కారణాల పరిష్కారాలు వెతికి వీలైనంత త్వరలో పూర్వ వైభవంతో గ్రామీణ కుల వృత్తులు స్థిరపడాలని అభిలషిస్తున్నాను.

## ఈ సదస్సు పత్ర రచనకు తోడ్పడిన గ్రంథాలు :

1. తెలుగులో ప్రగతి శీల కథా సాహిత్యం సిద్ధాంత గ్రంథం : డా॥ కాలువ మల్లయ్య.
2. డా॥ ముదిగంటి సుజాత రెడ్డి కథలు - సమగ్ర పరిశీలన : డా॥ ఎ.జ్యోతి.
3. జీవన దృశ్యాలు నానీలు : డా॥ కాలువ మల్లయ్య.
4. మన నవలలు - మన కథానికలు : ఆచార్య రాచపాలెం చంద్రశేఖర రెడ్డి.
5. 'నల్గొండ కథా సామాజికత' : డా॥ బి. వీరారెడ్డి.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# దాశరథి రంగాచార్య -చిల్లర దేవుళ్ళు

**- భూక్య నరేందర్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

దాశరథి రంగాచార్యులు గారి గురించి పరిశీలించే ముందు, దాశరథి రంగాచార్యులు గారి కుటుంబానికి వీరి వంశానికి 'దాశరథి' అన్న పేరు రావడానికి గల కారణం గురించి చెప్పకోవాలి.

భారతదేశం 11వ శతాబ్దానికి చెందిన విశిష్టాద్వైత సిద్దాంత ప్రవక్తలైన శ్రీమద్రామానుజచార్యుల వారి శిష్యులలో ప్రముఖుడు దాశరథి శిష్యుడైన దాశరథి శ్రీమద్రామాయునచార్యుల వారి మేనల్లుడు ఇతడు మహా పండితుడు అయితే రామానుజాచార్యుల వారితో వచ్చిన ఇద్దరు శిష్యులలో దాశరథి అన్న పేరుగల 'దాశరథి'ని తెలంగాణ ప్రాంతంలో వైష్ణవ మత ప్రచారానికి వినియోగించి రామానుజాచార్యుల వారు వెళ్ళిపోవడం జరుగుతుంది. అలా రామానుజుల వారి శిష్యుడైన దాశరథి తెలంగాణా ప్రాంతంలోనే స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. క్రమక్రమంగా వారి సంతతి వారి అందరికి ''దాశరథి'' అన్న నామమే వంశనామంగా స్థిరపడిపోయింది.

ఈ విధంగా దాశరథి అన్న పేరు వ్యక్తి నామధేయంగా ఉండి క్రమంగా తర్వాత సంతతి వారికి వంశనామమంగా మారిపోయింది. వంశనామం నుండి వచ్చిన దాశరథి వారి కుటుంబంలో ఆనాటి నుండి ఈ నాటి వరకు ఎవ్వరూ ఒక్కరైన పండిత స్థానాన్ని ప్రముఖుల ప్రక్కనే చేర్చగల ప్రాధాన్యాన్ని సంపాదించుకుంటూనే ఉన్నారు. అలాగే మరోవాదం'' దాశరథి శతకకర్త రామభక్తుడైన కంచెర్ల గోపన్నకు దాశరథి వంశానికి సంబంధం వున్నట్లు దాశరథి పేర్కొన్నట్లు కొందరు సాహిత్యకారులు పేర్కొనడం జరిగింది.

ఈ విధంగా దాశరథి రంగచార్య గారి వంశ నామములో ఇంత పెద్ద చరిత్ర ప్రాధాన్యత ఉంది అలా దాశరథి వంశం నుండి వచ్చిన రంగాచార్య గారి తాత ముత్తాతలు కూడా గొప్పవారే.

దాశరథి వేంకటాచార్యులు, వెంకటమ్మ దంపతులకు దాశరథి కృష్ణమాచార్య రంగాచార్య ఇద్దరు సంతానం ఈ దంపతులకు మొదటి సంతానం అయిన కృష్ణమాచార్యలు 22జలై 1925 సంవత్సరంలో జన్మించాడు. గొప్ప సాహిత్య ఉద్యమకారుడు కృష్ణమాచార్యలు. కృష్ణమాచార్యులుగారి తమ్ముడే రంగాచార్యులు. ఇతను 24 ఆగస్టు 1928లో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో జన్మించారు. వీరి తండ్రి వేంకటాచార్యులు వీరు తర్కంలో మంచి పండితులు విద్యాంసులుగా పేర్కొంటారు సాహిత్య చరిత్రకారులు

రంగాచార్య గారి తాతగారి పేరు లక్ష్మణాచార్యులు వీరు వైద్యంలో నిష్ణాతులు, విద్యాంసులు, మహా పండితులు తార్కికులు. రంగాచార్య గారి తండ్రి వేంకటాచార్యులు గారికి "సంస్కృతము భాషలో గొప్ప ప్రావీణ్యం సంపాదించారు. తన తండ్రికి సంస్కృతం భాష పట్ల వారికి అభిమానం ఉంది. వీరు ఒక్క సంస్కృతం లోకి కాకుండా ద్రవిడ భాషల్లోను కూడా వీరు మంచి పండితులు రామాయణ, భారత, భాగవత గ్రంథాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ పండిత ప్రభావం రంగాచార్యగారిపై ఎంతో ఉంది.

### రంగాచార్య గారి -బాల్యం-చదువు :

దాశరథి రంగాచార్య గారి విద్య ఒక చోట సాఫీగ సాగలేదు. అనేచెప్పాలి. వీరు రంగాచార్యగారికి 12 ఏళ్ళ వయస్సున్నపుడే చిన గూడూరు వదలి ఖమ్మం పోయారు అప్పటికి రంగాచార్యులు గారి చిన్న గూడూరులో ఐదవ తరగతి మాత్రమే చదివి ఉన్నందున ఖమ్మంలో 6వ తరగతిలో చేరడం జరిగింది. చదువుతున్న రోజుల్లో స్కూలు యూనిఫారం విషయంలో స్ట్రైక్‌చేసినందుకు సస్పెండు అయ్యారు. అలా అంతటితో అప్పుడు చదువకు స్వస్తి చెప్పి తరువాత కొంతకాలానికి కాని అప్పటికే

పాఠశాలకెళ్ళి చదువుకునే వయస్సు మించిపోవడం, తానే స్వతహాగ తెలుగు, ఇంగ్లీషు డిక్షనరీలు దగ్గర పట్టుకొని చదువుకునేవారు. డిక్షనరీలే గురువులుగా ఉపయోగ పడ్డాయి. ఈ విధంగా రంగాచార్యగారు స్వయంగా చదువుకొని మెట్రిక్యులేషన్ పూర్తి చేసారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి బి.ఏ. పట్టా అందుకున్నాడు. ఆ తరువాత ఎల్.ఎల్.బి పూర్తి చేశారు.

రంగాచార్య గారికి తన 12ఏళ్ళ వయస్సునాటికి పెళ్ళి అవడం వల్ల ఇల్లాలిగా కాపురానికి వచ్చిన తన భార్య కమలను చూసి కుటుంబ ఖర్చులకు పెరగబోయే సంసా రాన్ని ఊహించుకుని ఉద్యోగ అవసరాన్ని గుర్తించి రెండు ఉద్యోగాలకు ధరఖాస్తు చేసుకున్నాడు. 1) టీచర్ 2) రెవెన్యూ ఇన్‌స్పెక్టర్. టీచర్ ఉద్యోగంలో చేరి ఉద్యోగ చేసుకుంటు చాలా చోట్ల బదిలి అవుతూ వచ్చారు. ఆ తరువాత కొంత కాలానికి మున్సిపల్ కార్పోరేషన్‌కి రంగా చార్య గారికి ప్రమోషన్ పై బదిలి చేయడం జరిగింది. హైద్రాబాద్ లో స్థిర నివాసం ఏర్పరుచుకొని అక్కడికి పలు సాహితీ సభల్లో పాల్గొంటూ నవలా రచన చేపట్టి ద్విగ్విజయంగా కొనసాగుతూ సాహిత్య ప్రక్రియలో ఆంధ్రలోకానికి తన సేవలనందిస్తూ వచ్చారు.

## దాశరథి రంగాచార్య రచనలు- పరిచయం :

దాశరథి రంగాచార్య సాహిత్య సృష్టిలో వారి కలం నుండి ఆధ్యాత్మికత పరమైన పురాణాలు, ఇతిహాసాలు శ్లోకాలు వాటి అర్థాలు వ్యాఖ్యానాలు అదే కాలంతో తెలంగాణ పోరాట కాలం నాటి స్థితిగతులు వాతావరణం నిజాం రాజులు పరిపాలన అందులో ప్రజలు అనుభ వించిన అష్టకష్టాలు చిత్రించబడినాయి. తెలంగాణ ప్రాంతంలో ఒక చేత కత్తి పట్టి మరోచేత కలం పట్టి యుద్ధభూముల్లోకి దునికి పోరాటం చేసిన మహా యోధుడు దాశరథి రంగాచార్య "అభినవ వ్యాసుడు"గా బిరుదు పొందిన దాశరథి రంగాచార్య చిల్లర దేవుళ్ళు, మోదుగుపూలు, జనపథం, రానున్నది ఏది నిజం? అమృతంగమయ, శరతల్పం మొదలైన నవలలు రచన చేయటం జరిగింది. అలాగేనాలుగు వేదాల అనువాదం ఉమ్రాన్‌జాన్ వంటి అనువాదాలతో పాటు శ్రీమద్రా మానుజాచార్యులు, బుద్ధుని కథ, జీవిత చరిత్రలు శ్రీమద్రామాయణం, శ్రీమహాభారతం, వేదం - జీవనాదం మొదలైన రచనలు చెసారు. దాశరథి రంగాచార్యులు గారు తను "జీవనయానం". అన్న పేరుతో తను తన ఆత్మకథ వ్రాశారు. ఈ విధంగా అనేక రచనలు చేశారు దాశరథి. తాను అనేక సాహిత్య ప్రక్రియల్ని చేపట్టిన దాశరథి రంగాచార్య నవలా మొదలైన రచనలలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. అయితే మిగత సాహిత్య ప్రక్రియలుకంటే నవల రచనలలోనే ఎక్కువ పేరు వచ్చింది.

తెలంగాణ పోరాటకాలాన్ని వాతావరణాన్ని నవలా రూపంలో సమగ్రంగా అందించిన తెలంగాణ రచయిత ఒక దాశరథి రంగాచార్యగారే అని చెప్పకతప్పదు.

## చిల్లర దేవుళ్ళు :

నవల కాలక్రమం అందులో సంఘటనలు పరిశీలించి నట్లైయితే ఆ కాలంనాటి తెలంగాణ రాజకీయ ప్రజా జీవన విధానం అవగతమవుతుంది. దాశరథి రంగాచార్య గారి నవలా క్రమంలో చిల్లరదేవుళ్ళు మొట్టమొదటి నవల నవల 1964 సవత్సరంలో వ్రాయబడింది. అయితే ఈ నవలకు రంగాచార్యగారి స్నేహితుడు నార్ల చిరంజీవిగారు నామకరణం చేసారు. ఈ నవల 1971 సవవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వచ్చింది. అలాగే ఈ నవల టి. మధుసూదనరావు గారి దర్శకత్వంలో కాకతీయ పిక్చర్ వారు సినిమాగా నిర్మించి ఘనవిజయం సాదిం చారు. తరువాత ప్రగతి పత్రిక వారు సీరియల్‌గా ప్రచురిం చారు. హిందీ పక్షపత్రికలో మధుసుదనరావుగారి దర్శకత్వంలో "ఘాట్‌కా దేవతా"పేరా దారావహికంగా వెలువరించారు. అలాగే 1971 సంవత్సరంలో రేడియో నాటకంగా నవలా స్రవంతి కార్యక్రమములో ప్రసారం చేశారు.

చిల్లర దేవుళ్ళు నవల తెలంగాణలోని ఒక గ్రామం ఆనాటి ప్రజల స్థితిగతులు ఆకాలం నాటి రాజకీయ పరిస్థితులు జమీందార్లు, పటేల్‌లు, పట్వారీలు నిజాం

ప్రభుత్వ వారి దోపిడీ దుర్మార్గాలే నవలలోని ప్రధాన ఇతివృత్తం

రామారెడ్డి నవలలోని గ్రామానికి దేశ్‌ముఖ్ దొర వెంకట్రావును గ్రామానిక పట్వారీ వీరిద్దరిలో అభిప్రాయ భేదమున్న ప్రజలను దోచుకోవడంలో వీరద్దరు ఒక్కటవు తారు. వారికి సహాయం పోలీసు అధికారి అమీన్ మరియు తాసిల్దార్ కూడా వారితో చేతులు కలుపుకొని ప్రజలను దోచుకొని తినేవారు. ఒకనాడు గ్రామానికి వలుస వచ్చిన సారంగపాణి అతను సంగిత కళాకారుడు అతని అంటి సారంపాణి రాయరెడ్డి దొర అతని నివాసంలో ఆశ్రమం కల్పిస్తారు. సారంగపాణి దొరసానికి తోడుగా ఆడబాప వనజ వీరు ఉంటారు. సారాంగపాణి దొర కూతురుకి వేంకటరెడ్డి కూతురికి అలాగే నారయ్య కూతురు తయారుకు మంజూరికి సీతకు ముగ్గురికి సంగీత పాఠాలు చెప్పుకోవడానికి కుదరించుకొని బ్రతుకుతుంటాడు. దొరగారి దగ్గర ఉంటు దొర సన్నిహితుడిగా మెలుగు తుంటాడు.

అలాగే నవల కాల క్రమంలో గ్రంథాలయోధ్యమంలో భాగస్వామ్యం కావడం వివేషం. మాడపాట హనుమంత రావు. సారంగపాణి పట్నంలో కలిసి మాట్లాడిన సంఘ టనలు నవలలోవాస్తవికతను - చరిత్రకతను తెచ్చి పెట్టి నది. అలాగే నిజాం నవాబు కాంలో హరిజనులను బిద వారిని నిజాం నవాబు ప్రభుత్వం భయపెట్టి వారిని ప్రభావాలను గురి చేసి హరిజనులను ముస్లీం మతంలోకి మార్చుకునేవారు. దానికి ఒక సంస్థను కూడా వారు ఏర్పాటు చేసుకున్నారు. ముస్లీ వాదులు ఏర్పాటు చేసు కున్న సంస్థపేరు "ఇఏత్తహాదు పత్రిక" సంస్థ హిందువు లకు నిజాం పరిపాలన కాలంలో మత స్వాతంత్ర్యం అంతంత మాత్రంగానే ఉండేది. ఇలా మత మార్పిడికి గురి అయిన ప్రజలకు తిరిగి "ఆర్య సమాజ్"వారు తిరిగి హిందు మతంలో తిసుకోవడం జరిగిన సంఘటన ఈ నవలలో వాస్తవితక - చారిత్రకత సంఘటనలు ఈ నవలలో కనిపిస్తాయి. ఆ కాలంలో నాటి తెలంగాణ ప్రాంత దొరల దౌర్జన్యానికి నిరంకుశత్వానికి నిదర్శనంగా నవలలో కొన్ని సంఘటనలు చూడవచ్చును. అలాంటి సంఘటనలో ఒకటి దొర అధినంలో గల చింతకాలయ దొగతనం చేయడం దొర అతన్ని పట్టుకోవడానికి పోతే అతను పారిపోతాడు. కొంతకాలానికి దొర చింతకాయ దొంగతనం చేసిన అతనిని వెతికిపట్టుకొని అతన్ని కొట్టి చంపుతాడు.

చిల్లర దేవుళ్ళు నవలలో వెట్టి చాకిరి భూమి సమస్యలు మొదలైనవి మనకు కనిపిస్తుంది. ఈ నవలలో వెట్టి చాకిరికి నిదర్శనంగా మనకు ఆడబాష వనజ కనబడుతుంది. వనజ దొరకు విలాస వస్తువు ఈమె బండ చాకిరీ చేయాలి పశువులకు గడ్డి పెడితే తిన్నట్టు ఇంత ముద్ద పెడితే తినాలి. లేకుంటే అక్కడే అ గాడిలోనే పడిఉండాలి.

చిల్లర దేవుళ్ళు నవలలో మనకు కన్నిస్తున్న మరో రకం వెట్టిచాకిరి దొరగారి బండి మందు మనిషి పరు గెత్తడం. దేశ్‌ముఖ్ రాయరెడ్డి అతని భార్యతో బండిలో వెళ్తున్నపుడు చాకలి ఐలిగాడు బండి ముందు పరుగెత్తే ఘోరమైన, దుర్మార్గమైన సంఘటనని మనం చూడవచ్చు. అతని వేగంగా పరుగెత్తమనడం కాని అతడు కడుపు నొప్పితో బాధ పడ్తుండటం వల్ల పగుగెత్తలేక అక్కడే పడి పోవడం ఒకేసారి జరిగాయి. ఆగ్రహించిన దొర కర్రతో చాకలి ఐలిగాడిని చావబాదడంతో వాడు అక్కడనే కుప్ప కూలి పోవడం జరుగుతుంది. దొర కొట్టిన దెబ్బలు ప్రాణం మీదికివస్తాయి. దెబ్బలకు తాళలేక చాకలివాడు ఆక్కడే పడిపోవటం వలస దొరబండి ముందుకు పోలేక వెనక్కే పోతుంది. ముందు పరుగెత్తే మనిషి లేకపోతే దొర ఎంటి పని అయినా మానుకుంటాడు. అది వారి అధికార లాంచనంగా భావించడమే ఆకాలంనాటి దొరలు.

వారికి మనిషి ప్రాణంతో, మనిషితో పనిలేదు. వారికి కావాల్సిదల్లా వారి అధికారం దొరతనం దర్పం నెల్పు కోవడం మాత్రమే. ఎదుటివారి ఎంతటి ఇబ్బందులు పడినా వారికి అవసరం లేదు.

**నవలలో-లంబాడీల తిరుగుబాటు :**

నవలలో లంబాడీల భూమి సమస్య కీలకపాత్ర

వహిస్తుంది. లంబాడీలను మోసం చేసి కరణం వెంకట్రావు వారికి ఇవ్వాల్సిన డబ్బులియ్యక దానికి తోడు భూమి కూడ ఈయకుండా వారిని తిప్పిస్తూ ఉంటాడు.

ఈనవలో ప్రధాన సమస్య భూమి సమస్య. పట్వారి కరణం, వెంకట్రావు లంబడీల దగ్గర డబ్బు తీసుకొని భూమి ఇస్తానని ఆశ జూపి ఎంతకాలం అయినా ఇవ్వక పోగా లంబాడీలు భూమి ఇవ్వమని లేక తమ డబ్బు తమరికియమని పదే పదే అడగడంతో నవలలో కని పిస్తుంది. కరణం వెంకట్రావుని లంబాడీలు భూమిని అడిగి అడిగీ విసిగిపోయి ఒక రోజు వెంకట్రావు ఇంటి ముందు లంబాడీలు గుంపులు కూర్చుని ఆ రోజు తమ సమస్యనెలాగైనా పరిష్కరించుకోవాలిని కరణం ఇంటి ముందు కూర్చుంటారు. కాని కరణం ఇంటి నుండి బయటకు రాడు. రాకపోగ

కరణం దొర తరువాత దొరని నేను నాపైన ఎదరు తిరుగబోతారా అన్న అహంకారంతో తనకు సాయంగా పోలీసులను పిలిపించుకుంటాడు. పాలీసులు కరణం ఇంటి చుట్టూ కాపల కాస్తు అక్కడ ఉన్న లంబాడీలతో ఘర్షణలకు దిగుతారు. లంబాడీలు పోలీసులతో తలపడుతారు. ఈ సంఘటనతో బీక్యా భార్య లక్ష్మీను పోలీసులు మనభంగం చేయబోగా లక్ష్మి ప్రతిఘటించడం అందుకు పోలీసులు లక్ష్మిని కాల్చిచంపడం జరుగు తుంది. ఈ లాంటి క్రూరమైన అమానుషమైన చర్యల్ని చూసి సహించలేక పోతారు లంబాడీలు లక్ష్మిని అకారణంగా చంపటంతో కరణం, అమీన్ ఇద్దరి మధ్య ఘర్షణ మొదలవుతుంది. కాని బయటకు పొక్కనీయ కుండా జాగ్రత్త పడ్డరిద్దరు. కరణం లంబాడీల మీద గెలిచామని అనుకున్నారు. కాని అది ఎంతో కాలం నిలువ లేదు. అక్కడి నుండి వెళ్ళిపోయిన లంబాడీలు ఒక తండా అండగా అన్ని తండాలు కదిలి దాడికి దిగారు అది చూసి బయపడి పారిపోతాడు. కరణాన్ని లంబాడీలు నరికి చంపుతారు. ఇలాంటి ఘటనే మొండ్రాయి గ్రామంలో మరియు జనగమ తాల్కాలోని దర్మాపురం అనే చిన్న గ్రామంలో జరుగుతుంది.

ఇలాంటి భూమి సమస్యలంతో ఉన్న సంఘటనలు చాలా ఉన్నాయి. ఆ కాలంలో తెలంగాణ ప్రాంతంలో ఎన్నో జరిగినవి. దొరల దౌర్జన్యానికి అహంకారానికి మనం చిల్లరదేవుళ్ళు నవలలో చూస్తాం. మనం నవలలో రామిరెడ్డి దొరను అహంకారానికి తన అధికారం అప్రతి హతంగా సాగాలనుకునే నిరంకుశ మనస్తత్వానికి ఒక ప్రతీకగా చెప్పుకోవచ్చును ఇలాంటి దొరలు తెలంగాణ ప్రాంతంలో ఆకాలంలో ఎంతో మంది ఉన్నారు. ఆకాలం నాటి దొరల పెత్తందారి తనానికి నిరంకుశత్వాన్ని దాశరథి గారి చిల్లరదేవుళ్ళు నవలలో మనం గమనించవచ్చును.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. దాశరథి రంగాచార్యులు - చిల్లర దేవుళ్ళు నవల
2. దాశరథి రంగాచార్యులు - డా. వి. జయప్రకాశ్ (మోనోగ్రాఫ్)
3. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి

❀❀❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# కాకిపడగల పటం కథ - కర్ణుని పెళ్ళి విశేషాలు

- నోముల రాజు, పరిశోధక విద్యార్థి, జానపద గిరిజన పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, ఓరుగల్లు.

పల్లెల్లో, వలస పట్టణ వాసుల్లో ఉండెభాష, సంస్కృతి, సంప్రదాయం అంతయు జానపద విజ్ఞానమె అని అందరికి తెలిసిన విషయమే. జానపద విజ్ఞానం అనంతమైనది. అందు అనాదిగ కులపురాణాలు వర్ధిల్లుతు వచ్చాయి. కులాల్లో ఒక కులమైన తెనుగు (ముదిరాజ్) వారికి ఆశ్రిత / మీరాశిదార్లుగ / అడ్డిబిడ్డలుగ కాకిపడగల వారు జీవిస్తున్నారు.

కాకిపడిగెల కుల ఉత్పత్తి మరియు తెనుగు కులం వారికి వీరు ఆశ్రితులుగ మారిన విధం ఈ విధంగా ఉంది. పూర్వం జమ్ముకేశ్వర మహారాజు - సూర్యాదేవి దంపతులకు ఐదుగురు కొడుకులు కాగా అందు చివరి వాడైన వాడు దుగ్గన బోయడు ఇతడు పెందోట వనం కాపలదారుడుగ ఉండగ అక్కడికి ఔసలాయన (కంసాలి) వచ్చి తోటలోనికొన్ని పండ్లు ఇవ్వమంటాడు. అందుకు దుగ్గన్న భోయడు నిరాకరించి వెనక్కి పంపుతాడు. అలా తిరస్కరించి అవమానింపబడ్డ ఔసలాయన బంగారు కాకిని చేసి ప్రాణం పోసి తోటను నాశనం చేయమని పంపిస్థాడు. అప్పుడు ఆ కాకి తోటను నాశనం చేస్తున్న సమయంలో కాపలగ ఉన్న దుగ్గన దానిని చంపి వాళ్ళ అమ్మ దగ్గరకు వెళ్ళి విషయం చెప్తాడు. అందుకు అమ్మ సూర్యమహాదేవి అయ్యయ్యొ ఇంతవరకు మనం ఎవ్వరికి హాని చేయలేదు. ఇప్పుడు నీవు కాకిని చంపుట మహా అపరాదం కనుక నీవు కాకిపడగల అనుకొత్త కులంగ ఉద్భవించి తెనుగు కులస్థులకు అడ్డిదారులుగ ఉంటావు అని శపిస్తుంది. అంతేగాక ఆ సమయంలో తల్లి దుగ్గనతో తెనుగు కులస్థులలో ఎవరైన పుట్టిన, పురుడైన సమర్థైన పెండ్లైన, చావైన నీవు వారి నుండి కట్నం అడుకోవచ్చు. అలా తీసుకొన్న త్యాగంతో మనకు ఇష్టమైన పాండవుల కథలను చెప్పుకుని బ్రతుకు బిడ్డా .... అని తల్లి సెలవిచ్చింది.

ఆశ్రిత కులాల్లో ఒకరైన కాకిపడగల వారు అని వీరు తెనుగు కులస్థులకు హక్కు దారులుగ ఉంటు, పట సహాయతో వీరు పాండవులకు సంబంధించిన కథలు చెప్తుంటారు. పాండవుల కథలు చెపుతు పాండవులోల్లుగ గుర్తింపు పొందినారు గిరిజనులలో గోండి అనే ఉపకులం అయిన తోటి వాళ్ళలాగె పాండవుల కథలు చెప్పె కాకి పడగల వాళ్ళు ఉన్నారు. వీరు ఇద్దరు కూడా కర్ణుని పెళ్ళి విశేషాలు చెప్తారు.

### కర్ణుని పెండ్లి విశేషాలు :

పాండవులందరికి వివాహాలు జరిగాయి. అలాగె కౌరవు లందరికి వివాహాలు జరిగాయి. కానీ నాకెందుకు వివాహం జరగటం లేదని తనలో తాను బాదపడ్తు నా పెళ్ళి చేయండని కర్ణుడు అందర్ని అడగసాగాడు. అందు మొదటగా దృతరాష్టుడిని అడగగ నేను గుడ్డి వాడిని నా వల్ల కాదంటాడు. అలాగె దుర్యోధనుడి అడగగ నా వల్ల కాదు అంటాడు. చివరగా ధర్మరాజు దగ్గరికి వచ్చి తమ్ముడా ! నాకు ఒక మాట ఇయ్యవా? అనగా ధర్మరాజు మాత్రం మన తండ్రులు వేరైన మనకు తల్లి (కుంతి) ఒక్కతే కనుక నీ కోసం ఒక్క మాటేమిటి అన్నా ! ... నా ప్రాణమె ఇస్తా... ఏంటో చెప్పు అన్నా ... అనగా నాకు పెళ్ళి చేయి అని ధర్మరాజుకు కర్ణుడు తెలుపుతాడు.

అంతలో ధర్మరాజు పెద్దవాడైన తన అన్న కర్ణుని కాళ్ళు కడిగి ఉచిత అననంబునిచ్చి గౌరవిస్తాడు. అంతలోనె నాలుగు దిక్కుల గల దేశాలకు తన అన్న కర్ణుని (పెళ్ళికొడుకు) చిత్రపటాలు గీసి పెళ్ళి కూతురుకై పంపిస్తాడు. అదేంటో కాని ఏ ఒక్క పెళ్ళి కూతురు దొరక లేదు.

ఇంతలోనే నారదమహర్షులు ఆ సభలోకి వస్తారు. కర్ణుని పెళ్ళి చేయదలచి పెళ్ళి కూతురు దొరకు సంగతులను తెలుప వచ్చి ఉచిత ఆసనం పొంది, ఈ

విధంగా చెప్పాడు. ధర్మరాజా ! కళింగదేశమేలే వాడు సేనమంతిరాజు అతని భార్య సుగుణవతి కాగా, వారి కుమారుడు నందిగామ రాజు. నందిగామరాజు భార్య కుప్పగంధి, వీరి కూతురు పేరె పుష్పగంది. ఈ పుష్పగంది పేరు కల్గిన అమ్మాయియె పెళ్ళి కూతురు.ఈమెకు మీరు అనగా ధర్మరాజు, కుంతి, కర్ణునులను పూలు - పండ్లు పెట్ట వెల్లమని సెలవిచ్చి వెళ్ళుతాడు నాదర మహర్షులు. అది విన్న ధర్మరాజు, కుంతి, కర్ణులు సరే ! అని తల స్నానం చేసి బయలు దేరు సమయమున భల్లీ కలకల మని పలికింది. అదే విధంగా కర్రెపిల్లి ప్రయాణానికి ఎదురుగా వచ్చింది. అయిన ధర్మరాజు అపశకునాలను లెక్క చేయక ప్రాణం పోయిన ఫర్వాలేదు నా అన్న కర్ణుని కోసం అని ధర్మరాజు ముందుకు సాగుతాడు.

రథముపై బయలుదేరిన తల్లి కొడుకులిద్దరు నంది గామ రాజు కచ్చీరు వద్దకు వచ్చి రథము నిల్పి భటుల చేత మేము హస్తినాపుర వాసులము మీ కూతురుకు పూలు - పండ్లు పెట్ట వచ్చినాయి అని నందిగామరాజుకు కబురు పంపుతాడు. అంతలోనె నందిగామ రాజుకు తన తల్లి చెప్పిన విషయం గుర్తుకు వస్తుంది. అదేంటంటె నా తండ్రి అయిన సేనమంతి రాజును హస్తినపుర రాజు యుద్ధములో చంపాడని గుర్తుకస్తది. ఆ సమయంలో నందిగామ రాజు కడుపులోనె ఉన్నాడు. అంతేగాక తన తండ్రి మరణిచ్చినప్పటి విషయాలు, నెత్తుటి బట్టలు సందుగలో దాచినవి గుర్తుకొస్తాయి.

ఎచ్చంగ పెచ్చంగ ఏడేండ్ల బాలుడైతాండు, ఆటలాడు తాండు, పాటపాడుతాండు నందిగామ రాజు. అలాంటి సమయంలో బొంగరాలాట ఆడుతా అని ఒక్కపట్టు పట్టిన నందిగామునికి తల్లి సుగుణవతి బొంగరం చేయించి ఇస్తుంది. దానిని పట్టుకుని బాలుడైన నంది గామ రాజు బజట్ల ఆడుతుండగ ఒక బ్రాహ్మణ ముసలవ్వ పాదానికి దిగుతుంది. ఆ బాదలో ముసలవ్వ నందిగామ రాజును ఎన్ని బొంకులకు పుట్టినవురా .. పోడా, ఎన్ని రంకులకు పుట్టినవురా .. పోడ అని తిట్టగానె నంది గాముడు తల్లిని నా తండ్రేడని పల్కించగ గతంలో జర్గిన యుద్ధం తన తండ్రి మరణాన్ని వివరిస్తుంది తల్లి! ఎప్పు డైతె హస్తినపుర రాజు పాండురాజు నీ తండ్రిని చంపాడని తల్లి చెప్పిందో అప్పుడె నందిగాముడు ఆ పాండు రాజును చంపుతా అంటాడు. అతను కూడా చనిపోయాడని తల్లి చెప్పగా ఆ ఐదుగురు కొడుకులను చంపుతానని శపదము పూనుతాడు. అందుకోసమై శంకరుని కొరకు నంది గాముడు ఘోర తపస్సు ఆచరిస్తాడు. అంతలో ప్రత్యక్ష మైన భోళ శంకరుడిని నందిగాముడు పాండురాజు కుమా రులు ఐదుగురిని నేను చంపే వరమివ్వు. అందుకు శివుడు మాత్రం వాళ్ళు తప్ప ప్రపంచంలో ఎవ్వరైన రాజులు నీ క్రింద ఓడిపోతారు అంటాడు. అందుకు నంది గాముడు నాకు ఇంకొక్క వరమివ్వు అంటాడు. అదేం టంటె కుడి ప్రక్కన కుమ్మరి, ఎడమ పక్క కమ్మరి, బొడ్డున సంజీవని ఇవ్వమని అంటాడు. అందుకు శివుడు సరే ! ఇచ్చినా అంటాడు. అంతేగాక శివుడిని నొష్ట కన్ను తనకు కావాలంటాడు. అందకు కూడ ఒప్పుకున్న శివుడు ఇన్ని వరాలు ఇచ్చాను నీకు నేను ఒకేఒక 'శాపం' ఇస్తాను అంటాడు. అదేంటంటె 'స్త్రీ'తో పొందులేని బ్రహ్మచారి చేత ఓడిపోతావు, అలాగే పది విదాల పేర్లు ఏ ఒక్క వ్యక్తికి కలవాడి చేత నీవు చంపబడతావు అని శాపం ఇచ్చి మాయమవుతాడు. అప్పుడు నందిగాముడు బ్రహ్మ చారి ఎవడు యుద్ధానికి వస్తాడు. అది కూడా పదిపేర్లు ఒక్కడికె ఉండిన వీరుని ఇద్దరు కలిసి రావడమనేది కలే అని మరచిపోతాడు. హాయిగ పరిపాలన చేస్తు జీవిస్తుంటాడు. పై విధంగ గతం విషయాలు గుర్తుకు వస్తున్న సమయంలో పూలు పండ్లు పెట్టడానికి వెళ్ళిన ధర్మరాజు, కుంతి, కర్ణులు నందిగామ రాజు కచ్చీర్ వద్ద రథం నిల్పి భటులచే సందేశం పంపుతాడు. అది విన్న నందిగామ రాజు సరే ఆడపిల్లలుంటె ఎవ్వరైన వస్తారు. అని పిలిచి సాదరంగ గౌరవించి కూర్చుండబెట్టి మా అమ్మ, భార్య, కూతురు అభిప్రాయాలు తీసుకువస్తానని వెళ్ళిన నందిగాముడు కోపంతో మండిపోతాడు. ఎందు కంటె తన తండ్రిని చంపింది మరెవరో కాదు. వీరి తండ్రి పాండురాజు అని తెలుసుకొని వారి ముగ్గురిని భందిం

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

చమని ఆజ్ఞాపిస్తాడు. నందిగాముడు ధర్మరాజును అనేక విదాలుగ గుద్దుతు, తన్నుతు ఉండగా నా కొడుకులను కొట్టద్దని, కావాలంటె నన్ను కొట్టండని తల్లి కుంతి అడ్డము రాగ తల్లిని కొడుతెంటె కర్ణుడు తన గాండీవం సందించబోగ ధర్మరాజు మాత్రం అన్నా ! (కర్ణా) మనం వియ్యానికి వచ్చాము. కయ్యానికి రాలేదు. కనుక ఆగు ఆగు అన్నా ! అంటాడు. అంతలో ఆగుతాడు

అంతలో నందిగామ రాజు అంతులేని కోపంతో ధర్మ రాజును కత్తితో నరుక బోగ ధర్మమూర్తి అయిన ధర్మరాజు మెడలో పూలదండగ మారింది. ఆ తర్వాత నందిగామ రాజు కాళ్ళు - చేతులకు గొలుసు కట్టి గుట్టపై నుండి నూకండి అనగా అలాగే చేస్తారు భటులు అయిన ధర్మరాజు చావడు. అదే విధంగ ఉక్కు స్తంభం కాల్చి దానిపై ధర్మరాజును పండపెట్టగ అతను అగ్నిని ప్రార్థించగ చల్లని పాన్పుగ మారింది. ఇంకా ఊళ్ళోని విషపు కోనేరులో పడేయగ గంగదయచే ధర్మరాజు హాయిగ బయటికొస్తాడు. ధర్మరాజుకు కుర్తి వేయమనగా వేసిన భటులకు బుగులు పేట్టేల సకల దేవతలను తల్చగ కూర్చునె కుర్చిగ మారింది. ఉరేసిన, ఉక్కుబూట్లతో తొక్కిన ధర్మరాజు మాత్రం కర్ణునికి పెళ్ళి చేయాలని ఆలో చన మానక తమ్ములారా ! నేను వెళ్ళిపోతున్న అని తలుస్తడె తప్ప ప్రయత్నం మానడు. చివరికి భటులు, నందిగాముడు ధర్మరాజును ఏమి చేయలకపోతారు.

పూలు - పండ్లు పెట్టబోయిన తల్లికొడుకులకు పడ్తున్న శిక్షలకు అందు ధర్మరాజుకు పడ్తున్న మరణశిక్షలకు చలించిన నారదుడు ధర్మవర్తనుడు అయిన ధర్మరాజు నెత్తురు నేల తాకితె ప్రపంచ నాశన కారణమని తలచి అది వెంటనె మాన్పాలని వెంటనే మంత్రం చదువుకుంటు మాయవేశం ధరించి నందిగాముని పట్నంలో కచ్చీర్‌లోకి చేరుకుంటాడు. అప్పుడు నందిగాముడు నీవెవరు అని అడగగా నేను సంచారిని అన్ని క్షేత్రాలు తిర్గుతు పాపాలను తొలగిస్తాను అంటాడు అయితే వీళ్ళు నా శత్రువులు (కుంతి, కర్ణ, ధర్మరాజులు) వీరిని ఎలా చంపిన చావడం లేదు. కావునా నేను ఎలా చంపాలో సెలవివ్వడండని అడగగ నారదుడు వీరికి ఒంటి మేడ కట్టించి వారికి మంచి భోజనం 3 పూటల పెడితె చనిపోతారని సెల విచ్చాడు. (ఎందుకంటె అన్ని రకాల విషప్రయోగాలకు తట్టుకున్నారు గనక మంచి భోజనం తట్టుకోరని ఇలా చెప్పాడు).

నందిగామ రాజు పెట్టె మరణ శిక్షలు నారదుడు హస్తినపురంలోని భీమునికి తెలుపగా ఆవేశంతో భీముడు తన తమ్ముళ్ళను తీసుకుని యుద్దానికి బయలు దేరుతాడు. అప్పుడు అర్జునుడు మాత్రం అన్నా ! భావ కృష్ణులు వస్తె బాగుంటుంది కదా ! అనగా భీముడు మాత్రం కృష్ణుడా ! గోవులకాసి, గొల్ల భామల వెంట తిరుగెటోడు ఏమి యుద్ధము సాయం చేస్తాడు పా తమ్ముడు నా భుజ బలం నీకు తెలువదా ! అంటూ కళింగ దేశ నందిగామ రాజుపైకి యుద్దానికి ఆ దేశం చేరుతారు. అక్కడ బయట కచ్చీరు కాడ ఉన్న భటులను వీళ్ళు కొట్టగ అందులో ఒకడు వారి రాజు గారి వద్దకు పారిపోయి విషయం చెప్తాడు.

అది విన్న నందిగామ రాజు యుద్దానికి బయలు దేరుతు తల్లి ఆశీర్వాదంకై వెళ్తాడు. అప్పుడు వారి తల్లి వచ్చిన శత్రువుల చేయి కిందికి అయి నీ చేయి పైకి అగుగాక ! అని ఆశీర్వదించును. అంతలో నందిగాముడు వారిపై విరుచుకు పడగ వారు తట్టుకోలేక పారిపోయి ఊరి పోలిమెరల్లోకి పోయి తల దాచుకుంటారు. మొదట ముగ్గురు పూలపండ్లకోసం వెళ్ళి పడ్డబాదలు, ఆ తర్వాత భీమర్జునుడు నకుల సహాదేవులు పడిన బాదాలను వివరించి వారు నీ (కృష్ణుని) అండకోసం ఏడుస్తున్న తీరును విరవించాడు. ఆ వెంటనె వాళ్ళందరిని కాపాడు అని చెప్పి అదశ్యమైనాడు నారదుడు.

యుద్దానికి బయలు దేరాలంటె బలం బలగం అవ సరం అని కృష్ణుడు డిల్లి నగర రాజు దుర్యోధనుని చేరి విషయం వివరించగ అంతలో ధుర్యోధనుడు కోపతాము లుంటె మనలో మనము చూసుకోవాలి కాని వేరొకడు మనవాన్ని చంపుతుంటె చూస్తు ఉండేది లేదు. పద భావ యుద్ధానికి వెళ్దాం అంటాడు. అటు తర్వాత అన్న

బలరామునికి, తమ్ముడు సత్యకి చెప్పి భయలు దేరుతున్న సందర్భంలో, నా లక్ష్మి మీరు ఎటుపోతున్నారు అని అడుగుతె మీ తమ్ములు ఇలా చెరలోఉన్నారు. అని చెబితె ఎంత ఏడ్చునో, చెప్పకున్న ఎంత బాద పడునో అని చివరికి కృష్ణుడు తెలుపగ, లక్ష్మి నేను కూడా వస్తాను అని మగవాని వేషం ధరించి వారితో యుద్దానికి వస్తుంది. ఆ తర్వాత భీష్మాచార్యులను కూడా వెంట తీసుకుని వెళ్తాడు.

ఎప్పుడైతె లక్ష్మి యుద్దానికి భయలు దేరిందో కృష్ణుడు రథం నడుపుతుండగ అది చూసిన దుర్యోధనుడు కృష్ణ నీ జీవితం మా తమ్ముళ్ళా, చెల్లెల్లల కాళ్ళ వద్ద ఉండి రథం నడపడమె అని ఎత్తి పొడుస్తు అయిన ఆడవాళ్ళకు యుద్దము అవసరమా అని నిందిస్తాడు. అయినా కృష్ణుడు బాదపడడు. నందిగాముని రాజ్యం పోయి గాయూలు పడిన తమ్ములను ఓదారాస్తు ఏమి తిన్నరు, ఏడపన్నరు అని అడిగి తమ్ముళ్ళు బాదపడకండి మీకు మీ బావ ఉన్నాడు అని ధైర్యం చెప్తుంది అక్క లక్ష్మి. అంతలో పాండవ, కౌరవ కృష్ణ సైన్యాలతో పాటు అక్క బావలు లక్ష్మి కృష్ణ దుర్యోధనుడు, భీష్ములను చూసి సంతోషిస్తారు. ఆ తర్వాత మొదటిసారి నందిగామరాజుపైకి యుద్ధానికి భీమ ధుర్యోధనుడు వెలుతారు. రెండసారి దుశ్శాసనుడు, సుశర్మ వెలుతారు. ఇలా ఒక్కరొక్కరుగ (భీష్ముడు, అర్జునుడు తప్ప) యుద్దానికి పోయి ఓడిపోయి వస్తారు. చివరికి తల్లి ఆశీర్వాదంతో నందిగాముడె గెలుస్తాడు.

నందిగాముని చేతిలో ఒడిపోయి రక్తాలు కారుతు, బాదపడుతున్న ధుర్యోధనుడు, బలరాంలు కృష్ణుని వద్దకు వెళ్ళి మా తప్పును మన్నించండని వేడుకొన్నారు. అన్నా - బావ నేను మీ కోసం ఏమిచేయగలను ఆగవారి కాళ్ళ వద్ద కూర్చొని రథం నడిపె చేతకాని వానితో ఏమి పని అంటూనె కృష్ణుడు వారి బాదలను, గాయాలను మాన్పుతాడు.

కృష్ణుని ఆదేశం మేరకు సుక్కపొద్దుకు లేచి జప తపములు ఆచరించి, స్వయంగ వండుకుని తిని తన తండ్రి శంతనునికి నమస్కరించి యుద్దానికి బయలు దేరాడు భీష్మాచార్యులు. ఆ తర్వాత రణబేరి మోగించి, కోలతో డాం .... డాం .... అని కొట్టగ పట్నం అంత అల్లకల్లోలం అయితది. నంది గామరాజు తల్లి, భార్య, కూతర్లు అదిరపడి మంచంపైనుండి కింద అదిరి పడతారు. అది విన్న వాళ్ళంత ఏ యముడో? దేవుడో? అయి ఉంటాడు. అంతే తప్ప మనిషి మాత్రం కాదని అనుకుంటారు. అంతలో నందిగాముడు యుద్ధం చేయ తలచి, తల్లి ఆశీర్వాదం పొంద కోరి వెళ్తాడు. తల్లి మాత్రం తత్తర పాటుతో కొడుకును ఆశీర్వదిస్తు వచ్చిన వాని చేయి పైకి అయి - నీ చేయి కిందికి అగుగాక ! అని అమంగళం పల్కుతుంది. వెంటనె తన తప్పు తెలుసుకున్న తల్లి బిడ్డా ... ! నా మనస్సు ఏదో కీడు శంకిస్తుంది. యుద్ధం వద్దు నీ కూతుర్ని కర్ణునికిచ్చి వివాహం చేయమంటుంది.

ఆ తర్వాత నందిగాముని భార్య ఎదురొచ్చి నాథ ! నా కెందుకో కుడికన్ను అదురుతుంది. మీరు యుద్ధము మాని మన పుష్పగంది (కూతురు)ని ఇచ్చి వివాహం చేయమని బతిమాలాడుతుంది. అయినా వినని నంది గామ రాజు భీష్మాచార్యులతో యుద్ధము చేస్తుంటాడు. భీష్ముడు నందిగాముని చిత్తు చిత్తుగ ఓడించగ భీష్మాచార్యుని నందిగాముడు శరణువేడి ఇప్పుడు వెళ్ళి విశ్రాంతి తీసుకుని భార్య, తల్లి, పిల్లలతో మాట్లాడి రేపు వస్తాను అని శరణు వేడి వెళ్ళిపోతాడు.

ఎప్పుడైతే భీష్మా - నందిముగాముల యుద్ధమును కౌరవ - పాండవ కృష్ణ మొదలగు వారందరు చూసి భయకంపితులై నందిగామ రాజును మనం ఓడించి చంపలేము. నిజాయితిగ యుద్ధము చేయలేము అని తలచిన భీమార్జున, దుశ్శాసన, లక్ష్మిలు కలిసి అదే రాత్రి నంది గాముని పట్టణంకు నలుగు దిక్కుల నల్గురు చేరి తలో వైపునుండి సైనికులను నరుక్కుంటు వస్తారు. అది రాత్రి సమయం కాబట్టి ఎవరికి వీలైనట్లు వారు శత్రు సైనికులను చంపుకుంటు వస్తుంటారు. ఆ సమయంలో లక్ష్మికి ఎదురుగ అర్జునుడు, భీముడికి ఎదురుగ దుశ్వాసనుడు ఎదురు ఎదురుగ చంపుతు వస్తుండగా లక్ష్మికి ఎదురుగ చంపుతు వస్తున్న అర్జునుడు మాత్రం అయ్యో నన్ను

గమనించె నంది గామ రాజు యుద్ధము చేస్తున్నడొ ఏమో అని (లక్ష్మి చీకటిలో ఉన్నది కనబడక) తల్సి యుద్ధ శబ్దమును భట్టి అర్జునుడు బాణం వేయగ లక్ష్మి దేవి తల ఎగిరి ఎక్కడోపడిపోయింది. తెల్లారి చూసేసరికి మొండెంకు తల లేని స్థితిని చూసి కృష్ణుడు చింతిస్తు లక్ష్మిలేని నేను లేను అని అంటు లక్ష్మికి ఇష్టమైన గుర్రం తలను నరికి తెచ్చి అతికిస్తారు.

ఆ సమయంలో ఎల్లేరు గడ్డల కోసం అడవికి వచ్చిన (పద్మనాయక) గట్టయ్య వస్తున్న కాళ్ళ చప్పుడు విన్న లక్ష్మి తల గట్టయ్య నన్ను తీసుకుపో నీవెంట నీ ఇంటికి నీకు నేను సకల ధన రాశులను ఇస్తానంటుంది. అందుక అతడు తల్లి ! నేను నిన్ను తీసుకు పోతె కృష్ణుడు ఎంత బాదపడి, కోపగించుకొనునో కదా ! నేను నీ తలను కృష్ణుల వారికి దగ్గరగ విడిచి వెళ్తాను అని అలాగె చేస్తాడు. ఆ తర్వాత ఆ తల దొరకగా కృష్ణులు మంత్రోపదేశంతో పూర్వం లాగ తల ఉంచి లేపుతారు. అప్పుడు తలను తెచ్చిన గట్టయ్యకు లక్ష్మి తల సెలవు ఇచ్చినట్లు పిరికెడు దాన్యం ఇచ్చి, నరికిన గుర్రం తలను ఇచ్చి, నీ ఇంట్లో నిలుపుకో అని చెప్పగ అప్పటి నుండి లక్ష్మి దేవరగ పూజ లందుకొంటుంది.

తెల్లవారి భీష్ముడు యుద్ధానికి బయలు దేరగ కృష్ణుడు ఎదురు వెళ్ళి ఆచార్యా ! మీతో పాటు అర్జునుడి కూడా యుద్ధానికి తీసుకెళ్ళండి అంటాడు. ఎందుకంటె స్త్రీ సాంగత్యలేని వాడితో నందిగామ రాజు ఓడిపోతాడు మాత్రమే. కాని ఎవ్వనికైతె పది రకాల పేర్లు ఒక్కనికె ఉంటాయె వాని చేత చనిపోతాడని శాపం పొంది ఉన్నాడు. కనుక ఇద్దరు కలిసి వెళ్ళండని చెప్తాడు. ఆ సమయంలో నందిగామ రాజు యుద్ధానికి వస్తుంటె తన కూతురు పుష్పగంది ఎదురొచ్చి నాన్న యుద్ధం మాని కర్ణునికిచ్చి నా పెళ్ళి చేయి నాకెందుకో అపశకునంగ అనిపిస్తుంది. అనగా నందిగామ రాజు ఆ మాట వినక నేను తప్పక యుద్ధం చేస్తాను. ఒకవేల నేను యుద్ధమున మరణించిన నీకు ఉన్న రెక్కలతో దేవతల దగ్గరికి వెళ్ళు అని చెప్పి వెళ్తాడు. ఆ తర్వాత యుద్ధమున భీష్మాచార్యుడి చేత ఓడిపోయి, అర్జుని చేత శాపవశత్తు చనిపోతాడు నందిగామ రాజు. ఆ తర్వాత తన కూతురైన పుష్పగంది తన రెక్కలు విచ్చుకుని కాపడండని (1) వాయు (2) యమ (3) ఇంద్ర (4) శంకర (5) నారదుల వద్దకు విడివిడిగా వెళ్ళిన మా వల్ల కాదంటె మా వల్ల కాదంటారు. అప్పుడు నారదుడు ఈ విధంగా సెలవిస్తాడు. వచ్చిందేవరో కాదు దైవంశ సంభూతులు అని పల్కిన పుష్పగంది సంతోషిస్తుంది. ఆ తర్వాత పుష్పగంది రెక్కలు చంద్రా యుదంతో నరికించి పుష్పగంది - కర్ణుల పెళ్ళి చేసి సంతోషంగ జీవిస్తారు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కాకిపడగల పటం కథ - కర్ణుని పెళ్ళి - డా॥ అడ్లూరి వెంకటేశ్వర్లు
2. పటం కథలు - కథకులు - డా॥ గడ్డం వెంకన్న
3. కాకిపడగల కథ కర్ణునీ పెళ్ళి కథలు - పట ప్రదర్శన (క్షేత్ర పర్యటన - చల్లగరిగ వరంగల్)

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# విమర్శకునిగా సుదర్శనం

- పి. అన్వేష్ గౌడ్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో నూతన ఒరవడిన సృష్టించిన విమర్శకుడు ఆర్.ఎస్ సుదర్శనం. సామాజిక శాస్త్ర ప్రాతిపదికగా, నైతిక దృష్టితో సాగుతున్న విమర్శను తాత్విక దృష్టితో దర్శింపచేసిన ఆధునిక విర్శకుడు ఆర్.ఎస్ సుదర్శనం. విమర్శనా రంగంలో కొత్త విశ్లేషణా పరికరాలను ఏర్పరచుకొని, తనదైన శైలినీ, విధానాన్ని ప్రవేశపెట్టి, నవ్య పద్ధతులను ముందుకు తీసుకురావడం వల్ల సాహిత్య విమర్శలో తనదైన ముద్ర వేశారు సుదర్శనం.

1927లో జన్మించిన రాచకొండ సుబ్బయ్య సుదర్శనం రెండవ తరం నవలా రచయితలు బుచ్చిబాబు, గోపీచంద్‌లతో పాటు ప్రముఖులు, ఈయన నవలలు కవితలు వంటి విమర్శేతర గ్రంథాలు రచించినప్పటికీ, ఈయన రాసిన “సాహిత్యంలో దృక్పథాలు”, “సమాజం - సాహిత్యం” “సాహిత్య నేపథ్యం” వంటి విమర్శ గ్రంథాలు విమర్శనా ప్రయాణంలో మైలురాళ్ళుగా నిలిచి, సుదర్శనాన్ని విమర్శకుడిగా నిలబెట్టాయి. ఇందుకు కారణం ఈయన విస్తృత అధ్యయనంతో పాటు అనేక రంగాలకు సంబంధించిన పరిజ్ఞానం, అవగాహన కల్గి ఉండటం సుదర్శనం గారికి ఉన్న విస్తృతమైన తాత్త్విక సాహిత్య పరిజ్ఞానం ఆయనని తెలుగు సాహిత్యం విమర్శకుడిగా గుర్తించేటట్లు చేసింది.

విమర్శ పట్ల సుదర్శనానికి ఉన్న పరిజ్ఞానం, అవగాహన, దృక్పథం మరియు ఉత్తమ విమర్శకుడికి ఉండవల్సిన లక్షణాలు కల్గిఉండటం, అంతేకాకుండా మారుతున్న కాలంతోపాటు, సాహిత్యంలో వస్తున్న మార్పులకి అనుగుణంగా సాహిత్య విమర్శలో మార్పులు తీసుకురావడం వల్ల ఆర్.ఎస్. సుదర్శనం తెలుగు సాహిత్య విమర్శలో విశిష్టస్థానం సంపాదించుకున్నారు. సుదర్శనం గారి విమర్శా వ్యాసాలు అధ్యయనం చేయడం వల్ల ఈ విషయాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

“సాహితీ దృక్పథాలు”లో సుదర్శనం విశ్లేషించిన అల్లసాని పెద్దన, గురజాడ అప్పారావు, విశ్వనాథ సత్యనారాయణ, ఉన్నవ లక్ష్మీనారాయణ, గోపిచంద్, చలం, బుచ్చిబాబు, రావిశాస్త్రి, నోరినరసిహశాస్త్రి లాంటి పదిమంది సాహిత్యకారులు, సాహిత్య చరిత్రలో విశిష్టస్థానం సంపాదించిన మహామహులు రచయితలుగా సరయిన గుర్తింపులేని వాళ్ళు గురించి ఏమి చెప్పినా చెల్లుతుంది. కాని, నిర్థిష్టసాహిత్య వ్యక్తిత్వం ఉన్నళ్ళ గురించి విమర్శించడం చాలా కష్టం ఎందకంటే వాళ్ళ పాండిత్యం రచనా నైపుణ్యంతో, వారు ఇదివరకు సంపాదిచుకున్న అభిమానులు, వాళ్ళ గురించిన కొంత దుర్విమర్శ అయినా సహించలేదు. ఈ సందర్భంలో కూడా నిష్పక్షపాతంగా సమదర్శనంతో విమర్శ చేసి, నిష్పక్షపాతం అనే ఉత్తమ విమర్శ లక్షణాన్ని ప్రదర్శించారు సుదర్శనం గారు.

ఆధునిక సాహిత్యాన్ని సంప్రదాయవాదులు చిన్నచూపు చూశారు. అలాగే సాంప్రదాయ సాహిత్యాన్ని ఆధునికులు నిరాకరిస్తూ వచ్చారు. కానీ ఆనాటి సమాజ స్థితిగతులను, జీవన విధానాలను అధ్యయనం చేయడానికి ప్రాచీన సాహిత్యాన్ని విశ్లేషించటడం తప్పనిసరి. ప్రాచీన సాహిత్యం పట్ల ఆధునికులకు గల అకారణ అయిష్టత వల్ల, దాని మద విలువలు తీర్పులు చెప్పడం తప్ప, సమగ్ర పరిశీలనతో వాచకాల మీద విమర్శలు రాయడం చాలా తక్కువ. సుదర్శనం ఈ పరిమితిని అధిగమించి, అల్లసాని పెద్దన, వారి మనుచరిత్ర మీద విశ్లేషాత్మక వ్యాసం రాసి, గ్రంథం యొక్క విలువలు నిర్ణయించగల సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు.

ఆర్.ఎస్. సుదర్శనం గురజాడ వారి కన్యాశుల్కం మీదరాసిన వ్యాసం వారి విమర్శ వ్యాసాల్లో మణిపూస వంటివి. దీనిలో ముఖ్యంగా గిరీశం పాత్రని కేవలం నైతిక దృష్టితోనే కాకుండా తాత్విక దృష్టితో విశ్లేషించి సాహిత్య పాత్రల స్వరూప, స్వభావాలను విశ్లేషించడంలో నూతన

కోణాన్ని ఆవిష్కరించారు. సుదర్శనం జీవితానుభవంలో భాగంగా వచ్చే కష్టాలకు కృంగిపోకుండా వాటిని ఎదురించడానికి అవసరమైన హాస్యదృష్టిని కల్గిఉండటం, పాత్ర తత్త్వంగా గిరీశం పాత్రని విశ్లేషించారు. సుదర్శనం. అలాగే షేక్స్పియర్ ఫాల్స్టాఫ్ పాత్రతో, గిరీశం పాత్రని పోల్చి ఉదాహరణలతో వివరించి "తులనాత్మక - అధ్య యనం"ని వివరించారు. కావ్య విమర్శకి స్పష్టమైన దిశా నిర్దేశం ఉన్నప్పటికీ, నవలా విమర్శకి శాస్త్రీయమైన దిశానిర్దేశం చేసినవారు సుదర్శనం.

ఈయన విశ్వనాథ వారి నవలలను అన్వయ వ్యతిరేఖ ముఖాలతో విమర్శ చేసినా. ఈ అన్వేషణలో భాగంగా వారి 'సహృదయత' వల్ల విశ్వనాథ వారికి సన్నిహితులుగా మారారు. విమర్శకుడికి 'సహృదయత' లక్షణంగా ఉం డాలని నిరూపిస్తూ సుదర్శనం రాసిన 'నిశాంతం' కవితా సంపుటని విశ్వనాథ వారికి అంకితం చేశారు. తర్వాత విశ్వనాథ వారి జీవన, తాత్విక సాహిత్య అవగాహనలని విషించడంలో చక్కని పాండిత్యాన్ని ప్రదర్శించారు. అంతేకాకుండా విశ్వనాథ వారు "హైంధవ సాంప్రదాయ నిబద్ధమైన పరిధిని దాటకూడద'ని నిర్ణయించుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ "విశ్వనాథ వారి దృఢ సంకల్పమే ఆయన బలానికి, బలహీనతకి కారణం" అంటూ సత్య ప్రకటనం చేశారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఒక పాత్రని తాత్విక కోణంలో సమగ్రంగా విశ్లేషించడంలో విశేష కృషి చేశారు సుదర్శనం. తిలక్ సృష్టించిన అసమర్థుని జీవితయాత్ర లోని సీతారామరావు పాత్రని హేయవాద దృష్టితో రావి శాస్త్రి గారి సుబ్బయ్య పాత్రని ఆత్మన్యూనత సిద్ధాంతం లొంచి, బుచ్చిబాబు దయానిధి పాత్రని, ఈడపస్ కాంప్లెక్స్ కోణం నుండి అవగతంల చేసుకునే ప్రయత్నం చేశారు. సుదర్శనం ఈ విధంగా రచయితలు సృష్టించిన పాత్రలకి మరల ప్రాణం పోసిన సద్విమర్శకుడు సుద ర్శనం కానీ నోరినరసింహశాస్త్రి రాసిన "ధూర్జటి" చారిత్రక నవల మీద రాసిన వ్యాసం అంత సమగ్రంగా లేదనే చెప్పాలి.

ఆధునిక విమర్శకులలో ఉత్తమ విమర్శకుడిగా పేరొందిన సుదర్శనం మీద కూడా విమర్శలు వచ్చాయి. "పండ్లున్న చెట్టకే రాళ్ళు దెబ్బలని" ఎదుగుతున్న వారిని నిందించడం సహజమే కదా! రాచమల్లు రామచంద్రారెడ్డి సుదర్శనానిది, "మేరమీరిన మేథ" అని విమర్శించారు. కాని వారు ఒకానొక అయిష్టత లోంచి అలా నిందించారని తెలుస్తుంది. తర్వాత సుదర్శనం చలం రచనలని విశ్లేషిస్తూ "చలం సహజం మీద చేసిన విమర్శ వెనుక ఉద్వేగం తప్ప నిర్మాణాత్మకత లేదని, అలా గే చలానికి జీవితపు చివరిలో తప్ప జీవితాన్ని గురించిన నిర్థిష్ట తాత్వికత ఏర్పడ లేదని" వ్యాఖ్యానించారు. చలం అభిమానులు దీనిని అంగీకరించకపోవచ్చు కానీ, స్త్రీల అస్తిత్వం కోసం సాగిన స్త్రీవాదాన్ని ఇతివృత్తంగా రచనలు చేసిన చలం, స్త్రీలని వారి అస్తిత్వాల నుండి పారిపొమ్మని సందేశాన్ని ఇవ్వడం నచ్చిన సంబంధాలను ఏర్పరచుకొనే స్వేచ్ఛని ఇవ్వడం వల్ల విపలం అయ్యాడని జగమెరిగిన సత్యం.

ఈ విధంగా సుదర్శనం విమర్శనా పద్ధతులను వివ రిస్తూ, రచయిత ఏం చెప్పాడని కాక, ఎట్లా చెప్పారు అని పరిశీలించాలని, మారుతున్న కాలంతో పాటు, సాహిత్యంలో కొత్తపోకడలు వస్తాయి. కాబట్టి సాహిత్యాన్ని విమర్శించి, వ్యాఖ్యానించే మార్గాలు విభిన్నంగా రూపొం దాలని సందేశాన్నిచ్చారు. అలాగే రచయిత చీకట్లో ముసక వెలుతురులో దారి వెతుక్కుంటూ వెళ్ళవచ్చు.కానీ విమర్శ కుడు ఆ దారిలోనే దీపం పట్టుకొని వెళ్ళాలని ఆధునిక విమర్శకులకు మార్గదర్శనం చేశారు. ఈ విధంగా తెలుగు విమర్శకు ఒక ప్రామాణికమైన, బహుముఖమైన ధోరణికి శ్రీకారం చుట్టారు. 1964 నుండి 1984 వరకి నూరు సమీక్షలు చేసిన, సుదర్శనం గారు 2001లో తుదిశ్వాస విడిచారు. అయినా సహృదయ పాఠకుల హృదయాలలో, తెలుగు సాహిత్య విమర్శలో సుదర్శనం గారి స్థానం సురక్షమైనది.

## ఉపయుక్త గ్రంథాలు :

1. ఆర్.ఎస్. సుదర్శనం-నవలలు పరిశీలనం-డా॥ వై నాగయ్యగారు
2. ఆర్.ఎస్ సుదర్శనం సాహిత్య దృక్పథాలు- బి. తిరుపతి రావు

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# అన్నమయ్య - పురందరదాసు

- ఆచార్య ఎం. రామనాథంనాయుడు, తెలుగు విభాగం, కర్నాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు.

అన్నమయ్య పదకవితాపితామహుడుగా తెలుగులో కీర్తింపబడితే పురందరదాసు కర్నాటక సంగీత పితామహుడుగా కన్నడంలో కీర్తిగడించాడు. వీరిద్దరూ వారి వారి భాషలలో వైష్ణవ భక్తిని పెంపొందించాలని, సామాజిక చైతన్యం తీసుకురావాలని ఆరాటపడ్డారు. శిష్ట మరియు జానపదసంస్కృతిని కాపాడుతూనే జనజీవనం గురించి ఎన్నో కీర్తనలను రచించారు. అన్నమయ్య సాక్షాత్తు కలియుగదైవమయిన శ్రీ వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తే, పురందరదాసు పురందరవిఠలుడిని కీర్తించి ఇద్దరూ ఆయా భాషలలో సంకీర్తనాచార్యులయ్యారు.

దక్షిణ భారతదేశ వాగ్గేయకారుల్లో అన్నమయ్యకు, పురందరదాసుకు ప్రత్యేక స్థానం వుంది. వాసిలోనూ, రాశిలోనూ ఇతరులకు సాధ్యం కానన్ని కీర్తనలు రచించారు. సంగీత సాహిత్యాలను మేళవించి, పదాలను శిష్ట సాహిత్యానికి అనుగుణంగా రచించడమనేది వీరి సంకీర్తనల్లో కనిపించే ప్రత్యేక లక్షణాలు. అలాగే వీరి సంకీర్తనలు నృత్యానికి అనుకూలమైనదిగాను, సంగీతా నికి ప్రాధాన్యమైనవిగాను, భక్తి ప్రబోధాత్మకమైనవిగాను, శృంగారాత్మక- మైనవిగాను సమ్మిళితమై వుండడం వల్ల తరతమ భేదాలు లేకుండా అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వీరు ఏ భాషవాడినా, ఎలా వర్ణించినా, భావాలను ఏ తీరుగా చెప్పినా, ఏ దేవుడిని స్తుతించినా అందులో మనకు గోచరించేది ఒకే తత్త్వం. అదే భక్తితత్త్వం.

అన్నమయ్య చిన్నతనంలోనే తిరుమలకు వెళ్ళి అక్కడ అలవేలుమంగమ్మ ఇచ్చిన ప్రసాదం మూలంగా సరస సంపన్నుడవుతాడు. ఆశువుగా అలవేలు మంగమ్మ శతకం చెప్పి, తర్వాత తిరుమలవాసుడిని దర్శించి పులకించిపోతాడు.

పురందరదాసు చిన్నతనంలో తండ్రి దగ్గర వడ్డీ వ్యాపారం ఎలా చేయాలని నేర్చుకున్నాడు. తండ్రి మరణానంతరం ధనం కూడబెట్టడమే ధ్యేయంగా కాలం గడిపాడు. ఇతని అసలు పేరు శ్రీనివాసనాయక. పరమ పిసినారి. ఇతడు పండరినాథుని పరమభక్తుడు కావడానికి అతని భార్య సరస్వతీబాయి కారణం.

"యౌవనదల్లి శ్రీహరిపాదనంబదే
మూవత్తు వరుష మోహబ్ధియల్లి బిద్దె"

అని అన్నాడు. అంటే యుక్తవయసులో శ్రీహరిపాదాన్ని నమ్ముకోకుండా ముప్పయి సంవత్సరాలు మోహమనెడి సముద్రంలో పడి మోసపోయానని బాధపడ్డాడు.

క్రీ.శ. 1525లో అంటే శీనప్పకు 40సం.లు. అప్పుడు వ్యాసరాయలు అతనికి దీక్షనిచ్చి, మధ్వమత సిద్ధాంతాల్ని ఉపదేశించాడు. హరిదాసు జీవితంలో పాటించాల్సిన పద్ధతుల్ని వివరించాడు. ఆనాటి నుండి శ్రీనివాస నాయకుని పేరు మారి "పురందరదాసు" అయింది. దాస జీవిత మాధుర్యాన్ని చవిచూచాడు పురందరదాసు. దాంతో దాస సాహిత్యానికి, కర్నాటక సంగీతానికి సోపానాలు నిర్మించాడు. పురందరదాసు కీర్తనలు గుణంలోనూ, మౌలికతలోనూ ఉపనిషత్తుల సారానికి ఏమాత్రం తీసిపోలేదు. అందుకు వ్యాసరాయలు "పురందరోపనిషత్తు" అని అతని కీర్తనల్ని ప్రశంసించాడు.

అన్నమయ్య పెనుగొండ ప్రభువైన సాళువ నరసింగ రాయలతో హరినామ స్మరణ చేసే నాలుక నరుని నామం స్మరించలేదని గట్టిగా చెప్పాడు. దాంతో కోపించిన రాజు అన్నమయ్యను సంకెళ్ళతో బంధించమని ఆదేశిస్తాడు. బంధీ అయిన అన్నమయ్య

"ఆకటివేళల అలపైన వేళల
వేకువ హరినామమే దిక్కు మరిలేదు"

అనే కీర్తన పాడడంతో సంకెళ్ళు ఊడిపోతాయి. ఇక్కడ పోతన భాగవతంలోని ఆత్మార్పణా పూరితమైన గజేంద్రుని ఆర్తి కనబడుతుంది. అహంకారం నశించి, తన సర్వస్వాన్ని

భగవదర్పితం చేసినప్పుడే భగవంతుడు భక్తుడిని స్వీకరించేది.

అన్నమాచార్యులలాగానే పురందరదాసు నరస్తుతిని వ్యతిరేకించాడు. ఆయన ఎవరి మీద ఆధారపడలేదు. ఉన్న సంపత్తునంతా పేదలకు పంచి, తాను భిక్షాటన చేసి, సంసారం సాగించిన భగవద్భక్తి సంపన్నుడు. నరస్తుతిని ఇలా వ్యతిరేకించాడు.

"హిందిల్లా స్వామి ముందిల్లా గో
వింద నీనిల్లదె ఇహపరవిల్ల
నరస్తుతిసి నాలిగె బరదాయితల్ల
పరవిన ఇహవిల్ల నరజన్మ స్థిరవల్ల
నరగె పామరగె పాపద పంజరగె"

నాకు ముందు వెనుక ఎవరూ లేరు. గోవిందుడు లేకపోతే ఇహపరాలు లేవు. మానవులను స్తుతించడం నాకు చేతకాదు. నరులను స్తుతించే నాలుక నిస్సార మవుతుందని పలువిధాలుగా మానవుని స్తుతించడం మంచిది కాదని చెప్పుకున్నాడు పురందరదాసు.

అన్నమయ్య తన జీవిత కాలంలో రోజుకొక కీర్తన చొప్పున 32 వేల సంకీర్తనల్ని రచించాడని ప్రతీతి. అయితే పురందరదాసు ఏకంగా 4 లక్షల 75 వేల సంకీర్తనలు రచించాడని చెపుతారు. వీరిద్దరూ దైవాంశ సంభూతులు సాక్షాత్తు నారద స్వరూపులు. వీరి సంకీర్తనలు యావత్తూ లోకోక్తులు, వీరి జీవితసారం మానవాళికి ఆదర్శనీయం. అల్పాక్షరాల్లో అనల్పార్థం అంటే "మ(రి)చెట్టు విత్తనంలో దాగినట్టు" రచనలు చేసి, వర్ణనా నైపుణ్యం ప్రదర్శించిన భాగవోత్తములు చాలామంది వున్నారు.

విగ్రహారాధనను విమర్శించేవారిని దృష్టిలో పెట్టుకొని విజయదాసులవారు ఒక కీర్తన రాశారు.

"కల్లు భజిసిదరె కైవల్య తోరువుదో" 'రాతిని భజిస్తే కైవల్యసిద్ధి' అని వాక్యార్థం. 'కల్లు' అంటే కన్నడ భాషలో 'రాయి' అని అర్థం.

కల్లును (మంథరపర్వతాన్ని) చిలికితే అమృతం పుట్టింది.

కల్లును (గోవర్ధన పర్వతం) ఎత్తడం వల్ల గోవుల సంరక్షణకు అవకాశం కలిగింది.

కల్లును (శిలాకారమై పడిన అహల్య) తాకగా రాతి రూపం నాతి రూపమైంది.

కల్లును (సముద్రంలో వానరులు పడవేయగా) వేయడంవల్ల లంకకు దారి ఏర్పడింది.

అలాగే గోపాలదాసు "ఆవరోగవో ఎనగె" అన్నాడు. మనిషి అన్నాక రోగాలు తప్పవు. ఓపికున్నంత వరకు రోగాన్ని దాచుకోవడం సహజం. మితిమీరితే విధిలేక వైద్యుని దగ్గరికెళ్ళడం మానవస్వభావం. తన రోగమేమిటో వైద్యునికి చెప్పడం రోగి లక్షణం.

గోపాలదాసు ధన్వంతరి దగ్గరికెళ్ళాడు. తన రోగ లక్షణాల్ని చెప్పాడు. కళ్ళు కనబడటం లేదు. చెవులకు వినే శక్తి తగ్గింది. నాలుక తడబడుతుంది. రుచులు అరుచులవుతున్నాయి. చేతులకు చలనశక్తి లేదు. వాసనలు పసిగట్టే స్థితి ముక్కుకు లేదు అని చెప్పడంలో విశేషమేమీ లేదు. కాని హరిమూర్తిని కళ్ళు దర్శింపలేక పోతున్నాయి. హరికీర్తన వినే శక్తి చెవులకు లేదనడంలో వృద్ధాప్య సహజ లక్షణాల వ్యథను తెలిపాడు.

అదే సందర్భంలో హరిమూర్తి దర్శనాకాంక్ష. హరికథ శ్రవణానురక్తి. హరిసేవ ఆకాంక్ష వ్యక్తమవుతాయి.

"అనాదికాలద భవరోగ కళెయయ్య
నానెందిగూ మరెయె నీమాడిదుపకార"

నా రోగాన్ని నయం చేయవయ్యా భగవంతుడా! నీ ఉపకారాన్ని ఆజన్మాంతం మరచి పోలేనయ్యా అనడంలో భక్తుని ఆర్తి కనిపిస్తుంది.

నిత్య జీవితంలో మనిషికి ఆరోగ్యం అనేది భౌతిక శరీరానికి మాత్రమే కాదు. ఆధ్యాత్మిక ఔన్నత్యానికి కూడా అవసరం. అన్నమయ్య "శ్రీ వేంకటాద్రి మీద మందు" సర్వరోగ సంజీవిని అని నిరూపించాడు. ఇది గురుదత్తం. వేదవేద్యులు వెతికేది. ఆది అంతం లేనిది. అన్నమయ్య దృష్టిలో జన్మరోగాదులను లేకుండా చేసేది 'శ్రీ హరినామ సంకీర్తనం'. 'శ్రీహరి పాదతీర్థం చెడని మందు' అని అన్న

మయ్య అన్నాడు. అలాగే అన్నమయ్యకు "పుడమిధరుడు మాకు భువనౌషదము" అనేది గట్టి నమ్మకం కూడా.

లోకంలో గురువుల మీద భక్తి భావన ఉండేది సహజం. అయితే శిష్యులను అభిమానించడం, గౌర వించడం, ప్రశంసించడం దాస సంప్రదాయం లోని ఒక విశిష్ట లక్షణం.

శ్రీపాదరాయులు వ్యాసరాయుల్ని ''వాదతిమిర మార్తాండ, వాదిశరభభేరుండ" అంటూనే

"యతిగళొళగె నిమ్మంథ దవరుగళ
ప్రతి కాణెను ఈక్షితి యోళు యతిరాయా"!

అని అన్నాడు. అంటే యతిగణంలో నీకు సాటియైన వారు ఈ లోకంలో నాకు కనబడలేదని ప్రశంసించాడు. అలాగే వ్యాసరాయలు పురందరదాసులవారిని

"దాసరెందరె పురందరదాసరయ్య
వాసుదేవ కృష్ణన్న సూసి పూజిసువ"

అని పొగిడారు. వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుని సభక్తికంగా పూజించే దాసులెవరంటే పురందరదాసుల వారే. ఈ ప్రశంస పురందరదాసులవారి నైతిక జీవనానికి, జనాకర్షక కీర్తనల ప్రచారానికి, నీరాజనం లాంటిది.

పదకవితాపితామహుడు, సంకీర్తనాచార్యులైన అన్న మయ్య కూడా పురందరదాసును ముక్తకంఠంతో పొగి డారు. పురందరదాసుల ప్రతి కీర్తనలో ఓ సందేశం దాగి వుందని అనేక విధాలుగా ప్రశంసించాడు అన్నమయ్య.

పురందరదాసు హంపి నుండి లేదా పురందరపురం నుండి ప్రతి సంవత్సరం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్స వాలకు హాజరై, మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారిని చక్కగా వర్ణించి, కీర్తనలు పాడాడు. ఆయన కన్నడ భాష లోనే కాక సంస్కృతంలో కూడా స్వామివారిని కీర్తించాడు.

"వెంకటాచల నిలయం వైకుంఠపురవాసం
పంకజనేత్రం పరమపవిత్రం
శంఖచక్ర ధర చిన్మయరూపం
అంబుజభవవినుతం అగణితగుణధామం
తుంబురు నారద గాన వినోదం
అంబుధిశయనం అగణిత నామం
పాహి పాండవ పాలం కౌరవ మద హరణం
బాహు పరాక్రమ ఫణిపతి శయనం
అహల్య శాపవిమోచన చరణం
సకల వేద విచారం సర్వజీవినేతారం
మకర కుండలధర మదన గోపాలం
భక్త విపోషణ పురందరవిఠలం"

స్వామి తిరువీధులలో ఊరేగుతున్న సందర్భంలో పురందరదాసులవారు మనో నేత్రాలతో భవ్య విగ్రహ దర్శనాన్ని కోరుతూనే వాత్సల్యంగా రారా! అని వేనోళ్ళ స్వామిని కీర్తించాడు.

అన్నమయ్య, పురందరదాసులవారు అన్ని రకాల ప్రజల్ని భక్తి పరంగా, మానవతాధర్మాల పరంగా ప్రభా వితుల్ని చేయాలనుకున్నారు. వీరి ఆశయం స్వామి సేవ. తద్వారా సాహిత్య సేవ చేయడం. కాబట్టి వీరు సమస్త ప్రజానికానికి విషయం సులభంగా అర్థం కావడానికి ప్రజల వ్యవహారంలోని పదజాలాన్ని మాండలిక పదాల్ని స్వీకరించి తమ కీర్తనల్లో స్వేచ్ఛగా వాడారు. అన్నమయ్య ప్రత్యేకత అంతా గ్రామీణ ప్రాంతాల్లో కళ్ళకు కనిపించే అనేక దృశ్యాల్ని కవితామయం చేయడం. ఆధ్యాత్మిక రహస్యాలు బోధించడం.

1. కసువు కట్టలు వేసి కదా గోవుల చేత కొసరుచు పాలు పిండుకొనేది.
2. సుఖమును దుఃఖమును జోడుకోడెలు అఖిలము కన్నవారు అడ్డ మాడరెపుడు.

పురందరదాసు పదాలతో వ్యావహారిక భాషాధోరణి మరీ ఎక్కువ. అతడు అచ్చమైన పదకవి.

1. బారె గోపెమ్మ నిమ్మ బాలయ్య నళుతానె.
   (రావే గోపెమ్మ మీ బాలయ్య ఏడుస్తాడు)
2. హిడకో బిడబ్యాడ రంగయ్యన పాద
   (పట్టుకో వదలద్దు రంగయ్యని పాదం)

అన్నమయ్య, పురందరదాసుల పదాలలో అనే సామెతలు కన్పిస్తాయి. మచ్చుకు చూద్దాం.

**అన్నమయ్య :**

1. విత్తొకటి వెట్టితేను వేరొకటి మెలచునా?

2. వెన్న పట్టుకొని నేయి వెదకనేల.
3. గోరబొయ్యే దానికిగా గొడ్డలేటికి.
4. ఎంత తొండమున్నా దోమ ఏనుగవునటె.
5. అడవికింగాయు వెన్నెలకరణి.

## పురందరదాసు:

1. కెట్ట మేలే అరివు బందితయ్య.
(చెడ్డ తర్వాత బుద్ధి వచ్చింది)
2. కాగెబల్లందె కోగిలంతె స్వరగైవుదా!
(కోకిలరీతి కాకి పాడగలదా)
3. కాణబల్లనె కురుడ కన్నడియను.
(గుడ్డివాడు అద్దంలో కన్పిస్తాడా!)
4. ఆనెయ మేలే ఒప్పన శ్వాన కచ్చులు బల్లందె.
(ఏనుగు మీద కూర్చున్నవాడిని కుక్క కరవడానికి సాధ్యమా!)

కన్నడనాడులో అపారమైన వాగ్గేయకార సంపద వుంది. నరహరితీర్థులు, శ్రీపాదరాయలు, వ్యాసరాయలు, పురందరదాసు, గోపాలదాసు, జగన్నాథదాసులు హరిదాస సాహిత్యానికి జీవం పోసిన మహానుభావులు. వీరు మానసభక్తికి ప్రాధాన్యమిచ్చారు. పరిమిత సీమనుదాటి పరమాత్మను సర్వత్ర దర్శించినవారు. ఈ భావనలు తెలిసినవారికే అర్థమవుతాయి.

వీరు "ఏను సుఖవో ఎంథా సుఖవో హరియ
ధ్యాన మాడువర సంగ
సంగవాగలి, సాధు సంగవాగలి
సంగదింద లింగదేహ భంగవాగలి"

అంటూ హరిదాసులు కలిసి పాడడం, తన్మయత్వం చెందడం జరుగుతుంది.

తిరుమల శ్రీవారి దర్శనం సులభంగా చేసుకోవడానికి స్వామి భక్తుడైన హనుమంతుడు సహకరిస్తాడని నేటికీ కన్నడిగుల పరమ విశ్వాసం. వ్యాసరాయలు అందుకే కావచ్చు తిరుమలలో 'బేడి ఆంజనేయ స్వామి'ని ప్రతిష్ఠించాడు. 'బేడికె' అంటే కన్నడంలో 'కోరిక' అని అర్థం. మన కోరిక తీరాలంటే హనుమంతుడిని బేడుకొండని అంటే వేడుకోండని అర్థం. శ్రీరామనామ జపంతో తన జీవితాన్ని సార్థకం చేసుకున్న భక్తాగ్రేసురుడు హనుమంతుడు. అతను దాస్య భక్తికి, నమ్మిన బంటుకు చక్కని ఉదాహరణ.

హరి సర్వోత్తముడు, ఆత్మ నివేదనంతో కూడా భక్తి ముఖ్యం. పరమ భాగవోత్తములైన వారెందరో భగవంతుని లీలా విశేషాలను కీర్తించి, తమ జీవితాల్ని సార్థకం చేసుకుని తరించాడు. అన్నమయ్య, పురందరదాసుల వారు ముక్తికి భక్తి మూలమని, భక్తిలేని ఆడంబరాలు అనవసరమని తెలియజెప్పారు. అలాగే భక్తితోపాటు మానవులు జ్ఞానం సంపాదించాలని కూడా బోధించారు. వైరాగ్యాన్ని వివరించారు.

వీరు మతవైషమ్యాన్ని తొలగించి సామరస్యాన్ని ఆహ్వానించిన మహాపురుషులు. కుల మత భేదాల్ని నిరసించారు. పరమత సహనం వీరిలోని గొప్పదనం. మానవజీవితాల్ని సముద్ధరించిన మహిమాన్వితులు వీరు. నిత్య స్మరణీయులు. చరితార్థులు.

## అన్నమయ్య :

వేలవేల సంకీర్తనలతో శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆరాధించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమయ్య. తెలుగు పాటకు ప్రాణం పోసి, పదకవితకు పట్టం కట్టి, జానపదానికి వన్నె తెచ్చిన కవివరేణ్యుడు ఆయన. సంస్కృత వేదాల్లోని సారాన్ని అలతిఅలతి పదాలను అచ్చ తెలుగులోకి మలచి సామాన్యుడిని అందించిన అసమాన్యుడైన పదకవితా చక్రవర్తి అన్నమయ్య.

అన్నమాచార్యుడు 32 వేలకు పైగా సంకీర్తనలతో ముక్తి మార్గాన్ని పరచిన మహనీయుడు. ఆయనది భక్తి మార్గం. కేవలం దానికే పరిమితమయ్యారా అంటే కానే కాదంటారు ఆయన సాహిత్యం సమకాలీన చరిత్రులు.

సమాజ శ్రేయస్సు కోసం పాటపడిన కవి అన్నమయ్య. నందకాంశసంభూతుడైన అగ్రేసర వాగ్గేయకారుడు పదవ్మాయాన్ని అనంతంగా సృష్టించాడు. అవి నిత్య నూతనాలు, సార్వకాలీన సత్యాలు. అంతకు మించి ఆయన రచనలు మానవ వ్యక్తిత్వ వికాసానికి రాజ మార్గాలు.

కులమత భేదాల్ని నిర్మూలించడానికి ఆయన పదునైన ఆయుధంగా సంకీర్తనను ఎంచుకున్నాడు. అనేక సామాజికాంశాల్ని తన పాటల్లో ధారాళంగా వివరించిన సంఘసంస్కర్తగా నిలిచాడు. ఈ పదప్రయోగాలు నిరంతర మధురాలు. అరిషడ్వర్గాలనే లోపలి శత్రువుల్లో కోపం బహుబలమైంది. దుర్గుణమైన ఆ కోపాన్ని సంకీర్తనల ద్వారా అన్నమాచార్య నిరసించాడు.

"చలముగోపంబు దనుజంపేటి పగతులని తెలిసినది
యిదిగదా తెలివి
కోపము మానితేను కోటిజపాలు సే యుట
సరవి కోపించకుంటె జన్మమెల్ల సుఖమె"

అని బోధించాడాయన.

ఒక సంకీర్తనతో "సమబుద్ధే యిందరికి సర్వవేదసారం" అంటాడు అన్నమయ్య. సమబుద్ధి అంటే అన్ని ప్రాణులపట్ల సమత్వభావం కలిగి సామరస్యంగా ఉండటం. మనిషిలోని దుర్గుణం అత్యాశ. దాని గురించి ఆయన 'కడుపులోని పుండు కడలేని యాస' (ఎంతకీ తగ్గదు అని అర్థం) అని వ్యాఖ్యానించాడు. అలాంటి ఆసవిడిచినగాని యధిక సుఖము లేదు అని చాటాడు. అత్యాశ విడిచిపెట్టిననాడే మనిషికి నిజమైన సుఖం కలుగుతుందని ఆ సంకీర్తనాచార్యుడి భావన.

మానవుడిలోని ఒక దుర్గుణం స్వార్థం. అతడు తాను, తన కుటుంబం అనే ఇరుకైన భావనతో ఆలోచిస్తున్నాడు. కాని సమాజ శ్రేయస్సు గురించి పట్టించుకోవడం లేదు. స్వార్థమే అతడితో చెడుపనులు చేయిస్తుంది. స్వార్థపరుడైన మనిషికి సంబంధించి అన్నమయ్య 'తను దాను బ్రతుకేటి సుఖము' అని ఆక్షేపించాడు. మరో ముందడుగు వేసి పరపీడన సేయు కంటె పాపము మరెందులేదు. పరోపకారము కంటే బహు పుణ్యము లేదు అని నిత్య సత్యం ప్రకటించాడాయన. 'నిక్క మెరిగిన మహానిత్యుడే మనుడు' అంటూ అన్నమాచార్యులకు కులవ్యవస్థ పై తిరుగులేని బాణాన్ని సంధించాడు. పంచభూతాలకు లేని భేదాలు ఈ మనుషులకెందుకు అని సమాజాన్ని నిలదీసిన ఆయన అసలైన సత్యాన్వేషి.

"దానమే భూషణము తీనరు హస్తములకును
మానమె భూషణము మనుజులకును
రాజులకు నీతియె భూషణము
సుగుణమె భూషణము సాధులకును"

అని చాటి చెప్పారాయన. నిజమైన ఆభరణాలనే ధరించాలనడంతో పాటు దాన్ని ఆచరించి చూపిన ధన్యుడు అన్నమయ్య.

కాంతా కనకాదులు అనాదిగా మనిషిని బలహీనుణ్ని చేస్తున్నాయి. ఆ రెండింటి వల్ల కలిగే దుష్ఫలితాల్ని ఆయన అనేక సంకీర్తనల్లో వెల్లడించాడు. చెడు ఫలితాలన్నిచ్చే కామాన్ని విడిచిపెట్టాలని ఉద్బోధించాడు. అప్పు, అవినీతి ఈ రెండింటినీ మనిషి జీవితంలోకి చేరనివ్వరాదన్నదే అన్నమాచార్యుడి హితబోధ.

"అప్పు లేని సంసారమైన పాటే చాలు
తప్పు లేని జీతమొక్క తారమైన చాలు"

అంటూ మానవాళికి మార్గం చూపించాడు. దేవుడి రూపాలు, వాటి ఎక్కువ తక్కువల గురించి పోట్లాడుకునే మానవుల్ని ఉద్దేశించి "చూపెద నిదియె సత్యము నుండి" అంటారాయన. "బ్రహ్మమొక్కటె పరబ్రహ్మమొక్కటె" అంటూ సంకీర్తనద్వారా అన్నమయ్య శాశ్వత సత్యాన్ని ఆవిష్కరించాడు.

అన్నమయ్య పదాలు సంకీర్తన ఔషధాలు. అవి సమాజంలోని రుగ్మతల్ని దూరం చేయడానికి వుపయోగపడతాయి. సమ సమాజ నిర్మాణ లక్ష్యం ఆయన కీర్తనల్లో వెల్లి విరుస్తుంది.

తెలుగులో పదకవితా పితామహుడైన అన్నమయ్య కేవలం సంగీతజ్ఞుడు కాదు. తంబూర పట్టుకుని తందనాలు ఆడినవాడు కాదు. తన కీర్తనలతో కవులకు హెచ్చరిక చేశాడు. పరంపరగా వచ్చే మార్గంలో నడుస్తూ కొత్త దారికి దిశానిర్దేశం చేశాడు. అన్నమయ్య పాతదయినా కొత్త పంథాలో చెప్పడం ఆయన ప్రత్యేకత.

అన్నమయ్య ఏ భాషవాడినా, ఎలా వర్ణించినా, భావాన్ని ఏ తీరులో చెప్పినా, ఏ దేవుడిని స్తుతించినా అందులో మనకు గోచరించేది ఒకే తత్త్వం. అదే భక్తి తత్త్వం.

"ఏ వేల్పు సర్వేశుడేవేల్పు పరమేశు
డేవేల్పు భువనైక హిత మనోభావకుడు
యేవ్వేల్పు కడు సూక్ష్మమే వేల్పు కడు ఘనము
ఆవేల్పు తిరు వేంటకాద్రి విభుడు"

అని తన్మయత్వంతో శ్రీ వేంకటేశ్వరుడిని పొగడిన పరమ భక్తశిఖామణి తాళ్ళపాక అన్నమయ్య.

అన్నమయ్య అవతరణతో ఆంధ్ర సాహిత్యంలో భక్తి కవిత్వం వెల్లి విరిసింది. తనకు పూర్వం వున్న పురాణ పద్ధతిని కాని, కావ్యానువాద విధానాన్ని కాని స్వీకరించక సరికొత్త రీతులు సంకీర్తనా సాహిత్యాన్ని సృష్టించిన ప్రతిభా శాలి అన్నమయ్య. శ్రీ వేంకటేశ్వరుని ఆస్థాన కవియైన అన్నమయ్య రచించిన ఒక్కొక్క పదం ఒక్కొక్క ప్రబంధం.

అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన చేసి వర్ణనా నైపుణ్యం ప్రదర్శించిన పదకవితా పితామహుడు అన్నమయ్య. ఇతను తిరుమలేశుని వరప్రసాదంతో జన్మించాడు కాబట్టి ఆయన "ఆడిన మాటెల్ల అమృతకావ్యంగా, పాడిన పాటెల్లా పరమగానంగా" వర్ధిల్లింది.

పెద్దలకు, పుణ్యపురుషులకు, దేవతల పాదాలకు మనం నమస్కరిస్తాం. అంటే గౌరవిస్తాం. అలాగే మహా విష్ణువు దేవతల శత్రువైన బలిచక్రవర్తిని అణచడం కోసం వామనావతారం ఎత్తి, ఒక అడుగుతో ఆకాశాన్నంతా ఆక్ర మించగా బ్రహ్మదేవుడు అతని పాదాన్ని భక్తితో కడిగాడు. అలా బ్రహ్మచేత కడగబడినపాదం బ్రహ్మమే తానైన పాదం, భూమిని కొలిచిన పాదం. అహల్య పాపాల్ని ప్రక్షాళన చేసిన పాదం, కాళీయుని తలపై పెట్టిన పాదం. లక్ష్మీదేవి ప్రేమతో పట్టిన పాదం, గరుత్మంతునిపై అధిరోహించిన పాదం, భక్తులకు అనేక విధాలుగా మోక్షాన్నిచ్చే పాదంబీ అని స్వామివారి పాదాన్ని అన్న మయ్య బహువిధాలుగా కీర్తించాడు.

"బ్రహ్మకడిగిన పాదము
బ్రహ్మము తానైన పాదము
చెలఉగివసుధగొలచిన పాదము
బలితల మోపిన పాదము
తలకు గగనము తన్నిన పాదము
బలరిపుఉగాచిన పాదము
కామిని పాపము కడిగిన పాదము
పాముతలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము
పరమ యోగులకు పరిపరివిధముల
వరమొసగెడి నీ పాదము
చిరు వేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము".

ఆంధ్ర పదసాహిత్యానికి తాళ్ళపాక వారి సేవ అపూర్వం. వారిది కవి, పండిత, గాయక కుటుంబం. సంగీత సాహిత్యాల్ని భక్తి ప్రచారానికి ప్రముఖ సాధ నాలుగా ఎన్నుకొన్నారు. తాత్విక దృష్టితో విశిష్టాద్వైతాన్ని లోకానికి చాటారు. వీరి వంశస్థులంతా ఏడుకొండలో నెల కొన్న శ్రీ వేంకటేశ్వర స్వామిసేవకు అంకితం అయ్యారు.

ఆంధ్రపద సాహిత్యానికి ఎనలేని సేవచేసిన వారిలో తాళ్ళపాక అన్నమయ్య ప్రథముడుగా, తొలి తెలుగు వాగ్గేయకారుడిగా ప్రసిద్ధి చెందాడు.

అన్నమయ్య జానపదుల భాషకు, బాణీలకు అక్షర రూపాన్ని కల్పించి, శిష్ట సాహిత్యంతో సమాన గౌరవం కలిగించాడు. అందువల్ల సంగీత, సాహిత్య, పారమార్థి కాలు త్రివేణీ సంగమంగా అన్నమయ్య సాహిత్యం ఆంధ్రుల మదిలో చిరస్మరణీయమైంది.

తాళ్ళపాక కవుల సాహిత్యాన్ని గురించి డా. వేటూరి ఆనందమూర్తిగారన్న మాటలు చిరస్మరణీయాలు.

"తాళ్ళపాక వారి సాహితీ మందిరమునకు మతము పునాది", సంస్కృతాంధ్రములు కట్టడపు శిలలు, సంకీర్తనాది సాహితీ ప్రక్రియలు సోపానములు. అందలి ఆరాధ్య దైవము శ్రీవేంకటేశ్వస్వామి. ధర్మార్థ కామ మోక్షములు నాలుగు ప్రాకారములు, మధుర కవితలు ద్వారం వాకిళ్ళు, సార్వజనీనము, సర్వకాలికమునగు ఉత్తమ భావ సంపద తన్మందిర శ్రీ భండారము. ఆ కవులే అర్చకులు, భక్తియే భగవత్ప్రసాదము. గానమే స్వామి రంగరంగభోగము, రసికవర్యులే యాత్రికులు. ఇదియే వారి కవితా స్వరూపము.

నరసింగరాయలు ఒక రోజు అన్నమయ్యను తన రాజధానియైన పెనుగొండకు రప్పించుకొని అతని చేత వేంకటేశ్వరుని మీద కీర్తనలు పాడించి సత్కరించాడు. అక్కడే వుండేందుకు ఏర్పాటు చేశాడు. తర్వాత రాజుకు చాపల్యం తలెత్తి, రజోగుణం ప్రకోపించి స్వామి మీద పాడినట్లే తన మీద కూడా ఒక కీర్తన పాడమని కోరాడు. అన్నమయ్య అసహ్యించుకొని ''హరిముకుందుని కొనియాడనానాలుక నరుడైన నిన్ను కొనియాడనేరదని'' నిర్మొహమాటంగా నిరసిస్తూ, నిన్ను నీ స్నేహాన్ని విడిచి వేంకటాద్రికి వెళుతున్నానని సభా నిష్క్రమణం చేసి బయలుదేరబోయాడు. రాయల అహం దెబ్బతిని రాచ రికం బుసలుకొట్టింది. తనకోర్కెను తిరస్కరించిన అన్న మయ్యను బంధించమని ఆజ్ఞాపించాడు.

''ఆకటివేళల - అలపైన వేళల
హరినామమే - దిక్కుమరిలేదు''

అనే కీర్తనను పాడగా సంకెళ్ళు తెగిపోయాయి.

అన్నమయ్య తిరువేంకటనాథుని అనుదిన సేవ లన్నంటిలోనూ పాల్గొంటు పరవశించి తన సంకీర్తనలతో శ్రోతలను పరవశింపజేసేవాడు. ఉత్సవాలు, ఊరేగింపుల లోనూ పాల్గొని భక్తులకు నూతనోత్సాహం కలిగించేవాడు. స్వామికి మొట్టమొదటిసారి కల్యాణోత్సవం చేయించి కన్యాదాతగా వ్యవహరించాడు.

భగవంతుణ్ణి 'భక్తి' అనే పదకుసుమాలతో కీర్తించి దశదిశలా తన కీర్తి వ్యాపించేవిధంగా సంకీర్తనా యజ్ఞాన్ని చేశాడు. తరువాతి వాగ్గేయకారుల మీద, తన వంశస్థుల మీద తన ప్రభావాన్ని కవులకు కూడా ఆదర్శ ప్రాయుడ య్యాడు. తాను చేపట్టిన అన్ని రంగాల్లో విప్లవాత్మకమైన చైతన్యాన్ని తెచ్చి ఆంధ్ర సాహిత్య చరిత్రలో అమరకోశమై మరపురాని మార్గదర్శక మణిదీపంగా వెలు గొందుతున్నాడు.

## పురందరదాసు :

హరిదాసు సంస్కృతికి పెట్టింది పేరు పురందరదాసు. ఆయన మాట పాటయింది. తలకు తట్టింది సుళాదైంది. తిని త్రేచింది ఉగాభోగాలైంది. ఆయన పాటలు గందర్వ గానానికి ప్రేరేపితాలు. ఆయన సామాన్య ప్రజలకు చేరువై, ఇంటింటికీ సాహిత్యం, సంగీతం, ఆధ్యాత్మికం ప్రసరించాలనే కోరికతో భగీరథుడయ్యాడు. అతను ఊరూరా వివేకంతో సంచరించాడు. ప్రజలతో వినయంగా నడుచుకున్నాడు. వారి ఆశయాలకు విలువనిచ్చాడు. హరిదాసులంటే ఇలా వుండాలనే విధంగా వుండేవాడు.

నారదునివలె పురందరదాసు తిరుగాడే దేవుడ య్యాడు. సత్యానికి పరంజ్యోతిలా వెలిగాడు. భక్తి గొప్ప తనాన్ని తన కీర్తనల ద్వారా అమృతవాహినిలా శతమానాల వరకు నిలిచివుండేటట్టు తీశాడు.

మానవజన్మ గొప్పదన్న విషయాన్ని కీర్తనలద్వారా చెవికింపుగా వుండేటట్టు రక్తి కట్టించాడు. ఆయన ప్రజల ఉత్తమ జీవన విలువలను సంగీత రూపంలో సరళమైన కన్నడభాషలో, పండితపామరులందరికీ అర్థమయ్యేటట్టు చెప్పడానికి పూనుకున్నారు. మాటల ద్వారా కాకుండా పాటల రూపంలో చెప్పాడు. అందువల్లనే పురందరదాసు నోటినుండి వెలువడ్డ మాటలన్నీ పాటలయ్యాయి. ఆయన నోరుతెరిస్తే పదపద్యాల ధార పొంగి పొరలు తుంటుంది. ఎగిసిపడే సంగీత జలపాతం అవుతుంది. ఆయన కళ్ళతో చూచినదంతా నవనీతం చేస్తాడు. సమా జానికి అపురూపమైన జ్ఞాన సంపత్తును అందించాడు.

హరిదాస సాహిత్యం అంటే సాహిత్యం, సంగీతం, సంస్కృతులతో కూడుకున్న త్రివేణి సంగమం. అటువంటి సాహిత్యాన్ని రూపించడం సమృద్ధి చేయడం, జనప్రియం చేయడంలో పురందరదాసు కృషి, పట్టుదల మహోన్నత మైనది. ప్రజల ఆశయాలకు అనుగుణంగా దాస సాహి త్యాన్ని సంఘటితం చేసిన కీర్తి పురందరదాసుది. ఎంతటి సుప్రసిద్ధ సంగీత విద్వాంసులకైనా సహా సంగీత ప్రపం చానికి మూలమైన వారు కర్నాటక సంగీత పితామహుడైన పురందరదాసు. ఆయన సంగీతం ద్వారా భక్తితో కూడు కున్న జ్ఞానాన్ని గంగాప్రవాహంలా సామాన్య ప్రజల ఇళ్ళకు పారించి హరిదాస సాహిత్యానికి, కర్నాటక సాహిత్యానికి బంగారుబాట వేశారు.

సమాజంలోని ప్రతి ఒక్క వ్యక్తిని మంచి నడవడికలతో అత్యుత్తమ జీవనం వైపు నడిపించడానికి కంకణం

కట్టుకుని తన కీర్తనల ద్వారా మానవ విలువలను వ్యక్తీకరించాడు. అలాగే మానవుల మనస్సునూ, బుద్ధినీ శుభ్ర పరచి, హృదయాన్ని సంస్కరణ చేసి ఉత్తమ సంస్కారాన్ని అందించే అత్యుత్తమ సాహిత్యాన్నీ, సంగీతాన్ని సృష్టించి, కొత్త పరంపరను నిర్మించాడు.

హరిదాసుల జగత్తులో పురందరదాసు సంగీత ప్రపంచానికి గాలిలో గంధం వ్యాపించినట్టు వ్యాపించాడు. ఆయన చేతిలో తంబూరపట్టుకుని, కాళ్ళకు గజ్జెలు కట్టి అడుగులు వేస్తూ పెద్దతట్ట నెత్తుకుని భిక్షకోరుతూ సంచరించేవాడు. ఆయన హరిదాస సంస్కృతికి (నిదర్శనం) పట్టుగొమ్మ.

కర్నాటక దాససాహిత్యం నిండుకుండవంటిది. పురందరదాసు కర్నాటక సంగీతానికి గంగోత్రివంటివాడు. కర్నాటక సంగీత స్థాపనాచార్యుడుగాను, కర్నాటక సంగీత పితామహుడుగాను అతనికి అమితమైన గౌరవం దక్కింది. నవకోటి నారాయణుడైన ఆయన ఒక్కసారిగా హరిదాసుడయ్యాడు. తంబూర చేత బట్టి హరిని కీర్తించి, వైకుంఠం తలుపు తట్టాడు. మహావిష్ణువు ఆయన గానానికి ముగ్ధుడై అతనివైపు చూచాడు.

పురందరదాసు అసలుపేరు శ్రీనివాసనాయక. తల్లి రుక్మిణి, తండ్రి వరదప్పనాయక. భార్య సరస్వతిబాయి. ఇతను మహారాష్ట్రలోని పురందరఘడకు చెందినవాడు. తర్వాతి కాలంలో విజయనగరానికి దగ్గరివాడయ్యాడు. 1485 నుంచి 1565కాలంలో జీవించాడు.

శ్రీనివాసనాయక ఐశ్వర్యంలో నవకోటి నారాయణుడు. పరమపిసినారి. ఇతనిని పరీక్షించడానికి భగవంతుడు వృద్ధ బ్రాహ్మణుని వేషంలో మనవడి ఉపనయనానికి డబ్బును అప్పుగా అడుగుతాడు. శ్రీనివాసనాయక డబ్బులేదని ఆరునెలల పాటు అతనిని తన అంగడి దగ్గరకు తిప్పించుకుంటాడు. వృద్ధ బ్రాహ్మణుడు అలుపూ సొలుపూ లేకుండా ఇతని దగ్గరకు తిరిగి తిరిగి చివరకు అతని ఇంటికి వెళ్ళి సరస్వతీబాయిని దానం చేయమంటాడు. ఆమె తన సొత్తంటూ ఏదీ లేదు, నీకివ్వడానికి నా దగ్గర ఏముందని సమాధానం చెపుతుంది. అప్పుడు అతను మీ తల్లిదండ్రులు నీకవసరాలకని పెట్టిన ముక్కుపుల్లను చూపించి ఇవ్వమని అడుగుతాడు. ఆమె దయాగుణం కలది. వెంటనే ముక్కుపుల్లను తీసి ఇచ్చేస్తుంది. దాన్ని తీసుకున్న బ్రాహ్మణుడు పరుగు పరుగున వెళ్ళి శ్రీనివాస నాయకునికి ముక్కరను ఇచ్చి డబ్బులడుగుతాడు. అతను ముక్కరను బాగా పరిశీలించి ఇది తన భార్యదేనని పసిగట్టి, ఆ ముక్కరను అంగడిలోనే భద్రపరచి, వృద్ధునితో ఈ ముక్కర చాలా ఖరీదైనది. అంత డబ్బు ప్రస్తుతానికి అంగడిలో లేదు. ఇంటికెళ్ళి తీసుకువస్తానని చెప్పి వెళ్ళాడు. ఇంటికి వెళ్ళి భార్యను పిలిచి, ముఖం చూచి ముక్కర ఎక్కడ అని గద్దించాడు. ఆమె భయపడి స్నానం చేసేటప్పుడు అక్కడ తీసి వుంచానని చెప్పి, పూజగదిలోకి వెళ్ళి విషం తాగాలనుకుని గ్లాసును తీసింది. అందులో శబ్దం రాగా చూస్తే ముక్కర. ఆశ్చర్యంతో తీసుకెళ్ళి భర్తకు ఇస్తుంది. అతనికి అర్థం కాలేదు. ముక్కరను చేతిలో పట్టుకుని అంగడికెళ్ళి, భద్రపరచిన ముక్కరను చూస్తే లేదు. ఇదంతా విష్ణు మాయ అని తలచాడు.

ఇంటికెళ్ళి విషయాన్ని భార్యకు చెప్పాడు. ఆమె మీరెంత పుణ్యం చేసుకున్నారు. ప్రతిరోజూ ఆరునెలల పాటు భగవంతుడిని దర్శించారు. అలాగే నేను నీ భార్యనైనందుకు నేనెంత పుణ్యవంతురాలినని సంతోషపడ్డారు. తర్వాత ఆమె సలహా మేరకు తన యావదాస్తిని ఒక తులసిఆకును పెట్టి 'కృష్ణార్పణం' అని చెప్పి తన ధనాన్నంతా దానం చేశాడు.

విజయనగర రాజ్యానికి వెళ్ళి అక్కడ హంపి పట్టణంలో లోకపావనమనే వ్యాసరాయల మఠాన్ని దర్శించుకుని వ్యాసరాయల దగ్గర శిష్యత్వం స్వీకరిస్తాడు. వ్యాసరాయలు శ్రీనివాసనాయకునికి హరిదాస దీక్షను ఇచ్చి పురందరఘడ నుంచి రావడంవల్ల "పురందరదాసు" అని నామకరణం చేస్తాడు. హరిదాస దీక్ష తీసుకున్న పురందరదాసు ఊరూరు తిరిగి ప్రతిరోజూ ప్రజలకు రామనామపాయసం, కృష్ణనామ చక్కెర రుచులను వారి మనస్సుకు హత్తుకునే విధంగా చేశాడు.

వ్యాసరాయల మంత్రోపదేశంతో పురందరదాసు హరిదాస మార్గంలో నడిచి, హరినామ స్మరణతో మహా

ప్రవాహాన్ని జనసముదాయంలోకి పొంగిపొరలింపజేశాడు. ప్రజల పాపాలను, దుఃఖాలను పోగొట్టాడు హరిదాసులు సాహిత్యపు మార్గంలో నడిచి ప్రజల హృదయాంత రాలలోనికి భక్తి భగీరథిని, జ్ఞానగంగను పంపించి పండిత పామరులను ఉత్తేజపరిచాడు.

వేదోపనిషత్తుల పండిత భాష సామాన్య ప్రజలకు అర్థం కాదు. వారు మాట్లాడుకునే వ్యవహారిక భాషలోనే కీర్తనలు రచించి, రక్తి కట్టించడం ఆయన గొప్పతనం, ఆయన భక్తుల మనస్సునందు ధైర్యం నింపి, బతుకులో విశ్వాసాన్ని ఇచ్చాడు. తీర్థ క్షేత్రాలను దర్శించుకుంటూ తిరుమలను ఎక్కాడు. భక్తుల హృదయాలలో భగ వంతుని చిత్రాన్ని చెక్కాడు.

గురువు ఉపదేశించని జ్ఞానం స్నానం, గానం, మౌనం, మానం వంటివి ఉరగం ఉపవాసం వలె వుంటాయని తెలియజెప్పాడు.

నిజంగా సమాజ శ్రేయస్సు కోరినది పురందరదాసు. ఆయనది గురుదృష్టి. ఆ దృష్టితో చూచి భగవంతు డెప్పుడూ పేదల పాలిట వుంటాడన్న సత్యాన్ని తెలిపాడు. ముత్యాలు, రత్నాలు, వజ్ర వైఢూర్యాలను వీధి వీధిలో బల్లలతో అమ్ముతున్న శ్రీమంత సామంత విజయ నగరంలోని రాజవీధులలో పురందరదాసు తంబూర వాయించుకుంటూ, జోలి భుజానికి తగలేసుకుని భిక్షాటనకు వెళ్ళిన ఆయన "భిక్షక్కె రాగి తందీరా! యోగ్య రాగి, భోగ్యరాగి, భాగ్యవంతరాగి" నీవు అని చెప్పాడు. అంటే మనిషికి "ఆరోగ్యమే మహాభాగ్యం"అని తేట తెల్లం చేశాడు. మనిషికి కావాల్సింది వజ్రవైఢూర్యాలు కాదు. చక్కటి ఆరోగ్యం అవసరమని, ఆ ఆరోగ్యం 'రాగి సంగటి' తింటే వస్తుందని, వాటివల్ల యోగ్యులు, భోగ్యులు, భాగ్యవంతులవుతారని చక్కగా తెలియజేశాడు. హరిదాసు హరికి దాసుడేకాని ఎప్పటికీ నరదాసుడు కాడని చెప్పాడు.

"వెంకటరమణ వేదాంత నిన్నయపాద
పంకజ, కండమేలె మంకు మానవర బేడిసువుదు"

అంటూ "పంకజ ముఖియరెల్లరు బందు లక్ష్మీ వేంకట రమణనిగె ఆరుతి ఎత్తిరే" అని తాను నమ్మిన దైవానికి నీరాజనం ఇచ్చాడు.

పురందరదాసు శ్రీనివాసునిలో విఠలుని దర్శించి కీర్తించిన మహాభక్తుడు. అభయప్రదాతగా నుతులందు కొన్న శ్రీ వేంకటేశ్వరుని పట్ల అచంచలమైన విశ్వాసంతో గుణగానం చేస్తూ "జీవితం నీటి బుడగలాంటిద"ని తెలియజేశాడు.

కలలో కనిపించిన స్వామిని తనలోనికి ఆహ్వానిస్తూ 'వెంకటరమణనె బారో శేషాచలవాసనె బారో పంకజనాభ పరమపవిత్ర శంకరమిత్రనె బారో' అన్నాడు. అలా అనడంలో శివకేశవులమధ్య ఎలాంటి అంతరం లేదన్నాడు.

తిరువేంకటేశ్వరుని ఆలయంలో పురందరదాసు అన్నమయ్యను దర్శించాడు. ఆయన సంకీర్తనలను విని సంతోషంతో శ్రీ వేంకటేశ్వరుని దర్శించినంత ఆనందంగా వుందని చెప్పాడు. అలాగే అన్నమయ్య కోరిక మేరకు పురందరుడు కూడా కన్నడ కీర్తనలను ఆలపించాడు. ఈ కీర్తనలలో పాండురంగ విఠలుని దర్శనం పొందిన అన్న మయ్య పరవశించి పోయాడు.

ప్రహ్లాదుడిని, ధ్రువుడిని, ద్రౌపదిని, అహల్యను, కుచేలుడిని కాపాడావు. మహాపాపియైన అజామిళుడిని కూడా కాపాడావు. వాడేమైనా నీకు మేనల్లుడా? అని నిక్కచ్చిగా ప్రశ్నిస్తూ నన్ను కూడా నీవే కాపాడు అని ప్రార్థించాడు.

"వినావేంకటేశం ననాథో ననాథః" అంటూ పురందర విఠలుని శ్రీ వేంకటేశ్వరుడిని అద్వైత భావంతో స్తుతించిన సంకీర్తనాచార్యుడు శ్రీ పురందరదాసు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# శ్రీ శ్రీ మహాప్రస్థానం - మార్క్సిజం ప్రభావం

- **సాలి రాజా,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

**ప్రవేశిక :**

20వ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీ శ్రీ. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీ శ్రీగా ప్రసిద్ధుడయ్యాడు. విప్లవ కవిగా, సాంప్రదాయ, చందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వాడిగా, విప్లవ రచయితల సంఘ స్థాపక అధ్యక్షుడిగా సినిమా పాటల రచయితగా ఆయన ప్రసిద్ధుడు. శ్రీ శ్రీ హేతువాది మరియు నాస్తికుడు. మహాకవిగా శ్రీ శ్రీ విస్తృత ఆమోదం పొందాడు.

**ఉద్దేశ్యం :**

శ్రీ శ్రీ "మహా ప్రస్థానం" ద్వారా మార్క్సిస్టు దృక్పధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నం చేశాడు. బూర్జువా వ్యవస్థను, పెట్టుబడిదారీ వ్యవస్థను, శ్రామిక వ్యవస్థల యొక్క స్థితిగతులపై మార్క్సిస్టు ప్రభావాన్ని వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యం.

**ముఖ్యాంశాలు :**

శ్రీ శ్రీ "దేశ చరిత్రలు" అనే కవిత గతి తార్కిక భౌతిక వాదమునకు నిలువటద్దం వంటిది. దేశ చరిత్రలోని ఆంతర్యాన్ని కుండబద్దలు కొట్టినట్లుగా ఈ కవిత ద్వారా శ్రీ శ్రీ వెల్లడించాడు.

ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.... అంటాడు

ఈ పంక్తుల్ని గమనిస్తే శ్రీ శ్రీ గతి తార్కిక వాద దృష్టికి ఇవి నిదర్శనాలు. ఆనాటి చరిత్రకారులు దేశ చరిత్రలను వివిధ దేశములకు మధ్య జరిగిన యుద్ధాల పరంపరలుగా చిత్రించిరి. రాజుల దండయాత్రలు, నాయకుల చాకచక్య ధోరణులు, సేనానుల రక్తపాతాలు, చరిత్రలలో ప్రధానంగా వర్ణించబడ్డాయి. ఒకదేశంపై మరియొక దేశాధిపతి దండెత్తి పోవుటకు ఆ రాజు రాజ్య విస్తరణ కాంక్ష్యయో లేక అవినీతి ధృక్పధమో కారణమని చరిత్రలో వ్రాయబడింది. దేశ ప్రతిష్టను నిలుపుకొనుటకు కొందరు రాజులు శత్రు రాజులతో పోరాడినట్లు చిత్రించబడినవి. చరిత్రను ఈ దృక్పధంతో చూచుట మార్క్సిజం సమ్మతించదు. దీనివల్ల రక్తపాతం, ప్రాణనష్టం తప్ప ఏమీ లేదు.

శ్రీశ్రీ అసలు కథను, మూలాలను హేతుబద్ధంగా వివరిస్తూ ....

ఏ యుద్ధం ఎందుకు జరిగెనో
ఏ రాజ్యం ఎన్నాళ్లుందో
తారీఖులు దస్తావేజులు
ఇవి కాదో చరిత్రకర్థం
నైలు నదీ నాగరికతలో
సామాన్యుని జీవనమెట్టిది
తాజ్‌మహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు అని వెల్లడించాడు.

శ్రీ శ్రీ క్రాంవెల్ బ్రిటన్‌లో చేసిన తిరుగుబాటు ప్రభావం మహా ప్రస్థానంలో కనబడుతుంది. అందుకే ఇతిహాసపు చీకటి కోణాల్ని వివరిస్తూ

ఇతిహాసపు చీకటి కోణం
అట్టడుగున పడి కన్పించని
కథలన్నీ కావాలిప్పుడు

దాచేస్తే దాగని సత్యం అని హెచ్చరించాడు. ఇంతటి చారిత్రక దృక్పధం ఉన్నందువల్లనే చెంగీజ్‌ఖాన్, తామర్లేన్, నాదిర్‌షా, ఘర్నీ, ఘోరీ, చివరికి సికిందరు వంటి ప్రపంచ విజేతల గూడ నరహంతకులని తలచాడు. పారశీకులు, పెండారులు, మున్నగు యుద్ధ పిపాసువులు చేసిన ఘన కార్యం "కాలానికి కత్తుల వంతెన" కట్టుటయే అని నిష్కర్షంగా ప్రకటించాడు. రణరంగం కాని చోటు ప్రపంచంలో ఎక్కడ చూసినా దొరకదని, గత చరిత్ర

అంతయు రక్తంతో లేక కన్నీళ్ళతో తడిసినదని హృదయ విదారకమైన నగ్నసత్యాన్ని వెల్లడించాడు. రక్తం రణరంగంలో పాల్గొన్న యోధులది. కన్నీళ్ళు ఇంటిలో వున్న ఆయోధుల భార్యలవి, బిడ్డలవి.

ఈ కవితలో శ్రీ శ్రీ వర్గ సంఘర్షణ సిద్ధాంతంను అత్యంత స్పష్టంగా ప్రతిపాదించాడు. మానవజాతి చరిత్ర సమస్తం వర్గ సంఘర్షణ ఫలితమే అన్నీ మార్క్స్ సిద్ధాంత సారాన్ని శ్రీ శ్రీ వివరిస్తూ

పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను

అని ఒక్క మాటలో ఆశ్చర్యకరమైన రీతిలో అందించాడు. ఋక్కులలోని, సంగ్రహతను, సరళతను, గంభీరతను పుణికి పుచ్చుకొన్న వాక్కులివి. ఈ పంక్తులలో చెప్పబడిన "పరస్పర సంఘర్షించిన శక్తులు" మార్క్స్ వివరించినవే. ఉత్పత్తి విధానం సమాజంలో వర్గాలను కల్పించినది చరిత్రలో ప్రతియుగమున కష్టించువాడు ఒకడు. ఫలితం అనుభవించువాడు ఒకడు. బానిస యుగంలో బానిస, యజమాని జమీందారీయుగంలో రైతు, జమిందారు, పెట్టుబడిదారీ యుగంలో కార్మికుడు, పెట్టుబడిదారు. ఈ వర్గాలు పరస్పర విభిన్న గుణాలు కలవి. కావున వాటికి వాటికి ఘర్షణ తప్పదని మార్క్స్ ప్రవచనం. ఉత్పత్తి సాధనములను తన కైవసం చేసుకున్నది కావున పాలకవర్గం ఎప్పుడు పాలిత వర్గంను పీడిస్తూనే ఉంటుందని శ్రీశ్రీ

నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం
దరిద్రులను కాల్చుక తినడం అని వ్యాఖ్యానించాడు.
అంతేకాదు
బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు
నరహంతుకులు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి.. అంటూ

బానిసయుగంలో యజమానులు బానిసల రెక్కల విరగొట్టిన ఉదంతాన్ని, జమీందారీ యుగంలో భూస్వాములు రైతులను నోళ్లు కొట్టి గద్దెనెక్కిన విషయాలను ఘాటుగా వెల్లడించాడు.

ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా ఇకపై చెల్లవు

అంటూ పెట్టుబడీదారీ వర్గాన్ని పదునెక్కిన పద జాలంతో ప్రతిఘటించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఏవిధంగా జమీందారీ వ్యవస్థను అణగార్చిందో ఆ విధంగానే దానికి ఎదురుతిరుగునని మార్క్స్ చెప్పాడు. పెట్టుబడిదావీ వ్యవస్థ అభవృద్ధి అయిన కొద్దీ దానితో సమానంగా కార్మిక వ్యవస్థ బలపడక తప్పదు. క్రమక్రమంగా "విరోధ వైరుధ్య" సూత్రాల ప్రకారంగా పెట్టుబడిదారీ సమాజం నాశనమవుట తప్పదు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడి విధానంను నిర్మూలించుటకు విశ్వమానవులు అందరూ ఏకం కావాలని మార్క్స్ ప్రబోధించాడు. దీని ప్రభావంతో శ్రీ శ్రీ శ్రామికుల కష్టాలను, అవస్థలను వివరిస్తూ

"చీనాలో రిక్షావాలా
చెక్ దేశపు గని పనిమనిషీ
ఐర్లాండున ఓడ కళాసీ
అణగారిని ఆర్తులందరూ
హేటెటాట్, జూలూ, నీగ్రో
ఖండాంతర నానాజాతులు
చరిత్రక యధార్థతత్త్వం
చాటిస్తారొక గొంతుకతో" అంటూ

విశ్వశ్రామికుల సమిష్టి చైతన్యన్ని గూర్చి మరో ప్రపంచానికి చాటి చెబుతాడు శ్రీశ్రీ.

ప్రతిజ్ఞ అనే గేయంలో శ్రీశ్రీ శ్రామిక వర్గ చైతన్యంను అచ్ఛమైన మార్కిస్టు ధృక్పధంతో ప్రకటించాడు. కార్మికుల శ్రమశక్తిని దోచుకొను పెట్టుబడిదారీ వ్యవస్థను తీవ్రంగా నిరసించాడు. ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో వర్గ విభజన లేదు. అందరూ కలిసి పోగు చేసిన ఆహారాన్ని సమిష్టిగా అనుభవించేవారు. బాసిన యుగంలో వర్గ బేధం తలెత్తింది. జమీందారీ యుగంలో ఉత్పత్తి విధానం వ్యక్తిగతమైంది. ఈ వ్యవస్థలో స్థానిక అవసరాలకు

మాత్రమే ఉత్పత్తి జరిగేది. ఈ విధానం నుండి మొలకెత్తిన పెట్టుబడిదారీ విధానంలో లాభం కొరకు ఉత్పత్తి చేయుట ప్రారంభమయింది. ఉత్పత్తి పరికరాలు కొందరికి స్వాధీనమైనవి. ఈ యజమానులు పెట్టుబడిదారులు వీరి మగ్గంలు ముందు, రాట్నములు ముందు, యంత్రముల ముందు నిలుచొని పని చేయువారు కార్మికులు. జమీందారీ సమాజంలో రైతులు సాగు చేసి పంట పండించి, అందులో కొంతభాగం మాత్రమే జమీం దారికిచ్చి మిగిలిన పంటను తామె అనుభవించేవారు. పెట్టుబడిదారి వ్యవస్థలో ఇది తలక్రిందులైంది. కార్మి కులు నిర్ణీత కాలమున ఎంత సరుకు ఉత్పత్తి చేసినను వారికి ప్రయోజనం లేదు. వారికి వారి కూలీ డబ్బులు మాత్రం వచ్చును. వస్తువుల అమ్మకం మీద యజమానికి వచ్చిన లాభంలో కార్మికునికి భాగం లేదు. అనగా యజమాని కార్మికుడికి ఇచ్చిన ఫలితం కన్నా వారి శ్రమశక్తి ఎన్నో రెట్లుగా వినియోగించుకొని ఆ శ్రమశక్తి ద్వారా అధిక ఉత్పత్తి సాధించి ఎక్కువ లాభం గుంజుచున్నాడని తేలింది.

మార్క్స్, లెనిన్ చెప్పిన పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ సూత్రంలోని శ్రమశక్తి విలువను శ్రీ శ్రీ గమనించాడు. పెట్టుబడిదారీ సమాజంలో శ్రమశక్తిని దోచుకొనుచున్న వైనము పసికట్టి

ఘర్మ జలానికి, ధర్మజలానికి
ఖరీదు కట్టే షరాబు లేడోయ్

అని నిర్వేదం ప్రకటించాడు. ఈ నిర్వేదం నుండి ఆశా వాదం ఉదయించింది. అందుకే గనిలో పనిలో కార్ఖానాలో పనిచేసే వాళ్ళ కోసం

శ్రమ నిష్ఫలమై, జని నిష్ఠురమై
నూతిని గోతిని వెతికే వాళ్ళు
అనేకులింకా అభాగ్యులంతా
అనాధలంతా, అశాంతులంతా
దీర్ఘశృతిలో తీవ్ర ధ్వనితో
విప్లవ శంఖం వినిపిస్తారోయ్''
అని కవితామయం చేస్తాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీ మార్క్సిస్టు దృక్పథంతో శ్రామిక చైతన్యం, కళలు, కవిత్వం, తత్త్వం, శ్రామికుల సుఖ దు:ఖాలు వారి ఆశయాలను చిత్రించాడు.

నాలో కదలే నవ్య కవిత్వం
కార్మిక లోకపు కళ్యాణానికి
శ్రామిక లోకపు సౌభాగ్యానికి
సమర్పణం చేతునని శపథం చేశాడు. అంతేకాదు సమస్త వృత్తులను వివరిస్తూ

కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం
జాలరి పగ్గం, సాలెల మగ్గం
శరీరకష్టం స్ఫురింపజేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు

శ్రామిక వర్గానికి సంబంధించినవైన కమ్మరి కొలిమి చక్రం మొదలైనవి తన కవితా వస్తువులని చెప్పుకున్నాడు.

శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని - ఉద్భోదించాడు.

వ్యదార్ధ జీవిత యదార్ధదృశ్యం పునాదిగా జనించబోవు భావి వేదములను జగత్తుకి అందుతుందని ప్రతిజ్ఞ చేశాడు. శ్రీ శ్రీ మార్క్సిజం ఎంత లోతుగా అధ్యయనం చేశాడో ఈ ఉదహారణలను బట్టి తెలుస్తుంది.

దేశ చరిత్రలు, ప్రతిజ్ఞ అనే కవిత ద్వారా శ్రీ శ్రీ పై గల మార్క్సిజం ప్రభావం విశదమగును. ఇవియే గాక "అవతారం", "నవకవిత", "బుక్కులు", "నీడలు", "పేదలు", "వాడు", "మహాప్రస్థానం", "వ్యత్యాసం" "గర్జించు రష్యా " మున్నగు రచనలు కూడా మార్క్సిజం తత్త్వం కలిగినటువంటి గేయాలే.

రష్యాలో నెలకొల్పబడిన శ్రామిక వర్గ ప్రభుత్వం చేత రష్యా సాధించిన కార్మిక స్వర్గం చేత ప్రభావితమైన గేయం మరోప్రస్థానం. తరతరాల దాస్య భారంతో క్రుంగి పోతున్న ప్రపంచ పీడిత ప్రజలకిచ్చిన ఆశా సందేశం అవ తారం పాలకులకు వ్యతిరేకంగా పాలితులు చేసిన తిరుగు బాటును వ్యంగ్యంగా వివరిస్తూ

కనకదుర్గా చండ సింహం
జూలు దులిపి ఆవులించింది
ఇంద్రదేవుని మదపుటేనుగు
ఘీంకరిస్తూ సవాల్ చేసింది అంటాడు.

ఇటువంటి పాదములతో కనకదుర్గ అధిరోహించు సింహం ఆమెపై తిరుగుబాటు చేసిందని, ఇంద్రుని ఐరావతం ఆయననే సవాలు చేసిందని సూచించబడింది. అలాగే యముడు, సూర్యుడు, శివుడు మొదలైన దేవతలు ఎక్కు వాహనములు వారిపైనే తిరుగుబాట్లు చేసినట్లు ధ్వనించబడినది. ఈ తిరుగుబాటు విలంయకు విప్లవంకు సంకేతం. ప్రాత వ్యవస్థ శిధిలమై క్రొత్త వ్యవస్థను ప్రసవించుచున్న మార్క్స్ ప్రవచనం ఈ గేయంలో ప్రవచించబడినది. "పుడమి తల్లికి పురుటి నొప్పులు" క్రొత్త సృష్టిని స్ఫురింపచేశాయి అని చివరి పంక్తిలో పెట్టుబడిదారీ వ్యవస్థ విధ్వంసమై దాని స్థానంలో శ్రామిక వర్గం తలయెత్తునన్న మార్క్సిస్టు దృక్పధాన్ని వివరించాడు.

**ముగింపు :**

ఈ విధంగా శ్రీ శ్రీ మార్క్సిస్టు దృక్పధంతో చరిత్రను పర్యాలోకించుట, మానవ సమాజమును పరిశీలించుట, శ్రామికవర్గ చైతన్యం గురించి గానం చేయుట తన రచనలలోని గణనీయమైన విషయాలుగా చెప్పకోవచ్చు. అందుకే శ్రామిక లోకపు చైతన్యానికి శ్రీ శ్రీ వెలుగు దివ్వెట చూపించి, క్రొత్త లోకానికి దారులు వేశాడు. మహా ప్రస్థానంపై శ్రీశ్రీ మార్క్సిస్టు ప్రభావం అడుగడుగునా కనిపిస్తుందని తెలుస్తుంది.

**ఆధునిక గ్రంథాలు :**

1) శ్రీశ్రీ - మహా ప్రస్థానం
2) ఆధునికాంధ్రకవిత్వం - సంప్రదాయాలు - ప్రయోగాలు : డా॥ సి. నారాయణరెడ్డి.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# ప్రజాకవి కాళోజీ - కవితాతత్వం

- సూరేపల్లి పద్మావతి, సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

తెలంగాణకు చెందిన ప్రజా ఉద్యమ కవి అనగానే మొదటగా గుర్తుకు వచ్చేది, ప్రజాకవి కాళోజీ నారాయణ రావు. కాళోజి గారి అసలుపేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజి. కానీ తెలంగాణ - ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా భారతదేశంలో కాళోజీ నారాయణగానే సుపరిచితం. ఆయన రచనలతో కాళోజీగా సమాజానికి సుపరిచితుడు. ఆయన జననం 9 సెప్టెంబర్ 1914, మరణం 13 నవంబర్ 2002. కాళోజీని రాజకీయ సాంఘిక జీవన చైతన్యాల ఉద్యమ ప్రజాకవిగా అభివర్ణించవచ్చు. సగటు ప్రజల మనసు ఎరిగిన కవి. ప్రజా హక్కుల కొరకై ప్రజల గొంతుకను తన కవిత్వంలో బలంగా వినిపించిన ప్రజల కవి.

నిజాం కాలంలో దమన నీతి, నిరంకుశత్వానికి అరాచక, వికృత పాలనకి వ్యతిరేకంగా తన గళాన్ని కలం రూపంలో ఎత్తి చూపినాడు. తెలంగాణ పోరాటంలోనే కాకుండా స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొన్న కాళోజీకి 1992లో భారత ప్రభుత్వం భారతదేశ రెండో అత్యున్నత పురస్కారం అయిన పద్మ విభూషణ్ ఇచ్చి గౌరవించింది. ఆయన జన్మదినం అయిన సెప్టెంబర్ 9 ని తెలంగాణ ప్రభుత్వం "తెలంగాణ భాషా దినోత్సవంగా" జరుపుకుంటుంది. వరంగల్‌లోని ప్రజా వైద్య విశ్వవిద్యాలయానికి కాళోజీ వైద్య విశ్వ విద్యాలయంగా నామకరణం చేసింది. ఒక విధంగా చెప్పాలంటే తెలంగాణ విప్లవానికి తొలపొద్దుగా కాళోజిని చెప్పవచ్చు. సమాజంలో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక వైఖరులు, అరాచక పాలనకు వ్యతిరేకంగా కాళోజీ నుంచి ఉద్భవించిన నిప్పుకణిక లాంటి రచనలలో ప్రథమం నా గొడవ".

"అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి
అన్యాయాన్ని ఎదిరించినవాడే నాకు ఆరాధ్యుడు"

అని సగర్వంగా ప్రకటించి ఉద్యమం ఊపిరిగా జీవించిన ప్రజల కవి, ప్రజల గొంతుక, పాలకుల గుండెల్లో సింహస్వప్నం "కాళోజీ'.

కాళోజి ఇష్టపడ్డ ప్రజలు దోపిడికి గురౌతూ, పీడనకు లోనవుతున్న ప్రజలే, ఆ ప్రజల గొడవనే తన గొడవగా మలుచుకొని "నా గోడవ" అనే రచన గావించారు. తన రచనల ద్వారాప్రజల్ని మేలుకొలుపే ప్రయత్నం చేశారు. "కాటేసి తీరాలే" అనే కవితలో ప్రజలను భాదపెట్టేవారిని వదలకూడదని హెచ్చరిస్తాడు.

"సత్యమ్ము హింసయని సంకోచింపరాదు
దయయు ధర్మంబనుచు తడుముకో పనిలేదు.
శాంతియని చాటినను శాంతింపగరాదు
క్షమయని వేడినను క్షమియింపగ రాదు".

అనే కవితా ఖండిక రచన బైరాన్‌పల్లి గ్రామ ప్రజలపై రజాకార్ మూకలు జరిపిన అత్యాచారాన్ని గొంతెత్తి నిరసిస్తూ ఎలాంటి సంకోచాలు లేకుండా తిరుగుబాటు చెయ్యాలని ప్రజలకు ఉద్బోధించాడు. అందుకే సమయం రాగానే 'కసి తీరా కాటేయమని' ప్రజలకు ఆత్మ విశ్వాసాన్ని అందిస్తాడు.

మనకొంపలార్చిన మనస్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచి పోకుండగ గురుతుంచుకోవాలె
కసి ఆరిపోకుండ బుసగొట్టుచుండాలె
కాలంబు రాగనే కాటేసి తీరాలె
తిట్టిన నాల్కలను చేపట్టి కొయ్యాలె
కొంగు లాగిన వేళ్ళ కొలిమిలో పెట్టాలె
కన్ను గీటిన కండ్ల కారాలు చల్లాలె
తన్నిన కాళ్ళ 'దాకల'గ వాడాలె
కండ కండగ కోసి కాకులకు ఎయ్యాలె
కాలంబు రాగానే కాటేసి తీరాలె.

కాళోజీ కవిత్వంలో సున్నితమైన పదాల పొందికలు న్నాయి. తెలంగాణ ప్రజల భాష, శ్వాస యాస కనబడు తుంది. కానీ ఆ సున్నిత పదబంధాల వెంట సామాజిక స్థితిగతులు ఇట్టే కనిపిస్తాయి.

"అన్నపురానులు ఒక చోట - ఆకలి మంటలు ఒక చోట
కమ్మని చకిలాలొకచోట - గట్టిదేడలింకొక చోట".

సామాన్య ప్రజలకు, దొరలకు,, రజాకార్లకు మధ్య వ్యత్యాసాన్ని సున్నితంగా కవిత్వంలో పొదిగించారు. ప్రజలు వారి వారి జీవన విధానంలో వ్యక్తిగతంగానైన, సమూహంగానైన ఇబ్బందులకు లోనైనప్పుడు కవుల మనస్సు ఊరుకోదు. వారి సమస్యను పోగొట్టేందుకు కృషి సల్పుతారు. ఆ రచన ద్వారా ప్రజల్ని మంచి మార్గంలో నడిపించే ప్రయత్నం చేస్తారు. అలాంటి హృదయ స్పందన కలిగిన ప్రజాకవిగా సమాజహితం కోరి కవిత్వాన్ని రూపొందించారు. అందుకే కాళోజ రచనల్లో క్రాంతి దర్శిత్వం ప్రస్ఫుటంగా కనబడుతుంది.

"ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు" ? అనే కవితలో
ఏరుల కష్టము జూచి కరిగిపోవును గుండె
మాయ మోసము జూచి కరిగిపోవును గుండె"
అంటూ కవి మనోవేదనను బహిర్గతం చేస్తారు.

ఒక ప్రజాకవిగా ప్రజల గొంతును తన కవితల్లో వినిపించిన ధీశాలి కాళోజీ. అతని కవితల్లో తెలంగాణ ప్రజల అమాయకత్వం, నైజాం ప్రభుత్వాల రజాకార్ల నిరంకుశత్వం కనబడుతుంది.

ఈ క్రింది కవిత పరిశీలిస్తే .....

" 'లా' ఒక్కింతయు లేదు
'ఆర్డరు' నీ లోలంబాయే
'కమముక' ఠావుల్ దప్పెను.
మూర్ఛిల్లే రాజ్యాంగమున్"

నాటి ప్రభుత్వాల నిరంకుశత్వం ప్రజల స్థితిగతులు అవగతమవుతాయి. నమ్మిన విలువల కోసం జీవితమంతా పోరాడిన ప్రజాకవిగా తన జీవితంలో జరిగిన అనుభవాలనే కవిత్వంగా పొందుపరిచారు. అతని రచనల్లో మానవతా విలువలు కనబడుతాయి. మనిషిని మనిషిగా ప్రేమించే తత్వం కనబడుతుంది. సామాన్య ప్రజలపై అపారమైన ప్రేమ ఉండటం వల్ల వారితో నడుస్తూ, నడిపిస్తూ భావితరాలకు మంచి మేలుకొలుపు ఇచ్చారు. బాధ్యతల్ని గుర్తు చేశారు. ప్రశ్నించే తత్వంతో ప్రజలకు జవాబులను కవిత్వం ద్వారా అందించారు. అతని కవిత్వం అంతా నమ్మిన విలువల కోసం పోరాటమే.

కాళోజీకి ఒక్క తెలుగులోనే తన రచనలు పరిమితం కాలేదు. ఊర్థూ, హింధీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషలలో ప్రఖ్యాత రచయితగా ఖ్యాతి గడించారు. కాళోజి రచనలలో ప్రముఖంగా రాజకీయ వ్యంగ్య కవిత్వం కనిపిస్తుంది.

"నా గొడవ" ద్వారా సమకాలీన సామాజిక సమస్య లపై ప్రజలను చైతన్య పరచడం కోసం నిర్మోహమాటంగా, నిక్కచ్చికగా, తన వైకరిని వ్యతిరేకతను తెలియచేస్తూ పాలకులపై యుద్ధాన్ని తన 'అక్షరం'నే ఆయుధంగా చేసుకొని ఉద్యమించిన విప్లవ కవి కాళోజి.

హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు క్షమించరాని తప్పు, సామాన్యుడే నా దేవుడు అని ప్రకటించాడు కాళోజి. "పుట్టుక నీది, చావునీది, బ్రతుకంతా దేశానిది" అని తన దేశభక్తిని వెలుగెత్తి చాటిన మహోన్నత కవి కాళోజీ. భాషగురించి యాస గురించి కాళోజీ ఒక ఖచ్చితమైన అభిప్రాయంతో ఉండేవాడు. ఎవరు బాష వాళ్ళు రాయాలి, గిట్లరాస్తే అవతలోనికి అర్థమైతదా అని ఆదిలోనే మనకు మనమే అనుకుంటే, మనల్ని మనమే తక్కువ చేసుకున్నట్లు లెక్క. ఈ బానిస భావనలు పోవాలి అనే వారు. భాష అనేది రెండు రకాలు. ఒకటి బడిభాష పలికే భాష, రెండోది పలుకు బడుల భాష మనకు మన సమాజానికి కావలసింది పలుకుబడుల భాష అని చెప్పేవారు. మాతృభాష గురించి మాట్లాడుతూ

"తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు సంకోచ పడేదవు సంగతేమిటిరా ?

అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు సకిలించు ఆంధ్రుడా ! చావవెందుకురా ! ?

- కాళోజీ.

తెలుగు బిడ్డగా పుట్టి తెలుగు మాట్లాడుటకు సంకోచించుతూ ఉంటావు. పరభాషలు ఎన్నో నేర్చుకొని తెలుగు భాష రాదు అని వెకిలినవ్వు నవ్వుతావు ఎందుకు ఆంధ్రుడా నీవు బ్రతికి ఉపయోగం ఏమిటికి అని మాతృ భాషపై తన మమకారాన్ని తనకున్న ఆవేదనను వ్యక్తపరుస్తాడు కాళోజీ.

## ముగింపు :

చివరగా చెప్పాలనుకుంటే కాళోజీకి తన సేవలకు దక్కవలసిన గౌరవం మాత్రం దక్కలేదని చెప్పాలి. భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం "భారతరత్న"తో గౌరవిస్తే కాళోజీ చేసిన స్వాతంత్ర్య పోరాటానికి తను చేసిన సాహిత్య సేవకు నిజమైన అలంకారంగా ఉంటుంది. సమాజం ఏమైతే నాకేంటి, సమాజంతో నాకేం పని, ఈ గొడవ నాకెందుకు అని కాళోజీ అనుకుంటే "నా గొడవ" అక్షర రూపం దాల్చేది కాదు. ప్రజలు చైతన్యం అయ్యేవారు కారు. ఉద్యమ బాట పట్టేవారు కాదు. అందుకే తన ఆలోచనలు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా తన రచనలకు రూపు నిచ్చేవారు.

సమాజంలోని ప్రతి పౌరుడు అనుసరించాల్సిన కాళోజీ అక్షర సత్యం.

"పుట్టుక నీది, చావు నీది బ్రతుకంతా దేశానిది" అని చెప్పిన మహాకవి, చివరికి తన మరణానంతరం తన దేహం కూడా సమాజం కోసం ఉపయోగపడాలని భావించి తన పార్థివ దేహాన్ని పరిశోధనల నిమిత్తం కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగించుకున్నారు. "సమాజంలో ఒకడిగా బ్రతకడం కంటే నీవల్ల సమాజానికి ఉపయోగపడే విధంగా బ్రతకడం ఈ జీవితానికి ఒక అర్థం"

## ఆధార గ్రంథం :

"ఇదీ నా గొడవ" - కాళోజీ (ఆత్మకథ).

**BHAVAVEENA**
**Vol. 17, Issue. 3, March (1) - 2020**
**ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**

భావవీణ

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# భారతీయ సంస్కృతి - జానపదుల భక్తి విశ్వాసాలు

**– వెన్నె కాశిరెడ్డి,** పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషావిభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఒక జాతి యొక్క విశిష్టతను, ఉన్నతిని చక్కగా, సవివరంగా తెల్పేది సంస్కృతి. ఇది సంప్రదాయాలు, ఆధ్యాత్మికత, భౌతిక విషయాలైన కులం, మతం, వర్గం, భాష, ఆచార వ్యవహారాల సమాహారంగా చెప్పవచ్చును. సంస్కృతి అనేది తరం నుంచి తరానికి అందించే వారసత్వ సంపద. భారతదేశంలో భిన్న కులాలు, మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు, జాతులు, భాషలు, వర్గాలు ఉన్నప్పటికి మేమంతా భారతీయులం అనే జాతీయతా భావనే భారతీయ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా చెప్పబడుతున్నాయి. భారతదేశంలోని వివిధ భాషలు, మతాలు, సంగీతం, నృత్యం, ఆహారం, నిర్మాణకళ, ఆచార వ్యవహారాలు దేశంలో ఒక్కొక్క ప్రాంతానికి ఎంతో భిన్నంగా ఉంటాయి. కనుకనే భారతీయ సంస్కృతి అనేది అనేక సంస్కృతుల సమ్మేళనంగా పిలువబడుతుంది. అందుకే భారతదేశం ఉపఖండంగా పేరుగాంచిది.

మన భారతీయ సంస్కృతి అనేక వేళ సంవత్సరాల చరిత్రను కలిగి ఉంది. భారతీయ సంస్కృతిలో వైవిధ్యమైన భాగంగా ఉన్న భారతీయ మతాలు, తత్వశాస్త్రం, వంటకాలు, కుటుంబ వ్యవస్థ, ఆచారాలు, వివాహ బంధం వంటి పలురకాలైన అంశాలు ప్రపంచంలో మిన్నగా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ప్రపంచం పైననే బలమైన ప్రభావమును చూపుతూ భారతదేశంను అగ్రస్థానంలో నిలుపుతున్నాయి.

జనపథంను జానపదం అంటారు. జనావళి నివసించే ప్రాంతం జానపదం. జనపదాలలో నివసించే వారిని జానపదులు అంటారు. సాంఘీక సమైక్యత, శ్రమైకజీవనం, భావనా బలిమి, కష్టసుఖాలు అందరూ పంచుకోవడం వంటిఅంశాలు జానపద సంస్కృతిని, భారతీయ మూలాలను తెలియజేస్తాయి.

జానపద సంస్కృతిని తెలిపే వాటిలో జానపద కవిత్వం ఒకటి. జానపద కవిత్వం సమాజం ఇచ్చిన ఉమ్మడి సాహిత్య సంపద. అది జనసమైక్య రాగసంపద మరియు జనప్రదర్శన సంపద. ఇది స్థానిక భౌగోళిక, భాష, చరిత్ర, సంస్కృతులను ప్రతిఫలించే సంపద. సామూహిక మానవ చర్యలకు, సమిష్టి ఉత్పాదనా శ్రమలోని ప్రత్యక్ష భాగ స్వామ్యానికీ, శ్రమోపశమనానికీ, గతంతో సంబంధానికీ, వర్తమానంలో అనుబంధానికీ, భవిష్యత్తు పట్ల ఆకాంక్షలకూ, సంకేతమైన సంపద ఇది. ఈ సంపద మన చిర కవిత్వం, సంగీత, నాట్య, నాటక, సాంస్కృతిక, వారసత్వానికి ఒక ఉదాహరణ.

పల్లెల్లోని కల్లాకపటం తెలియని శ్రమజీవులైన జానపదులు నాగరికుల్లాగా, సమాజంలోని నియమాల పట్ల సుశిక్షితులు కారు. వారికి చాటుమాటు వ్యవహారాలు ససేమిరా పనికిరావు. వారి మాటల్లో పెడసరితనము, కాస్త దురుసుతనము ఉంటాయి. అందుకే వారి మాటలు కుండబద్దలు కొట్టినట్లుగా ఉంటాయి. కనుకనే జానపదాల్లోని మాటలు చమత్కారంతోనూ, హేళన, వెక్కిరింతలు, చలోక్తులు, పెడసరి, గడసరితనాలతో పాటు ఆధ్యాత్మిక భక్తిభావాలను కలగలుపుకొని వారి సంస్కృతి సంప్రదాయాలను వెలుగులోనికి తెచ్చేవిగా ఉంటాయి.

భక్తి అనేది ఒక పవిత్రమైన భావన. మనుషులల్లో భక్తి భావన కలవారిని ''భక్తులు'' అంటారు. భక్తి సర్వమానవులు సౌలభ్యంతో ఆచరించదగిన సాధనం. దీనిపై మనుషులందరికీ అధికారం ఉంది. ఈ కలి కాలంలో భక్తితో సమానమైన ఆత్మోద్ధారకమైన సులభోపాయము లేదు. ఎందుకంటే జ్ఞానం, యోగం, తపం, యాగం వంటివి ఈ కాలంలో లభించడం చాలా కష్టం మరియు వాటికి ఉపయోగపడే సాధనా సామాగ్రి కూడా నేడు దొరకడం కష్టమే. కనుక మనుషులందరూ భగవంతుని యందు భక్తి ప్రపత్తులను కలిగి ఉండాలి. ధర్మాన్ని గౌరవించిన వారిలోనే భక్తి ఎక్కువగా ఉంటుందని చెప్పవచ్చు.

ధర్మాచరణ అనేది జానపదులకు ఒక ఆచారం వంటిది. వారి వేషధారణ, ఆచార- వ్యవహారాలు, పండుగలు-పబ్బాలు, ఉరుసులు-ఉత్సవాలు, కళలు, అలంకరణలు, ఆరాధనల యందు పాటించే నియమాలు, నిష్టలు అనేవి దీనిని తేటతెల్లం చేస్తాయి. జానపదులు శ్రమజీవులు. శ్రమను మరవడానికి పాడుకునే పాటల్లోను, రామాయణ, భారత, భాగవతంలోని మహాపురుషులకు చెందిన అంశాలు, శివుడు, విష్ణుమూర్తితో పాటు లక్ష్మీ, గౌరీదేవి, ఎల్లమ్మ, గంగమ్మ, పోలేరమ్మ వంటి స్త్రీ దేవతలు గూర్చి పాడుకోవడం వారిలోగల మాతృభక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు.

వఋవాత లేచినది మొదలు సూర్యదేవుని పిలుపుతో తనకు దైనందిన జీవితంలో సహాయపడే చెట్టు, పుట్ట, పశుపక్షులు, వ్యవసాయ పనిముట్లు, వాన, గాలి, నేల, నీరు, నిప్పు వంటి పంచభూతాలనను సైతం భక్తితో ఆరాధించేతత్వం జానపదుల సాంఘీక ఆచారంలో భాగంగా ఉంటుంది. నిష్కల్మషమైన మనస్సులో భగవంతుడు ఎల్లవేళలా దర్శనం ఇస్తాడని, భక్తికి నాగరికం, అనాగరికం, లింగం, జాతిబేధాలు లేవని నారద భక్తి సూత్రాలు తెలిపిన అంశాన్ని జానపద కళలు గేయాలు నిరూపిస్తున్నాయి.

**వాటిలో కొన్ని.............**

## కోలాటం పాటల్లో భక్తి :

జానపదులు తమ సంస్కృతిలో భాగమైన కళలు, కళారూపాల ద్వారా భక్తిని చాటుకుంటారు. పల్లె జనులు, తాము ఆడే ఆటల్లోనూ, పాడే పాటల్లోనూ, ప్రతి పనిలోనూ, ప్రతి పనిలోనూ ప్రారంభానికి ముందు విఘ్నరాజైన గణనాధుని ఇష్టంగా కొలుస్తారు. తమతో సహజీవనం చేసే వృత్తుల వారిని తమను పాలిస్తున్న రాజును సైతం విఘ్ననాయకుడు చల్లగా చూడాలని, మేలు చేకూర్చలని జానపదుల ఆశయం. ప్రజలంతా క్షేమంగా ఉండాలన్న ఆసక్తి భక్తిగా మారి గణనాధుని స్తుతిస్తు కోలాటంలో పాడటం ఈ గేయంలో చూద్దాం.

గణనాయకా - విద్దెల గణనాయకా - ముందె నీకు
పూజ సేచ్చురా గణనాయకా
గణనాయకా - విద్దెల గణనాయకా - నిన్ను ఊరిలోన
ఊరేగించెద - గణనాయకా
ఉంద్రాళ్ళు పోచ్చామయ్య - గణనాయకా,
యాపారులు నిన్ను కొలవగా - గణనాయకా,
దండిలాభం ఇచ్చావంట - గణనాయకా
కాపులెల్ల నిన్ను కొలవగా - గణనాయకా,
కణికారం సూపుదువంట - గణనాయకా
రైతులంత నిన్ను గొలవగా - గణనాయకా,
ధాన్యం చాల ఇచ్చావంట - గణనాయకా
పల్లె పల్లె నిన్ను కొలవగా - గణనాయకా,
పాడిపంటలు ఇచ్చావంట - గణనాయకా
గాసగాల్లు నిన్నుకొలువ - గణనాయకా,
ఆయాస తీరుత్తావు - గణనాయకా
రాజులంతా నిన్ను కొలువగ - గణనాయకా,
రాజాలు ఇచ్చావంట - గణనాయకా
ఎలుక వాహన పార్వతి తనయ - గణనాయకా,
జగతినల్ల రక్షసాయి - గణనాయకా

వేద పురాణాలలో, ఆధ్యాత్మికంగా విఘ్నేశ్వరుని ప్రార్ధనతో ప్రారంభం కావడమనే సంప్రదాయంతో విఘ్నాలు తొలగిపోతాయనే నమ్మకం జానపదుల ఆచారంగా నిలిచి భారతీయ సంస్కృతిని ఇనుమడింప చేస్తుంది.

జానపదులు పాడే కోలాటం పాటల్లో మనసుల్ని గిలిగింతలు పెట్టే చిలిపిగీతాలు ఎన్ని ఉన్నా భగవంతుని గురించిన పాటలకు సైతం జానపదులు ఎంతో ప్రాముఖ్యాన్నిచ్చారు. భగవంతుని నమ్మినవారికి కష్టాలు వైదొలుతాయని, ఆపదల్లో ఉన్నవారిని భగవంతుడు కాపాడుతాడని జానపదుల విశ్వాసం. తిరుపతి వెంకన్న రూపాన్ని ఆస్వామికర్పించే ధూప, దీప నైవేద్యాదులను, వారి మహిమలను ఈ పాటలో ఎంతో భక్తి భావంతో చూపగలిగారు జానపదులు.

ఎన్ని సొద్దాలవాడో యంగటన్న - ఓరామ,
ఎగువ తిరుపతిపైని యంగటన్న - ఓరామ
గోవిందాయంటె పలుకుతాడురా - ఓరామ,
గోవులను గాసిన గోవిందుడు - ఓరామ

నల్ల నల్లనివాడు యంగటన్న - ఓరామ,
నామాలు పెట్టుకున్న నల్లనయ్య - ఓరామ
తిరుపతి పోతానె పలుకుతాడు - ఓరామ,
కుప్పల యతలన్ని కూలగొట్టు - ఓరామ
దాగల్ల వడపప్పు దండి బెల్లాలు - ఓరామ,
మండిగల దీపాలు మంచి నెయ్యి - ఓరామ
వడపప్పు పానకాలు గుమ్మడి పల్లూ - ఓరామ,
గుడి తిరిగి యియ్యాల - గుల్లో దేవుడికి - ఓరామ,
తిరుపతి బోయేటి చిట్టి దాసరికి - ఓరామ
తిరువేంగళ్ళప్పనికి ఫణతులెందరో - ఓరామ,
పెద్దామె నాంచారు లోకమాత - ఓరామ
అయ్యవారికి సక్కనిది అలువేలు మంగ - ఓరామ
॥ఎన్నిసొద్దాల॥

## స్త్రీల పాటల్లో భక్తి :

పండుగల వేళ తనతోపాటు శ్రమించిన ఎడ్లను పరమ శివుని వాహనమైన నందీశ్వరుని అవతారంగా భావించి వాటికి స్నానాదులు చేయించి, అలంకరించడం గమనిస్తాము. తనకు జీవనాధారమైన వృత్తిపనుల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తోడ్పడే ప్రతిదీవారికి పూజించదగినదే. తనకు పంటను కాపాడటంలో పరోక్షంగా సహకరించే పరమశివుని కంఠాభరణమైన నాగేంద్రుని నాగులచవితి పర్వదినాన, పుట్టను అలంకరించి పాలు, గ్రుడ్లు, నానాబాలు, చలిపిండి వంటి పదార్థాలతో భక్తి ప్రవత్తులను కలిగి భజనలు చేస్తూ పూజిస్తారు.

పల్లవి : శివుని మెడలో నాగరాజు - సిన్ని పార్వతి పిలిచెను దేవా
శివుని పలుకు లాలకించేవా - ఓ శివనాగరాజ
దేవిపలుకు లిన్నవించేవా ॥ శివుని మెడలో ॥

చరణం - 1 :
ఎండి గిన్నెలో ఎన్నబెట్టి - పసిడిగిన్నెలో పాలు బోసి
పాలనారగించ రావయ్య ఓ శివనాగరాజ
ఆపాలనారగించారవయ్యా ॥శివుని మెడలో॥

వంటి భజనలతో జానపదులు తమ భక్తిని, సంప్రదాయాలను, పొందిన మేలుకు ప్రత్యుపకారం చేయాలనే భావనను తెల్పుతారు.

## గ్రామదేవత - పాటల్లో భక్తి :

గ్రామదేవతారాధన మాతృస్వామికకు చెందినది. గ్రామదేవతల్లో చాలా వరకు అందరూ స్త్రీమూర్తులే ఎల్లమ్మ, గంగమ్మ, పెద్దమ్మ, అంకాళమ్మ, పోలేరమ్మ మొదలైన గ్రామదేవతలు పలుప్రాంతాల్లో రకరకాల పేర్లతో జానపదులు పూజిస్తుంటారు. ఈ పూజలన్నీ జానపదుల భయభక్తులకు రూపకల్పనలు, గ్రామాలకు వెలుపల ఏ గుట్టమీదనో, చెట్టు క్రిందనో, చెరువు కట్ట మీదనో ఈ దేవతలకు చిన్న చిన్న గుళ్ళు ఏర్పరచి అంటు రోగాలు ప్రబలినప్పుడో, కరువు కాటకాలు వచ్చినప్పుడో, పలు గ్రామాల జానపదులు అన్ని కులాలవారు పూజలు, మరికొందరు మొక్కుబడి కింద మేకపోతులను, దున్నపోతులను, కోళ్ళను బలియిస్తారు. ఈ సందర్భంగా ఆయా గ్రామదేవతలకు సంబంధించిన పాటలు పాడుతూ నృత్యం చేస్తూ పూజావిధులు నెరవేరుస్తుంటారు.

తల్లిరాయా - యల్లమ్మరాయా, దేవతరాయా - యల్లమ్మరాయా
వచ్చెరా యల్లమ్మ హా - దేవతా యెల్లమ్మ హ,
యేడూమీరిన మేకాపోతులు - దేవరకిడిసిన గావూ పోతులు
యెదురుగాను కుంబారాసులు - కావరించిన కోడిపుంజులే ॥ వచ్చెరా ॥
ఆ పక్క ఈ పక్కండి గొడుగులు - నెత్తిమింద కిరీటాలు
ఆకుల్ పూజలు అందవేమమ్మా - ఆదుకొని సాకరావమ్మా ॥ వచ్చెరా ॥
నెత్తీజోతులు బోనంకడవలు - వడపప్పులు పానకాలు
గడ్డాపెరుగు పాలముంతలు - పట్టామీది పాల కంకూలే ॥ వచ్చెరా ॥
నిండూ దొళ్ళుల దొళ్ళవచ్చిరి - పరుపు చీరల పార్లివచ్చిరి
నోటిజీగం బగుతూ లొచ్చిరి - రక్షసేసి జగతి నేలమ్మా
॥ వచ్చెరా ॥

## వీధి రూపకాల్లో భక్తి :

అన్నాచెళ్ళెల్ల మాటలు, తోడికోడళ్ళు, వదినా ఆడ బిడ్డల దెప్పులు, విమర్శలు కూడా వీధి రూపకాలలో కన్పిస్తాయి. శివరాత్రి పర్వదినం నాడు శ్రీశైలం వెళ్ళే

మార్గాన్ని దాని విశిష్టతను అడిగిన చెల్లెలికి అన్న శివభక్తిని కుమ్మరించి మార్గాన్ని చెప్పేతీరే ఈ గేయం.

చెల్లి : శివశివ అంటాడు శివుడెక్కడున్నాడు
శివరాతిరెప్పుడు రన్నయ్య స్వామితిరనా ఎప్పుడు రన్నయ్య

అన్న : మహాశివరాతిరి మాగమాసము నందు
పండగ ప్రజలకు ఓ చెల్లి పిండి గుగ్గుళ్లమ్మ నాతల్లి.

చెల్లి : అన్నన్న నామాట చిన్నమాటాను శ్రీశైలంచేరగ శివరాతిరి చూడగ
బసులు బండ్లు లేవు ముసిలోల్లపనికాదు.
శ్రీశైలం పోయేటి దారేది, శివుని చేరేటి తోవేది

అన్న : శేషాచల వెంకన్నను చూసి శ్రీకాళకాళహస్తీశ్వరుని చూసి
మహనందినందీశ్వరునితోడ మార్కాపుర చెన్నకేశవుని చూసుకొని
దొర్నాల దొరల కాపి పుచ్చుకొని
సిగరేటు మీటిస్తు ఓ చెల్లి బస్సు చింతల చేరిందెనా తల్లి
చింతలకొండలు అంతులేని వంటనాతల్లి
చిట్టెద్దుల కురవంట ఓ చెల్లి మెట్ట సెన్నంగుల బండంట నాతల్లి
శ్రీశైల శిఖరేసుని చూసి హటకేశ్వరులింగేసునిజూసి
సాక్షిగణపతిని సాకిరిజేసి శ్రీశైలము చేవత్తముచెల్లి
కోటచుట్టూ పది ద్వారంబులున్నవి. కోటలోపల పది కోనేరులున్నవి
కోనేది మంటపాలు ఓ చెల్లి కొదవలేకున్నాయి నాతల్లి
పాతాలగంగలో తానంజేసి భ్రమరాంబమల్లనల భక్తి గొలవాలి
కోటకురక్షగా ఓచెల్లి కనకపురాతిబసవన్నలు నా తల్లి
॥ శివశివ ॥

...... ఈ విధంగా పరమేశ్వరతత్వాన్ని భక్తిగా చాటుతారు.

## ఉపసంహారం :

జానపదుల్లోగల భారతీయ నాగరికత, వారి సామాన్య జీవనవిధానం, సంప్రదాయాలు భారతీయ సంస్కృతకి ఆధారమై భారతీయ తత్వాన్ని, భారతీయుల ఐక్య మత్యాన్ని తెలుపుతూ సంస్కృతిలో భాగంగా నిలుస్తు న్నాయి. భాగవతంలో పోతనగారు ప్రహ్లాద చరిత్రలో భగవంతుని చేరుకోవడానికి నవవిధ భక్తిమార్గాలున్నాయని చెప్పినట్లుగా జానపదులు తమ శ్రమైక జీవనవిధానంలో భాగంగా సాగే గేయాలలో భక్తిని, పారమార్థికతను, తెలు పుతూ నవవిధభక్తిమార్గాలైన, శ్రవణం, కీర్తనం, స్మరణం, అర్చనం, వందనం వంటి వాటితో తమ భక్తిప్రవత్తులను చాటుకుంటున్నారు. ఈ జానపదగేయాలు నాడు శర వేగంగా దూసుకొస్తున్న సాంకేతికాభివృద్ధి వలన కొంత మరుగునపడిపోతున్నవి. వీనిని వెలికి తీసి మనసంస్కృతి సౌరభవాలు జగద్ధితం చేయాల్సిన తరుణం ఆసన్న మయింది. కనుక దీని రక్షణ మనకర్తవ్యంగా భావించి అడుగులు కదుపుదాం!

"శుభం భూయాత్"

## ఉపయుక్త గ్రంథసూచి :-

1. ఇది మన సంస్కృతి - ఇది మన సంప్రదాయాలు - డా॥ కృష్ణస్వామి.యం -1923
2. త్రివేణి (ఆంధ్రదేశ జానపదగేయాలు) - రామరాజు.బి., గోపాలకృష్ణమూర్తి - శ్రీపాద గంగాధారం - నేదునూరి, ఆచార్య దోణప్పతూమాటి - 2006
3. తెలుగు జానపదగేయ సాహిత్యం - రామరాజు.బి - 1958
4. నారద భక్తి సూత్రములు - శ్రీ. వేంకట రామరెడ్డి దొడ్ల - అనువాదం - 2004
5. భారతీయ సంస్కృతి - ఆచార్య. రఘునాధాచార్య. పి.బి. -1993
6. రాయలసీమ రాగాలు - శ్రీ మునయ్య.కె - 1996

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# ప్రకృతి వైపరీత్య సాహిత్యంలో - కావ్య వస్తువుగా ప్రకృతి

- కె. సుధాకర్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ప్రకృతి వైపరిత్య సాహిత్యాన్ని పరిచయం చేసేముందు మన ప్రాచీన సాహిత్యంలో కావ్యవస్తువుగా ప్రకృతిని కవులు ఎలా వర్ణించారో ఇక్కడ విశ్లేషించడం జరుగుతుంది.

శ్రావ్యమైన సంగీతం శిశువులను, పశువులను కూడా ముగ్ధులను చేస్తుందని ఆంగ్ల నాటక పితామహుడైన షేక్స్పియర్ సెలవిచ్చాడు. ఈ అభిప్రాయం ప్రకృతిపట్ల కూడా వర్తిస్తుంది. ప్రకృతి సౌందర్యాన్ని దర్శించి అలౌకికానందాన్నుభవించుట ఉగ్గుపాలతో వస్తుంది పిల్లలకు. చల్లటి వెన్నెలలో తల్లి అమృత హస్తాలతో అన్నం తినిపిస్తూ మధ్య మధ్య చందమామను చూపుతూ...

"చందమామ రావే
జాబిల్లి రావే
కొండెక్కి రావే
కోటిపూలు తేవే..."

అంటూ పాట నేర్పిస్తూ ఉంటే పసిపిల్లలు చెందే ఆనందం అనంతం. పైనున్న అమృతకిరణుని దర్శిస్తూ చెంతనున్న అమృతమయియైన తల్లి ప్రేమామృతంలో ఓలలాడుతూ, అమృతసమమైన అన్నం తింటూ యీ అమృతత్రయాన్ని అనుభవించే బాలల అనిర్వచనీయమైన ఆనందభావాలు పెద్దల ఊహలకందని విషయాలు; శిశువులే కాదు పశుపక్షాదులు కూడా ప్రకృతి వలన ఉత్తేజము చెందుతాయి. మేఘామృతమైన ఆకసాన్ని చూడగానే నెమలి ఆనందంతో పురివిచ్చి నాట్య విజృంభణకు పూనుకుంటుంది. వసంతపు కమ్మని వాసనల మైకానికి కోకిల కంఠమెత్తి గానము చేస్తుంది. చల్లటి సెలయేటి నీరు వన్యమృగాలకు అమరత్వాన్నను భవింపజేస్తుంది. అలాంటప్పుడు రసహృదయులైన కవులు కళాకారుల పైన ఈ ప్రకృతి యొక్క ఇంద్రాజల ప్రభావం పడకుండా ఎలా ఉండగలదు? అడవి బాపిరాజు గారు కళాకారులు ప్రకృతినెందుకు చిత్రిస్తున్నది ఇలా వివరించారు.

"అందరికీ భగవంతుని ఛాయయైన ప్రకృతిని చూసి ఆనందించే లక్షణం ఉంది. ఆ ప్రకృతి భౌతికరూపంగా, మనోమయరూపంగా, బుద్ధిరూపంగా ప్రత్యక్షం అవుతూ ఉంటుంది. అలాంటప్పుడు ఆ ప్రకృతిలో మనస్సుకిగాని, హృదయానికి గాని, బుద్ధికిగాని, ఆత్మకుగాని ఆనందము కలిగించే ఒక దృశ్యం, ఒక రూపం, ఒక జీవితం, ఒక భావం, కళాశక్తి కలిగిన, రసజ్ఞునికి గోచరించినప్పుడు తనలో ఉండే కళాశక్తి పైకి ఒక స్వరూపంగా జన్మించాలని ఆవేదన పొందడంచేత కళాస్వరూపం ఉద్భవిస్తున్నది. ఆ కళాస్వరూపంతో ఉన్న ముఖ్యలక్షణం ఆనందం. ఆ సృష్టి భాషాస్వరూపమైతే కవిత్వము, వర్ణ స్వరూపమైతే చిత్రలేఖనము, మూర్తి స్వరూపమైతే శిల్పము, అంగవిక్షేప స్వరూపమైతే నృత్యము, భవన స్వరూపమైతే ఆలయము అవుతుంది.

ఆదిమ మానవులు కూడా గుహలలో జీవితాన్ని గడిపేరోజుల్లో ప్రకృతిలోని వివిధ మృగాలను, పక్షులను అనేక ప్రకృతి దృశ్యాలను రాళ్ళపైన చిత్రించినట్లుగా ప్రాచీన సంస్కృతిని అధ్యయనం చేసిన పరిశోధకులు బయలుపరచిన విషయాలవల్ల తెలుస్తోంది. ఆ తర్వాత కళాకారులు ప్రకృతిని ఇపుడు చూసిన దృశ్యం కొంచెం సేపట్లో అదృశ్యమౌతుంది. ఆకసము నిమిష నిముషానికి వేషం మారుస్తూ కన్పిస్తుంది. కాబట్టి ఇలా మారుతున్న ప్రకృతి దృశ్యాలకు పట్టి స్థిరంగా భద్రపరచి తమ సొత్తు చేసుకోవలెనను ఆకాంక్ష కూడా ప్రకృతిని తిరిగి సృష్టించుకొనునట్లుగా మానవున్ని ప్రోత్సహించింది.

మానవుడు ప్రకృతిలో పుట్టి పెరిగినవాడు కాబట్టి మానవుని చర్యలకు ప్రకృతి నేపథ్యంగా ఉంటూ ఉంది. ప్రకృతి మానవుని చుట్టూ వాతావరణాన్ని కల్పిస్తున్నది. ఈ విషయాన్నే వివిధ లలితకళలందు కళాకారులు

సూచిస్తూ ప్రకృతిని నేపథ్యంగా ఉంచుకొన్నారు. నాట్య కళలోను, కావ్యాలలోను, ప్రకృతి నేపథ్యంగా ఎట్లేర్ప డింది. దువ్వూరి రామిరెడ్డి గారు వివరించారు.

"రసవాదము భరతముని నాట్యశాస్త్రమున నిర్వచింప బడింది. బహుశా ప్రభవించినదని కూడా చెప్పవచ్చును. నాట్యమునందు నాయికా నాయకులు ముఖ్యపాత్రలు. తక్కినవెల్లను ఔపచారికములు. కావుననే ప్రకృతి మానవ చర్యలకు కేవలము భిత్తిమాత్ర ప్రయోజనముగా రెండవ స్థానము అలంకరించినది. కావ్యములు కూడా క్రమ క్రమముగా ఈ పద్ధతినే అవలంభించినవి. వానియందును మానవ చర్యలే ముఖ్యములు. మానవ చర్యలతో సంబంధము లేని ప్రకృతి వర్ణమునకు తావులేదు. మానవ చర్యలకు సంబంధించి రసపోషణకు కావలసిన మాత్రము ప్రకృతి వర్ణనము గ్రాహ్యమని వారి మతము.

ప్రకృతి స్వయంగా మనోహరమైనదైనప్పటికిని, మానవ సుఖదుఃఖములు చిత్రణతో మనోహరమైన కావ్యంలో కలిసినచో మరింత రమ్యంగా ఉండగలదు. ఈ విష యాన్నే రామిరెడ్డి గారు ఇలా చెప్పారు.

''రమణీయ వస్తువులు తమంతట తావే వర్ణనాయోగ్యములయ్యును అవి మానవ చర్యలకు భిత్తిక మయయి కావ్యవర్ణనములో మిళితమైనప్పుడు మరింత సుందరముగానుండును. మానవ నాటక రంగమునకు బాహ్యప్రకృతి వరదావంటిది. ఇందుకు వివిధ దేశము లలోని మహాకవుల రచనలే సాక్ష్యము."

ఈ విధంగా కావ్యాల్లో ప్రకృతిని వర్ణించుట వలన చెప్పుచున్న కథకు వాస్తవికత కూడా చేకూరగలదు. 'కుమార సంభవము' నందు పార్వతి చలికి వానకు ఎండకు జంకక ఘోరమైన తపస్సు చేస్తున్నట్లు చిత్రించ దలచినచో కవి ఆయా జంతువుల యొక్క ఉధృతిని వర్ణించినచో అది పాఠకుని మనస్సునందు చక్కగా హత్తుకొని పార్వతి యొక్క నిశ్చలమైన తపమునకు ఆశ్యర్చపడునట్లు చేస్తుంది. అలాగే కాలగమనాన్ని చూపించుటకు సూర్యాస్తమయ సూర్యోదయములు. వివిధ ఋతువులు సహాయపడగలవు. కాబట్టి కావ్యంలో సందర్భానికి తగ్గట్లుగా నేపథ్యరంగాన్ని చిత్రించటానికి, కథయందలి సన్నివేశాలకు సరియైన వాతావరణాన్ని కల్పించటానికి ఉపయోగపడి ప్రకృతి కావ్యవస్తువుగా మారింది.

ఆధునిక కవులు మాత్రం ప్రకృతిని కావ్యాలలో 'మానవ చర్యలకు భిత్తిక' గాకాక స్వతంత్ర కావ్యవస్తువుగా కూడా తీసుకొని సంప్రదాయపు కట్టుబాట్లను బ్రద్దలుకొట్టినారు. అలా సంప్రదాయాన్ని త్రోసిపుచ్చుటకు వారిపైన ఆంగ్ల సాహిత్య ప్రభావ ముదప్రడుటయే కారణం. దేవులపల్లి రామానుజరావు గారు ఇలా చెప్పినారు.

"నవ్యాంధ్ర కవితకు ముఖ్యాంగ్ల సాహితీ ప్రోద్భల ములు వర్డ్సువర్తు, షెల్లీ, కీట్సు రచనలని చెప్పవచ్చును. వర్డ్సు వర్తు ప్రకృతి ప్రేమ, ప్రకృత్యుపాసన, స్వాతంత్ర్య దాహము, ఆధ్యాత్మిక తృష్ణ, అస్పష్టతామాధుర్యము అభినవాంధ్రకవి కుమారులయందు పుష్కలముగా లభించును." ప్రాచీన సంస్కృత కవులలో కాళిదాసు మాత్రం ఎవరి ప్రభావం లేకనే ప్రకృతిని స్వతంత్ర కావ్య వస్తువు తీసుకుని "ఋతుసంహారము" అనే కావ్యాన్ని నిర్మించాడు. ఈ సందర్భంలో ప్రాచీన కావ్యాలతో పరిచితిలేని కొందరు ఆధునికులలో బలంగా పాదుకొని ఉన్న ఒక అపోహను గురించి పరిశీలించుట ముఖ్యమని భావిస్తాను. పాశ్చాత్యులు అందులోనూ ఆంగ్లేయులే మనకు ప్రకృతిని చూచి ఆనందించుటకు నేర్పినారు. వారివల్లనే మనము ప్రకృతిని గుర్తించగలిగాము. వారినుండియే 'ప్రకృతి'ని ప్రేమించుట ఉపాసించుట' నేర్చుకొన్నాము అన్న అపోహ కలదు.

**ఆధారగ్రంథాలు :**

1. 'ఆంధ్ర శిల్పము' అను వ్యాసం నుండి.
2. నేటి కవిత - ప్రకృతిపూజ, కవికోకిల గ్రంథావళి.
3. నేటి కవిత - ప్రకృతిపూజ, కవికోకిల గ్రంథావళి.
4. సారస్వత నవనీతము, పుట 70.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# గోరటి వెంకన్న - జీవిత విశేషాలు

- మల్లేపాకుల పైదయ్య, నాగర్‌కర్నూలు, తెలంగాణ.

గోరిటి వెంకన్న ఈ పేరు చెబితే మనశ్శరీరాలు పుల కించిపోతాయి. అతని పాట మన రక్తనాళాల్లో ప్రవ హిస్తుంది. అతని తల్లిండ్రులు ఈరమ్మా, నర్సింహ ఏప్రిల్ 04 1964న వెంకన్న మహబూబ్‌నగర్ జిల్లా తెల్కపల్లి మండలం గౌరారం గ్రామంలో జన్మించాడు. మూడో తరగతి వరకు గౌరారంలో తర్వాత పదవ తరగతి వరకు రఘుపతిపేట్‌లో చదువుకున్నాడు. కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే రోజుల నాటికే వెంకన్న కవిత్వ రచన మొదలుపెట్టాడు. జడ్చర్లలో డా॥. బూర్గుల రామకృష్ణారావు డిగ్రీ కళాశాల నుండి బి.ఎ.లో పట్టాపుచ్చుకున్నాడు. అదే ఏడాది హైదరాబాద్ లోని ఆంధ్ర సారస్వత పరిషత్ కళాశాల ఎం.ఏ తెలుగులో చేరాడు. ఆ తర్వాత 1987లో నాగర్‌కర్నూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో చేరాడు.

రఘుపతిపేటలో వడ్ల వెంకటయ్య పద్యాలు పాడడం విని నేర్చుకున్నారు. 1986 తర్వాత విప్లవోద్యమాలతో సంబంధం, వెంకన్న గమనాన్ని, గమ్యాన్ని సూచించాయి. వెంకన్న పాటలు గేయరూప కవితలు. వెంకన్న మొదట 1. ఏకునాదంమోత, 2. రేలాపూతలు, 3. అలసెంద్ర వంక పాటలు పుస్తకాలు వచ్చాయి. ఐదు పాటల ఆల్బమ్స్ వచ్చాయి. సృజాత్మకంగా జీవించే వెంకన్నని వరించిన అవార్డులు అనేకం. హంస పురస్కారం, తెలుగు విశ్వ విద్యాలయ సాహిత్య పురస్కారం అధికార భాషా సంఘం పురస్కారం, విశాలాంధ్ర పురస్కారం తెర సంస్థ వారి జీవిత సాఫల్య పురస్కారం ఇంకా ఎన్నింటినో వెంకన్న అందు కున్నారు. ప్రకృతి, పల్లె, యదార్థుడైన మనిషి అతని ప్రధాన ఇతివృత్తాలు.

## గోరటి వెంకన్న గేగోరటి వెంకన్న - జీవిత విశేషాలుయ కవిత్వం - సమీక్ష :

**గోరటి వెంకన్న** : ఈ పేరు వినగానే పల్లె ప్రతి రూపం కళ్ళల్లో కదలాడుతుంది. పల్లెతత్వాన్ని అణువణువున నింపుకున్న ప్రకృతి తత్త్వవేత్త. ఇతను ఆధునిక ప్రజా వాగ్గేయకారుడు. తెలంగాణ పల్లె బతుకులను ప్రపంచ మంతటికి పరిచయం చేసినవాడు. ప్రకృతి తల్లి కడుపులో పాటై పుట్టినవాడు. చెట్టు, పుట్ట, వాగూ, వంకా నింగిలోని ఆ నీలిమబ్బును తొంగిచూసి ఆ సందమామను, రాలే చినుకును, రామచిలుకను, ప్రకృతిలో ప్రతి అణువు అణువును తడిమిచూసుకొని తనివి తీరా తన్మ యత్వమును పొందినవాడు.

వెంకన్నకు ముందు రామదాసు అన్నమయ్య, త్యాగయ్య, నాజర్, సుద్దాల, గద్దర్ లాంటి వాగ్గేయ కారులున్నా, వారిని మించిన లోతును దర్శించాడు వెంకన్న. వెంకన్న పాటలో యక్షగానాలు, చిందు భాగో తాలు, బుడబుక్కల, గంగిరెద్దుల, చీరుతల భజనల మద్దెల దరువుల సబ్బండ జాతల సాంస్కృతిక వాసనలు వెదజల్లుతుంటాయి. అమాయకుడిలా ఏమి ఎరగనట్టు సహజత్వంతో కనిపించే గోరటి వెంకన్న పాటెత్తుకుంటే అది ప్రవాహమై పరుగెత్తుతుంది. జలజలపారే జలపాత మవుతుంది. పసిపాప నవ్వులా పాల నురుగలా వెంకన్న జీరగొంతులో జీవనాదమవుతుంది పాట.

వెంకన్న పాటకు ఎల్లలు లేవు. ఒక ప్రాంతం, ఒక జిల్లా, ఒక రాష్ట్రం, ఒక దేశం గాదు అది ప్రపంచ భుజాల మీదెక్కి అంగారక గ్రహం మీద అడుగు పెట్టింది. వలస కూలీ బతుకుల వలపోతే అతని గేయం. చితికిన గతుకుల అతుకుల బతుకుల చిరునామే వెంకన్న. జాన పద జన జీవన గీతిక వెంకన్న, దగాపడ్డ గాయాల గేయమే అతని పాట. పాలు తాగే పసిపాపలనుండి పాడెనెక్కే పండుముసలిదాక ప్రతి దశను వెంకన్న పాట పసిగట్టింది. అతని పాట అమ్మ పాలను తగినట్లుగా, జోల పాటలా ఊగినట్లుగా, నాన్న పట్టి నడిపించినట్లుగా, ఊటసెలి

మెలా ఊరినట్లుగా, దుందుభీనది దుంకినట్లుగా, గోదావరి ఉప్పొంగినట్లుగా, కూలితల్లి గొంతెత్తినట్లుగా, కోకిల రాగం తీసినట్లుగా, జింకపిల్ల గంతేసినట్లుగా, ఎర్రదారు లేరు వెక్కినట్లుగా, సమత రాజ్యముకు సాగినట్లుగా ఉంటుంది.

జానపద గేయ శిఖరమంచుల్లో నరిస్తాడు వెంకన్న. వెంకన్న పాటల తోటలో ప్రతి పాటా ఒక పరిమళ సందేశమే. వెంకన్న గేయానికి అంతం లేదు దానికంతే లేదు. అది నయాగార జలపాతమై నడుస్తూనే ఉంటుంది. ''జైబోలో జైబోలో అమరవీరులకు జైబోలో'' అంటూ వెంకన్న తను మొదటిసారిగా సినీరంగంలో ప్రవేశించి ఎన్‌కౌంటర్ సినిమాకి పాట రాశారు. అమరవీరులైన స్వాతంత్ర్య సమర యోధులను స్మరిస్తూ ఎంతో అద్భుతంగా ఈ పాట రాశారు. ''కంప తారు చెట్లు అమ్ముకొని - కడుపునింపుకునే కాలమొచ్చినాది'' అంటూ పల్లెల్లో బతకడానికి జీవనాధారం కరువయ్యి ఏ దిక్కు లేక చివరికి ఊర్లో ఉన్న చెట్లు కొట్టి అమ్ముకొని పొట్టను పోషించుకొనే కాలమొచ్చిందంటాడు ఈ కవి. పాటలో వెంకన్న గుక్కించి బోరు దుంకూతుంటే - ఒక్కటన్నా మడి సక్కాగదడవధు అంటూ ఎడారి మారిన పల్లె చేను, చెలకల్ని డొక్కలెండిన పాడిపశువుల్ని కళ్ళల్లో ఆశలు లేని రైతు బతుకుల్ని, ఆవేదనలని నిలువెల్లా గాయాలైన తన గేయాలతో గానం చేస్తాడు. నిలిచి కురిసే వానలేక నిండి పారే సెరువులు డొక్కలెండినాయంటాడు గోరటి వెంకన్న భూగర్భ జలాలు అడుగంటి పోయాయని నారు తడుపసుక్క నీరు లేదని పేద రైతు ఆవేదనని, అవస్థలని ఆ రైతు కంట కన్నీటి గేయాలయ్యాడు వెంకన్న.

''పల్లె కన్నీరు పాట'' ఎంత సహజంగా ఉందంటే...... పల్లె తల్లి గుండె - ఘోషను నిశబ్దంగా ఒక్కడేవిని, గ్లోబలైజేషన్‌ను పేల్చిన తుపాకిగుండ్లను తూట్లుగా కాలిపోయిన పల్లె తల్లి గాయాలను కన్నీటి గేయాలుగా మార్చిన మనోవాగ్గేయకారుడు వెంకన్న. ఈ సమాజంలోని మంచి, చెడు, ఆధిపత్యం, అన్యాయం, అవమానం, అంధకారం, కార్మికులు, కర్షకులు, పల్లె, పట్నం ప్రకృతి ధర్మం ఇలా ప్రతి అంశాన్ని తన మనోనేత్రంతో చూసి వాటిని తన మనస్సు పొరల్లో దాచి ఒక్కొక్కటిగా మన హృదయ క్షేత్రాల్లోకి వదులుతుంటాడు వెంకన్న. ప్రకృతి వినాశనం అవుతుందని విలవిలాడాడు వెంకన్న. పేద ప్రజల బతుకులు మారలేదని బాధపడ్డాడు. 'రేలా దూలా తాలెల్లాడే నేల'' అంటూ గూడు చెదిరిన పక్షులైన తెలంగాణ వలస బతుకులు చూసి విలపించాడు వెంకన్న. తాత తండ్రుల నాటి జానపద గేయాల బాణీల ఆనవాళ్ళను అందిపుచ్చుకొని వాటికి సాహిత్య ప్రకృతి ఆయుర్వేదంతో ఆయుష్షు పోస్తున్నాడు వెంకన్న. ఆయన ''మొదటి గేయ కవిత్వ సంపుటి ''ఏకునాదంమోత'' రెండవది 'రేలపూతలు'' మూడవది ''అలసెందవ్రంక''. ఈ మూడు గేయ సంపుటాల్లో ఆయన కవిత్వ ప్రధాన ఇతివృత్తాలు మూడు అవి ప్రకృతి, మనిషి, పల్లె, పాలమూరు జిల్లాలో గొల్లోళ్ళు గొర్లను ఎక్కువగా పెంచుతారు. వాటి వచ్చే మాంసాన్ని, చర్మాన్ని, చర్మంపై వెంట్రుకలని మనిషి అవసరాల కోసం ఉపయోగించుకుంటారు. వాటి వెంట్రుకలతో గొల్లోళ్ళు గొంగళ్లనేస్తారు. ఈ గొర్లను మేపడానికి గోల్లోళ్ళు ఊర్లవెంబడి మేతకోసం వెళుతుంటారు. ఈ గొర్ల మంద వెంట ఉండే ఎలమంద వాటిని జాగ్రత్తగా కాపాడుకుంటాడు ఎండా, వాన, చలి కాలాలతో సంబంధం లేకుండా ఆ ఎలమంద ఒంటిమీద బట్ట లేకుండా ఒక్కగొంగడేసుకొనే వాటితో ప్రయాణమవుతాడు. ఈ ఎలమంద జీవన చిత్రన్ని ''మందెంట పోతుండే ఎలమంద'' పాటలో తన కలము కుంచెతో ఆ గేయ కాన్వాసుమీద అద్భుతంగా చిత్రించాడు. ప్రకృతి తల్లి పాదాల చెంత ప్రణమిల్లు తాడు వెంకన్న. ఒకప్పుడు ఆరుగాలం పారే పెద్దవాగు ఎండిపోయి ఏడుస్తున్నప్పుడు ఆ వాగు దీనస్థితిని ''వాగు ఎడి పాయెరో'' పాటలో ఎంతో సహజంగా రాశారు. దుందుభినది గుండె ఘోష గుర్తెరిగిన వాడు వెంకన్న. తాజ్‌మహలందాలకన్నా వాగు పిచ్చుక గూళ్ళు మిన్న అని తన బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆ ఇసుక తిన్నెల పాన్పుపై సేదతీరుతాడు వెంకన్న. గాలిలో ఎగిరే పక్షుల ''ఆనందాన్ని, అందాన్ని

వాటి అంతరాత్మని పసిగడతాడు వెంకన్న". వెండి తీగలతో నీ రెక్కలు ఏ దేవుడల్లేనని, మడుగుల్లో ఈ దినా ఈ సమంత మైలంటదని, తుమ్మకొమ్మ నిడుంటే అమ్మ ఒడినే మర్చిపోతావని గాలిలో ఎగిరే కొంగల బారుల తీరుని వాటి జీవిత తత్త్వాన్ని జీవింపజేస్తాడు వెంకన్న. తన గేయ కవిత్వంలో ప్రకృతి ఒడిలో పసిపాప వెంకన్న. పిల్లల మానసిక మైదానంలో ఆడుకున్నవాడు వెంకన్న. కల్లాకపటం తెలియని పిల్లల స్వచ్ఛమైన ప్రేమ ఒడిలో నిద్రపోయినోడు కాబట్టే "ఆటలాడేటి పిల్లల మానసిక ప్రపంచ మర్మాన్ని గుర్తెరిగినవాడు". బడుగులు, బలహీనులపై పేదలపై రాజ్యం చేస్తున్న కుట్రలను పసిగట్టి ఎదురు తిరిగి రాజ్యహింస పెరుగుతున్నదని రణరంగం చేశాడు. ఈ 21వ శతాబ్దంలో మానవుడు అంతరిక్ష రహస్యాలను తెలుసుకొని అక్కడ విందు హోటళ్ళు కట్టుకొనే స్థాయికి కొంతమంది వెళ్ళినా ఈ దేశంలో నూటికి 80% మంది ప్రజల బతుకులు మార లేదని పేదలు ఇంకా పేదలుగానే మారుతున్నారని, కనీసం వారు దోమతెరలైనా కొనుక్కోని పరిస్థితి దాపు రించిందని ఆ సాలె పురుగులు అల్లిన పరదాలే ప్రజలకు దేవుడిచ్చిన దోమ తెరలయ్యాయని ప్రజలను పాలకులు పట్టించుకోవట్లేదని "ఏమీ మారెను, ఏమి మారెనురా నా ప్రజల బతుకులు" అంటూ గుండె పగిలేల దుఃఖపడ్డాడు వెంకన్న. తను స్వయంగా ఆ పేదరికాన్ని అనుభవించిన వెంకన్న తన ప్రజల బతుకులను కై గట్టడం, పాడటం కొత్తేమికాదు. ఆ పేద బతుకులోని ప్రతి విషయాన్ని పసిగట్టి ఆ వెతల వెనుకున్న మత లాబును మానవత్వంతో ఈ లోకానికి అర్థమయ్యేలా తన గేయ కవిత్వ దండోర వేశాడు వెంకన్న. తను పుట్టిన ఊరిలోని మట్టితల్లి పొత్తిళ్ళలో పొరాడి పారాడి ఆ తల్లి ఆత్మను అర్థం చేసుకున్నవాడు వెంకన్న. అందుకు అతడు ప్రకృతి కవి అయ్యాడు, ప్రజల కవి అయ్యాడు. ఎంతో మంది కవులు, కళాకారులు కరువులో వానలు రావాలని ఆకాంక్షించి పాటలు రాశారు కానీ వెంకన్న కొత్తకోణంలో ఆ వాన చినుకుల వలపులను, పరుగులను, నురుగలను, ప్రకృతిలో వాటికలయికను మనం అద్దంలో ప్రతిబింబాన్ని చూసినంత స్వచ్ఛంగా "వానొచ్చెనమ్మా వరాదొచ్చెనమ్మా అంటూ" మనల్ని తన గేయ కవిత్వ వర్షంలో తడిపాడు సంత పాటను చక్కగా సహజంగ అక్కడ ఏమేమి వస్తువులంటాయో, ఎలాంటి సంఘ టనలు జరుగుతాయో పూసగుచ్చినట్లు అక్షరాలకు ఆయుస్సు పోసి, ఆ సంతలోని ఆరేకుమాలోడు సామాను అందంగా పేర్చినట్లు అక్షరాలను పేర్చాడు వెంకన్న. తన మనసులోని మాటను కపటం లేకుండా కమనీయ కలము హలముతో ప్రజా హృదయక్షేత్రాల్ల తన గేయాల సాల్లల్లో అక్షరాల విత్తనాలు జల్లుతాడు వెంకన్న. "పల్లెల్లో ఉండే పట పొలాలు వాగులు, వంకలు, చెట్టూ, పుట్టా, కొండా, కోనా, నదులు, యేరులు, తరులు గిరులు ఇలా ఒకటేమిటి పల్లెలోని ప్రతి అణువును స్పర్శించాడు వెంకన్న. "నా పల్లె అందాలు చూసితె కనువిందురో" అనే పాటలో ప్రతి పాదానికి ప్రాణం పోశాడు వెంకన్న. పల్లె ఎట్లుంటాదో ఈ పాటవింటే మన కళ్ళముందే ప్రత్యక్ష మవుతుంది. ఈ పాట రాసి పల్లె తల్లి ఋణం తీర్చు కున్నాడు వెంకన్న. ప్రతి అక్షరాన్ని దండగా గుచ్చి ఆ తల్లి మెడలో వేశాడు. కోరికలు, సంసార బంధాలు, ఆస్తులు, అంతస్తులు, ఆశలు లేని మనిషి జీవితం ఎంత కులా సాగా ఉంటుందో "సందారమే ఎంతో బాగుంటుంది - దీనంత ఆ నందమేముంటది" అనే పాటలో ప్రాకృతిక జీవి ఎలా ఉంటాడో అనే విషయాన్ని అద్భుతంగా చెప్పాడు.

"గల్లీ సిన్నది" పాటలో అక్కడి జీవన స్థితులను, సజీవ సాక్ష్యంగా కలం కన్నుల్తో చూశాడు కవి. అక్కడి జీవచ్చవాల జీవనస్థితిని, వారి జీవితాన్ని గల్లీ బతుకులను ఈ పాటలో రాశారు వెంకన్న. కిల్లి కొట్టుకన్న సిన్నగున్న వారి ఇండ్లలో డొక్కుఫ్యాన్లు పగిలిన అద్దాలుంటాయని "తన అద్దం లాంటి అక్షరాలను పేర్చి వారి బతుకులను చూపించాడు వెంకన్న". పల్లెల్లో కూలీ పనులకు లేదా చెలక పనులు చేసుకునే ఒక పేద తల్లి జీవితాన్ని తను నిత్యం చేను,

చెలకలో పనిచేసే విధానాన్ని "కంచేరేగి తీపివోలే లచ్చువమ్మో" అనే పాటలో ఎంతో హృద్యంగా చిత్రించాడు. ప్రకృతికి, మనిషికి విడిపోలేని బంధముందంటూ ఈ పాటలో ఆమె త్యాగాన్ని, కష్టాన్ని చూసి ప్రకృతే శిరసువంచి ఆమెకు పాదాభివందనం చేస్తుంది, పనిచేసి అలసిపోయి దుసరితీగల పొదలపై కునుకుదీస్తున్న ఆ తల్లి నిద్రకు భంగం కలుగొద్దని ఆ ఎండకు మేఘాలు అడ్డువచ్చి నీడపడుతాయి అనే మాట ఎంతో గొప్ప మనసుతో రాశాడని అర్థమవుతుంది. గ్లోబలైసేషన్‌కు, ప్రపంచీకరణకు వ్యతిరేకంగా తన పాటల తూటాలను పేల్చాడు. ప్రపంచ దేశాలపై అమెరికా తన అవసరాల కోసం స్వార్థంతతో చిన్నదేశాల మీద చేస్తున్న అమానవీయ దాడులను, కుట్రలను అప్పటి అమెరికా ప్రెసిడెంట్ జార్జ్ బుష్ కుతంత్రాలను ఈ పాట ద్వారా తిప్పికొట్టాడు. "తన పాటను అన్యాయం పైన తిరుగుబాటు బావుటాగా ఎగరేశాడు". వెంకన్న పాటలో ఒక సునిశితమైన, నిర్దిష్టమైన పరిశీలన ఉంటుంది "పూసిన పున్నమి వెన్నెల మేనా తెలంగాణ వీణా వాసిగ చరితల వెలుగొందిన గత వైభవాల కోనా" అంటూ తెలంగణాలోని ప్రతి జిల్లాలోని ప్రాముఖ్యమైన ప్రాంతాల గొప్పతనాన్ని అంతా కలగలిపి అక్షరాలమాలలన్నీ ఆ తెలంగాణ తల్లి మెడలో దండగా వేశాడు వెంకన్న.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (1) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# కడప జిల్లాలోని జాతరలు - ప్రత్యేకత మరియు ప్రాధాన్యత

- ఆచార్య వి.రామబ్రహ్మం
సహాయ ఆచార్యులు - చరిత్ర విభాగం,
యోగివేమన విశ్వ విద్యాలయం, కడప.

- ఆచార్య యు. కృష్ణమోహన్
చరిత్ర అధ్యాపకుడు, సి.యస్.యస్.ఆర్ &
యస్.ఆర్.ఆర్.యమ్. కళాశాల, కమలాపురం.

ఆంధ్రదేశంలో జాతరలకు ఎంతో ప్రత్యేకత ఉంది. అందులో రాయలసీమలో జరిగే జాతరలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ జాతరలు మన ఆచార, సాంప్రదాయ, కట్టు, బొట్టు, కళలలకు ప్రతీకలు. ఇవి అతి ప్రాచీన కాలం నుంచి నేటి వరకు పల్లెలలో, పట్టణాలలో నాగరికతా జీవనాన్ని తెలియజేస్తాయి.

కడప జిల్లా మహోన్నత సంస్కృతికి నాగరికతకు పుట్టి నిల్లు. ఈ ప్రాంతాన్ని పల్లవులు, బాదామి చాళుక్యులు, రేనాటిచోళులు, బాణులు, వైదుంబులు, చోళులు, కాకతీయులు, విజయనగర రాజులు, కుతుబ్‌షాహిలు, హైదరాలి, టిప్పుసుల్తాన్, అసఫ్ భాహిలు, మొగలులు, ఆంగ్లేయులు పాలించారు. జిల్లాలో అనేక నదులు ప్రవహించడమే కాక, విభిన్న మతాల ప్రజలకు పుట్టినిల్లు.

చిత్తూరు జిల్లాకు భౌగోళం దగ్గర ఉన్న కడప జిల్లా సరిహద్దు ప్రాంతాలైన రైల్వేకోడూరు, రాయచోటి లలో పేరుగాంచిన జాతరల గొప్పదనం కనిపిస్తుంది. ఈ జాతరలు యొక్క ఆవిర్భావం, దక్షిణ భారతదేశంలో ద్రావిడుల మొదలకొని, తరువాత రాజవంశస్తులు ఆధరణ నోచుకొని శతాబ్దాలుగా నేటికి ప్రజాబాహుళ్యంలో గ్రామీణ పండుగలుగా విలసిల్లుతున్నాయి.

ఈ జాతరలు సంవత్సరానికి ఒకసారి, 3సంవత్సరాల కొకసారి చేస్తారు. జాతరలు చేయడం వల్ల ఎటువంటి అంటురోగాలు రావని, వర్షాలు సకాలంలో కురుస్తాయని, గ్రామాలను, ప్రట్టణాలును గ్రామదేవతలు కాపాడుతారని ప్రజల విశ్వాసం. ముఖ్యంగా ఈ జాతరలు మార్చి, ఏప్రిల్ నెలలో మంగళ, శుక్ర, ఆదివారలలో చేస్తారు. ముఖ్యంగా గ్రామ దేవతలకు పేర్లు పెట్టి జాతరలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారసాంప్రదాయం.

**కడప జిల్లాలోని జాతరలు :**

1. కడప జిల్లాలోని రాజంపేటలో జరిగే బలిజ పల్లె గంగమ్మ జాతర
2. లక్కిరెడ్డి పల్లె గంగమ్మ జాతర
3. చిన్నమండెంలోని కొండలరాయుని జాతర
4. రాయచోటి తాలూకాలోని రాచపల్లి అరిణమ్మ జాతర
5. సుండుపల్లిలోని పెదనేని కాలువ గ్రామంలో నాగా రాపమ్మ జాతర
6. వీరపునాయని మండలంలోని మోపూరులోని అక్కపప్పూరమ్మ
7. ఖాజీపేట దుంపల గట్టు అంకాళమ్మ జాతర
8. రైల్వేకోడూరు తాలూకాలోని ముత్యాలమ్మ జాతర
9. బి. కోడూరు తాలూకాలోని రాయసముద్రంలో పోలే రమ్మ జాతరలు చాలా ప్రసిద్ధి పొందాయి. ఈ జాతర లలో మనకు అనేక సాంప్రదాయాలు, కొన్ని కులాల వారు (రజకులు, కుమ్మరులు) మాత్రమే పూజారు లుగా ఉండి జాతరలు జరిపించడం జరుగును.

**గ్రామదేవతలు - పూజారులు :**

గ్రామదేవతలకు ఎక్కువ మందికి నిత్యసేవలు ఉండవు. వీరు పూజారులుగా ఒక సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో ఏదైన ప్రత్యేక సందర్భాలలోను గుడిలో కనిపిస్తారు. ఈ పూజారులకు శుచి, శుభ్రతతో పని ఉం డదు. ఆహారాది, నియమాలు వర్తించవు. ఉదాహరణకు చాకలివారు, కుమ్మరి వారు, సుంకులవాళ్ళు, పెద్దమాల వారు, జోగులవాళ్ళు చెప్పుకోవచ్చు. మరి కొన్ని చోట్ల యాదవులు, తెలగలు, కాపులు, ఆదిఆంధ్రులు, తలా

రులు, కొండదొరలు, దేవాంగులు, వడ్డెర కులాల వారు పూజారులుగా ఉన్నారు. కొన్ని చోట్ల స్త్రీలు, కొన్ని చోట్ల నపుంసకులు కూడా పూజారులుగా ఉండి జాతర జరిగేటపుడు మాత్రమే వీరు ప్రత్యేకంగా చూడబడి మిగిలినపుడు సామాన్యులుగా పరిగణించబడతారు.

## ఆచరణ విధానం :

జాతరలను గ్రామ పెద్దలు గ్రామ సభ నిర్వహించి ఎప్పుడు చేయవలనో ముహూర్తం నిర్ణయించి చాటింపు వేయిస్తారు. చాటింపు వేయించిన వారంకు గాని, పది రోజులలో గాని జాతర నిర్వహించబడును.. ఆరోజు రాత్రి గంగమ్మను గ్రామంలోని చాకలివారు, కుమ్మరి వారు బంకమట్టితో గంగమ్మ బొమ్మను చేసి బొట్టు, కళ్ళు, గాజులు, కొత్త చీర కట్టి విగ్రహంను ప్రతిషిస్తారు. ముఖ్యంగా వేపాకుతో అక్కడ అలంకరిస్తారు. గ్రామ జనమంతా కలిసి ఒక దున్న పోతును ముందుగా అమ్మ వారిది అని చెప్పి దానిని నెలనుంచి మేపుతారు. జాతర రోజు అమ్మవారి ముందు దున్నపోతును నిలబెట్టి దానికి పెద్ద బొట్టు పెట్టి, పదునైన పెద్ద కత్తితో ఒక వేటుతో దాని తల నరికి, అమ్మవారి ముందు దానితల నిల బెట్టి గండదీపం పెడతారు. ఈ విధంగా చేసిన తర్వాత ఆ గ్రామ దళిత కులానికి చెందిన కొందరు వ్యక్తులు తప్పెటలు, కొమ్మలు వాయిస్తు రక్తంతో కలిపిన అన్నంను గ్రామ పొలిమేరలలో చల్లివస్తారు.

## దిగ్బంధన చేయడం - కుంభం రాసిగా పోయడం:

జాతర ప్రారంభం కాగానే అన్నం రక్తంతో కలిపి ఊరి పొలిమొారలచుట్టు చల్లుతారు. దీనిని 'పొలి' అన్నం అంటారు. చాటింపు వేయించిన తర్వాత ఆ గ్రామ ప్రజలు వేరే ఊరికి గాని ఎక్కడికి వెళ్ళరాదు. ఆవిధంగా వెళ్ళడం వలన వారికి హాని కలుగుతుందని ఒక విశ్వాసం. ప్రజలు జాతర ప్రారంభమైన రోజు జంతు బలులు అనగా కోడిని, గొర్రె, మేక, పొట్టేలు, మేకపోతును ఊరేగింపుగా తీసికొని వచ్చి బలి ఇస్తారు. ఈ విధంగా వచ్చేటపుడు తమతో బాటుగా పసుపు, కుంకుమ, వక్కలు, పూలు, పండ్లు, తమలపాకులు, అన్నం తెచ్చి రాసిగా పోస్తారు. దీనిని 'కుంభం' అంటారు. ఈ విధంగా రాసిగపోసిన దానిని వచ్చిన ప్రజలకు కొద్ది కొద్దిగా ప్రసాదంగా ఇస్తారు. పసుపు, కుంకుమను, బండారు (పసుపు, సున్నం నీరు కలయిక వలన ఎరుపు రంగు అవుతుంది. దీనిలో వేప చిగురులు కూడా వేస్తారు) అని తీసి ఇస్తారు. దీనిని భక్తి శ్రద్ధలతో ఇంటికి తీసికొని జబ్బులు బారిని పడినవారికి పూస్తారు. గాయాలు తొందరగా మానుతాయి.

## వేప :

శక్తి దేవతల విగ్రహాలు, గుళ్ళు ఎక్కువగా వేప చెట్ల క్రింద ఉంటాయి. దేవతలు చెట్లను ఆశ్రయించుకొని ఉండడానికి కారణం ఆత్మారాధనలోని భాగమైన వృక్షారాధన, చెట్లకున్న విశిష్ట లక్షణాలు. వేపాకు సఫలతా చిహ్నంగా బోనాలకుండలలో, గరగల్లో, ఘటాలలో పెడు తుంటారు. జాతరలలో ఇంటికి తోరణాలుగా కడతారు. మసూచి, అమ్మవారుపోసినపుడు అమ్మవారికి మ్రొక్కి వేప ఉండలును తినిపిస్తారు.

## పూజా విధానం :

సాయంత్రం పూట గంగమ్మకు వండిన పదార్థాలు, చీర, రవిక, నల్లగాజులు, కదుంపొడి. చవ్వాకు (తాటా కుకు రంగు అద్దడం) వంటి వాటిని నట్టింట పెట్టి పూజి స్తారు. కొంత మంది ఎర్రని చీరలు, నల్లని చీరలు గంగమ్మను నిలిపిన చోట ముడుపుగా ఇస్తారు. కొన్ని ప్రాంతాల్లో వాటిని తడికలకు కడ్తారు. ఇవన్నీ మొక్కుబడి ఉన్నవాళ్ళు చేస్తారు. జాతర రోజు రాత్రి గంగమ్మకు చీకటి కుంభాలు వేస్తారు. ఈ చీకటి కుంభాలను ఊరివాళ్ళంతా కలిసి ఒక్కసారిగా వేస్తారు. ముఖ్యంగా కుడుములు, ఆవిరి పిండి దీపాలు అమ్మవారికి నైవేద్యంగా పెడ్తారు.

## మొక్కులు తీర్చడం :

జాతర సమయంలో అనేక రకాల మొక్కులను తీరు స్తుంటారు. ఏదో ఆపద, కష్టం కలిగినప్పుడు గంగమ్మకు మెుక్కుకుంటారు. అవి నవ్యంగా జరిగినప్పుడు మొక్కులు తీర్చడం జరుగుతుంది. శక్తి పూజలో శక్తికి

బలిపెట్టే ప్రాణులలో కోడి ప్రథమ స్థానాన్ని ఆక్రమించుకొన్నది. మనిషికి ఏ జబ్బు వచ్చినా, దయ్యం పట్టినా, భూతం పట్టినా, ఎలాంటి పీడలు తగిలినా అటువంటి వ్యక్తులకు కోడిని దిగదుడిచి అమ్మకు బలి ఇస్తారు. ఈ విధంగా మొక్కుకున్న కోడి మాంసాన్ని చాకలి, మంగలి, కుమ్మరి వాళ్ళకు దానం చేస్తారు. ఏ కోడిని ఏదేవత పేరు మీదుగా దిగదుడిచితే ఆదేవతకు బలి ఇవ్వాలి. మరొక దేవతకు బలి ఇవ్వకూడదు.

## సారా - కల్లు :

గంగమ్మకు గంగజాతర సమయంలో నట్టింటిలోను, గుడి ముందు తలిగెలతో పాటు ఒక ముంతలో గాని మూకుడులోగాని సారా లేదా కల్లుని కొందరు నైవేద్యంగా పెట్టి పూజించడం కూడా ఉంది. ఈ విధమైన ఆచారం అనేక ప్రాంతల్లో ఉంది.

## శూలాలను గుచ్చుకోవడం :

వీపు పైన, నాలుకకు, తొడలకు సన్నని శూలాలలను గుచ్చుకుంటారు. ఆ శూలాలకు ఇరువైపులా నిమ్మకాయలను గుచ్చుతారు. అదే విధంగా దవడలకు టెంకాయలను కూడా గుచ్చుకొని శివమెత్తి ఆడతారు.

## దుత్తలను తీసికొనిరావడం :

జాతరలకు వచ్చునపుడు స్త్రీలు చిన్న కుండల (దుత్తలు) కు పసుపు, కుంకుమ పూసి సున్నపు బొట్లు పెట్టి ఆకుండలలో వేపాకు వేసి దీపం వెలిగించి భుజం మీద కాని, నెత్తిన కాని పెట్టుకొని గుడి దగ్గర నేల మీద కేసి పగులకొడతారు. ఆవిధంగా చేయడం వలన తమ పాపాలు అన్ని అమ్మ హరించి స్త్రీల పసుపు, కుంకుమలు కాపాడుతుందని నమ్మిక.

## బుర్ర కథలు, ఒగ్గు కథలు :

కడప జిల్లాలో జరుగు జాతరలు రెండు రోజులు జరుగుతాయి. మొదటి రోజు అమ్మవారిని నిలబెట్టడము, బలి ఇవ్వడం జరుగుతుంది. రెండవ రోజు జాతరలో బుర్ర కథ, ఒగ్గు కథలు చెబుతారు. బుర్ర కథను ముగ్గురు చెబుతారు. వారిలో ఒకడు కథను చెబితే, మిగిలిన ఇద్దరు 'తందాన తానా' అని వంతపాడుతారు. ఒగ్గు కథ చెప్పేవాడు ఒగ్గు వాయిద్యం (జవుడిక) వాయించుతూ చెబుతాడు. ఈ విధమైన కథలు చెప్పేవాటిలో చాలా ఖ్యాతి గాంచిన జాతరలో చెప్పుకోదగినవి. లక్కిరెడ్డి పల్లె కనుమాటి గంగమ్మ జాతర, నాపారమ్మ జాతర, రాచపల్లె అరిణమ్మ జాతరలు రెండు రోజులు ఘనంగా జరుగును.

నాపారమ్మ జాతరకు వివిధ రాష్ట్రాలనుంచి కూడా భక్తులు వస్తారు. ఇక్కడ వేసవిలో జరుగును. అమ్మవారి విగ్రహం 3 అడుగుల ఎత్తులో నలుపు, ఎరుపు రంగు మిశ్రమంతో సిమెంటులో తయారు చేయబడినది. చాకలి వాళ్ళ కుల దేవత అయినను చుట్టుప్రక్కల గ్రామాల వారు, ఊరి వారందరు పూజిస్తారు. గుడి ఒక ఎకరాలో విశాలంగా నిర్మితమైనది. ఇక్కడ జాతర మూడు రోజులు జరుగుతుంది. ప్రతి ఏడాది శనివారం దాసర్లు, ఆదివారం జాగర్లు, సోమవారం బండలాగడం వంటివి చేస్తారు. ఇక్కడ జాతర నెలముందు నుంచే పోతురాజులను ఊరేగిస్తారు.

మోపురులో వెలసిన అక్కపప్పూరమ్మ 2 అడుగుల ఆరుగుపై చతుర్భజముల యందు త్రిశూలం, ఖడ్గం, ఢమరుకం, పాత్ర ధరించి ఉంటుంది. 3 1/2 అడుగుల ఎత్తుతో, నలుపు రంగును కలిగిఉంటుంది. ఇక్కడ కూడా ఘనంగా ఏడాదికి ఒక సారి జాతర జరుగును.

అరిణమ్మ జాతర చాలా ప్రఖ్యాతి గాంచినది. ఇక్కడ అరిణమ్మ తొమ్మిది అడుగుల ఎత్తులో దేవాలయం కప్పును తాకుతూ ఉంటుంది. అమ్మవారు భయంకర స్వరూపంలో భయం గొలుపుతూ ఉంటుంది. ఈ దేవాలయంలో దొంగతనం చేయడానికి ఎవరు సాహించరు. ఒక వేళ దొంగతనం చేస్తే చనిపోతారు. ఇక్కడి ప్రత్యేకత హిందువులు, ముస్లింలు కుల, మత భేదం లేకుండా అమ్మ వారిని కొలుస్తారు. ఏరువాక పున్నమి రోజున ఇక్కడ పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. ఈ తల్లి భక్తులను రోగాలనుంచి, కష్టాలనుంచి కాపాడుతుందని, దయ్యాలను, భూతాలను పారద్రోలి అయుష్షు పెంచుతుందని విశ్వాసం.

## వేషాలు వేయడం :

ఇలా జాతరలు జరిగేటపుడు వేషాలు వేస్తారు. మాతంగి వేషాలు వేయడం, మగవారు ఆడవారిగా వేషం వేయడం ఇంకా రకరకాలైన దేవుని వేషాలు వేయడం చేస్తారు. ఈ వేషాలు వేసికొని గంగమ్మను దర్శించుకొన్న తర్వాత అమ్మవారిని అనేక రకాలైన బండ బూతులు తిట్టుతారు. ఇలా చేయడం వలన అమ్మవారు వారికి మేలు చేస్తుందని ఒక విశ్వాసం.

## గంగమ్మను తీసి వేయడం :

కడప జిల్లాలో జరిగే గంగమ్మ జాతర రెండు రోజులు ప్రజలు బాగా శ్రద్ధలతో వేస్తారు. మేకలను, కోళ్ళను బలిస్తారు. బలి ఇవ్వని వారు పొంగళ్ళు చేస్తారు. ఈ జాతర రోజులలో జనం విపరీతంగా రావడమే కాకుండా ఇతర ప్రాంతాల ప్రజలు కూడా వచ్చి గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటారు. అయితే గంగమ్మకు మొదటి రోజు ఎంత అలంకరణ చేస్తారో రెండవ రోజు తెల్ల వారు ఝామున కుమ్మరి వారు, రజనులు వచ్చి అమ్మవారి అలంకరణను తీసివేసి ఊరేగింపుగా ఊరి పొలిమేరలకు తీసికొని పోయి గంగమ్మకు కండ్లు, చెవులు, చేతులు అన్ని తిట్టుతూ తీసివేస్తారు (ఇలా ఎందుకు చేస్తారంటే రెండు రోజులకే బోనం, అనేక రకాల బలులు కోరు తుంది. ఎక్కువ రోజులు అయితే చాలా ఇబ్బంది అవు తుందని ప్రజల విశ్వాసం). ఈ విధంగా జాతర పరి సమాప్తం అవుతుంది.

## ముగింపు :

మానవ జీవితంలో ఎన్ని పరిణామాలు జరిగినా ఎంతెంత ఎత్తుకి ఎదిగి పోతూ ఉన్నా భయం, భక్తి, నమ్మకం అనే దాన్ని విడనాడడం లేదు. వీటివల్లే ఆచారం, సంప్రదాయం అనేవి ఇంకా బతికున్నాయి. నాగరితలో ముందడుగు వేస్తున్న మానవులు పురాతన కాలం నుండి వస్తున్న ఆచరణ విధానాలను మర్చి పోకుండా వాటిని పాటిస్తూనే ఉన్నారు.

ఇలా మన సంస్కృతిలో అనేక జాతరలు పూజా విధానాలలోను, ఆరాధనా పద్ధతుల్లోనూ, బలి విధానాల లోను కొన్ని కొన్ని మార్పులతో దాదాపు అన్ని ప్రాంతాల లోనూ జరుగుతున్నాయి. కాబట్టి జాతరలు మన సంస్కృతి లోని వైశిష్ట్యాన్ని, మన సంప్రదాయాలలోని ఔన్నత్యాన్ని చాటి చెప్పేవిగా అలరారుతున్నాయి.

## ఉపయుక్త గ్రంథాలు :

1. మహోజ్వల చరిత్రకు నిలయం కడప జిల్లా - యస్. సీతారామయ్య - పేజి. 1
2. కడప కౌస్తుభమ్ - రెండు వందల పళ్ళ కడప జిల్లా - ఆచార్య జి.సాంబశివారెడ్డి - పేజి. 21-22
3. జానపద విజ్ఞానం-ఆచారాలు, సాంప్రదాయాలు - ఆచార్య పేట రామకృష్ణారెడ్డి -పేజి. 130-137
4. కడప కౌస్తుభమ్ - జానపద దృశ్యరూపాలు - డా.పి. రమాదేవి - పేజి. 92
5. కడప జిల్లా గ్రామదేవతలు - డా.యస్.వి. పద్మనాభ రెడ్డి - పేజి. 35-45
6. కడప జిల్లా జానపద సాహిత్యం - ఆచార్య చిగిచర్ల కృష్ణా రెడ్డి - పేజి. 4-15
7. క్షేత్ర పర్యటనలో పలువురితో చర్చించి, సేకరించిన సమాచారం.

Bhavaveena
Vol. 17, Issue. 3, March (1) - 2020.
ISSN No.: 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl. No. 34
under Arts and Humanities Category

# శ్రీమహా భాగవతం - నారయ అలంకార సౌందర్యం

**డా. జి. శ్రీనివాసరావు,** ఎం.ఏ, ఎం.ఫిల్, పిహెచ్.డి. అసిస్టెంట్ ప్రొఫెసర్,
తెలుగు శాఖ
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా.

**1.ఉపోద్ఘాతం:** వెలిగందుల నారయగారు శ్రీమహా భాగవతం లోని ఏకాదశ, ద్వాదశ స్కంధములను రచించారు. జ్ఞాన ప్రధానమై అతి విస్తారమై వేదవ్యాస మహర్షి సంస్కృత భాగవత ఏకాదశ, ద్వాదశ స్కంధములుండగా, అతి సంక్షిప్తంగా వెలిగందల నారయగారు గారు ఆంధ్రమున రచించిరి. ఏకాదశ స్కంధమున 125 గద్య పద్యాలను, ద్వాదశ స్కంధమున 53 గద్య పద్యాలను రచించారు. నారయ గారు ప్రయోగించిన అలంకారాల సంఖ్య అత్యల్పం ఇవి అనుశీలింపబడతాయి.

**2.విషయ వివరణ:** వెలిగందుల నారయ గారు శ్రీమహాభాగవతములోని ఏకాదశ, ద్వాదశ స్కంధాలలో ప్రయోగించిన :అలంకారాలను సమీక్షిద్దాం

**1.శబ్దాలంకారాలు**

**1.వృత్త్యను ప్రాస (అంత్యప్రాస)**

**జగదవన విహారీ! శత్రు లోక ప్రహారీ!**
**సుగుణ వన విహారీ! సుందరీ మానహారీ!**
**విగత కలుషపోషీ! వీరవర్యాభిలాషీ!**
**స్వగురు హృదయ పోషీ! సర్వదా సత్య భాషీ!**

(భాగ. 12-53)

శ్రీరాముని వర్ణిస్తూ భాగవతంలో చెప్పబడ్డ చివరి పద్యమిది. ఈ పద్యంలో నాలుగు వాక్యాల చివర 'రీ' అనే అక్షరం, నాలుగు వాక్యాల చివర 'షీ' అనే అక్షరాలు ఆవృత్తమైనాయి. అక్షరావృత్తి కాబట్టి వృత్త్యనుప్రాస వాక్యాంతమున ఆవృత్తమగుటచే అంత్యప్రాసగా చెప్పవచ్చు. భగంతుని కీర్తించునపుడు అది ఒక పాటగా, లయాత్మకంగా చెప్పడం శ్రవణ సుభగంగా ఉంటుంది. అంత్యప్రాస వలన ఇది పాటగా శ్రవణపేయంగా ఉంది.

**2. పదాంశా వృత్తి (యమకం)**

**తరణంబులు భవజలధికి**
**హరణంబులు దురితలతల కాగమములకా**
**భరణంబులార్తజనులకు**
**శరణంబులు నీపదాబ్జ సంస్కరణంబుల్**

(భాగ. 11-15)

శ్రీహరి దివ్య శ్రీపాద స్మరణ మహిమ ఈ పద్యంలో శ్రవణపేయంగా చెప్పబడింది.

తరణంబు హరణంబులు -ఆభరణంబులు - శరణంబులు అనే పదాలలో 'రణంబులు' అనే అక్షరగుచ్ఛం ఆవృత్తమైంది. కావున ఇది యమకము. ఆవృత్త అక్షరగుచ్ఛములకు అర్థం లేదు. పదాలకు మాత్రం భిన్నార్థాలు ఉన్నాయి.

**2.శబ్దార్థాలంకారాలు**

**1.వ్యవధాన-భిన్నార్థక-పదావృత్తి**

**ఇట్లు వర్షశతంబు వర్షశూన్యంబగును.**

(భాగ. 12-24)

కలియుగ ధర్మాలను గూర్చి చెబుతూ వంద సంవత్సరాలు వర్షాలు పడవు అని చెబుతున్న సందర్భంలోనిది ఈ వాక్యం. 'వర్షం' అనే పదం భిన్నార్థకంగా వ్యవధానంతో ప్రయోగింపబడింది. 'వర్షశతంబు' అనునపుడు

వందసంవత్సరాలు. అని అర్థం. 'వర్షశూన్యంబు' అన్నపుడు వానలు పడవని అర్థం. ఇలా 'వర్షం' అనే పదం భిన్నార్థకంగా ప్రయోగింపబడడం ఒక విధమైన చమత్కారాభివ్యక్తీకరణ.

**3.అర్థాలంకారాలు**

**1.ఉపమ**

**మృణ్మయంబైన ఘటంబున జలంబులు**
**జాలుగొను తెఱంగున దినదినంబునకు**
**నాయువు క్షయంబై, మృత్యువు సన్నిహితంబై**
**వచ్చు.** (భాగ. 11-109)

మట్టి కుండలోని నీళ్ళు క్రమంగా తగ్గిపోయినట్లు రోజురోజుకు ఆయువు క్షీణిస్తుంది.

వేదాంత విషయాన్ని మనము ఎప్పుడూ చూసే ఉపమానం ద్వారా సులభతరం చేసి, రమ్యంగా చెప్పడం దీనిలో చూడవచ్చు.

**మాలోపమ**

**"ఈ పదునెనిమిది పురాణంబుల మధ్యంబున నదులయందు భాగీరథి విధంబున, దేవతల యందు బద్మగర్భుని మాడ్కి, దారకలందు గళానిధి గరిమ, సాగరంబులందు దుగ్ధార్ణవంబు చందనంబున, నగంబులందు హేమనగంబు భాతి .... తేజరిల్లు అట్టి భాగవత పురాణంబు పఠియించి విష్ణుసాయుజ్యంబు జెందుదురు.** (భాగ. 12-48)

శ్రీమద్భాగవత పురాణ శ్రేష్ఠత ఇక్కడ వివరింపబడింది. దీనిలో ఉపమేయం భాగవత పురాణం ఉపమానాలు చాలా చెప్పబడ్డాయి. కావున ఇది మాలోపమ.

నదులలో గంగ, దేవతలలో బ్రహ్మ, తారకలలో చంద్రుడు, సాగరాలలో క్షీరాబ్ధి, పర్వతాలలో మేరు నగం వలె భాగవత పురాణం తేజరిల్లుతోందట.

దీని ద్వారా అన్ని గ్రంథరాజములకన్న శ్రీకృష్ణహృదయమనదగిన భాగవతం శ్రేష్ఠతమమైనదని తెలియుచున్నది.

**2.రూపకం**

**శ్రీనాయక నీనామము**
**నానా భవరోగ దు:ఖనాశమునకు వి**
**న్నాణంబగు నౌషధమిది**
**గానరు దుష్టాత్ములకట! కంజదళాక్షా!**
(భాగ. 11-17)

భవరోగమునకు హరినామము ఔషధము అని సంసారమునకు రోగమునకు, హరినామానికీ, ఔషధానికి అభేదం చెప్పబడింది. కావున ఇది రూపకం, అనేక పాపపుణ్యకర్మలతో అవిచ్ఛిన్నంగా సాగే సంసారాన్ని మాన్పగలది ఒక్క హరినామమే.

**3. స్వభావోక్తి**

**ఘనుని శ్రీకృష్ణుని గౌస్తుభాభరణుని**
**గర్ణకుండల యుగ్మఘనకపోలు**
**బండరీకాక్షు నంభోధరశ్యాముని**
**గలిత నానారత్న ఘనకిరీటు**
**నాజానుబాహు నిరర్గళాయుధహస్తు**
**శ్రీవక్షు జితకౌశేయవాసు**
**రుక్మిణీ నయన సరోజ దివాకరు**
**బ్రహ్మాది సుర సేవ్య పాదపద్ము**
**దుష్టనిగ్రహ శిష్టసంతోష కరణు**
**గోటి మన్మథ లావణ్య కోమలాంగు**
**నార్త జనరక్షణైక విఖ్యాత చరితు**
**గనిరి కరుణా సముద్రుని ఘనులు మునులు**
(భాగ. 11-12)

నారద, వశిష్ఠ, విశ్వామిత్ర, కాశ్యపాది మహర్షులు ద్వారకా నగరానికి వెళ్ళి అక్కడ ఉన్న శ్రీకృష్ణుని దివ్యరూపాన్ని సందర్శించారు. ఆ శ్రీకృష్ణుని అందం ఉన్నది ఉన్నట్లుగా వర్ణింపబడింది కావున ఇది స్వభావోక్తి.

**4. సార**

జీవ జాలంబులలోన ద్విపాదంబులు గల మనుష్యులు మేలు, వారలలోన నిరంతర ధ్యాన గరిష్ఠులైన యోగీంద్రు లుత్తములు (భాగ. 11-91)

ప్రాణులలో మనుష్యులు, మనుష్యులలో యోగీంద్రులు ఉత్తములంటూ ఒకరికంటే ఒకరిని ఉత్కర్ష వర్ణింపబడింది. కావున ఇది సారాలంకారము. అంటే మానవ జన్మకు సార్ధకత ధ్యానం చేసి యోగీంద్ర పదవికి ఎదగడమే అని తెలుస్తుంది.

**5. సంభావన**

**నరపతులు మహిమనంతను**

**సురగాధిపుడైన నుడువనోపడు ధాత్రిం**

**జరకాల మేలి యిందే**

**పరుపడి నణగుదురు వారు భ్రాంతులు నగుచున్** (భాగ. 12-6)

కలియుగంలో రాజుల దుష్కృత్యాలను వర్ణించడం ఆదిశేషునికైనా వీలుగాదు అని భావం.

రాజుల దుష్కృత్యాలు అనేకం ఉంటాయి. కాబట్టి వేయినాల్కల ఆదిశేషునికైనా వీలుగాదనడం. అయితే ఇక్కడ వేయి నాలుకలున్న విషయం చెప్పకుండా, దాన్ని స్ఫురింప జేసే లాగా ఆదిశేషుని పేర్కొనడం జరిగింది. కావునా ఇది సంభావన అలంకారం.

**6.అర్థాపత్తి**

**బలభిన్ముఖ్యదిశాధి నాథ నరులున్ ఫాలాక్ష బ్రహ్మాదులున్**

**జలజాతాక్ష పురందరాది సురలున్ జర్చించి నీమాయలన్**

**దెలియన్ లేరుట నా వశంబె తెలియన్ దీనార్తి నిర్మూల! యు**

**జ్వల తేజోవిభవాది సన్నుత! గదా చక్రాంబు జాద్యంకితా!** (భాగ. 12-36)

మార్కండేయుడు శ్రీమన్నారాయణుని ప్రార్థిస్తూ చెప్పిన పద్యమిది. ఇంద్రుడు, బ్రహ్మ, శివుడు వంటి వారే విష్ణువు. మహామాయను తెలుసుకోనపుడు నేనెంత? అంటాడు మార్కండేయుడు, గొప్పవ్యక్తులను పేర్కొని వారికే తెలియనపుడు చిన్నవాడిని నేనెంత? అనేభావం ఉండడం చేత ఇది అర్థాపత్తి. భగవంతుని మహా మాయను తెలుసుకోవడం ఎవరికీ వీలు కాదని తెలుస్తుంది.

**3.ముగింపు :** వెలిగందుల నారయగారు చక్కని అలంకారాలతో వేదాంత విజ్ఞాన ప్రధానమైన ఏకాదశ, ద్వాదశ స్కంధాలను చక్కగా అలంకరించారు. భక్తి రస ప్రధానమైన భాగవతానికి చక్కటి ముగింపు పలికారు.

**ఆధార గ్రంథాలు**

1. భాగవతవైజయంతిక. 1983. కరుణశ్రీ(సంపాదకుడు) (
2. శ్రీమహాభాగవతము. 1994. బమ్మెర పోతన (ఏడవ ముద్రణ)

★★★

భావవీణ

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

March (1) 2020

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1
Journal Sl. No 34 under Arts and Humanities Category






Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.